ఈనాడు
కడప
మంగళవారం 2 జనవరి 2018 | 16 పేజీలు

తొలిరోజు.. రోడ్డుపై యమరాజు

ఆంగ్ల సంవత్సరాదిన జిల్లాలో రోడ్లపై నెత్తుటి వరద



రిమ్స్‌లో విలపిస్తున్న బంధువులు

పెండ్లిమర్రిలో కారు ఢీకొని ఐదుగురు మృతి

విషాదంలో నల్లయ్యగారిపల్లె దళితవాడ

కడప రిమ్స్, పెండ్లిమర్రి, నేరవార్తలు, న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా చేసుకున్నారు. మిత్రులంతా కలిసి కేక్‌కోసి సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. చలిగా ఉండడంతో రహదారి పక్కన చలిమంట వేసుకున్నారు. ఉదయం ఏమి చేయాలో ప్రణాళికలు రూపొందించుకుంటున్న సమయంలో కారు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఐదుగురి ప్రాణాలు బలి తీసుకుంది. సోమవారం తెల్లవారుజామున పెండ్లిమర్రి మండలం ఇందిరానగర్ వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. తెల్లవారితే

...మిగతా 7లో



నాకు దిక్కెవరంటూ రోదిస్తున్న భాస్కర్ తల్లి

చలిమంటల నుంచి చితి మంటలకు..


మృతులు...



బి.భాస్కర్



సి.గిరి



ఎస్.లక్ష్మీనరసింహులు



ఎస్.కార్తీక్

ఇంటి దీపాలను ఆర్పిన మృత్యువు.. 2లో

సీఎం పర్యటనకు చకచకా ఏర్పాటు

ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు తెదేపా నాయకులు, అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పులివెందుల ద్యాన్‌చంద్ క్రీడామైదానంలో బుధవారం నిర్వహించనున్న సీఎం బహిరంగ సభకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ హెలీప్యాడ్‌ను తారుతో ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 35 వేల మంది ప్రజలు కూర్చునేందుకు వీలుగా పందిరిళ్లు ఏర్పాటు చేశారు. గండికోట ఎత్తిపోతల పథకాల వద్ద ఏర్పాట్లను నాయకులు, అధికారులు పర్యవేక్షించారు.



పులివెందులలో హెలీప్యాడ్ ఏర్పాటు

పండుగలా సీఎం పర్యటన సాగాలి -16లో

దగాపడ్డ రైతన్న!

ఓ వైపు ప్రకృతి దెబ్బ.. మరో వైపు అధికారుల తప్పిదం

బీమా సొమ్ము మంజూరులో పప్పుశనగ సాగుదార్లకు తీవ్ర అన్యాయం

సరిచేయాలని వేడుకోలు.. మరి సరిచేస్తారా?

న్యూస్‌టుడే-వేముల : ఫసల్ బీమా కోసం ఎదురుచూసిన రైతులకు నిరాశే మిగులుతోంది. అధికారులు చేసిన చిన్న తప్పిదాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. గతేడాది రబీ సీజనులో జిల్లాలో 80 వేల హెక్టార్లలో పప్పుశనగ సాగుచేశారు. ఈ పంట వేసిన 52 వేల

...మిగతా 7లో



ఈ చిత్రంలో ఉన్న గొందిపల్లెకు చెందిన రైతు ప్రకాశ్‌రెడ్డికి వేముల రెవెన్యూశాఖ పరిధిలో 4.67 ఎకరాల భూమి ఉంది. 2016 రబీలో పప్పుశనగను సాగుచేశారు. రూ.1390 ప్రీమియం చెల్లించి ఫసల్ బీమా చేశారు. వర్షాభావంతో పంట దెబ్బతింది. పరిహారం మంజూరు చేశారు. పంట వివరాల నమోదులో వెలుగు అధికారులు తప్పిదం చేశారు. వేముల రెవెన్యూ విభాగం కింద పంట సాగుభూములను నమోదు చేయాల్సి ఉండగా.. గొందిపల్లె రెవెన్యూ పరిధిలో నమోదు చేశారు. దీంతో ఎకరాకు రూ.12 వేల చొప్పున రాకుండా కేవలం రూ.6 వేల చొప్పున రూ.30 వేలు మాత్రమే ఆయన ఖాతాలో జమ అయింది.



ఈ చిత్రంలో ఉన్నది వేములకు చెందిన సదాశివారెడ్డి. మూడు ఎకరాల్లో పప్పుశనగ సాగుచేసి ఫసల్ బీమా చేశారు. వర్షాభావంతో పంట దెబ్బతిని పరిహారం మంజూరైంది. వేముల రెవెన్యూ విభాగం కింద ఎకరాకు రూ.12 వేల పరిహారం మంజూరైంది. మూడు ఎకరాలకు రూ.36 వేల పరిహారం మంజూరుకావాల్సి ఉండగా.. ఎకరన్నరకు కేవలం రూ.18 వేలు మాత్రమే వచ్చింది. భూమి విస్తీర్ణాన్ని నమోదు చేయడంలో అధికారులు చేసిన తప్పిదానికి ఈయన రూ.18 వేల పరిహారాన్ని కోల్పోయారు.



వర్షాభావ పరిస్థితులతో దెబ్బతిన్న పప్పుశనగ (పాత చిత్రం)

నేటి నుంచి జన్మభూమి-మా ఊరు

కడప, న్యూస్‌టుడే : మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమం నిర్వహించనున్నారు. గ్రామస్థాయిలో సభలు నిర్వహించి ప్రజల కష్టసుఖాలను తెలుసుకోవడం, స్థానిక సమస్యలను పరిష్కరించాలనే ధ్యేయంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈసారి ప్రజాసంక్షేమానికి పెద్ద పీట వేయనున్నారు. రేషన్ కార్డులు, పింఛన్ల విషయంగా లబ్ధి కలిగించనున్నారు. అర్హులకు తక్షణ విచారణతో కార్డులు మంజూరు చేసే అధికారం అధికారులకు ఇవ్వడం ఈసారి ప్రత్యేకత. స్వచ్ఛభారత్‌లో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణంపైనా ప్రచారం చేయనున్నారు. గ్రామ సభలకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు.



రెండ్రోజుల్లో.... రూ.3.70 కోట్ల మద్యం తాగేశారు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కొత్త ఏడాది ఆరంభంలో మద్యం అమ్మకాలు భారీ స్థాయిలో జరిగాయి. డిసెంబరు 31వ తేదీ రాత్రి 1 గంట వరకు సమయాన్ని పొడిగించడంతో మందుబాబులకు కలిసొచ్చింది. గతంలో కన్నా ఈ ఏడాది చాలా మంది హోటళ్లు, బార్లు, మద్యం దుకాణాల్లోనే కొత్త ఏడాది సంబరాలు జరుపుకొన్నారు. మద్యం తాగి వాహనం ఎక్కితే జైలుకు పంపిస్తామని అధికారులు ఖరాఖండిగా చెప్పడంతో ఎక్కువ మంది బార్లలో తాగడానికే సుముఖత చూపారు. డిసెంబరు 31, జనవరి 1వ తేదీ రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా రూ.3.70 కోట్లు మద్యం అమ్మకాలు జరిగాయి.

■ డిసెంబరు 31వ తేదీ కడప డివిజన్ పరిధిలో 1200 మద్యం పెట్టెలు, 1061 బీరు పెట్టెలు అమ్మారు. ప్రొద్దుటూరు డివిజన్‌లో డిసెంబరు

...మిగతా 7లో

ఆయకట్టును మింగిన అడవి!

గొట్టిమానుకోన జలాశయ నిర్మాణంలో అంతులేని నిర్లక్ష్యం

కనీస నిబంధనలు పాటించకపోవడంతో రైతులకు ఇబ్బంది

అటవీ అభ్యంతరాలపై దృష్టి కరవు.. అడ్డంగా కట్టేసి ఇష్టారాజ్యం

రూ.12 కోట్లు గంగపాలు.. పూర్తికాని ప్రధాన, ఉపకాల్వలు

రెవెన్యూ, అటవీ, జలవనరుల శాఖల మధ్య తెగని పంచాయితీ

ఉన్నతాశయంతో చేపట్టిన కార్యక్రమం ఉసూరుమనిపిస్తుండగా.. ముందుచూపు లేకపోవడం కష్టాలు తెచ్చిపెట్టింది.. కోట్ల రూపాయల ప్రజాధనం హారతికర్పూరంలా కరిగిపోగా కరవు రైతులకు మాత్రం చుక్కనీరందించలేకపోతోంది.. కళ్లముందే నీళ్లు కనిపిస్తున్నా వాడుకోలేకపోతుండటం, కాల్వలు తవ్వేందుకు అటవీశాఖ అభ్యంతరం చెబుతుండటం వెరసి వేదనే మిగులుతోంది. కేవలం కాసుల దోపిడీతో గుత్తేదార్ల జేబులు నింపడం మినహా ప్రభుత్వ లక్ష్యం కలగానే మారింది.



గొట్టిమానుకోన జలాశయం

ఈనాడు, కడప - న్యూస్‌టుడే, చిట్వేలి : కడప జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలోని చిట్వేలి మండలం వద్ద ఉన్న గొట్టిమానుకోన జలాశయం పరంగా ఏళ్ల తరబడి సమస్య నెలకొంది. 1600 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సిన ఇక్కడ ఏళ్లు గడుస్తున్నా ఎంతకూ ఆ దిశగా అడుగులు లేకపోవడం సమస్యగా తయారైంది.. కోడూరు-చిట్వేలి మార్గమధ్యంలో సిద్ధారెడ్డిపల్లి వద్ద ఉన్న గొట్టిమానుకోనలో ఐదు దశాబ్దాల కిందట వరకు ఎలాంటి జలాశయం లేదు. సమీపంలోని వెలిగొండ కొండల్లో పడిన వర్షపునీరంతా ఈ కోనలోకి వచ్చి చేరడం.. అది పిల్ల కాల్వల ద్వారా ఆయకట్టు చెరువులకు అందే పరిస్థితి ఉండేది. ప్రధానంగా ఈ కోనలోకి చేరిన నీరు భూగర్భంలోకి చేరి భూగర్భజలాల పెరుగుదలకు తోడ్పడేవి. అలాంటి ఇక్కడ 1950లో జలాశయం నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ఆ ఏడాదే నిర్మించాలనుకున్నా అనివార్య కారణాలతో వాయిదా పడింది. అనంతరం 1979లో జలాశయం రూపుదిద్దుకునేలా పరిస్థితులు దోహదపడ్డాయి.. 1990లో అప్పటి స్థానిక ఎమ్మెల్యే జలాశయం ఏర్పాటుపై పూర్తిగా దృష్టి నిలిపారు. ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి నిర్మాణానికి పూనుకొన్నారు. ఇక్కడే అసలు సమస్య తలెత్తింది.

ఇదెక్కడి చోద్యం...

గొట్టిమానుకోన మొత్తం రిజర్వు ఫారెస్టులో ఉంది. అతి పెద్దచెరువుగా ఉన్న దాన్ని రిజర్వాయర్‌గా మార్చాలని 20 ఏళ్ల కిందట నిర్ణయించారు. ఆ నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ప్రధానంగా అక్కడ జలాశయానికి పోయిన భూమికి ప్రత్యామ్నాయంగా మరోప్రాంతంలో

...మిగతా 7లో

ఇంటిదీపాలను ఆర్పిన మృత్యువు


భాస్కర్


లక్ష్మీనరసింహులు


కార్తీక్


గిరి


బ్రహ్మానందరెడ్డి

★ జిల్లాలో విషాదఛాయలు
★ ఒకే గ్రామంలో నలుగురు మృతి

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : కారు ఢీకొన్న ప్రమాదంలో మృతిచెందిన వారంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారే! ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషిస్తున్న ఓ భర్త, వృద్ధులైన తల్లిదండ్రులకు తోడునీడగా నిలవాల్సిన కొడుకు, అమ్మానాన్నల ఆశల దీపాలైన ఇద్దరు చిన్నారులు.. వణికించే చలిలో వెచ్చదనం కోసం చలిమంట వేసుకోగా కారు రూపంలో మృత్యువు విరుచుకుపడింది. ఇంటికి దీపాల్లాంటి ఇద్దరు యువకులు, ఇద్దరు చిన్నారులను పొట్టనపెట్టుకుంది. పెండ్రిమర్రి మండలం ఇందిరానగర్ వద్ద జరిగిన ఈ ఘటన నూతన సంవత్సర ఆగమనం రోజున జిల్లాను ఉలికిపాటుకు గురిచేసింది. ఇందిరానగర్‌కు చెందిన బి.భాస్కర్ ఆటో డ్రైవర్, భార్య రాజేశ్వరి కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవారు. వీరికి ఇద్దరు పిల్లలు. నూతన సంవత్సరం సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కేకుకోసి వస్తానని చెప్పి తిరిగిరాని లోకాలకు వెళ్లావా.. ఇక తమకు దిక్కెవరని భార్య రాజేశ్వరి బోరున విలపించారు. వెంకటసుబ్బయ్య, అంజనమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో ఇద్దరు ఆడపిల్లలు. కొడుకు గిరి. కూలి పనులు చేసుకుంటూ జీవించేవారు. తల్లిదండ్రులకు ఆసరాగా గిరి సిమెంటు ఇటుకలు తయారుచేసే పనికి వెళ్లే వారు. వృద్ధాప్యంలో అండగా ఉంటాడనుకున్న కొడుకు దుర్మరణం చెందడంతో ఆ తల్లిదండ్రులు కుమిలిపోయారు. కొత్త సంవత్సరంలో విషాదం మిగిలించి వెళ్లావా కొడుకా అని కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలకదిరయ్య, రమణమ్మ దంపతులకు ముగ్గురు సంతానం, రెండో సంతానం ఎస్.లక్ష్మీనరసింహులు. నందిమండలం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సంపాదించి కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకును కారు రూపంలో మృత్యువు కబలించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

కదిరయ్య, చంద్రకళ దంపతులకు ఇద్దరు సంతానం. వీరిని ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. పెద్దకొడుకు కార్తీక్ నందిమండలం ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. తోటి మిత్రులతో కలిసి కొత్త సంవత్సర వేడుకలు చేసుకుని వస్తానని చెప్పి వెళ్లిన కొడుకు శవమై రావడంతో ఆ దంపతులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. సర్కారు కొలువు సాధిస్తా మిమ్మల్ని కష్టాల కడలి నుంచి గట్టెక్కిస్తానంటివే ఇక మాకు దిక్కెవరని బోరున విలపించారు. రిమ్స్‌లో శవపరీక్షల అనంతరం సోమవారం సాయంత్రం మృతదేహాలను ఇందిరానగర్‌కు తీసుకొచ్చి అంత్యక్రియలు చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు రూ.5 వేల చొప్పున నాలుగు కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని కడప ఆర్డీవో దేవేంద్రారెడ్డి అందించారు. ప్రమాదరం జరిగిన తీరు గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు ఆంజనేయులు వెంట ఉన్నారు.

వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలని ధర్నా : కడప-పులివెందుల రహదారిలో ఇందిరానగర్ వద్ద వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలని, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ధర్నా చేశారు. రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. విషయం తెలిసి ఎస్సై రోషన్ అక్కడికి చేరుకున్నారు. అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఇందిరానగర్ వద్ద వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలని ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న గ్రామస్థులు.. కారులో ఉన్న బిరియాని డబ్బా

గూడ్స్ ఆటో - బైక్ ఢీ.. వ్యక్తి మృతి

ప్రొద్దుటూరు పురపాలిక, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణంలో సరకుల రవాణా(గూడ్స్) ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో నేతి కొండారెడ్డి(55) అనే టీ దుకాణ నిర్వాహకుడు మృతి చెందారు. సోమవారం ప్రొద్దుటూరు మండలం సోముల వారిపల్లె ఈశ్వర్‌రెడ్డినగర్ బైపాస్‌రోడ్డులో ప్రమాదం జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన కొండారెడ్డి బైపాస్ రోడ్డులోని దోబీ ఖానా ఎదురుగా టీ, శీతల పానీయాల దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం నూతన సంవత్సరం కావడంతో కొండారెడ్డి ఉదయం దుకాణం తెరవలేదు. ఉదయాన్నే కుటుంబ సభ్యులతో కలిసి గుడికెళ్లి అనంతరం ఇంటికొచ్చి మధ్యాహ్న భోజనం చేశారు. తర్వాత కాసేపు దుకాణం తెరచి వ్యాపారం చేసుకొని సాయంత్రం తిరిగొస్తానమ్మా అని కుమార్తెకు చెప్పి ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో బైపాస్‌రోడ్డులోని దుకాణానికి బయలుదేరారు. ఈ క్రమంలో కొండారెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా నుంచి అతివేగంగా వస్తున్న సరకుల రవాణా ఆటో ఢీకొట్టింది. దీంతో ఎగిరి రోడ్డు మీద పడిన అతని తలకు బలమైన రక్తగాయం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఆటో అదుపు తప్పి ద్విచక్ర వాహనంపై బోల్తా పడింది. ఆటో డ్రైవరు భయపడి పరుగు తీస్తుంటే స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఓ వర్ధంతి కార్యక్రమానికి తయారు చేసిన భోజనాలను ఆటోలో తీసుకెళ్లే సమయంలో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. పట్టణంలోని వాజ్‌పేయ్‌నగర్ చెందిన గంగాధర్ అలియాస్ నారాయణ అనే వ్యక్తి డ్రైవరుగా ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీఐ సదాశివయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొత్త సంవత్సరం.. టీ దుకాణానికి వెళ్లి కాసేపు వ్యాపారం చేసుకొని వస్తానమ్మా అని వెళ్లి.. రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లావా అని కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతునికి భార్య భాగ్యలక్ష్మీ, కుమార్తె సుకన్య, కుమారుడు రాజశేఖర్ ఉన్నారు.


ఘటనా స్థలంలో మృతిచెందిన కొండారెడ్డి


ద్విచక్ర వాహనంపైకి బోల్తా పడిన గూడ్స్ ఆటో

చేపల అక్రమ వేటపై చర్యలు

మత్స్యశాఖ డీడీ చంద్రశేఖర్‌రెడ్డి

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: సోమశిల పోటు జలాల్లో అక్రమంగా చేపల వేట ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మత్స్యశాఖ ఉప సంచాలకులు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంటిమిట్ట, బద్వేలు వైపున అక్రమార్కులు చేపల వేట సాగిస్తున్నారని... వారిపై ఇటీవల వరుస దాడులు చేస్తున్నామన్నారు. నిషేధిత అలివి వలలు, బోట్లు, ఎండు చేపలతోపాటు వేట చేస్తున్న వారిని పట్టుకున్నామన్నారు. మత్స్యశాఖచట్టం ప్రకారం కేసులు నమోదు చేశామని... పట్టుబడిన 12 వలలు, బోటు, ఎండు చేపలను తమ కార్యాలయం వద్దకు తీసుకొచ్చామన్నారు. ఇప్పటి వరకు ఒంటిమిట్ట ప్రాంతం వైపు 180 మందికి... బద్వేలు ప్రాంతం వైపు 75 మందికి చేపల వేటకు మత్స్యకారులకు లైసెన్సులు ఇచ్చామన్నారు. సమావేశంలో మత్స్య అభివృద్ధి అధికారి రబ్బాని, తదితరులు పాల్గొన్నారు.


పట్టుకున్న అలివివలలను చూపుతున్న మత్స్యశాఖ ఉప సంచాలకులు చంద్రశేఖర్‌రెడ్డి

జిల్లాకు 13,723 రేషన్‌కార్డులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జన్మభూమి కార్యక్రమంలో భాగంగా కడప జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు 13,723 రేషన్‌కార్డులు మంజూరు చేసిందని బాధ్య సంయుక్త కలెక్టర్ నాగేశ్వర్రావు పేర్కొన్నారు. వాస్తవానికి రూ.16,200 మంది రేషన్ కార్డులు కావాలని దరఖాస్తు చేసుకున్నారని... వీరంతా ఆయా మండల కేంద్రాల్లోని మీ సేవా కేంద్రంల్లో తమ అర్జీతో పాటుగా కుటుంబ సభ్యుల గ్రూపు ఫోటో, కుటుంబసభ్యుల ఆధార్ నకళ్లు, ఎన్నికల గుర్తింపు కార్డు, కరెంటు బిల్లులు తీసుకెళ్లాలన్నారు. కొత్తగా మంజూరైన రేషన్‌కార్డు లబ్ధిదారులందరికీ చంద్రన్న సంక్రాంతి కానుకలు అందిస్తామని అయితే నిత్యవసర వస్తువులు మాత్రం ఫిబ్రవరి నెల నుంచి అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

వైకాపా యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా సురేష్


పాకా సురేష్‌కుమార్

కడప సంక్షేమం న్యూస్‌టుడే: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కడప నగరానికి చెందిన పాకా సురేష్‌కుమార్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. పాకా సురేష్‌కుమార్ 47వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్నారు. 2017 మార్చి నెలలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు ఆయన తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. కార్పొరేటర్లు పార్టీ మారిన నేపథ్యంలో పాకా సురేష్ మీద నగరపాలక కార్యాలయం సమీపంలో దాడి జరిగింది. ఈ సంఘటన రాజకీయ వర్గాల్లో సంచలనం రేపింది.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

సంబేపల్లె, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో మండల పరిధిలోని గురిగింజకుంట గ్రామం దళితవాడకు చెందిన సగినాల సుశీల(28) అనే మహిళ ఆదివారం సాయంత్రం బావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతకొమ్మదిన్నె మండలం రసూల్‌పల్లె దళితవాడకు చెందిన నాగసుబ్బమ్మ, సుబ్బరాయుడులకు చెందిన సుశీలను సంబేపల్లె మండలం గురిగింజకుంట గ్రామం దళితవాడకు చెందిన శేఖర్‌తో గత 10సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి అపర్ణ, చంద్రశేఖర్, సాయి అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆదివారం ఉదయం సుశీల మేకలను మేపడానికి పొలాలకు వెళ్లిందని భర్త శేఖర్ పోలీసులకు చెప్పారు. సాయంత్రానికి మేకలు ఇంటికి వచ్చి భార్య ఇంటికి రాకపోవడంతో బంధువులతో కలిసి చుట్టుపక్కల ఉన్న పొలాల వద్దకు వెళ్లి వెతికాడు. అయినా ఎక్కడా కనిపించపోవడంతో ఊరికి దగ్గరలో ఉన్న బావివద్దకు వెళ్లి పరిశీలిస్తే బావిలో చెప్పులు కనపడడంతో బావిలో వెతకడంతో ఆమె శవమై ఉందని పోలీసులకు తెలిపాడు. ఈ విషయాన్ని శేఖర్ వెంటనే అత్తమామలకు తెలియజేశాడు. వారి బంధువులు సుశీల మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. భర్త, వారి బంధువులే తమ బిడ్డను చంపారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు విచారించి కేసు నమోదు చేస్తామని పోలీసులు వారికి చెప్పారు. సుశీల మృతితో పిల్లలు తల్లి మృతదేహం వద్ద మిన్నకుండిపోయారు. తమ తల్లి మృతి చెందిందనే విషయం వారికి తెలియక మృతదేహం వద్ద అమాయక చూపులతో ఉండడంతో చూపరుల హృదయం ద్రవించింది. సోమవారం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హషం తెలిపారు.



మృతి చెందిన సగినాల సుశీల.. తల్లి మృతితో బిక్కుబిక్కుమంటున్న పిల్లలు



దేశానికి సేవ చేసే ఉద్యోగం ఒక వరమని స్టెప్ సీఈవో మమత పేర్కొన్నారు. ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు కడప మున్సిపల్ స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిందని... ఏడు జిల్లాల నుంచి వచ్చే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నేపథ్యంలో స్టెప్ సీఈవోతో 'న్యూస్‌టుడే' ముఖాముఖీ నిర్వహించింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

- కడప ఏడురోడ్లు

దేశానికి సేవ చేసే ఉద్యోగం ఒక వరం

- రేపటి నుంచి కడపలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ
- అర్ధరాత్రి నుంచే ఎంపికలు
- దళారులను నమ్మి మోసపోవద్దు
- 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో స్టెప్ సీఈవో మమత

ప్రశ్న: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ వివరాలు తెలియజేయండి.

జవాబు: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు కడప మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్నాయి. సోల్జర్ టెక్నికల్, సోల్జర్ జనరల్ డ్యూటీ, సోల్జర్ ట్రేడ్స్‌మెన్ విభాగాలకు సంబంధించి ఎంపికలను నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు పలు ప్రభుత్వశాఖలు కలిసి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లను చేయడం జరిగింది.

ప్రశ్న: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో ఎన్ని జిల్లాలు పాల్గొంటున్నాయి. ఎంతమంది రానున్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా ఎటువంటి చర్యలు తీసుకున్నారు.

జవాబు : కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి అభ్యర్థులు రానున్నారు. ఒక్కో జిల్లా నుంచి సుమారు 4 నుంచి 5 వేలమంది వరకు అభ్యర్థులు ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొనవచ్చు. మొత్తం మీద పై తెలిపిన ఏడు జిల్లాల నుంచి 30 వేలమంది అభ్యర్థులు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొంటారని అంచనా వేశాం. ఎంపికలు 2వ తేదీ అర్ధరాత్రి నుంచే ఎంపికలు ప్రారంభమవుతాయి. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా అన్నిశాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లను చేశాం.



సీఈవో మమత

ప్రశ్న: ఆర్మీ ఎంపికలకు వచ్చే కడప జిల్లా అభ్యర్థులకు జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఏమైనా శిక్షణ ఇచ్చారా.

జవాబు: రాష్ట్ర యువజన సర్వీసులశాఖ ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో ఆయా యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. కడప జిల్లా పరంగా చూస్తే శిక్షణకు సంబంధించి అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలను నిర్వహించాం. అందులో అర్హత సాధించిన వారిని గుర్తించాం. అనంతరం రాష్ట్రయువజన సర్వీసులశాఖ ఆదేశాల మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా అర్హత సాధించిన 164 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఇందులో ఎక్కువ మంది గ్రామీణ అభ్యర్థులే ఉన్నారు.

ప్రశ్న: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించి ఎన్ని శాఖలు సమన్వయంతో పని చేయనున్నాయి.

జవాబు: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో పదహేనుకు పైగా ప్రభుత్వ శాఖలు సమన్వయంగా పని చేయనున్నాయి. జిల్లా యువజన సర్వీసులశాఖతోపాటు పోలీసు, డీఆర్‌డీఏ, డ్వామా, కార్పొరేషన్, రెవెన్యూ, మెప్మా, డీఎంహెచ్‌ఓ, రిమ్స్, ట్రాన్స్‌కో, ఆర్‌అండ్‌బీ, ఐఅండ్‌పీఆర్, డీఈవో, డీఎస్‌ఏ, జిల్లా సైనిక సంక్షేమ శాఖ, ఎస్సీ కార్పొరేషన్ తదితర ప్రభుత్వ శాఖలు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ప్రతిరోజు అర్ధరాత్రి తర్వాత ఆర్మీ ఎంపికలు జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా తగిన లైటింగ్ ఏర్పాట్లను చేయడంతోపాటు నీటివసతి, వైద్యుల ఏర్పాటు తదితరాలను అందుబాటులో ఉంచనున్నాం. ముఖ్యంగా అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా పోలీసు వ్యవస్థ సెక్యూరిటీ ఏర్పాట్లను చేసింది.

.ప్రశ్న: ఎంపికలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అర్హతలుండాలి.

జవాబు: ఎంపికలకు హాజరయ్యే అభ్యర్థులు ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారి సూచించిన మేరకు విద్యార్హతలు ఉండాలి. సోల్జర్ టెక్నికల్ ఉద్యోగాలకు 165 సెంమీ ఎత్తు, 50 కిలోల బరువు, ఛాతి 77-82 సెం.మీ, సోల్జర్ జనరల్ డ్యూటి ఉద్యోగాలకు సంబంధించి 166 సెం.మీ ఎత్తు, 50 కిలోల బరువు, 77-82 సెం.మీ ఛాతి, సోల్జర్ ట్రేడ్స్‌మెన్‌కు సంబంధించి 166 సెం.మీ ఎత్తు, 48 కిలోల బరువు, 76-81 సెం.మీ ఛాతి ఉండాలి. అభ్యర్థుల శరీర భాగాలకు ఎటువంటి పచ్చబొట్లు ఉండకూడదు. అభ్యర్థులు పెళ్లి కాని వారై ఉండాలి. 1.6 కిలోమీటర్ల పరుగుపందెంను 5 నిమిషాల 30 సెకన్లలోపు పూర్తి చేయాలి. పుల్‌అప్స్ కనీసం 6 తీయాలి. 9 అడుగుల కందకం దూకడం, ఒక కడ్డీపై నిలబడి చేతులు బ్యాలెన్స్‌గా నడవాలి. అభ్యర్థులు అర్హత సర్టిఫికెట్లు అయిన కుల ధ్రువీకరణ, నేటివిటీ, పుట్టిన తేది సర్టిఫికెట్ తీసుకురావాలి. అలాగే అభ్యర్థుల కాండక్ట్ సర్టిఫికెట్, కారెక్టర్ సర్టిఫికెట్ 6 నెలలకు మించకుండా ఉండాలి. 12 ఫొటోలు తీసుకురావాలి.

ప్రశ్న: అభ్యర్థులకు మీరిచ్చే సూచనలు.

జవాబు: దేశానికి సేవ చేసే ఉద్యోగం లభించడం ఒక వరం. అందుకే ఆర్మీ ఎంపికలకు సంబంధించి జిల్లావాసులు అధిక సంఖ్యలో పాల్గొని ఎక్కువమంది ఆర్మీకి ఎంపిక కావాలని ఆకాంక్షిస్తున్నాం. ముఖ్యంగా అభ్యర్థులు వారి స్వశక్తినే నమ్ముకుని ఎంపికల్లో సత్తా చాటి ఆర్మీ ఉద్యోగం పొందాలి. దళారుల మాటలు నమ్మవద్దు. ఎంపికల్లో సత్తాచాటిన వారే ఉద్యోగాలు పొందుతారు. ఎటువంటి పైరవీలు, మోసాలు జరగవనే విషయాన్ని అభ్యర్థులు గ్రహించి దళారులను దరిచేరకుండా చూసుకోవాలి. ఒకవేళ దళారులు ఇదివరకే మొత్తం తీసుకుని ఉంటే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

ప్రశ్న: ఎంపికలకు సంబంధించిన షెడ్యూలు ఏంటి. ఎంపిక విధానం ఎలా ఉంటుంది.

జవాబు: ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు సోల్జర్ జనరల్ డ్యూటీ ఎంపికలు జరుగుతాయి. అందులో భాగంగా 3వ తేదీన అనంతపురం, ప్రకాశం జిల్లాలు, 4న చిత్తూరు, కడప జిల్లాలు, 5న కర్నూలు, నెల్లూరు జిల్లాలు, 6న గుంటూరు జిల్లా అభ్యర్థులు సోల్జర్ జనరల్ డ్యూటీ ఎంపికల్లో పాల్గొంటారు. అలాగే ఈనెల 6వ తేదీన సోల్జర్ టెక్నికల్‌కు సంబంధించి గుంటూరు, అనంతపురం జిల్లాలు, 7న చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల అభ్యర్థులు పోటీపడనున్నారు. ఈనెల 8, 9 తేదీల్లో సోల్జర్ ట్రేడ్స్‌మెన్ ఉద్యోగాలకు ఎంపికలు జరుగుతాయి. సోల్జర్ ట్రేడ్స్‌మెన్‌కు సంబంధించి ఈనెల 8వ తేదీన అనంతపురం, చిత్తూరు, కడప, గుంటూరు జిల్లాల అభ్యర్థులు, 9వ తేదీన కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల అభ్యర్థులు పోటీపడనున్నారు. ఇక ఆర్మీ ఎంపిక విధానానికి సంబంధించి ఎంపికలకు అర్హత సాధించిన అభ్యర్థులకు అడ్మిట్ కార్డులను ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారి ఇదివరకే పంపించారు. అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్(ఎత్తు, బరువు, ఛాతి కొలతలతో పాటు 1.6 కిలోమీటర్ల పరుగు పోటీ, పుల్ అప్స్) పరీక్షలు ఉంటాయి. అనంతరం రాతపరీక్షలు, ఆపై మెడికల్ పరీక్షలు నిర్వహించి అభ్యర్థులకు ఎంపిక చేయడం జరుగుతుంది.

'ఏపీ కార్ల్'ను వినియోగంలోకి తెస్తాం



పరిశీలిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి తదితరులు

పులివెందుల, న్యూస్‌టుడే: రూ.386.23 కోట్ల వ్యయంతో నిర్మించిన 'ఏపీ కార్ల్'ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేలా కృషిచేస్తామని భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి అన్నారు. ఈమేరకు సోమవారం పులివెందుల ఊరి బయట ఉన్న ఏపీకార్ల్‌ను భాజపా నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. ఇక్కడ పరిశోధనలు జరిపేందుకు చర్యలు చేపట్టేలా ప్రభుత్వం దృష్టికి తీసికెళ్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చి రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాలను వినియోగంలోకి తెచ్చేలా ప్రయత్నిస్తామని ఆయన వివరించారు. ఏపీకార్ల్‌లో ఉన్న పరిశోధనశాలలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా మాజీ అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, నాయకులు భానుప్రకాష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



గాలివీడు: వెలిగల్లు జలాశయం ఉద్యానవనంలో సందర్శకుల సందడి

వెలిగల్లు జలాశయం వద్ద పోటెత్తిన జనం

గాలివీడు, న్యూస్‌టుడే : గాలివీడు- కదిరి ప్రధాన మార్గంలోని పాపాఘ్ని నదిపై నిర్మించిన వెలిగల్లు జలాశయాన్ని సందర్శించేందుకు పర్యాటకులు పోటెత్తారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ప్రాజెక్టు కట్ట మార్గంలో జనం రద్దీతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గాలివీడు, రాయచోటి, కదిరి, మదనపల్లి ప్రాంతాల నుంచి సందర్శకులు ఈ సారి అధిక సంఖ్యలో వచ్చారు. జలాశయం, ఉద్యానవనం, గండిమడుగు పుణ్యక్షేత్రం, గాలివీడు, రాయచోటి రక్షిత మంచినీటి పథకాలు, పరిసర ప్రాంతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో జనం రావడంతో ఎస్సై పార్నపల్లి మంజునాథ తగిన రక్షణ ఏర్పాట్లు చేయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఏర్పడకుండా పర్యవేక్షించారు.



పార్కు లో రద్దీ

ఏకశిలానగరిలో పుష్కరిణి

- రూ.96 లక్షలకు పరిపాలన అనుమతి
- బ్రహ్మోత్సవాలకు పూర్తి చేయాలని నిర్ణయం
- ప్రారంభమైన పనులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట కోదండ రామాలయం సన్నిధిలో భక్త సంజీవరాయస్వామి ఆలయం వెనక వైపున (తూర్పు దిశలో) పుష్కరిణి నిర్మించేందుకు భారత పురావస్తు శాఖ ఉన్నతాధికారులు అనుమతిచ్చారు. అనువైన ప్రాంతాన్ని తితిదే అధికారులు ఇప్పటికే ఎంపిక చేశారు. 2017 నవంబరు 25న ముఖ్య సాంకేతిక నిపుణుడు చంద్రశేఖర్‌రెడ్డి, స్థపతి మునుస్వామిరెడ్డి స్థలాన్ని పరిశీలించారు. నిరుడు డిసెంబరు 16న సంయుక్త కార్యనిర్వాహణాధికారి పోలా భాస్కర్, జిల్లా కలెక్టరు టి.బాబూరావునాయుడు చేపట్టనున్న పనులను చూశారు. 161.3 అడుగుల పొడవు, 104.5 అడుగుల వెడల్పు, తొమ్మిది అడుగుల లోతుతో నిర్మించేలా ఆకృతి రూపొందించారు. మధ్యలో 10.5 అడుగుల విస్తీర్ణంలో మండపం నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.96 లక్షలు కేటాయించారు. పుష్కరిణి మెట్లు తొమ్మిది వరుసలుగా రాయితో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం అవసరమైన ముడిరాయిని కర్ణాటక రాష్ట్రం మూలబగాల్ నుంచి తెప్పించారు. ఈ ఏడాది మార్చిలో కోదండరాముడి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహణపై తితిదే దృష్టిసారించింది. ఉత్సవాల నాటికి కోనేరును పూర్తి చేయించాలని నిర్ణయించారు. వారం రోజులుగా పనులను వేగవంతం చేశారు. ఇక్కడ పూర్వం నుంచి బావి ఉంది. గతంలో ఇందులోని నీటిని ప్రజలు తాగేందుకు తీసుకెళ్లేవారు. పాత కాలం నాటి జలవనరును పూడ్చి వేయకుండా అలాగే ఉంచాలని నిర్ణయించారు. పుష్కరిణి చుట్టూ విశాలమైన సిమెంటు రహదారులు నిర్మించేందుకు ఇప్పటికే ఆమోదం తెలిపారు. సమీపంలో పచ్చని ఉద్యానవనం ఏర్పాటు చేయనున్నారు. అడ్డంకిగా ఉన్న శ్రీరామ కుటీరం, రథశాల, భక్తుల విడిది భవనాలు, ప్రాథమిక పాఠశాల భవనాలను తొలగించనున్నారు. పుష్కరిణి పనులను ఈ ఏడాది మార్చిలో జరిగే బ్రహ్మోత్సవాలు నాటికి పూర్తి చేస్తామని డీఈ రాఘవయ్య తెలిపారు.



పుష్కరిణి నిర్మించే ప్రాంతం ఇదే..



కోనేరు మధ్యలో మండపం నిర్మించేందుకు చేపట్టిన పనులు..

రైల్వేకోడూరు

సమాచార సేకరణకే చరవాణులు

పుల్లంపేట, న్యూస్‌టుడే: పని వేగాన్ని పెంచేందుకు సమాచారాన్ని వేగంగా సేకరించాలనే ఆశయంతో ప్రభుత్వం కార్యదర్శులకు సెల్‌ఫోన్లు పంపిణీ చేయడం జరిగిందని రైల్వేకోడూరు ప్రత్యేక అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ఎనిమిది మంది కార్యదర్శులకు సెల్‌ఫోన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం, ఎంపీడీవో ఎస్ఎండీ హుస్సేన్, ఈవోపీఆర్డీ నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పదిమంది పందెంరాయుళ్ల అరెస్టు

చిట్వేలి: నాగవరం పంచాయతీ ఉప్పరపల్లి గ్రామ సమీపంలో సోమవారం కోడి పందేలు నిర్వహిస్తున్న 10 మందిని పట్టుకున్నట్లు ఎస్సై డాక్టర్ నాయక్ తెలిపారు. వారి నుంచి రూ.9010 నగదు, 4 కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది నందకిశోర్, రాజేష్, మనోజ్, మహేష్, శ్యామ్యుల్ పాల్గొన్నారు.

దళితుల గ్రామ బహిష్కరణ హేయమైన చర్య



నిరసనలు తెలుపుతున్న మండల దళిత నాయకులు

చిట్వేలి: దళితులు గ్రామ బహిష్కరణ అమానుషమైన చర్యని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి పోలంరెడ్డి మల్లికార్జున అన్నారు. సోమవారం చిట్వేలిలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి కర్నూలు జిల్లాలోని నక్కలదిన్నె గ్రామంలో దళితుల బహిష్కరణపై మాట్లాడారు. ఆధునిక కాలంలో అగ్రవర్ణాలు ఈ చర్యలను చేపట్టడం అనాగరీకం అని విమర్శించారు. వెట్టి పనులను నిరాకరించడం బహిష్కరణకు కారణమని, రాజ్యాంగంలో దళితుల కోసం ఏర్పాటు చేసిన హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. కార్యక్రమంలో రంపా అంజన్న, రాజబోయిన ప్రకాశం, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలన్నీ పేదలకే అందాలి



రంగంపల్లె వడ్డిపల్లెలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బత్యాల


రంగంపల్లె(పుల్లంపేట), న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ నిరుపేదలకే అందాలన్నదే సీఎం చంద్రబాబునాయుడి ఆశయమని మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్రాయుడు పేర్నొన్నారు. సోమవారం మండల పరిధిలోని రంగంపల్లె పంచాయితీలోని వడ్డిపల్లె, గొల్లపల్లె, రంగంపల్లె తదితర గ్రామాల్లో ఇంటింటా తెదేపా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదో విడత జన్మభూమిలో మీ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలనే ఆశయంతో అధికారులు మీ ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో సభా సంస్థల కరస్పాండెంటు శ్రీరాములు, ఎంపీటీసీ సుబ్బనరసమ్మ, తెదేపా నాయకులు వెంకటసుబ్బయ్యయాదవ్, వెంకటసుబ్బయ్య, గురుమూర్తి పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో మార్కెట్ ధరలు (నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
బెండకాయలు	30
మటిక్కాయలు	30
వంకాయలు	20
బీట్‌రూట్	40
బంగాళదుంప	25
కాకర	30
టమోటాలు	10
పచ్చిమిరప	30
క్యాలీఫ్లవర్	30
అల్లం	60
చిక్కుడు	40
క్యారెట్	80
ఎర్రగడ్డలు	50
క్యాబేజీ	40
మునక్కాయలు	140
బీన్స్	60
దొండ	40
ముల్లంగి	30

మాంసం ధరలు



	కిలో (రూ)
మటన్	480
చికెన్	140
చికెన్ (స్కిన్‌లెస్)	180
100 గుడ్లు	565
డజను గుడ్లు	62
చేపలు	130

తెరపై ఈనాడు

శ్రీ లక్ష్మీ ప్యారడైజ్ : హలో
శ్రీ కృష్ణా :2 కంట్రీస్
లవ : ఇఈ **సిద్ధేశ్వర :**
ఎంసీఏ **ఎమ్ఎస్ఆర్ :**
ఒక్కక్షణం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక



ప్రభుత్వాసుపత్రుల్లో సరైన వసతులు లేక ఇలా కిటికీలకు కూడా సెలైన్ సీసాలుపెట్టి రోగులకు వైద్యం చేస్తున్నారు.

నేటి నుంచి జన్మభూమి - మాఊరు

రేషన్‌పత్రాలు, పింఛన్లకు ఇంకా లభించని ఆమోదం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: నేటి నుంచి అన్ని గ్రామపంచాయతీలలో 'జన్మభూమి- మాఊరు' కార్యక్రమం ప్రారంభం కానుంది. ప్రజల వద్దకే పరిపాలనను తీసుకెళ్లడం... వారి కష్టసుఖాలను తెలుసుకోవడం... సమస్యలను పరిష్కరించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇది ఐదో విడత జన్మభూమి కార్యక్రమం. ఈసారి ప్రజా సంక్షేమానికి సంబంధించిన పది ముఖ్యమైన అంశాలను ఎజెండాగా చేపడుతున్నారు. అయితే కొన్ని సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికీ రేషన్‌పత్రాలు, పింఛన్లు పొందలేని వారు అసంతృప్తిని వ్యక్తం చేస్తుండగా- మరికొందరు జన్మభూమి కార్యక్రమాల వల్ల గ్రామీణప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని చెబుతున్నారు. మిశ్రమ ఫలితాల మధ్య మరికొన్ని గంటల్లో ప్రారంభం కానున్న కార్యక్రమం సమస్యలు- సంతోషాల మధ్య అధికారులకు స్వాగతం పలకనుంది.

✸ జన్మభూమి కార్యక్రమంలో నిర్దేశించిన పది అంశాలు - ప్రస్తుతం వాటి స్థితిగతులను ఓసారి పరిశీలిస్తే..

1. సంక్షేమం - సంతృప్తి

నియోజకవర్గంలోని సంక్షేమ వసతిగృహాలు, అందులోని విద్యార్థులు, వారు పొందుతున్న సంక్షేమ పథకాలు, వాటి పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తెలియజేస్తున్న సంతృప్తిపై చర్చిస్తారు. ఐదు మండలాల్లో కలిపి మొత్తం 16 సంక్షేమ వసతిగృహాలు నడుస్తుండగా, ఇందులో 4,580 మంది విద్యార్థులు ఉంటున్నారు. అయితే పిల్లలకు భోజనం పళ్లేలు, ట్రంకు పెట్టెలు కూడా ఐదేళ్లుగా అందడం లేదు. మరికొన్ని వసతిగృహాల్లో సరైన భోజనం లభించడం లేదు. ఈ పరిస్థితులపై జరిగే చర్చ విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేలా ఉండాలి.

2.ఆరోగ్యం - ఆనందం

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఉచిత రక్తపరీక్షలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార పంపిణీ, ఆసుపత్రిలో ప్రసవం చేసుకునే వారికి రూ.6,000 నగదు ప్రోత్సాహం వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తోంది. కానీ కొన్ని ఆసుపత్రుల్లో వైద్యుల కొరత, చిన్నపిల్లలకు ప్రత్యేక చికిత్స అందుబాటులో లేకపోవడం, డెంగ్యూ, మలేరియా జ్వరాలకు అవసరమైన పరీక్షలు, ఎక్స్‌రే, స్కానింగ్ యంత్రాలు అందుబాటులో లేకపోవడంవల్ల రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఈ జన్మభూమి కార్యక్రమం ద్వారానైనా ఆధునిక వైద్యం అందుబాటులోకి తీసుకురావాలి.

3. స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధన

నియోజకవర్గంలో వంద గ్రామ పంచాయతీలున్నాయి. రైల్వేకోడూరు మేజర్ పంచాయతీకి మినహా మరెక్కడా పారిశుద్ధ్య కార్మికులు, వాహనాల వసతి లేదు. కేవలం సర్పంచులే పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. అందువల్ల గ్రామీణ పారిశుద్ధ్యం అమలు కావడం లేదు. సాధారణ నిధులు, ఆర్థిక ప్రణాళికాసంఘం నిధుల నుంచి ఐదుశాతం పారిశుద్ధ్యానికి కేటాయిస్తున్నా అవి సరిపోవడం లేదు. అందుకే పల్లెల్లో ఎక్కడ చూసినా చెత్తదిబ్బలు, మురుగు కాలువలు దర్శనమిస్తున్నాయి. జన్మభూమి చర్చల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది.

4. విద్యావికాసం

మండలానికి రెండు, మూడు చొప్పున ఆదర్శ పాఠశాలలుగా అర్హత పొందినా.. ఎక్కడా ఆదర్శం కనిపించడం లేదు. అందుకు తగిన వసతులు, ఉపాధ్యాయులను నియమించలేకపోతున్నారు. సర్కారు బడుల్లో ఆంగ్లమాధ్యమ బోధన, క్రీడలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మధ్యాహ్న భోజనానికి సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో ఏజెన్సీల వారు నాసిరకం సరకులతోనే భోజన కార్యక్రమాలను గడిపేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వారిని ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంటోంది. ఏకరూప దుస్తులు, తొమ్మిదో తరగతి విద్యార్థినులకు సైకిళ్లపంపిణీ వంటి ప్రయోజనాత్మక కార్యక్రమాలు విద్యార్థులకు ఉపకరిస్తున్నాయి.



స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధన సాధ్యపడేనా..

5. మౌలిక సదుపాయాల కల్పన

నియోజకవర్గంలోని జానకీపురం, గుర్రప్పపాళెం, రామయ్యపాళెం గిరిజకాలనీ, గంగిరెడ్డులమిట్టవంటి అనేక గ్రామాలకు కనీసం కాలిబాట కూడా లేదు. చంద్రన్నబాట పేరుతో ప్రభుత్వం సిమెంటుదారులు నిర్మిస్తున్నా అవి తగిన బడ్జెట్‌కు లోబడే ఉంటున్నాయి. కొన్ని గ్రామాలకు కాలువలు, ఏటిమీదుగా వెళ్లాల్సి ఉంది. అలాంటిచోట వంతెనలు నిర్మించి రోడ్డు నిర్మాణాలు చేపట్టాలి. కానీ ఇందుకు నిధులు సమకూరడం లేదు. మరికొన్ని గ్రామాల్లో శ్మశానాలకు దారి లేదు. ప్రజలు వీటిపై అధికారులను ప్రశ్నించే అవకాశముంటుంది.

6. సహజవనరులు - అభివృద్ధి

నియోజకవర్గంలో మంగంపేట ముగ్గురాయి విశేషమైన సహజవనరు. ఈ గనులను నమ్ముకుని మంగంపేట చుట్టూ సుమారు 250 వరకు ముగ్గురాయిని పొడిగొట్టే మిల్లులు ఏర్పాటయ్యాయి. అయితే కొన్ని ఆరోపణలు, మరి కొన్ని కారణాల వల్ల ప్రభుత్వం ఈ సహజవనరుల వినియోగం పట్ల ఉదాశీనంగా వ్యవహరిస్తోంది. ఉన్న సంపదను సద్వినియోగం చేసుకుంటే సర్కారుకు ఆదాయంతో పాటు కొన్ని వేలమంది కార్మికులకు ఇక్కడ జీవనోపాధి లభిస్తుంది.

7. వ్యవసాయం - అనుబంధశాఖల అభివృద్ధి

చంద్రన్న రైతుక్షేత్రాలు, రైతురథం, వ్యవసాయ యాంత్రీకరణ, సూక్ష్మపోషకాల ఉచిత పంపిణీ, పొలం పిలుస్తోంది, మట్టిపరీక్షలు, భూ ఆరోగ్యపత్రాల పంపిణీ వంటి అనేక కార్యక్రమాలు వ్యవసాయ రంగాన్ని పటిష్ట పరుస్తున్నాయి. అయితే దాని అనుబంధశాఖలైన ఉద్యానం, పాడిపరిశ్రమ, పట్టుపరిశ్రమ వంటివి నిర్లక్ష్యం చేయబడుతున్నాయి. ముఖ్యంగా పశువైద్యం దయనీయంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల వరకు వెళ్లి పశువులకు వైద్యం అందించే పరిస్థితి లేదు. దీనివల్ల ఇబ్బందులకు గురవుతున్న రైతులు పాడిని, పశువులను వదులుకుంటున్నారు. వ్యవసాయంతోపాటు అనుబంధశాఖలను బలోపేతం చేసే దిశగా చర్యలు అవశ్యం.

8. సుపరిపాలన - టెక్నాలజీ వినియోగం

పౌరసేవలను ఆన్‌లైన్ ద్వారా అందజేయడం, ఆలస్యమైతే సదరు శాఖలకు జరిమానా విధించడం, ప్రభుత్వం అందిస్తున్న సేవల పట్ల ప్రతి ఒక్కరికి నేరుగా ముఖ్యమంత్రి ఫోన్‌చేసి(రికార్డింగ్ కాల్) వారి నుంచి సమాధానాలు, సమస్యలను తెలుసుకోవడం, పింఛన్లు, రేషన్ సరకుల పంపిణీలో అవకతవకలను నివారించడం ద్వారా ప్రజలకు సుపరిపాలన సాధ్యపడుతోంది. టెక్నాలజీ వినియోగంలోనే పంచాయతీలు కొంత వెనకబడుతున్నాయి. మారుమూల ప్రాంతాలవరకు అంతర్జాల(ఇంటర్నెట్) సదుపాయాలు లేకపోవడంతో పంచాయతీ కార్యాలయాల్లో కంప్యూటర్ల వినియోగం మూలకు చేరింది.

9. విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్

గ్రామపంచాయతీల పరిపుష్టితో విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, ఉపాధి, మౌలికవసతుల కల్పన, పారిశ్రామికాభివృద్ధి వంటి అనేక అంశాలలో ప్రతి పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దినప్పుడే విజన్ సాధ్యపడుతుంది. నియోజకవర్గంలో వ్యవసాయాధారిత పరిశ్రమలను నెలకొల్పడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పంచాయతీలకు నిధులు పెరుగుతాయి. ఈ అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉంది.

10. ఆనందలహరి

ప్రజాసంక్షేమం, విద్యావిధానంలో చోటుచేసుకుంటున్న మార్పులు, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల ప్రగతి, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాల సమాహారమే ఆనందలహరి. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు అందిస్తున్న సేవలు, ప్రజల నుంచి వినతుల స్వీకరణ, కొత్తగా మంజూరైన పింఛన్లు, రేషన్‌పత్రాల పంపిణీలతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



జన్మభూమి కార్యక్రమం ద్వారా అధికారులు, నాయకులందరు మా గ్రామాలకే రావడం సంతోషం. గ్రామాల అభివృద్ధి గాని, అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గాని వారే నేరుగా చూసి తెలుసుకోవచ్చు. ఈ కార్యక్రమం ప్రయోజనకరమైనదే. మా గ్రామానికి వెళ్లేదారి మొత్తం గుంతలు, గోతులతో నిండిఉంది. ఈసారి జన్మభూమి కార్యక్రమంలోనైనా వాటికి పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాం.

- దేరంగుల రవికుమార్, కే.బుడుగుంటపల్లె

నేటి నుంచి జన్మభూమి- మాఊరు

ఓబులవారిపల్లె, : మండలంలో మంగళవారం నుంచి జన్మభూమి- మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈనెల 2న గద్దలరేవుపల్లె, బి.పి.రాచపల్లె, 3న బి.కమ్మపల్లె, బొమ్మవరం, 4న బోటుమీదపల్లె, మంగళంపల్లె, 5న ముక్కావారిపల్లె, యల్లాయపల్లె, 6న చిన్నంపల్లె, గొబ్బూరివారిపల్లె, రాళ్లచెరువుపల్లె, పెద్దఓరంపాడు, 7న గోవిందంపల్లె, మంగంపేట, 8న చెన్నరాజుపోడు, కొర్లకుంట, 9న బాలిరెడ్డిపల్లె, వైకోట, 10న జీవీపురం, గాదెల, 11న తేదీ చిన్నఓరంపాడు ఓబులవారిపల్లెలో జన్మభూమి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

పుల్లంపేట: జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండల స్థాయి అధికారులు కృషి చేయాలని రైల్వేకోడూరు నియోజకవర్గం ప్రత్యేక అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఐదో విడత జన్మభూమి నిర్వహణపై మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ మూడు నెలల్లో శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు.

రేషన్ పత్రాలకోసం దరఖాస్తుల ఆహ్వానం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: జన్మభూమి కార్యక్రమంలో అర్హతగల వారికి రేషన్ పత్రాల మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దారు చెంద్రాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు, బడుగు, బలహీనవర్గాలకు చెందినవారు ఇందుకోసం దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.

పెనగలూరు: మండలానికి 418 రేషన్‌పత్రాలు మంజూరు అయినట్లు తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. సోమవారం పెనగలూరు ఎంపీటీసీ-2 కొత్త బాలకృష్ణ తహసీల్దార్‌తో మండలానికి మంజూరు అయిన రేషన్‌పత్రాలపై చర్చించారు.

ఉచితంగా దుస్తుల పంపిణీ

అనంతరాజుపేట(రైల్వేకోడూరు గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని మినీ గురుకులంలోని విద్యార్థుల తల్లిదండ్రులకు సోమవారం మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్రాయులు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. మొత్తం 600 మందికి దుస్తులు పంపిణీ చేసినట్లు చెప్పారు.

రైల్వేకోడూరు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



రైల్వేకోడూరు: ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులును సత్కరిస్తున్న అభిమానులు, ఐసీడీఎస్ సిబ్బంది



రైల్వేకోడూరు: కస్తూరి, కట్టాను గజమాలతో సత్కరిస్తున్న రవికుమార్‌రాజు తదితరులు



రైల్వేకోడూరు: మాజీ ఎమ్మెల్సీ బత్యాలకు శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచి కృష్ణయ్య తదితరులు



ఓబులవారిపల్లె: ఎంపీడీవోకు కేక్ తినిపిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరాజు, తదితరులు



ఓబులవారిపల్లె: బాలిరెడ్డిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో నూతన సంవత్సర వేడుకల్లో విద్యార్థులు



పుల్లంపేట: తహసీల్దారు గౌరీశంకరరావును సత్కరిస్తున్న నాయకులు



పుల్లంపేట: సాయిబాబా ఆలయంలో భక్తుల పూజలు



చిట్వేలి: శివాలయంలో భక్తుల పూజలు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: కొత్త ఆంగ్ల సంవత్సర ప్రారంభం సందర్భంగా సోమవారం పట్టణంలోని ముఖ్య నాయకుల నివాసాలు, కార్యాలయాలు అభిమానులు, కార్యకర్తలు, అధికారులతో సందడిగా మారాయి. స్థానిక వైఎస్ అతిథిగృహం వద్ద ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అభిమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైకాపా జిల్లా ప్రధానకార్యదర్శి పంజం సుకుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు కౌరెడ్డి సిద్దయ్య, చెవ్వు శ్రీనివాసరెడ్డి, కరిముల్లా, సుధాకర్ రాజు, అన్వర్‌బాషా తదితరులు ఆయనను పూలమాలలతో సత్కరించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
❍ తెదేపా కార్యాలయం వద్ద చిట్వేలి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సంగరాజు రవికుమార్‌రాజు ఆధ్వర్యంలో యాభై కిలోల భారీ కేకును ఏర్పాటు చేశారు. తెదేపా నియోజకవర్గ బాధ్యుడు కస్తూరి విశ్వనాథనాయుడు, నాయకుడు కట్టా బాలాజీని ఒకే గజమాలతో సత్కరించారు.

❍ మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర అధికారప్రతినిధి బత్యాల చెంగల్రాయుడి నివాసం వద్ద సర్పంచి తిప్పన కృష్ణయ్య, ఉపసర్పంచి నార్జాల హేమరాజ్, చిట్వేలి మండలాధ్యక్షుడు కట్టా గుండయ్యానాయుడు, శివాలయం కమిటీ మాజీ అధ్యక్షుడు పరిటాల జగన్నాథం తదితరులు ఆయనను పూలమాలలతో సత్కరించారు. వీరితోపాటు తహసీల్దారు చెంద్రాయుడు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఐసీడీఎస్ సీడీపీవో సుజామణి తదితరులు నాయకులను కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.
❍ కొత్తసంవత్సరం సోమవారం రోజు రావడంతో స్థానిక శివాలయానికి భక్తులు వరస కట్టారు. ఆలయ అర్చకులు పవన్‌కుమార్‌శర్మ, యోగీశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆదిదంపతులకు ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకుడు మణికంఠశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా, శ్రీవినాయకస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల్లోను భక్తులు విశేష పూజలు చేపట్టారు.
❍ పట్టణంలోని దక్షిణాంధ్ర లూథరన్ చర్చిలో నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. పాస్టర్ ఆనంద్‌సురేష్‌బాబు ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరీమణులు క్యాండిల్ సర్వీస్ అనే కార్యక్రమంద్వారా పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి - కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో చర్చి కమిటీ అధ్యక్షుడు సామ్యూల్, ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, ప్రకాష్‌రాజ్, ప్రదీప్‌రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: మండలంలో ఆంగ్ల సంవత్సరాదిని స్వాగతిస్తూ సూర్యోదయం మునుపే బాబా దర్శనార్థమైన భక్తులు బారులు తీరారు. సోమవారం ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని పలుప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల స్థాయి అధికారులను కింది స్థాయి సిబ్బంది, అభిమానులు, పలువురు ఆంగ్లసంవత్సానికి శుభాకాంక్షలు తెలిపి పండ్లు అందించారు.

పెనగలూరు: మండలవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు దాటగానే యువత పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. మండలంలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. * మండల పరిధి పెనగలూరు మేజర్ పంచాయతీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పెనగలూరు పంచాయతీ ఇన్‌ఛార్జి సర్పంచి దేపూరు చిన్న వెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం నూతన సంవత్సర వేడుకలను ఇండ్లూరు మూడు రోడ్ల కూడలిలో పెనగలూరు పంచాయతీ ప్రజల మధ్య ఘనంగా నిర్వహించారు. 30 కేజీల కేకును కత్తిరించారు. కార్యక్రమంలో నాగినేటి మురళీకృష్ణనాయుడు, కోడూరు మురళీ, ఎర్రబోతులు హరి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను సోమవారం పలు కార్యాలయాలలో అధికారులు, నాయలకులు, ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల ఎంపీపీ వెంకటేశ్వరరాజును అధికారులు సన్మానించి, సత్కరించారు. అనంతరం ఎంపీడీవో వెంకటసుబ్బయ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షాలు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీటీసీ రమణ కేక్ కోశారు. బాలిరెడ్డిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయులు జయరామయ్య, ఉపాధ్యాయుల ఉదయ్‌భాస్కర్ విద్యార్థులతో కలసి నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు.
❍ మండల పరిధిలోని యల్లాయల్లెలో ఉన్న చిన్మయాశ్రమం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి సోమవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మజ, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.వి.రమణయ్య, మండల అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, ఉపాధ్యాయులు రమణ, సుబ్బరాయుడు, శ్రీను, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కేఎస్ అగ్రహారంలోని రంగనాయకుల మఠంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగయ్యస్వామి ఛారిటబుల్ ట్రస్టు ప్రధానార్చకులు భానుచంద్ర నేతృత్వంలో పూజలు జరిగాయి.
❍ లక్ష్మీపురంలో వెలసియున్న కంభారాయుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



పెనగలూరు: కేకు కోస్తున్న దేపూరు చిన్న వెంగల్‌రెడ్డి తదితరులు వేడుకలు



పెనగలూరు: అధికారులకు కేకు ఇస్తున్న ఎంపీపీ ఇర్షాద్ బేగం

ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

❖ ఘనంగా బాబా గ్రామోత్సవం



చెక్కభజన చేస్తున్న కళాకారులు

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన పుల్లంపేట వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన కళాకారుల ప్రదర్శనతో పులకరించిపోయింది. సోమవారం స్థానిక బజారువీధిలో వెలసిన షిర్డిసాయినాథుని 37వ వార్షికోత్సవం భాగంగా స్వామి వారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవం వెంట ఇతర జిల్లాల నుంచి తరలివచ్చిన కళాకారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించి భక్తులను ఆకట్టుకొన్నారు. డబ్బు దరువు, కర్ర, కత్తి విన్యాసాలు, టెంకాయ పగల కొట్టడం తదితర కార్యక్రమాలను చేపట్టారు. చెక్కభజన ప్రదర్శనలో చిన్నారులు ఆలపించిన భక్తిగీతాలతో పుల్లంపేట పులకిరించిపోయింది. గుర్రం రెండు కాళ్లపై నృత్యం చేయడం అందరిని అబ్బురపరిచింది. కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపకుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, సుబ్బరాయుడు, డాక్టర్ శంకరయ్య, చలమయ్య, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.



పుల్లంపేట పురవీధుల్లో ఊరేగుతున్న బాబా

కాలమానిని ఆవిష్కరణ

చిట్వేలి, న్యూస్‌టుడే: రాష్ట్రోపాధ్యాయ సంఘం చిట్వేలిశాఖ ఆధ్వర్యంలో స్థానిక చిట్వేలి మండల విద్యావనరుల కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలు వైభవంగా నిర్వహించారు. సోమవారం ఎమ్మార్సీ భవనం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో జయవేలు పాల్గొని ఎస్టీయూ కాలమానిని, దైనందినిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఉపాధ్యాయుడు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడు కే.హరినాథ్, ప్రధానకార్యదర్శి కే.నారాయణరెడ్డి, ఆర్థిక కార్యదర్శి రంతుల్లా, రీజనల్ కన్వీనర్ బాలసుబ్రమణ్యం, రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ బి.రవిశంకర్‌రెడ్డి, జిల్లా కన్వీనర్లు అజయ్‌కుమార్‌రెడ్డి, శిబువతుల్లా, దుర్గరాజు, పోలయ్య, సుమన్ పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం యూటీఎఫ్ కాలమానినిలను ఎంఈవో పద్మజ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, మండల అధ్యక్షులు రమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు విద్యాభివృద్ధికి దోహదపడాలని ఎంఈవో రంగనాథయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో కాలమానిని, దైనందినిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన కోర్కెల కోసం ఎలాగైతే ఐక్యతంగా పోరాటాలు చేస్తారో అలాగే విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ, ఎస్టీయూ నాయకులు రామకృష్ణయ్య, నాగేశం, సిద్ధయ్య, చంద్రశేఖర్, పెంచలయ్య, మల్లికార్జున మహేష్, మాధవమూర్తి, బాలనరసింహులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

రాష్ట్రపతి చేతులమీదుగా పీహెచ్‌డీ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎత్తపువారి కాలనీలో నివాసముంటున్న పీవీ ప్రత్యూష రాష్ట్రపతి రామనాథ్‌కోవింద్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు ఆమె తండ్రి పి.రామకృష్ణ తెలిపారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తున్న, దేశంలో పేరెన్నికగన్న బెంగళూరులోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్‌హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్' నుంచి ఈమె శనివారం జరిగిన సంస్థ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భక్తులతో గండిక్షేత్రం కిటకిట



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి



స్వామి హారతి తీసుకుంటున్న భక్తులు

గండి (చక్రాయపేట), న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం గండిక్షేత్రంలో భక్తులు పోటెత్తారు. రాయలసీమలోని అన్ని జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో వీరాంజనేయస్వామి సన్నిధిలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజారమేష్‌స్వామి తదితరులు పుష్పాలు, తోరణాలతో వీరాంజనేయస్వామిని అలంకరించారు. స్వామివారికి పూజలు నిర్వహించారు. పాపఘ్నినదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారికి కొబ్బరికాయలు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో గురుప్రసాద్, ఛైర్మన్ రాజారావు, రవిచంద్రారెడ్డి, దాసిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు



ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి



సౌమ్యనాథస్వామిని దర్శించడానికి విచ్చేసిన భక్తులు

నందలూరు, న్యూస్‌టుడే : నూతన ఆంగ్ల సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకొని సోమవారం నందలూరులోని సౌమ్యనాథస్వామికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్టుతో పాటు శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి ఉత్సవ విగ్రహాలను అత్యంత అందంగా అలంకరించారు. స్వామి దర్శనం కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సౌమ్యనాథస్వామి అన్నదాన సేవా ట్రస్టు వారు భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ధర్మకర్త పల్లె సుబ్రహ్మణ్యం, ఈవో రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక స్వర్ణాంధ్ర మదర్‌లాండ్ విక్టరీ రోవర్ స్కాటు గ్రూపు సంస్థ అధ్యక్షుడు వేపగుంట సాంరాజ్ ఆధ్వర్యంలో భక్తులకు సేవలందించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు లంకాయగారి సుబ్బరామయ్య, మోడపోతుల రాము తదితరులు పాల్గొన్నారు.

పల్లకీ ఉత్సవానికి పోటెత్తిన భక్తులు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలో వెలసిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి సోమవారం రాత్రి జరిగిన పల్లకీ సేవకు భక్తులు పోటెత్తారు. ఆలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకుని ఉదయం నుంచి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా 5వ అదనపు కోర్టు న్యాయమూర్తి ఎం.తిరుమలరావు, న్యాయమూర్తి ఎం.మానసలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీ ఉత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ అర్చకులు కృష్ణయ్యస్వామి, శంకరయ్య, యోగి అర్చనలు చేసి మంగళ హారతులు ఇచ్చి స్వామివారి ఆశీర్వచనాలను అందజేశారు. రాత్రి జరిగిన పల్లకీ ఉత్సవంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఉత్సవ కార్యక్రమానికి స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి.మంజుల, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



పల్లకీ సేవలో పాల్గొన్న న్యాయమూర్తులు తిరుమలరావు, మానస

కన్నడ నటి సురేఖకు ఘన స్వాగతం



కన్నడ నటి సురేఖను సన్మానిస్తున్న ఒంటేరు, మధు, తదితరులు

వైఎంఆర్ కాలనీ(ప్రొద్దుటూరు), న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా కన్నడ నటి సురేఖ సోమవారం సాయంత్రం ప్రొద్దుటూరు పట్టణానికి వచ్చారు. శ్రీరాముల పేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆమెకు సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, సెన్సారు బోర్డు సభ్యుడు పంజగల మధుసూదన్‌బాబు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నటి సురేఖ మాట్లాడారు. మహిళలు అన్నిరంగాలలో ముందంజలో ఉండాలని చెప్పారు. ప్రజా చైతన్య చిత్రాలకు ప్రాధాన్యత ఇస్తున్నానని తెలిపారు. ప్రొద్దుటూరుకి రావడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం ఆమెను పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫిల్మ్ హ్యాట్రిక్ కోడైరెక్టరు సూర్య, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య, నరేంద్రనాథరెడ్డి, సుందరం, రామారావు, రామచంద్ర, లక్ష్మీనారాయణ, సహదేవరెడ్డి, ఓబుళరెడ్డి, కిరణ్, నాగరాజు, నరేష్‌కుమార్, ఖైరోజీ, ఎస్ఎల్‌వీ ప్రసాద్, సుబ్రహ్మణ్యం, దస్తగిరి, గోపీ, ఆకేపాటి విశ్వం, జనార్ధన్‌రెడ్డి, డాన్స్ మాస్టర్ డిస్కో రమణ, నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సావిత్రిబాయి పూలే అవార్డుకు సైరాభాను ఎంపిక



డి.సైరాభాను, ప్రధానోపాధ్యాయురాలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: చిన్నమండెం బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.సైరాభాను రాష్ట్ర స్థాయి సావిత్రిబాయి పూలే పురస్కారానికి ఎంపికయ్యారు. సర్వశిక్షఅభియాన్ కింద రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు హెచ్‌ఎంలను ఎంపిక చేయగా కడప జిల్లా నుంచి సైరాభానుకు మాత్రమే ఈ అవకాశం దక్కింది. ఈ నెల 3న వైజాగ్‌లో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకోనున్నారు. విధినిర్వహణలో చేసిన విద్యాభివృద్ధి, పదో తరగతిలో వంద శాతం ఫలితాల సాధనతో పురస్కారం వరించిందని ఆమె పేర్కొన్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపిక కావడం పట్ల ఆనందంగా ఉందన్నారు. పాఠశాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. సావిత్రిబాయి పూలే పురస్కారానికి కస్తూర్బాల నుంచి పెండ్లిమర్రి పాఠశాలకు చెందిన పీఈటీ ప్రమీల, చిట్వేలి పాఠశాలకు చెందిన సుమతమ్మ, కేజీబీవీల ఎస్‌వోల విభాగంలో వల్లూరు ఎస్‌వో నసీరున్నీసా, స్కూల్‌అసిస్టెంట్ విభాగంలో ఖాజీపేట బాలికల పాఠశాలకు చెందిన భార్గవి, ఎస్‌జీటీ విభాగంలో జాగువారిపల్లె పాఠశాలకు చెందిన హైమావతి, ఐఈఆర్టీ విభాగంలో చెన్నూరు 5వ వార్డుకు చెందిన సుభద్రమ్మ ఉన్నారు.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 'ఈనాడు' సంయుక్త నిర్వహణలో
ఇంటర్ తర్వాత విద్యా, ఉపాధి అవకాశాలపై 4న సదస్సు

విశాఖపట్నం, న్యూస్‌టుడే : కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ(ఎమ్‌హెచ్‌ఆర్‌డీ) నుంచి ఏ గ్రేడ్ గుర్తింపు పొందిన వర్సిటీల్లో ఒకటైన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో కలిసి 'ఈనాడు' ఈ నెల 4న కడపలో 'యువత- భవిత' పేరిట విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు గీతం ప్రవేశాల విభాగం సంచాలకుడు ఆచార్య కె.నరేంద్ర సోమవారం తెలిపారు. కడప హరిత హోటల్, ఎస్పీ కార్యాలయం ఎదురుగా, కోటిరెడ్డి సర్కిల్ పక్కన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సదస్సు జరగనుందన్నారు. ఇంటర్మీడియట్ తర్వాత ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, ఆర్ట్స్, కామర్స్, సైన్స్, బీఎస్సీ వంటి కోర్సుల్లో వస్తున్న మార్పులు, డిగ్రీ అనంతరం పీజీ స్థాయిలో లభిస్తున్న విద్యావకాశాలను నిపుణులు వివరిస్తారన్నారు. ఇంటర్మీడియట్ తర్వాత ఇంజినీరింగ్‌తో సమానంగా ప్రాధాన్యం పెరుగుతున్న అకౌంటింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్‌లతో కలిపిన లా, ఆర్కిటెక్చర్ కోర్సుల గురించి విద్యార్థులు తెలుసుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఇంజినీరింగ్‌లో ఏయే కోర్సులకు డిమాండ్ ఉంది. ఇంజినీరింగ్‌లో కోర్సుల ఎంపిక ఏ విధంగా చేసుకోవాలి, మంచి కళాశాలలను ఎంచుకునే విధానం, ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు తెలియజేస్తారన్నారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రత్యేక సమయాన్ని ఈ సదస్సులో కేటాయిస్తారన్నారు.

ప్రవేశానికి సమాచార కేంద్రం : సదస్సుతో పాటు గీతం డీమ్డ్ వర్సిటీలో ప్రవేశం పొందగోరేవారికి గీతం అడ్మిషన్ టెస్ట్(గాట్)- 2018 గురించిన సమాచారాన్ని అందజేయడానికి ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రవేశ పరీక్ష విధానం, కేంద్రాలు, నమూనా పరీక్షకు సంబంధించిన సమాచారం ఈ కేంద్రం నుంచి పొందవచ్చని పేర్కొన్నారు.

తొలిరోజు.. రోడ్లపై యమరాజు

(మొదటిపేజీ తరువాయి) సంతోషంగా వేడుకలు చేసుకోవాల్సిన సమయంలో యముడు మృత్యుపాశం విసిరాడు. గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పెండ్లిమర్రి మండలం నల్లయ్యగారిపల్లె ఇందిరానగర్ దళితవాడ రహదారి పక్కనే ఉంది. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి వరకు కాలనీ వాసులంతా కలిసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అందరూ కలిసి రహదారి పక్కనే చలిమంట వేసుకుని చలి కాచుకుంటూ కూర్చున్నారు. సోమవారం తెల్లవారుజామున వేంపల్లె వైపు నుంచి కారు అతి వేగంగా వచ్చి చలికాచుకుంటున్న వారిపై దూసుకెళ్లింది. పల్టీలు కొట్టుకుంటూ వెళ్లి మట్టి దిబ్బను తగిలి ఆగిపోయింది. ప్రమాదంలో భాస్కర్ (27), లక్ష్మినరసింహులు(14), కార్తీక్(12), గిరి(16) అక్కడికక్కడే మృతిచెందారు. వీరు ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. కారు నడపుతున్న చింతకొమ్మదిన్నె మండలం రసూల్‌పల్లెకు చెందిన బ్రహ్మానందరెడ్డి(27) ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన టి.సుమంత్‌ను రిమ్స్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. కారులో ముగ్గురు ప్రయాణిస్తుండగా అందరూ మద్యం తాగి ఉన్నారని, మద్యం సీసాలు, బిరియానీ పొట్లాలు ఉన్నాయని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. కారు నడుపుతున్న బ్రహ్మానందరెడ్డి మృతి చెందగా సీకేదిన్నెకు చెందిన రాజు, ఈశ్వరయ్య సురక్షితంగా బయటపడ్డారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సంఘటన స్థలాన్ని కడప డీఎస్పీ మాసూమ్‌బాషా, ఎస్సై రోషన్ పరిశీలించారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను కడప రిమ్స్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మిన్నంటిన రోదనలు : ఒకే గ్రామానికి చెందిన నలుగురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రిమ్స్ ఆవరణలో రోదనలు మిన్నంటాయి. మృతుల బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. భాస్కర్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భాస్కర్ మృతితో ఆ కుటుంబం అనాథగా మారింది. లక్ష్మీనరసింహులు తొమ్మిదో తరగతి, కార్తీక్ ఏడో తరగతి చదువుతున్నారు. గిరి కూలి పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. ఉన్న ఒక్క కుమారుడు మృతిచెందడంతో ఇకతమకు దిక్కెవరని కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

కోట ప్రహారీ.. నాణ్యత హారీ

● నిర్మాణ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ● పనుల తీరుపై పురావస్తుశాఖ అధికారుల అసంతృప్తి



కోట సమీపాన బేస్‌మట్టంపై చేపట్టిన రాతికట్టడడం పనులు



నీటితడులకు నోచుకోని నిర్మాణం



నాసిరకం రాళ్లను పరిశీలిస్తున్న జిల్లా పురావస్తు శాఖ అధికారి, సంస్థ ప్రతినిధులు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటంలోని చారిత్రక మట్లిరాజుల కోట చుట్టూ భారీ వ్యయంతో చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించింది. ఇక్కడ కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు, పర్యాటకుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చారిత్రక కట్టడాల పరిరక్షణ నిమిత్తం మంజూరైన ఈ పనులు కొందరు జేబులు నింపుకొనేందుకు దోహదపడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణాలు చాలా నాసిరకంగా చేపడుతుండడంతో పురావస్తుశాఖ అధికారులు సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సిద్దవటంలోని మట్లిరాజుల కోటకు పెన్నానది వైపు మినహాయించి మిగతా మూడువైపులా రక్షణగోడ నిర్మాణ పనులు మంజూరయ్యాయి. ఈ పనులను దిల్లీకి చెందిన వాప్‌కాస్ సంస్థ దక్కించుకుని చేపట్టింది. ఇందుకోసం ఎంత మొత్తం మంజూరైందీ ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించడంలేదు. అధికారులు మాత్రం రూ.కోటికిపైగానే వెచ్చించనున్నట్లు చెబుతున్నారు. కోటకు పడమర, ఉత్తరం, తూర్పువైపున సుమారు 1700 మీటర్ల ప్రహరీ నిర్మించాల్సి ఉంది. మొదట బేస్‌మట్టం, దానిపై రాతితో కట్టడడం ఆపై ఇనుప గ్రిల్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు పడమర, ఉత్తరం వైపున బేస్‌మట్టం పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయి. ఇంకా తూర్పువైపున ప్రారంభించాల్సి ఉంది. బేస్‌మట్టం పనుల్లో తగినమేరకు సిమెంటు వినియోగించలేదని స్థానికులు చెబుతున్నారు. దీనికితోడు సిమెంటుకు సక్రమంగా నీటితడులు అందించని కారణంగా గట్టిదనం కోల్పోయే పరిస్థితి నెలకొంది. కొన్నిరోజుల నుంచి కోట ముఖద్వారం సమీపంలో బేస్‌మట్టంపై రాతికట్టడం పనులు పదిమీటర్ల దూరం వరకు చేపట్టారు. ఈ పనుల్లో నాణ్యత లోపించింది. నిర్మాణంలో వాడిన రాళ్లు ఒక క్రమ పద్ధతిలో లేవని, వివిధ ఆకారాల్లో హెచ్చుతగ్గులతో ఉన్నాయని కూలీలు చెబుతున్నారు. పనులకు వినియోగించే రాళ్లు కూడా నాసికరంగా ఉన్నాయంటూ వారు వాపోతున్నారు. వాటికి నలువైపులా నునుపుగా చేయడం కష్టంగా ఉందని పురావస్తుశాఖ అధికారుల ఎదుటే కూలీలు చెప్పారు. రాళ్లకు నలువైపులా నునుపు చేయడానికి యంత్రాన్ని వినియోగించాల్సి ఉండగా కూలీలతోనే కానించేస్తున్నారు. దీంతో రాతి పనుల్లో నాసిరకం రాజ్యమేలుతోంది. ఇటీవల నిర్మాణాన్ని పరిశీలించిన జిల్లా పురావస్తుశాఖ అధికారి బాలకృష్ణారెడ్డి పనుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యత లేదని మండిపడ్డారు.

● ఈ రక్షణగోడ నిర్మాణంపై జిల్లా పురావస్తు శాఖ అధికారి బాలకృష్ణారెడ్డిని వివరణ కోరగా.. పనులు నాసికరంగా ఉన్నాయన్నారు. నిబంధనల మేరకు పనులు చేపట్టడడంలేదని తెలిపారు. నిర్మాణానికి వినియోగించే రాళ్లను పరిశీలించామని, అవి చాలా నాసిరకంగా ఉన్నాయని చెప్పారు. ఈ విషయమై రాష్ట్ర పురావస్తుశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఆయకట్టును మింగిన అడవి!

(మొదటిపేజీ తరువాయి) భూకేటాయింపు జరపాల్సి ఉంది. ఆ తర్వాత అటవీశాఖ నుంచి నిరభ్యంతరం పొంది నిర్మాణం చేపట్టాలి. అప్పటి పాలకులు అవేవీ పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వం నుంచి నిధులు రప్పించి రూ.12 కోట్ల పైబడి ఖర్చు చేసి జలాశయం నిర్మించేశారు. తద్వారా సమీపంలోని నగరిపాడు, చింతారెడ్డిపల్లి, వెంకటరాజుపల్లి, పెద్దూరు, గొల్లపల్లి.. తదితర గ్రామాల సాగుభూములకు నీరివ్వాలన్నది ఉద్దేశం. కోన పరివాహకంలో వ్యవసాయ బోర్లలో నీటిమట్టం పెంచవచ్చని భావించారు. అక్కడి నుంచే కథ అడ్డం తిరిగింది. జలాశయం అడ్డగోలుగా నిర్మించేసినా.. కాల్వల పరంగా సమస్య ఏర్పడింది. కుడికాల్వ 3 కిలోమీటర్లు, ఎడమకాల్వ 600 మీటర్లు ఉండగా.. ఇందులో కొంతమేర పనులు జరిగి ఆగిపోయాయి. ఉపకాల్వలను అసలు నిర్మించనే లేదు. పనులు జరపడానికి అటవీశాఖ అభ్యంతరాలు చెప్పడంతో ఎటూ తేలకుండా ఉండిపోయింది. ఇక్కడ రూ.12 కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయి. ప్రస్తుతం గొట్టిమానుకోన జలాశయంలోకి భారీగా నీరొచ్చినా దాన్ని సాగుకు వినియోగించే అవకాశమే లేకుంది. ఆఖరుకు జలాశయం కట్టడం ద్వారా నాలుగు చెరువులకు నీరు చేరకుండా అడ్డుకట్ట పడినట్లయింది. ప్రస్తుతం అటవీశాఖకు ప్రత్యామ్నాయ భూమి చూపే కసరత్తు జరుగుతుండగా.. రెవెన్యూ, అటవీ, జలవనరులశాఖల మధ్య సమన్వయలోపం సమస్యను జటిలం చేస్తోంది



జలకళతో ఉన్న కోన వెనుక ప్రాంతం

నిర్మించి ఏం లాభం?

-మలిశెట్టి రాహుల్, ఆయకట్టు రైతు, వెంకటరాజుపల్లి



కోట్ల రూపాయలు వెచ్చించి గొట్టిమానుకోన జలాశయం నిర్మించారు. దీనివల్ల ఈ ప్రాంత రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుండాపోయింది. కుడికాల్వ రెండు కిలోమీటర్లు, ఎడమకాల్వ 600 మీటర్లు పనులు జరిగాక ఆగిపోయాయి. దీంతో నీరు వదిలే అవకాశమే లేదు. దాంతో పాటు సప్లై ఛానళ్ల నిర్మాణమూ లేకపోవడం దురదృష్టకరం. దీంతో మేం చాలా నష్టపోయాం. నాకు 20 ఎకరాల పైబడి పొలం ఉంది. జలాశయం కింద ఉన్న ఆ పొలానికి నీటికష్టం తప్పడం లేదు.

ప్రభుత్వం పట్టించుకోవాలి

-కృష్ణయ్య, పెద్దూరు



జలాశయం నిర్మించి కేవలం డబ్బు తిన్నారు తప్ప మాకు మాత్రం న్యాయం జరగలేదు. నాకూ 15 ఎకరాల పొలం ఉంది. ఆ ఆయకట్టుకు కోన నీళ్లు అందని పరిస్థితి. 1600 ఎకరాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది బోర్లకు ఈ జలాశయం ఆధారమవుతుందని చెప్పారు. నీళ్లతో నిండటం మినహా మాకు ఆ నీళ్లు ఉపయోగపడటం లేదు. ఏళ్లు గడుస్తున్నా ఈ సమస్య పట్టించుకునేవారే లేరు. మా భూములకు కోన నీళ్లు ఇప్పించాలి.

కసరత్తు జరుగుతోంది

-మురళీకుమార్‌రాజు, జలవనరులశాఖ డీఈ

అటవీశాఖ భూమి గొట్టిమానుకోన రిజర్వాయర్‌లో కొంత వెళ్లింది. దానికి ప్రత్యామ్నాయంగా భూమిని అటవీశాఖకు అప్పగించాల్సి ఉంటుంది. ఈ అంశంపై ఇప్పటికే ప్రత్యేకంగా దృష్టి సారించాం. రెవెన్యూ, జలవనరులశాఖతో పాటు అటవీశాఖ అధికారులు ఇప్పటికే సమావేశమై సమీక్షించాం. గొట్టిమానుకోన సమీపంలో 15 ఎకరాల రెవెన్యూ భూమిని గుర్తించి అటవీశాఖకు అప్పగించే విషయమై కలెక్టర్‌కు నివేదించాం. నిర్ణయం వెలువడాల్సి ఉంది.

ప్రత్యేక దృష్టి సారిస్తాం

-బాబూరావు నాయుడు, జిల్లా కలెక్టర్

గొట్టిమానుకోన జలాశయానికి సంబంధించిన సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. అధికారులతోనూ మాట్లాడి పూర్తి వివరాలు రాబడతాం. ఇబ్బందులెక్కడున్నాయన్న దానితో పాటు.. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలను చేపడుతోంది.

దగాపడ్డ రైతన్న!

(మొదటిపేజీ తరువాయి) మంది రైతులు ప్రీమియం చెల్లించి ఫసల్ బీమా చేశారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంట దిగుబడిలేకపోవడంతో గ్రామాన్ని యూనిట్‌గా పరిగణలోకి తీసుకుని పరిహారాన్ని మంజూరు చేశారు. రెవెన్యూ గ్రామాల వారీగా పరిహారం ఎకరాకు రూ.6 వేల నుంచి రూ.19 వేల వరకు మంజూరైంది. రైతుల నుంచి ప్రీమియంతో పాటు దరఖాస్తులను పొందిన వెలుగు అధికారులు పంటసాగు వివరాలను అంతర్జాలంలో నమోదు చేయడంలో తప్పిదాలు చేశారు. రైతుకు సంబంధించిన భూమి విస్తీర్ణాన్ని తక్కువగా నమోదుచేయడంతో పాటు రెవెన్యూ గ్రామాల వారీగా భూములను నమోదు చేయాల్సి ఉండగా నివాస ప్రాంతాలను పరిగణలోకి తీసుకొని నమోదుచేశారు. దీంతో పరిహారం మంజూరులోయ అనేకమందికి తీవ్ర అన్యాయం జరిగింది. జరిగిన తప్పిదాలను సరిదిద్ది న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

2700 దరఖాస్తులు వెనక్కి..

ప్రీమియం చెల్లించి బీమా వస్తుందని ఎదురుచూసిన రైతులకు చేదు అనుభవం ఎదురైంది. గతేడాది డిసెంబరులో బీమా కోసం ప్రీమియం చెల్లించి దరఖాస్తులను పంపితే ఏడాది తర్వాత తప్పులు ఉన్నాయంటూ ఆ సంస్థ ప్రతినిధులు దరఖాస్తులను వెనక్కు పంపారు. జిల్లా వ్యాప్తంగా ఇలా 2700 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఇందులో జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎక్కువగా ఉండగా మిగతా మండలాల్లో 20 నుంచి 60 దరఖాస్తుల వరకు తిరస్కరణకు గురయ్యాయి. చాలా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని పేర్కొంటూ జాబితా రావడంతో సంబంధిత రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

త్వరగా ఖాతాల్లో జమచేయాలి

ప్రీమియం చెల్లించిన రైతుల్లో ఇంకా చాలామందికి బీమా రావాల్సి ఉంది. ఇంతవరకు ఎంతమంది రైతుల ఖాతాల్లో బీమా జమ అయింది జిల్లా అధికారుల వద్ద సమగ్ర సమాచారం లేదు. వ్యవసాయ, వెలుగు అధికారులను బీమా మంజూరు విషమయై సంప్రదిస్తే తమ వద్ద పూర్తి సమాచారం లేదంటూ దాటవేస్తున్నారు. బీమా సంస్థ నుంచి సమాచారం వచ్చిన వెంటనే మండల కేంద్రాలకు జాబితాను పంపుతామని చెబుతున్నారు. దీంతో పెండింగ్ జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేవోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పెండింగ్ జాబితాను విడుదలచేసి ఉత్కంఠకు తెరదించాలని రైతులు కోరుతున్నారు.

రెండ్రోజుల్లో.... రూ.3.70 కోట్ల మద్యం తాగేశారు

(మొదటిపేజీ తరువాయి) 31వ తేదీ 2258 మద్యం పెట్టెలు, 895 బీరు పెట్టెలు విక్రయించారు. రూ.1.60 కోట్లు వచ్చాయి.

● కడప డివిజన్ పరిధిలో జనవరి 1వ తేదీ మద్యం 3069 కేసులు, బీరు 2061 పెట్టెలు, ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో 1482 మద్యం పెట్టెలు, 809 బీరు పెట్టెలను విక్రయించగా రూ.2.10 కోట్లు వచ్చాయి.

శునకాలపై వ్యాసానికి అంతర్జాతీయ గుర్తింపు




ఫలించిన అధ్యాపకురాలి కృషి

నల్ల రంగు చాక్లెట్లు తినిపిస్తే.. ప్రమాదమే



సాధించాలన్న తపన, నిరంతర కృషితో ఎంచుకున్న రంగంలో ప్రత్యేకత చాటుకుంటున్నారు ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలలో అదనపు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ సిరిగిరెడ్డి శివజ్యోతి. పెంపుడు శునకాలకు పెట్టే నలుపు వర్ణం చాక్లె ట్ల వల్ల వాటికి వాటిల్లే నష్టాలపై ఆమె గతంలో రాసిన వ్యాసానికి తాజాగా అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది.

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలలో అదనపు అధ్యాపకురాలిగా పరాన్నజీవ శాస్త్ర విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్. సిరిగిరెడ్డి శివజ్యోతి పెంపుడు శునకాలకు పెట్టే నలుపు వర్ణం చాక్లెట్ల వల్ల వాటికి జరిగే నష్టాలపై 2013లో వ్యాసం రాశారు. దీన్ని అంతర్జాలానికి అనుసంధానం చేశారు. దీన్ని అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన వ్యాలీ బ్లాక్ వెల్ పబ్లికేషన్ 'స్మాల్ అనిమెల్ ట్యాక్సికాలజీ' అనే పుస్తకంలో గత డిసెంబరు 15వతేదీన ప్రచురించారు. ఈ మేరకు అమెరికా.. న్యూజెర్సీలోని ప్రధాన కార్యాలయం ద్వారా ఆమెకు సమాచారం అందించారు. ఈ వ్యాసానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపునిస్తున్నట్లు తెలిపారు. పెంపుడు జంతువుల్లో కొన్నిరకాలు, అవి తీసుకునే పదార్థాల వల్ల కలిగే వ్యాధులు, రుగ్మతల గురించి ఆమె అందులో విశ్లేషించారు.



ఈ పుస్తకంలోనే వ్యాసానికి చోటు దక్కింది



ఈ చాక్లెట్‌పైనే పరిశోధన జరిపింది



ఇటీవల పీహెచ్‌డీ అందుకుంటున్న శివజ్యోతి

◆ ప్రొద్దుటూరు సమీపంలోని గోపవరం పంచాయతీ పశువైద్య కళాశాలలో అదనపు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఈమె 2012 నవంబరులో విధుల్లోకి చేరారు. పరాన్నజీవశాస్త్ర విభాగంలో పని చేస్తూనే మరోవైపు పరిశోధనలు ప్రారంభించారు. ప్రస్తుతం పొందిన గుర్తింపే కాకుండా గతంలో కూడా వివిధ అంశాలపై ఈమె పరిశోధన వ్యాసాలకు 15 పురస్కారాలు వరించాయి. ఇటీవలే పీహెచ్‌డీ కూడా పూర్తి చేసి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి జవహర్‌రెడ్డి చేతుల మీదుగా పట్టా అందుకున్నారు. నలుపు వర్ణం కలిగిన చాక్లెట్లను శునకాలకు పెట్టడం వల్ల గంటలోనే తీసుకున్న ఆహారం ద్వారా వాటి కండరాలు సచ్చుబడిపోతాయి. దీంతోపాటు నోటి ద్వారా సొంగ కారుతుంది. కొన్ని శనకాలకు వాంతులు కూడా అవ్వొచ్చు. మరికొన్ని మృత్యువాత పడే అవకాశముంది. శనకాలకు ఇలాంటి పరిస్థితులు ఎదురైతే యాక్టివేటెడ్‌చార్‌కోల్ అనే మందును వేయాలని మరోవైపు సెలైన్ ఎక్కించడం వల్ల ప్రమాదం నుంచి వాటిని బయట పడవేయవచ్చని అందులో వివరించారు. నలుపు వర్ణం రంగు కలిగిన చాక్లెట్‌లో మిథైల్ గ్జాంతిన్స్ అనే పదార్థం ఉంటుందని దీన్ని తీసుకోవడం వల్ల శునకం శరీరం లోపలి భాగం పూర్తిగా విషంగా మారుతుందని డాక్టర్ శివజ్యోతి శాస్త్రీయంగా విశ్లేషించారు. వయసు తక్కువున్న శునకాలు నలుపు వర్ణం చాక్లెట్లు తినడం వల్ల శరీరంలోని అవయవాలన్నీ త్వరగా పాడై అవి మృత్యువాత పడే అవకాశముందన్నారు. చాక్లెట్‌లో అయోబ్రోమిన్ కేఫిన్ అనే పదార్థం వల్ల వాటి కండరాల్లోని కాల్షియంలో సమతుల్యత దెబ్బతింటుందనే అంశాన్ని పొందుపరిచారు. వాటికి గుండె సంబంధిత వ్యాధులు కూడా వస్తాయని హెచ్చరించారు.

డిసెంబరు 15న సమాచారం

డాక్టర్. శివజ్యోతి రాసిన వ్యాసాన్ని గుర్తించిన అంతర్జాతీయ వ్యాలీ బ్లాక్‌వెల్ పబ్లికేషన్ స్మాల్‌మెల్ ట్యాక్సికాలజీ అనే పుస్తకంలో ప్రచురించారు. ఈమేరకు గత ఏడాది డిసెంబరు 15వతేదీన సమాచారం అందింది. దీనిపై కళాశాల యాజమాన్యం డాక్టర్ శివజ్యోతిని అభినందించింది. బెస్ట్ వరల్డ్ ప్రిజివేషన్, వీనస్ ఎంగ్ ఫ్యాకల్టీ, ఎడిటోరియల్ బోర్డు మెంబరుతోపాటు వివిధ అంశాలపై జాతీయ, అంతర్జాతీయ అవార్డులను ఆమె సొంతం చేసుకున్నారు. ఈమె భర్త డాక్టర్ సుధాకర్‌రెడ్డి ఇదే కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఆనందంగా ఉంది..

శునకాలు నలుపు రంగు చాక్లెట్లు తీసుకోవడం వల్ల జరిగే నష్టాలపై రాసిన వ్యాసానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించటం ఆనందం కలిగిస్తోంది. విదేశీయులకు చెందిన అంతర్జాతీయ పుస్తకంలో వ్యాసాన్ని ముద్రించి వాడుకోవడం చెప్పలేని ఆనందంగా ఉంది. అధ్యయనం చేసి రాసిన వ్యాసానికి సార్థకత దక్కింది. మరిన్ని పరిశోధనలు చేసి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాలనేదే లక్ష్యం.

- డాక్టర్.సిరిగిరెడ్డి శివజ్యోతి. అధ్యాపకురాలు, పశువైద్య కళాశాల, ప్రొద్దుటూరు.



భర్త డాక్టర్ సుధాకర్ రెడ్డితో..

మహిళలు స్వయం ఉపాధి రాణులు

భర్తకు తోడుగా..కొలిమి పని



ఈ చిత్రంలో కొలిమి వద్ద ఇనుప వస్తువుపై సమ్మెట దెబ్బలు కొడుతున్న మహిళ పేరు బత్తల వెంకటలక్షుమ్మ. ఈమె బాలాజీ స్వయం సహాయ సంఘం సభ్యురాలు. భర్త మల్లికార్జున చేస్తున్న కొలిమి పనికి సహాయకురాలిగా ఉన్నారు. వీరిది పోట్లదుర్తి. జీవనోపాధి నిమిత్తం ప్రొద్దుటూరొచ్చారు. ఎర్రగుంట్ల రోడ్డు వీధిలో నివాసం ఉంటున్నారు. కొలిమి ద్వారా వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టరు ట్రాలీ కిట్ల పనులు చేస్తున్నారు. తొలుత వీరు ప్రైవేట్‌గా రూ.1000కి 3 నెలలకు రూ.120 వడ్డీ చెల్లించేలా రూ.10 వేలు రుణం తీసుకుని కొలిమి ప్రారంభించారు. అయిదేళ్ల క్రితం ఆర్పీ సౌజన్య సాయంతో స్వయం సహాయ సంఘంలో సభ్యురాలిగా చేరారు. తొలిసారిగా రూ.7,500 రుణం తీసుకున్నారు. ఆ తరువాత రూ.30 వేలు, రూ.40 వేలు, రూ.75 వేలు రుణాలు తీసుకున్నారు. పని ముట్ల తయారీని విస్తృత పరచుకున్నారు. రోజుకు 100 కిలోల ఇనుముతో పనిముట్లు తయారు చేస్తున్నారు. నెలకు రూ.15 వేలు ఆదాయం సమకూరుతోంది. మొదట్లో సమ్మెట దెబ్బలు కొట్టటానికి రోజుకు రూ.500కు ఒక కూలీ వచ్చేవారు. కాలక్రమంలో కూలీలు రావడం మానుకున్నారు. దీంతో వెంకటలక్షుమ్మ సమ్మెట పని చేస్తున్నారు. నాలుగేళ్లుగా భార్యాభర్తలు కొలిమి పని చేస్తూ ఇద్దరు కుమారులను చదివించుకుంటున్నారు.

- ప్రభుత్వం చేయూత
- వివిధ రంగాల్లో రాణింపు
- కుటుంబాలకు మహిళల ఆసరా

వారంతా నిరుపేద, సాధారణ కుటుంబాలకు చెందిన పట్టణాల్లోని మహిళలు. కుటుంబంలోని పురుషులు పొద్దస్తమానం కష్టపడుతున్నా పూట గడవని పరిస్థితి. తప్పని సరై కొందరు, మరికొందరు ఆసక్తితో స్వయం ఉపాధికి బాటలు వేసుకున్నారు. వీరికి ప్రభుత్వం మెప్మా ద్వారా చేయూత అందించింది. దీంతో మహిళలు వివిధ విభాగాల్లో మహిళా వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా అవతరిస్తున్నారు. జిల్లాలోని పురపాలికల్లో స్వయం సేవా సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. కుటుంబాలకు ఆర్థిక దిశానిర్దేశం చూపే స్థితికి చేరుకుంటున్నారు.

ప్రొద్దుటూరు పురపాలిక న్యూస్‌టుడే: ప్రభుత్వ పట్టణ పేదరిక నిర్మూలన పథకం కింద మహిళల స్వయం ఉపాధికి మార్గం సుగమం చేస్తోంది. మహిళలు ఎంచుకున్న వ్యాపారం, చేతి వృత్తులకు ఎక్కువ వడ్డీకి అప్పులు తెచ్చి ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇదే సందర్భంలో తక్కువ వడ్డీకి రుణాలిచ్చే మెప్మా సంఘంలోని మహిళా సభ్యులకు వరప్రసాదినిలా మారింది. జిల్లాలోని పురపాలికల్లో మహిళలు చిరు పొదుపుతో కుటుంబాలను పోషిస్తున్నారు. తమతోపాటు మరింత మందికి ఉపాధి చూపుతూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

◆ జిల్లాలో మహిళలు చేతి వృత్తులు, చిరు వ్యాపారులతో జీవనోపాధి పొందుతున్నారు. మెప్మా.. వివిధ రంగాల్లో స్వయం సహాయ బృందాల్లో సభ్యులైన మహిళలకు శిక్షణ ఇస్తోంది. వారికి ఆర్థికంగా సాయం అందిస్తోంది. ఇంటి వద్దనే కుటుంబ పనులు చేసుకుంటూ చిరు వ్యాపారాలు చేస్తూ ప్రగతి పథంలో నడవాటినికి మార్గం చూపుతోంది.

◆ జిల్లాలో నగర, 8 పురపాలికలున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరానికి 8,314 స్వయం సహాయ సంఘాలకు జీవనోపాధులు మెరుగు పరచేందుకు రూ.219.49 కోట్లు రుణాలివ్వడానికి ప్రభుత్వ లక్ష్యంగా నిర్దేశించింది. 2018 మార్చి నాటికి లక్ష్యాలను అధిగమించాలని సంకల్పించారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 3,394 స్వయం సహాయ సంఘాలకు రూ.164.27 కోట్లు రుణాలు ఇచ్చారు. ఇక మూడు నెలల్లో 4,920 సంఘాలకు రూ. 55.22 కోట్లు ఇవ్వగలిగితే లక్ష్యం పూర్తి చేసినట్లే. జిల్లాలో మొత్తం దాదాపు 50 వేల మంది జీవనోపాదుల కింద చేతివృత్తులు, వ్యాపారాలను కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రొద్దుటూరు పురపాలిక మెప్మా పరిధిలో 1,534 స్వయం సహాయ బృందాలకు ఈ ఏడాది రూ.42.27 కోట్లు రుణాలుగా ఇవ్వాలని నిర్దేశించారు. ప్రస్తుతం 719 సంఘాలకు రూ.36.54 కోట్లు రుణాలు ఇచ్చారు. ఇంకా 815 సంఘాలకు రూ.5.73 కోట్లు ఇవ్వాల్సి ఉంది. గడువు మూడు నెలలే ఉన్నా లక్ష్యాన్ని సాధిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రొద్దుటూరులో 'టీ' పొడి, ఓళిగ, వ్యవసాయ పనిముట్లు, వేరుసెనగ పప్పుల ముద్దలు తదితర ఆహార ఉత్పత్తులను నాణ్యంగా తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు సైతం రవాణా చేసి మహిళలు ముందుకు దూసుకెళుతున్నారు. ప్రొద్దుటూరులో జీవనోపాదుల కింద 10 వేల మందికి లబ్ధి చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 6,011 మందిని జీవనోపాధుల కింద తీసుకురాగలిగారు.

పురపాలికల్లో స్వయం సంఘాలు తీసుకున్న రుణాలు

పురపాలిక	సంఘాలు	రుణాలు తీసుకున్నవి	లక్ష్యం రూ.కోట్లల్లో	పొందిన రుణం రూ.కోట్లల్లో.
బద్వేలు	742	283	19.94	12.79
జమ్మలమడుగు	397	208	10.48	8.83
కడప	2,896	1,247	72.32	57.46
మైదుకూరు	465	165	10.20	7.60
ప్రొద్దుటూరు	1,534	719	42.27	36.54
పులివెందుల	1,015	206	29.58	10.61
రాజంపేట	332	154	9.65	8.22
రాయచోటి	615	304	14.57	12.65
ఎర్రగుంట్ల	328	108	10.48	9.47



ప్రొద్దుటూరు నుంచి ముంబయి వరకు

ఈ చిత్రంలో 'టీ' పొడి పొట్లాలను తయారు చేస్తున్న నఫీసా (మొదటి కుడివైపు) సంఘం సభ్యులు. వీరు 16 ఏళ్లుగా జీవనోపాధి కోసం వ్యాపారం చేస్తున్నారు. వీరిది స్థానిక మట్టిమసీదు వీధి. తండ్రి ప్రోత్సాహంతో వ్యాపారం చేయాలని వీరు నిర్ణయించుకున్నారు. నిత్యం ఉదయాన్నే అందరూ వినియోగించే వాటిని తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. టూత్ పేస్టు తయారు చేయాలని భావించారు. అది కుదరకపోవటంతో 'టీ' తయారీపై దృష్టి సారించారు. అనుకున్నదే తడవుగా 2002లో రూ.2 వడ్డీకి రూ.2 లక్షలు తెచ్చుకున్నారు. కుటుంబ సభ్యులు మాత్రమే టీ పొడిని పొట్లాలుగా మార్చి విక్రయించారు. నెలకు రూ.10 వేలు ఆదాయం వచ్చేది. ఆ తరువాత వ్యాపారాన్ని విస్తృతం చేయాలని భావించి 2007లో సూరజ్ స్వయం సహాయ సంఘం ఏర్పాటు చేసుకున్నాం. తొలి నాయకురాలిగా జిలానీ బేగం వ్యవహరిస్తున్నారు. మొదటి సారిగా రూ.50 వేలు, ఆ తరువాత రెండు సార్లు రూ.10 లక్షల రుణం తీసుకుని వ్యాపారాన్ని వృద్ధి చేశారు. నెలకు రూ.20 లక్షల విలువైన 'టీ' పొడి పొట్లాలను విక్రయిస్తున్నారు. ముంబయి, ఔరంగాబాద్, కడప, కర్నూలు, చిలంకూరు, రాజస్థాన్, అనంతపురం, పులివెందుల, గుత్తి తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తే ఇక్కడి నుంచి పార్శిళ్లలో సరకును ఎగుమతి చేస్తున్నారు. సంఘంలో పది మంది మహిళా సభ్యులు కలిసి పని చేస్తున్నారు. ఒక్కొక్కరు నెలకు రూ.5 వేల ఆదాయం తీసుకుంటున్నారు. ఇలా పది మందీ ఇంటి వద్దే ఉంటూ సంతోషంగా జీవనోపాధి పొందుతున్నారు. నఫీసా అనే అమ్మాయి పదో తరగతి చదివి, వ్యాపారమే వృత్తిగా భావించి టీ పొడి వ్యాపారాన్ని నలుదిక్కులా విస్తరించటానికి కృషి చేస్తున్నారు.

ఓళిగ.. హాయిగా..

ఈ చిత్రంలోని భార్యాభర్తలు నాదేండ్ల హుస్సేన్‌బీ, బాబా సాహెబ్‌లది అమ్మవారిశాల వీధి. గత ఐదేళ్లుగా రాయలసీమలో ఇష్టంగా తినే ఓళిగలు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. మొదట్లో ప్రైవేట్‌గా రూ.10 వేలు వడ్డీకి తెచ్చి ఓళిగలు తయారీ చేపట్టారు. అప్పట్లో ఖర్చులన్నీ పోనూ నెలకు రూ.3 వేలు ఆదాయం సమకూరేది. ఆ తరువాత ఆర్పీ సౌజన్య ప్రోత్సాహంతో బాలాజీ ఎస్‌హెచ్‌జీలో సభ్యురాలిగా హుస్సేన్‌బీ చేరారు. తొలిసారి రూ.7,500 రుణం తీసుకున్నారు. ఆపై రూ.20 వేలు, రూ.40 వేలు, రూ.75 వేలు రుణంగా తీసుకుని ఓళిగ తయారీని వృద్ధి చేసుకున్నారు. ఓళిగల తయారీకి నెలకు రూ.70 వేలు ఖర్చు అవుతోంది. ముగ్గురు వ్యక్తులు పని చేస్తున్నారు. ఒకరికి రూ.6 వేలు, మరొకరికి రూ.7,500, ఇంకొకరికి రూ.9 వేలు నెలకు జీతం ఇస్తున్నారు. ఓళిగలకు పండగ సీజన్‌లో బాగా గిరాకీ ఉంటుంది. వీటిని హైదరాబాద్, కడప, అమెరికాకు కూడా తీసుకెళుతున్నారు. మాకు ఇద్దరు సంతానం. కుమార్తెకు పెళ్లి చేశామని వీరు తెలిపారు. కొడుకుకు కూడా దుకాణం పెట్టించామన్నారు. ఓళిగల తయారీ ద్వారా చక్కని జీవనాన్ని గడుపుతున్నామని వీరు ఆనందం వ్యక్తం చేశారు.



ఈ ఏడాది రూ.5.20 కోట్ల రుణాలు



పట్టణంలో మా పరిధిలో 300 సంఘాలున్నాయి. ఇందులో ఈ ఏడాదికి 190 బృందాలకు రూ.5.90 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో 120 సంఘాలకు రూ.5.20 కోట్లు రుణాలిచ్చాం. ప్రతి ఒక్కరూ చేతి వృత్తులతో వ్యాపారాలను మంచిగా అభివృద్ధి చేసుకుంటున్నారు. ఇంకా మార్చి వరకు గడువు ఉంది. మిగిలిన రూ.70 లక్షలను ఎస్‌హెచ్‌జీలకు అందజేస్తాం. సాధికార మిత్రలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన, శిక్షణ ఇస్తున్నాం. సభ్యులు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉంది. కొనుగోళ్లు బాగా జరుగుతున్నాయి. మహిళలు చక్కని ఆదాయాన్ని అందిస్తూ, కుటుంబ పోషణకు బాసటగా నిలుస్తున్నారు.

-ఎం.ఉషారాణి, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజరు, ప్రొద్దుటూరు.

రూ.పదివేలు ఆదాయాన్ని చూపిస్తున్నాం



పట్టణ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా మెప్మా పనిచేస్తోంది. ఈ దిశగా ఎస్‌హెచ్‌జీలకు రూ.10 వేలు తక్కువ ఆదాయం లేకుండా జీవనోపాధి కల్పిస్తున్నాం. చేతి వృత్తుల్లో చక్కని శిక్షణ ఇస్తున్నాం. సంఘాలను సంఘటితం చేసి కొత్తవాటికి రుణ సదుపాయం కల్పిస్తున్నాం. ఇదివరకు అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. బ్యాంకు అనుసంధానం, వ్యక్తిగత రుణాలకు వడ్డీ వ్యాపార సంస్థలను ఆశ్రయించే విధానాన్నే మరచిపోయారు. ప్రభుత్వం రూ.కోట్ల మొత్తాన్ని రుణం కింద చేయూత ఇస్తోంది. దీన్ని సద్వినియోగం చేసుకుని అనేక సంఘాలు ఉపాధిబాటలో విజయ బావుటా ఎగురవేస్తున్నాయి. వీరితోపాటు మరి కొందరికి ఉపాధి చూపడం అభినందనీయం.

-హరిత, మెప్మా టీఎంసీ, ప్రొద్దుటూరు.

పెళ్లి బంధం.. నమోదుకు దూరం

- ముందస్తు సమాచారంతో
- పంచాయతీల్లో సులభం
- ధ్రువీకరణ లేకపోతే నష్టం
- చంద్రన్న కానుకలు కష్టం



ఈ వధూవరులు పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామానికి చెందిన వారు. పుల్లప్రసాదు, హైమావతిలకు 2017 జూన్ నాలుగో తేదీన రంగసముద్రంలో పెళ్లి అయింది. ఎలాంటి ఇబ్బదులు లేకుండా గ్రామ పంచాయతీలోనే పెళ్లి ధ్రువీకరణ పత్రాన్ని కార్యదర్శి నుంచి ఉచితంగా పొందారు. వీరు పంచాయతీలోనే పెళ్లి ధ్రువీకరణ పత్రాన్ని పొంది ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

అట్లూరు, న్యూస్‌టుడే : పెళ్లి అంటే కొత్త దుస్తులు, అలంకరణలు, విందులు, వినోదాలు, కొత్త బంధుత్వాలు, పచ్చటి తోరణాలు.. ఆపై మూడుముళ్లతో ఒకటవుతున్న యువతీ యువకులు సంప్రదాయ పద్ధతులు పాటిస్తున్నారు. ఈ సందర్భంలో చట్టబద్ధ ప్రక్రియలో కాసింత వెనుకబడ్డారు. అవగాహన లోపం, అవసరమొచ్చినప్పుడు చూసుకోవచ్చనే నిర్లిప్తత వెరసి గ్రామ పంచాయతీల్లో పెళ్లి వివరాల నమోదులో వెనుకబడిపోతున్నారు. దీంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

పెళ్లి వివరాలను పంచాయతీ పరిధిలోనే నమోదు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. పంచాయతీలు, పురపాలికల పరిధిలో పెళ్లి వివరాలు నమోదైతే చాలా వరకు బాల్య వివాహాలను అరికట్టవచ్చు. పంచాయతీల్లో పెళ్లి వివరాలు నమోదు చేసుకోవచ్చన్న అంశం ఇప్పటికీ జిల్లాలో చాలా మందికి తెలియదు. యంత్రాంగం కూడా వీటిపై అవగాహన కల్పించటంలేదన్న విమర్శలున్నాయి.

◆ చంద్రన్న పెళ్లి కానుక నూతన పథకానికి వధూవరుల పెళ్లి ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. దీనికితోడు జిల్లా నుంచి యువత ఉపాధి నిమిత్తం విదేశాలకు పెద్ద సంఖ్యలో వెళుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, సైన్యంలో చేరేవారికి పెళ్లి ధ్రువీకరణ పత్రం అవసరం చాలా ఉంది.

◆ జిల్లాలో 786 గ్రామ పంచాయతీలున్నాయి. జిల్లాలో ఏటా సుమారు 5 వేల నుంచి 6500 వరకు పెళ్లిళ్లు జరుగుతున్నాయని అంచనా.

◆ నమోదు ప్రక్రియలో పంచాయతీలు వెనుకబడ్డాయి. గత ఐదేళ్ల వ్యవధిలో జిల్లాలోని 50 మండలాల్లోని పంచాయతీ అధికారులు 13 మంది జంటలకు మాత్రమే పెళ్లిధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు. డిజిటల్ పద్ధతిలో కాకుండా చేతిరాత ద్వారా కొన్ని పంచాయతీల్లో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లాలో 25 జంటలు దరఖాస్తు చేసుకోగా 13 మందికి మాత్రమే పత్రాలు ఇచ్చారు. 12 నమోదు పత్రాలు ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్నాయి. వేంపల్లె మండలంలో 8, ఖాజీపేట, కోడూరు, నందలూరు మండలాల్లో ఒకటి చొప్పున, పోరుమామిళ్లలో రెండు పెళ్లిళ్లు నమోదై ఉన్నాయి.

◆ జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల పెళ్లిళ్లకు ప్రభుత్వం చంద్రన్న పెళ్లి కానుక పథకం కింద ఆర్థిక సహాయాన్ని అందజేయాలని సంకల్పించింది. మండలాల్లో వెలుగు కార్యాలయం పరిధిలో లబ్ధి పొందాలంటే పెళ్లి నమోదు, ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అవడంతో దీనిపె లబ్ధిదారులు అవగాహన పెంచుకోవాల్సి ఉంది.

◆ 'వివాహాల నిర్బంధ నమోదు' చట్టాన్ని 2002లో తీసుకువచ్చారు. ద్వితీయ పెళ్లిళ్ల నిరోధించటం, మోసాలను నివారించాలన్న లక్ష్యంతో ఈ చట్టాన్ని తీసుకువచ్చారు. పంచాయతీలు, పురపాలక సంఘాల్లో జనన, మరణాలతోపాటు పెళ్లి నమోదు తప్పనిసరి చేశారు. పంచాయతీ కార్యదర్శి, పురపాలికల్లో అధికారి పెళ్లి అధికారిగా వ్యవహరిస్తారు.

◆ వరుడికి 21, వధువుకి 18 ఏళ్లు నిండినవారు పెళ్లికి అర్హులు. పెళ్లికి ముందే సంబంధిత పంచాయతీ అధికారికి వినతి పత్రం ఇవ్వాలి. దీని ఆధారంగా కార్యదర్శి పెళ్లి అనంతరం వధూవరుల నుంచి సంతకాలు సేకరించి సాక్షులను గుర్తించి పెళ్లి ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేస్తారు.

ప్రచారం ముమ్మరం చేస్తాం

గ్రామ పంచాయతీ పరిధిలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతోపాటు పెళ్లి నమోదుపై పలుమార్లు కార్యదర్శులకు అవగాహన కల్పించాం. ఇకపై అన్ని పంచాయతీ భవనాల్లో పెళ్లి నమోదు ప్రక్రియపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తాం. గ్రామ పంచాయతీల్లో పెళ్లిళ్ల నమోదుపై పురోహితులకు వివరించి నమోదు చేసేలా చర్యలు తీసుకుంటాం. చర్చిలు, మసీదుల్లో జరిగే పెళ్లిళ్లకు పెళ్లి ధ్రువీకరణ పత్రాలు అక్కడే ఇస్తున్నాం.

- కేవీ రమణ, డీఎల్‌పీవో, రాజంపేట

నల్లమరాజుతో నల్లతిమ్మాసుపల్లె .. అప్పలరాజుతో అప్పారాజుపేట



రాజుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో సరస్వతి గుడి


అట్లూరు, న్యూస్‌టుడే : ఇద్దరు అన్నదమ్ములు విడిపోయి రెండు గ్రామాల్లో స్థిరపడ్డారు. వారి పేర్లతో రెండు గ్రామాలు ఏర్పాటయ్యాయి. వివరాలు పరిశీలిస్తే.. బద్వేలు మండలంలోని అప్పారాజుపేట ప్రాంతంలో అప్పలరాజు, నల్లమరాజు అన్నదమ్ములు కలిసి జీవించేవారు. కుటుంబ కలహాలతో ఇద్దరూ వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అప్పలరాజు నివసించిన ప్రాంతం అప్పారాజుపేటగా పేరొందింది. నల్లమరాజు నివాసమున్న ప్రాంతాన్ని నల్లతిమ్మాసుపల్లెగా ఏర్పడింది. ఆపై అవే పేర్లతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయి. అప్పారాజుపేట, నల్లతిమ్మాసుపల్లె రెండు గ్రామాలకు అప్పటి రాజులు నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయం ప్రత్యేకత. ఈ ఆంజనేయస్వామిపై రెండు గ్రామాల ప్రజలు ప్రత్యేక భక్తిప్రపత్తులు చాటుతున్నారు. పూర్వం పాత అప్పారాజుపేట గ్రామస్థులు కడప- బద్వేలు ప్రధానరోడ్డు సమీపంలో స్థిరపడ్డారు. గ్రామంలో 40 మంది చేనేత కుటుంబాలున్నాయి. నల్లతిమ్మాసుపల్లెకు సమీపంలోనే నూతనంగా రాజుపాలెంను నిర్మించుకుని అభివృద్ధి చెందుతున్నారు.

పేరులో నేముంది?




అప్పారాజుపేటలోని విశాలమైన వీధి

తండ్రి ఆశయాన్ని నెరవేర్చిన కుమారుడు



అనంతరాజపురంలో అసంపూర్తిగా నిలిచి పోయిన తూర్పు గాలి గోపురం

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు సమీపంలోని అనంతరాజపురంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. ప్రధాన రహదారి మార్గంలో ఈ ప్రాంతాన్ని పాలించిన మట్లి అనంతరాజు తూర్పు ముఖంగా గాలిగోపురం నిర్మించాలని భావించారు. ఈమేరకు పనులను కూడా మొదలు పెట్టారు. పెద్ద బండరాళ్లను చెక్కించి 30 అడుగులపైగా ఎత్తు వరకు నిర్మించారు. ఈ తూర్పు గాలిగోపురం నిర్మాణం సమయంలో అనంతరాజు యుద్ధానికి వెళ్లి వీర మరణం పొందారు. తండ్రి మొదలు పెట్టిన ఆలయాన్ని ఆయన తనయుడు మట్లి తిరువెంగళనాథుడు గాలిగోపురం నిర్మించి నెరవేర్చారు. ఆనాటి ఆగమ శాస్త్ర పండితుల సలహా మేరకు దక్షిణ ముఖంగా గాలి గోపురంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు స్థానికులు చెబుతారు. ఇప్పటికీ తూర్పు ముఖంగా అసంపూర్తిగా ఉన్న గాలిగోపురం వెళ్లిన వారికి కనిపిస్తుంది.



తిరువెంగళనాథుడు నిర్మించిన దక్షిణ గాలిగోపురం





కలసపాడు వద్ద ప్రధాన రహదారిలో గుడారాన్ని తలపిస్తున్న చెట్లు


ఆహ్లాదం.. ఆనందం

కలసపాడులో పచ్చతోరణం

కలసపాడులోని పోరుమామిళ్ల ప్రధాన రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వీటిని 50 ఏళ్ల క్రితం ఆర్‌అండ్‌బీ అధికారులు నాటించి సంరక్షించారు. గుడారం ఆకారంలో కనువిందు చేస్తున్న చింత, వేప తదితర చెట్లు కలసపాడుకు వచ్చే ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నాయి. 200 మీటర్లకు పైగా రహదారికి ఇరువైపులా ఈ చెట్లు బాటసారులకు సేద తీరుస్తున్నాయి. కొంతకాలంగా ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కొన్ని చెట్లను కొంతమంది తమ స్వార్థం కోసం నరికివేశారు. - కలసపాడు, న్యూస్‌టుడే

హాయ్! బుజ్జీ!!

ఈ పిట్టలు అపార్టుమెంట్లు కట్టేస్తాయ్!



పక్షి గూళ్లు చూసే ఉంటారు... ఏ చూరుకో చెట్లపైనో కనిపిస్తుంటాయి... గుప్పెడంతే ఉంటాయా గూళ్లు... అయితే ఓ రకమైన పక్షులున్నాయి... అవి ఏకంగా అపార్టుమెంట్లు కట్టేస్తాయి... ఆశ్చర్యపరిచే ఆ సంగతులేంటో చదివేయండి మరి!

ఓ పది, ఇరవై కుటుంబాలతో మనం అపార్టుమెంట్లు కట్టుకుంటాం. ఒకే పెద్ద భవంతిలో వాటాల్ని పంచుకుంటాం. గదులు కేటాయించుకుంటాం. ఇలా చేసేది మనమేనా? సోషల్ వీవర్ పక్షులూ చేసేస్తాయి. అయితే అపార్టుమెంట్లు అనగానే మనలా ఇసుక, సిమెంటుతో కట్టినవి కాదండోయ్... చెట్లపైన చిన్న చిన్న కర్రలు... గడ్డి ఆకులు వంటి వాటితోనే. అయితే మిగతా పక్షి గూళ్లలా ఇవి చిన్నగా ఉండవు. భారీ పరిమాణంలో ఉంటాయి. లోపల అంతరాలు అంతరాలుగా వందల సంఖ్యలో గదులుంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే బోలెడు పక్షులు కలిసి ఒకే పేద్ద పక్షి గూడుని నిర్మించుకుంటాయన్నమాట.

■ ఈ గూళ్ల కొలతలు వింటే అయ్య బాబోయ్ అనేస్తారు. ఇరవై అడుగుల వెడల్పు, పది అడుగుల ఎత్తు, వెయ్యి కిలోల బరువుతో ఉంటాయివి. 100 జంటల పక్షులుండేంత పరిమాణం ఈ గూళ్లది.



> ■ ఆశ్చర్య పరిచే సంగతి తెలుసా? చెట్లు, విద్యుత్తు స్తంభాలపై కట్టుకునే ఈ గూళ్లు గాలి వానకో, వాన నీటికో అంత సులువుగా కూలిపోవట. ఏకంగా ఏళ్లకు ఏళ్లు దృఢంగా స్థిరంగా ఉంటాయట.

ఈ గూళ్లతో ఏకంగా చెట్టే పడిపోగలదు.

■ అద్భుతమైన ఈ గూటికి... ఎండిపోయిన చెట్ల కొమ్మలే సిమెంట్. మనం ఇంటిని అలంకరించుకున్నట్టే ఈ పక్షులు కూడా గూటి లోపల నిర్మాణానికి గడ్డి, దూది, ఆకులు, ఈకల్ని వాడేస్తాయి. పది అంగుళాల పొడవుతో మూడు అంగుళాల వెడల్పుతో ద్వారమూ నిర్మించుకుంటాయి. వీటికి ఎంత తెలివంటే... పాముల్లాంటి శత్రువులు లోపలికి చొరబడకుండా ముళ్లతో ప్రత్యేకఏర్పాటు చేసుకుంటాయి.


■ అంతేకాదూ... ఈ గూళ్ల మధ్యలో హాలు లాంటి విశాలమైన గది దాని చుట్టూ బోలెడు బుల్లి గదులు ఉంటాయి. వీటి ప్రత్యేకతలు ఏమిటంటే... గూడు మధ్యలోని పెద్ద గది ఉష్ణాన్ని నిలిపి ఉంచుకుంటూ రాత్రుల్లో వెచ్చగా ఉంటుంది. పగటిపూట బయట వాతవరణ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుందిగా... దానికి తగ్గట్టు చుట్టూ ఉన్న గదులు పగటిపూట 7 నుంచి 8 డిగ్రీల సెల్సియస్‌తో చల్లగా ఉంటాయట. ఏమైనా భలే ఏర్పాటులెండి.

■ వీటిని చూస్తే మనకే కాదూ ఇతర జాతి పక్షులకూ ముచ్చటేస్తుందేమో... అందుకే పిగ్మీ ఫాల్కన్, రెడ్ హెడ్డెడ్ ఫించెస్ వంటి పక్షులూ ఈ గూళ్లను ఎంచక్కా వాడేసుకుంటాయి.

■ ఐదున్నర అంగుళాల పొడవు, 26 నుంచి 32 గ్రాముల బరువుండే ఈ పక్షుల చిరునామా ఆఫ్రికా.

■ ఈ చిట్టిపొట్టి పిట్టలు... కీటకాలు, పురుగులు, విత్తనాల్లాంటివి తిని పొట్ట నింపుకొంటాయి. ఇవి నీటిని తాగవట. పదార్థాల నుంచే అవసరమయ్యే తేమను గ్రహిస్తాయట.

అంకెల్లో బొమ్మ



ఆణిముత్యం

మౌనంగా ఉండటం అంటే మనం ఇంకో మార్గం ద్వారా మన వాదనను కొనసాగించడమే


– చేగువేరా

నేర్చుకుందాం!

Lose = కోల్పోవడం

Loose = వదులుగా ఉన్న


దారేది?



బావిలో నీరు వేడిగా ఉంటుందేం?

ప్రశ్న: బావిలో నీరు చలికాలంలో వేడిగా, వేసవి కాలంలో చల్లగా ఎందుకుంటుంది?


జవాబు: నీటికున్న ఉష్ణ వాహకత్వ లక్షణం వల్ల ఈ తేడా వస్తుంది. నీటి ఉష్ణవాహకత చాలా తక్కువ. వేసవికాలంలో పగలు చాలా వేడిగా ఉంటుంది. అయినా ఆ వేడిని నీరు గ్రహించి వేడిగా కావడానికి సాయంత్రం వరకూ పడుతుంది. అందుకే వేసవి కాలంలో పగలు బావి నీళ్లు చల్లగా ఉంటాయి. రాత్రి పూట కాస్త వెచ్చగా అనిపిస్తాయి. అదే విధంగా చలికాలంలో పగటిపూట ఉన్న చల్లదనాన్ని మెల్లగా పొందుతాయి. కానీ పగటి పూట ఉన్న ఎంతోకొంత ఎండ వల్ల వచ్చిన వేడిని గ్రహించడానికి సాయంత్రం వరకూ పడుతుంది. ఆ వేడి మరుసటి రోజు పగటి పూట వరకూ అంతో ఇంతో ఉంటుంది. చలికాలంలో రాత్రి పూట బయట ఉన్న చలి వల్ల, బావి నీటికున్న అధమ ఉష్ణ వాహకత్వం వల్ల తన దగ్గరున్న వేడిని అంత తొందరగా కోల్పోదు. అందువల్ల పగటి పూట బావి నీరు కొంత వెచ్చగా అనిపిస్తుంది. ఒక్కోసారి మనం బయట ఉన్న లోహ పదార్థాల్ని తాకి, బావిలో నీటిని తాకితే అవి వెచ్చగా, లోహపు వస్తువులు చల్లగా అనిపిస్తాయి. అందుకు కారణం లోహపు వస్తువు వేడిగా ఉందని, బావిలో నీరు చల్లగా ఉందని భావించకూడదు. మన శరీరం నుంచి వేడిని స్వీకరించేతత్వం లోహపు వస్తువులకు ఎక్కువగా ఉండటం వల్ల అవి చల్లగా, నీటికి ఆ తత్వం తక్కువగా ఉండటం వల్ల సాధారణంగా అలా అనిపిస్తాయి.



– **ప్రొ॥ ఎ.రామచంద్రయ్య,** నిట్, వరంగల్; ఎడిటర్, చెకుముకి, జనవిజ్ఞాన వేదిక(తెలంగాణ)

సబ్జెక్ట్ ల్యాబ్ ఇంగ్లిష్

ఆంగ్ల అచ్చులైన **a, e, i, o, u** లను బొమ్మల ఆధారంగా సరైన చోట నింపితే పదాలు అర్థవంతమవుతాయి.



స్కూల్ సవాల్

జర్మనీ రాజధాని?

1. మన దేశంలో 'సిటీ ఆఫ్ సెవెన్ ఐలాండ్స్' అని ఏ నగరాన్ని పిలుస్తారు?
2. 'రాజతరంగిణి' రాసిందెవరు?
3. జర్మనీ రాజధాని ఏది?



దారిశెట్టి సాన్వి, కృష్ణవేణి పాఠశాల, సిర్పూర్ కాగజ్‌నగర్

సబ్జెక్ట్ ల్యాబ్ - జవాబులు: 1-A 2-I 3-O 4-E 5-E 6-A 7-U 8-I

జవాబులు: స్కూల్ సవాల్: 1. ముంబయి 2. కల్హణుడు 3. బెర్లిన్

లక్ష్యాన్ని 'పొట్లం' చుట్టేశారు!

- ప్యాక్‌హౌస్ నిర్మాణంలో వెనుకబాటు
- ఆరేళ్లలో 955 మంజూరు, 662 నిర్మాణం
- రూ.19.10 కోట్లు కేటాయింపు, ఖర్చు రూ.10.57 కోట్లే
- పలుకుబడి ఉంటేనే మంజూరు.. అర్హుల బేజారు




దవంతరంపల్లిలో నిర్మించిన ప్యాక్‌హౌస్.. బ్రాహ్మణపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనం పనులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. సంప్రదాయ వ్యవసాయ పంటల సాగుతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఈ క్రమంలో శ్రమకు తగ్గ రాబడి వచ్చే ఉద్యాన తోటల వైపు అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. పండ్లు, కూరగాయాలు, పూలతోటల పట్ల ఆసక్తి చూపే ఔత్సాహిక కర్షకులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవాలని ప్రభుత్వం ముందుకొచ్చింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట దిగుబడులు చేతికొచ్చాక సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడంతో 20- 25 శాతం నష్టపోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితి నుంచి కర్షకులను గట్టెక్కించేందుకు ప్రభుత్వం ప్యాక్‌హౌస్‌ల నిర్మాణానికి రాయితీలు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. దీనిపై క్షేత్రస్థాయిలో సరైన ప్రచారం లేదు. దరఖాస్తు చేసుకున్న వారికి సకాలంలో మంజూరు చేయట్లేదు. అర్హులు నెలలకొద్దీ ఎదురుచూడాల్సి వస్తోంది.

● జిల్లాలో ఉద్యాన తోటల సాగు క్రమేణా విస్తరిస్తోంది. ప్రకృతి విపత్తులు, గిట్టుబాటు ధరల లేమి, వర్షాభావం వంటి కారణాలతో వ్యవసాయ పంటలు దెబ్బతింటున్నాయి. కనీసం పెట్టిన పెట్టుబడి రావట్లేదు. ఈ నేపథ్యంలో రైతుల్లో మార్పు వస్తోంది. మామిడి, అరటి, బొప్పాయి, బత్తాయి, నిమ్మ, జామ, సపోటా, దానిమ్మ తదితర రకాలు పండ్ల తోటల సాగుకు ఉత్సాహం చూపుతున్నారు. జాతీయ ఉద్యాన సంస్థ, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకాల్లో వీరికి పలు రాయితీలు ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా చూస్తే సుమారు 1.17 లక్షల హెక్టార్లలో పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాల రకాల తోటలు సాగులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీర్ఘకాలిక రకాలు 60 శాతం ఉన్నాయి. ఏడాది పాటు పంటను కంటికి రెప్పలా కాపాడుకుని దిగుబడి చేతికందే సమయంలో తాత్కాలికంగా నిల్వ చేసుకునే వెసులుబాటు ఉండటం లేదు. సరైన గదులు అందుబాటులో లేకపోవడంతో వానకు తడిసి, ఎండకు ఎండటం.. చలికాలం మంచులో ఆరుబయటే నిల్వ చేయడం వల్ల ఉద్యాన ఉత్పుతుల నాణ్యత దెబ్బతింటుంది. ఈ నష్టాన్ని నివారించేందుకు పెట్టెల్లో, సంచుల్లో నింపుకొనేందుకు వీలుగా 'ప్యాక్‌హస్'లను నిర్మించాలని ఉద్యాన శాఖ ముందుకొచ్చింది.

రాయితీ ఆసరా ఎన్నడు.. రైతు పొలంలో తనకున్న స్థలాన్ని పరిగణనలోకి తీసుకొని 30×20 అడుగుల పొడవు, వెడల్పుతో నిర్మించుకోవాల్సి ఉంటుంది. ఒక గది నిర్మాణం అంచనా విలువ రూ.4.25 లక్షలు ఉంటుంది. అందులో రూ.2 లక్షల ఉద్యాన శాఖ రాయితీ ఇస్తుంది. మిగతా డబ్బును లబ్ధిదారులు (రైతులు) భరించాలి. ఎస్సీ, ఎస్టీలకు ఇదివరకు 50 శాతం రాయితీ దక్కేది. 75 శాతం ఇచ్చేందుకు ప్రభుత్వం ఇటీవల అంగీకరించింది. 2017 నవంబరు 23న ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి చిరంజీవి చౌదరి ఉత్తర్వు-738 జారీ చేశారు. కావాల్సిన వారు 25 శాతం చెల్లించాల్సి ఉంటుంది. కావాల్సిన రైతులు ఆయా ప్రాంతాల్లోని ఉద్యానశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. 2012- 13 నుంచి 2017- 18 వరకు ఆరేళ్లలో జిల్లాలో 955 నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. రూ.19.10 కోట్లకు అనుమతిచ్చారు. మన అధికారులు 662 నిర్మించడమే గగనమైంది. ఇందుకు గాను రూ.10.57 కోట్లు వెచ్చించారు. మూడేళ్లుగా చూస్తే పూర్తి స్థాయిలో అమలు చేయట్లేదు. ఏ పథకం కింద ఎన్ని కేటాయించారు అనే సమాచారాన్ని అధికారులు చెప్పట్లేదనే వాదన వినిపిస్తోంది. తమకు అనుకూలమైన వారికి మాత్రం సమాచారం తెలియజేసి ప్యాక్‌హౌస్‌లు మంజూరు చేస్తున్నారనే వాదన లేకపోలేదు. రాయితీ ఆసరాగా నిలుస్తుందని ఆశించిన అన్నదాతలకు నిరాశే మిగులుతోంది. ఒంటిమిట్ట మండలంలో ఐదుగురు, నందలూరులో నలుగురు, పెనగలూరులో 12, రాజంపేట మండలంలో 16 మందికి పైగా దరఖాస్తు చేసి అనుమతి ఎదురుచూస్తున్నారు. ఇక్కడే కాకుండా జిల్లాలోని చాలా మండలాల్లో ఇదే పరిస్థితి. ఆరేడు నెలలకు పైగా ఎదురుచూసినా పరిపాలనా అనుమతి దక్కకపోవడం శాపంగా మారింది.

ఒనగూరే లబ్ధి..

పంట కోత తర్వాత పండ్లు, కూరగాయలను గదిలోకి తీసుకొస్తారు. ఇక్కడ కాయల నాణ్యత విభజన (గ్రేడింగ్) చేస్తారు. శుభ్రం కూడా చేసుకోవచ్చు. తర్వాత వివిధ ద్రవాలు పిచికారి చేసి కాయలను పండుబారేలా మాగబెట్టుకోవచ్చు. నీడలో కాయలను తాత్కాలికంగా నిల్వ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. దిగుబడులను రవాణాకు అనువుగా సంచుల్లో లేదా పెట్టెల్లో నింపుకోవడానికి అనువుగా ఉంటుంది. గది నిర్మాణ పనులు పూర్తయిన తరువాత విస్తరణాధికారి, ఉద్యాన అధికారి, సహాయ సంచాలకుడు వచ్చి క్షేత్రస్థాయిలో పనులు చేశారా లేదా అని పరిశీలన చేస్తారు. సంతృప్తి చెందిన తర్వాత రాయితీని మంజూరు చేస్తారు. కాకపోతే గృహ నిర్మాణం, మరుగుదొడ్ల పనులకు జరుగుతున్నట్లుగా దశలవారీగా చెల్లింపులు చేస్తే కొంత ఉపశమనం లభిస్తుంది. చివర్లో ఒకేసారి ఇవ్వడంతో నిర్మాణ వ్యయం కోసం అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో ప్యాక్‌హౌస్‌ల నిర్మాణం భౌతిక, ఆర్థిక లక్ష్యాలు.. సాధించిన ప్రగతి ఇలా..

సంవత్సరం	భౌతిక లక్ష్యం	కేటాయింపు రూ.లక్షల్లో	ప్రగతి నిర్మాణం	చేసిన ఖర్చు రూ.లక్షల్లో
2012-13	50	75	54	81
2013-14	45	67.5	43	64.5
2014-15	49	98	47	94
2015-16	400	800	255	510
2016-17	203	454	152	304
2017-18	208	416	111	4

ఏడాదిగా అడుగుతున్నాం



మాకు లేత చీనీచెట్లు 200, ముదురు చెట్లు 50 ఉన్నాయి. కాయలను సంచుల్లో, పెట్టెల్లో నింపుకొనేందుకు పొలంలో ప్యాక్‌హస్ నిర్మించుకోవాలని ఏడాది కిందట దరఖాస్తు చేశా. అప్పటి నుంచి అధికారులను అడుగుతున్నాం. అదిగో ఇదిగో అంటూ చెబుతూ వస్తున్నారు. ఇంతవరకు మంజూరు చేయలేదు. ఎన్నాళ్లని తిరగాలి. దరఖాస్తు చేసిన వెంటనే అనుమతిచ్చేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

- పందేటి రామప్రసాద్‌రాజు, రైతు, రాచపల్లె

ఎలాంటి సమాచారం ఇవ్వలేదు



నాకు అయిదెకరాల భూమి ఉంది. మామిడి తోట సాగు చేశా. బేనిషా, బెంగుళూర, నీలం, చందూర్ రకాలు సాగులో ఉన్నాయి. ఉద్యాన శాఖ ద్వారా ప్యాక్‌హౌస్ మంజూరు చేస్తారని తెలిసి ఏడాది క్రితం దరఖాస్తు చేశా. అప్పటి నుంచి ఎదురుచూస్తున్నా. ఇంతవరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఇస్తారని ఎంతో ఆశతో ఉన్నా. ఇప్పటికైనా అధికారులు మంజూరు చేయాలి.

- కొండూరు వాసుదేవరాజు, రైతు, రాచపల్లె

అర్హత ఉంటే మంజూరు చేస్తున్నాం



ప్యాక్‌హౌస్ కావాలని రైతులు దరఖాస్తు చేసుకోవాలి. అర్హత ఉంటే పరిశీలన చేసి మంజూరు చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలకు 75 శాతం, ఇతరులకు 50 శాతం రాయితీ ఇచ్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అర్హులైన వారిని గుర్తించి కేటాయిస్తున్నాం. వీటి నిర్మాణంతో రైతులకెంతో మేలు అని క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నాం. కావాల్సిన వారు ముందుకురావాలి.

- వైవీఎస్ ప్రసాద్, ఉప సంచాలకుడు, ఉద్యాన శాఖ, కడప

జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో ఆటలు

2 నుంచి 11 వరకు పోటీలు



మాట్లాడుతున్న డీఎస్‌డీవో ఉమాశంకర్


కడప క్రీడలు, న్యూస్‌టుడే: నేటి నుంచి ప్రారంభకానున్న జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో పిల్లలు, ప్రజలకు ఆటలపోటీలు నిర్వహించనున్నారు. చిన్న-పెద్ద అనే తేడా లేకుండా అందరికి ఆటలు ఆడించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోటీలను ప్రవేశపెడుతున్నట్లు డీఎస్‌డీవో ఉమాశంకర్ తెలిపారు. అన్ని నియోజకవర్గాలకు ఒక్కొక్క డీఎస్‌ఏ శిక్షకుడు బాధ్యుడిగా వ్యవహరిస్తారని తెలిపారు. 7న ప్రొద్దుటూరు పట్టణంలో జరగనున్న భారీ 5కె రన్ జరుగుతుందన్నారు. 11వ రోజున అన్ని మండల ప్రధాన కేంద్రాల్లో బహుమతుల ప్రధానం నిర్వహిస్తారన్నారు.

వైభవంగా ముగిసిన తిరుమలరాయుని తిరుణాల

సంబేపల్లె, చిన్నమండెం, న్యూస్‌టుడే: మండలంలోని నారాయణరెడ్డిగారిపల్లె పంచాయతీ కైలాసపురానికి సమీపంలో ఉన్న తిరుమలరాయుని గుట్టపై నూతన సంవత్సరం సందర్భంగా తిరుమలరాయుని తిరుణాల సోమవారం వైభవంగా ముగిసింది. ముద్దినేనివాండ్లపల్లె, ముద్దినేనివడ్డిపల్లెకు చెందిన ప్రజలు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం, చెక్కభజనలు ఏర్పాటు చేశారు. సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి, సుండుపల్లె, చిత్తూరు జిల్లాలోని కలకడ, గుర్రంకొండ మండలాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలి వచ్చి తిరుమలరాయునిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద మొక్కుబడులున్న భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం చేశారు.



కొండమీద కిటకిటలాడుతున్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో తిరుమలరాయుని మూలవిరాట్

వైఎస్సార్‌కు ఉన్న నైతిక విలువలు జగన్‌లో లేవు

కమలాపురం, న్యూస్‌టుడే: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కున్న నైతిక విలువలు, లక్షణాలు ఆయన తనయుడు, ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిలో లేవని, వైఎస్సార్ తన అనుయాయులను ఏమైనా అంటే ఊరుకునేవారు కాదని, జగన్ సూటుకేసులు మోసుకొచ్చేవారికే ప్రాధాన్యతనిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా విందు ఏర్పాటుచేసిన అనంతరం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జగన్ పాదయాత్రకు ప్రజల నుంచి స్పందనలేదని, ఆయన ప్రభుత్వం కలలో కూడా రాదన్నారు. 2014లో జగన్ సీఎం అవుతారని ప్రజలు మోసపోయారన్నారు. అప్పట్లో జిల్లాలో వైకాపాకు 9 సీట్లు వచ్చాయని, 2019లో తెదేపా 6 సీట్లు లేదా మెజార్టీ సీట్లు గెలవబోతుందని అందులో కమలాపురం ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి దగ్గర కుప్పిగంతులు కుదరవని, ఓడిపోయేవారికి టికెట్లు ఇవ్వరని తెలిపారు. గెలుపుగుర్రాలకే టికెట్లు ఇస్తారన్నారు. నేను కూడా టికెట్టు ఇవ్వమని అడుగుతానని ఇస్తే పోటీ చేస్తానని లేదంటే ఎవరికిచ్చినా ఆయన గెలుపునకు కృషి చేస్తానన్నారు. సర్వరాయసాగర్ ప్రాజెక్టు గురించి సీఎం బహిరంగ సభలకెళ్లి ఎంపీ ఒకసారి అడిగితే సరిపోదని, రెండు, మూడుసార్లు సీఎం వద్దకు వెళ్లి అర్జీలు ఇచ్చి పనులు చేయించుకోవాలన్నారు. సర్వరాయసాగర్ రూ.300 కోట్ల ప్రాజెక్టు అని అది అందరి చేత నలిగి, నలిగి బీటలు, నెర్రెలు చీలి నీరు నిలవకుండా వచ్చిందన్నారు. దాంట్లో ఎమ్మెల్యే రవిరెడ్డి భాగస్థుడని, రూ.40 కోట్లు లబ్ధిపొంది పనులను అమ్ముకున్నాడని చెప్పారు. చంద్రబాబు నీళ్లివ్వలేదని ఆయనే మళ్లీ దొంగ పాదయాత్ర చేయడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే అయ్యాక నియోజకవర్గంలో ఆయన రూ.లక్ష ఖర్చు చేసి పనులు చేసిన దాఖలాలు లేవన్నారు.

పచ్చ బంగారం ధర పెరిగేది ఎప్పుడో

టంగుటూరు (రాజుపాలెం), న్యూస్‌టుడే: రేయింబవళ్లు శ్రమటోడ్చి పంటలు పండించే రైతులు నిరంతరం ఆశాభావంతోనే ఉంటున్నారు. పంట సాగు చేసినప్పటి నుంచి వాటికి సోకే తెగుళ్లు, పంట దిగుబడులు, ప్రకృతి వైపరీత్యాలు,ఆపై గిట్టుబాటు ధర ఇలా అన్నింటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అత్యధిక మంది రైతులు తమ కష్టం ఎప్పుడో ఒకసారి ఫలిస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. మండలంలోని టంగుటూరు గ్రామంలో ప్రతి ఏడాది రైతులు పసుపు పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ గ్రామ రైతులు 300 ఎకరాల్లో పసుపు పంట సాగు చేస్తున్నారు. గత పదేళ్లుగా పసుపు ధర పెద్దగా పెరగలేదు. ఇదే సందర్భంలో పెట్టుబడి మొత్తం పెరిగింది. దీంతో ఎకరాకు కనీసం రూ.లక్ష ఖర్చు వస్తోంది. దిగుబడులు కూడా తగ్గడంతో చివరకు పెట్టుబడులు రాక నష్టపోతున్నారు. క్వింటాలు పసుపు ధర నాణ్యతను అనుసరించి రూ. 5100 నుంచి రూ. 7000 వరకు పలుకుతోంది. 2009లో క్వింటాలు పుసుపు ధర రూ. 19 వేలకుపైగా పలికింది. మళ్లీ ఆ ధర ఇంత వరకు రాలేదని రైతులు తెలిపారు. చివరకు రూ. 10 వేలను అధిగమించలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. నాలుగేళ్ల క్రితం క్వింటాలు రూ.3000 నుంచి రూ. 4300 మధ్య పలికింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. చివరకు కౌలు రైతులు కోలుకోనివిధంగా దెబ్బతిన్నారు. ఆపై కౌలు రైతులు చాలా మంది పసుపు సాగుకు దూరమయ్యారు. ప్రస్తుతం ఎక్కువగా భూమి యాజమానులు పసుపును సాగు చేస్తున్నారు. ఎకరాకు మంచి దిగుబడులు వస్తే 20 నుంచి 25 క్వింటాళ్లు మాత్రమే పండుతుంది. దీంతో రైతులకు కొంత ఊరట కలుగుతుంది. అదే పంటకు తెగుళ్లు సోకితే దిగుబడి పూర్తిగా తగ్గి రైతులకు నష్టాలే మిగులుతాయి. క్వింటాలుకు రూ.10 వేల గిట్టుబాటు ధర అయినా ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.ఇదే ఆశతో దాదాపు మూడేళ్లుగా దిగుబడులు నిల్వ ఉంచుకున్నారు. కడపలోని వ్యాపారుల వద్ద నిల్వ చేసుకున్నారు. దీంతో పచ్చబంగారానికి ధర ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు.



సాగులో ఉన్న పసుపు పంట

కాసుల కక్కుర్తితోనే పోలవరాన్ని చేపట్టారు

కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: కాసుల కక్కుర్తితోనే పోలవరం ప్రాజెక్టు చేపట్టారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి అన్నారు. సోమవారం ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిందన్నారు. 2019 నాటికి పోలవరాన్ని పూర్తి చేయాలని ఆయన డిమాండు చేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 43 ప్రాజెక్టులను జలయజ్ఞం కింద చేపట్టారన్నారు. కాంగ్రెస్ హయాంలో 2007లో బ్రహ్మంసాగర్‌కు, 2012లో హంద్రీనీవా ద్వారా జీడిపల్లె రిజర్వాయర్‌కు, 2013లో గాలేరు-నగరి ద్వారా గండికోటకు నీరిచ్చామన్నారు. వెలిగల్లుతో కలిపి 11 ప్రాజెక్టులు తమ పార్టీ హయాంలో పూర్తి అయ్యాయన్నారు. అనంతరం ఆయన ఈనెల 7, 8, 9వ తేదీల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చేపట్టే మహా పాదయాత్ర గోడపత్రాలను ఆవిష్కరించారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద ఏడో తేదీన యాత్ర ప్రారంభించి 9వ తేదీన ముగిస్తారన్నారు. 10వ తేదీన పోలవరం ప్రాజెక్టు వద్ద సామూహిక సత్యాగ్రహం చేపడతామన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, నాయకులు నీలిశ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రెడ్డి, చార్లెస్, నాగరాజు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర పోస్టర్లును ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి, చిత్రంలో డీసీసీ అధ్యక్షుడు నజీర్‌అహ్మద్

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: మంగళవారం గోంగూర దానంచేస్తే ఆర్థిక విషయాలు అనుకూలిస్తాయా?, వాస్తుదోషాలు ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: అమ్మో! ఒకటో తారీఖు (శ్రీకాంత్, రాశి).

మధ్యాహ్నం

12-00: తెలుగు 'రుచి': ఘుమఘుమలు 'బెండకాయ కొబ్బరి వేపుడు', మీ చేతి వంట 'మలైకోఫ్తా కర్రీ', 'ఆలూకార్న్ సూప్', జస్ట్ ఎ మినిట్ 'గుమ్మడి పరోటా' తయారుచేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ: (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు(విధి-2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జబర్దస్త్ (రిపీట్), 06-00: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్) 06-30: తేనె మనసులు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: సైసై సయ్యారే: దర్శకేంద్రుడి పాటల సందడి..., 10-30: 'ఫన్' డే (స్పెషల్ కామెడీ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 అమ్మాయి క్యూటు అబ్బాయి నాటు రిపీట్
01:15 పిట్టగోడ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు
03:00 తారక్ మామా అయ్యోరామా రిపీట్
03:30 పోవే..పోరా రిపీట్

సాయంత్రం

04:30 నా షో నా ఇష్టం రిపీట్
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి 07:30 తారక్ మామా అయ్యోరామా
08:00 అల్లరే అల్లరి
08:30 సరదాగా కాసేపు
09:00 పటాస్
09:30 మహాతల్లి
09:45 ఫ్రూట్స్
10:00 నా షో నా ఇష్టం రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస: సాఫ్ట్ స్కిల్స్ ఎవరికి ఎంత అవసరం - పార్ట్ 1 (ఉ.6:00, రా.11:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా.10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.6:30, రా.10:00)
- ★ అమృతం: వండర్ వెజిటబుల్స్ (ఉ.8:00, మ.12:30, రా.8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.1:00, రా.8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ.1:30)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్: మహిళల్లో గుండె జబ్బులా? ఎలా అడ్డుకుందాం? (ఉ.9:30)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్: స్త్రీలలో మూత్రనాళ సమస్యలా? ఎటువంటి జాగ్రత్తలు అవసరం? (మ.2:00, రా.7:00)
- ★ అంతరంగం: కొత్త సంవత్సరంలో తీసుకునే సంకల్పాలను..మీరు మధ్యలోనే వదిలేయకుండా ఉండాలంటే ఏంచేయాలి? (ఉ.10:00)
- ★ అంతరంగం: మీ పిల్లల ఫోన్లను చెక్ చేయాలనుకుంటున్నారా? మరి వారిని ఎలా మ్యానేజ్ చేయాలి? (మ.2:30, రా.9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. నూతన సంవత్సరం - ఆరోగ్య సంకల్పాలు, 2. పూర్ణాయుషుకు పోషకాహారం, 3. లాలాజలం..ఓ దివ్యౌషధం (ఉ.10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. రక్తంలో పూడికలు ఏర్పడడానికి కారణాలు, 2. మనం హోటళ్ళో తినగా మిగిలిన ఆహారాన్ని ప్యాక్ చేసి ఇంటికి తీసుకొని వెళ్లడం మంచిదేనా?, 3. శరీరంలో వాపుల వెనుక దాగున్న వాస్తవాలు (మ.3:00, రా.9:00)
- ★ డా. ఈటీవి: గుండె ఆరోగ్యం (ఉ.11:00)
- ★ డా. ఈటీవి: చర్మ సంరక్షణ (ఉ.11:15)
- ★ డా. ఈటీవి: మధుమేహం (మ.3:30, రా.7:30)
- ★ డా. ఈటీవి: ENT (మ.3:45, రా.7:45)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలీషాపింగ్ 7-00: సన్‌రైజ్ సినిమా: దొంగపెళ్ళి (శోభన్‌బాబు, విజయశాంతి) 10-00: మార్నింగ్ షో: బాలమిత్రుల కథ (మాస్టర్‌దేవానంద్, మాస్టర్ సురేంద్ర) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: ఘటోత్కచుడు (ఆలీ, రోజా) సాయంత్రం: 4-00: ఈవినింగ్‌షో : హృదయం (మురళి, హీరా) రాత్రి: 7-00: ఫస్ట్‌షో: బాగ్దాద్ గజదొంగ (ఎన్టీఆర్, జయలలిత) 10-00: మై ఛాయిస్ (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కోడిగుడ్డు శెనగల ఛాట్ & గోధుమగడ్డి బాదం పాన్‌కేక్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (పంజాబీ క్యూసైన్) - చోలే ఆలూ ఔర్ గోబీ కా టిక్కీ ఛాట్, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - కర్డ్ అండ్ ఓట్స్ సెరియల్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - స్పినాచ్ ఎగ్ పొంగణాలు, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - మటన్ దమ్ బిర్యానీ & కార్జం వేపుడు, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - అవలక్కి ఎర్రియప్ప, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - అరవి కబాబ్, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ - గుమ్మడికాయ హల్వా, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - గుమ్మడికాయ గింజలతో సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పారిస్ క్యూసైన్) - పార్మీ ఫ్రైడ్ చికెన్ & చికెన్ కర్రీ విత్ పొటాటోస్, మ.1.30, రా.10.00: చటపట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) ఇండియన్ కేక్, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ - స్టఫ్డ్ ఎగ్ విత్ చికెన్ & చాక్లెట్ ఎక్లైర్స్, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - పెరుగు మర్చి మటన్ బిర్యానీ & కాజు మటన్ ఫ్రై, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - ఉల్లి పునుగులు, మ.2.45, రా.10.30: ఎట్‌హోమ్ - మ్యాంగో స్క్వాష్ & క్లాసీ రంచ్ డ్రెస్సింగ్, మ.3.30: ఆహారవీధిలో - ప్రముఖ రెస్టారెంట్‌లో.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థ యాత్ర: శ్రీ లక్ష్మీనారాయణ దేవాలయం, మధురవాడ, విశాఖపట్నం, 5-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థ యాత్ర: శ్రీ గోదారంగనాథస్వామి ఆలయం, ఎదులాబాద్, మేడ్చల్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ఈటీవీ న్యూస్, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 02-01-2018

SVBC

ఉదయం: 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (అష్టాదళ పాదపద్మారాధన సేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - ఆంజనేయ స్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారికల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ +ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:**12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 భగవద్గీత - బాలవికాసం, 03-30 అద్భుత ఆలయాలు - మురుడేశ్వర్ (రిపీట్), **సాయంత్రం:** 04-00 శ్రీదేవీ కటాక్షం, 04-30 విలువలు - విజ్ఞానం, 05-00 లైవ్ ఎస్.డి.సేవ - తిరుమల + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు - భక్తిచైతన్యం, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - గుహ్య అగష్టేశ్వరస్వామి ఆలయం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాలకృష్ణమాచార్యులు.

భక్తి TV

ఉదయం: 06-00 శ్రీ లలితాసహస్రం, 06-30 హనుమాన్ చాలీసా, 07-00 అర్చన, 07-30 శ్రీ కనకధారస్తోత్రం 08-00 పుణ్యక్షేత్రం, 08-30 ఆరుద్ర దర్శనం (లైవ్), 11-00 ధర్మ సందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రీ కనకధారస్తోత్రం, 05-30 హనుమాన్ చాలీసా, 06-00 శ్రీ లలితాసహస్రం, **రాత్రి:** 07-00 భక్తి విశేషాలు, 07-30 అమృత కలశం 08-00 ఆరుద్ర దర్శన మహోత్సవం 08-30 శ్రీమద్భగవద్గీత, 09-00 దుర్గాసప్తశతి 09-30 మహా భారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తి విశేషాలు, 11-00 గోదామృతం.

ZEE తెలుగు

ఉదయం: 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: చందమామ, 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 రారండోయ్ వేడుకచేద్దాం, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 కళ్యాణ వైభోగం రిపీట్, **సాయంత్రం:** 04-00 డ్రామా జూనియర్స్ రిపీట్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 ఎవరే నువ్వు మోహిని 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్).

maa

ఉదయం: 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: పోకిరి, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కోడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లి కూతురు, 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: లీడర్, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్ర బంధం, 10-00 నీలికలువలు, 10-30 స్టార్ మా పరివార్ అవార్డ్స్.

GEMINI

ఉదయం: 06-00 టెలీషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: నేనున్నాను, 11-30 నాగిని 2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 షిరిడి సాయి, 03-00 సినిమా: శంభో శివ శంభో, 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 జూలకటక, 10-30 సినిమా: మిస్టర్ ఫర్‌ఫెక్ట్.

HBO

ఉదయం: 06-00 స్నిచ్, 07-54 రాక్ ఆఫ్ ఏజెస్, 09-53 టీనేజ్ మ్యుటెంట్ నింజా టర్‌టిల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-52 300: రైజ్ ఆఫ్ యాన్ అంపైర్, మధ్యాహ్నం: 01-24 బ్యాట్‌మ్యాన్ వర్సెస్ సూపర్‌మ్యాన్: డాన్ ఆఫ్ జస్టిస్.

గులాబి పురుగును ముందే నివారించాలి

పత్తి పైరును ఆశించి తీవ్ర నష్టం కలిస్తున్న గులాబి రంగు పురుగు నివారణకు పైరు లేతదశ నుంచే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చేజర్ల వ్యవసాయాధికారి శ్రీదేవి సూచించారు. బీటీ పత్తి రకాల సాగుతో కాయ తొలిచే పురుగులు తగ్గుముఖం పట్టినా, ఇటీవల గులాబి రంగు పురుగు, శనగపచ్చ పురుగు, పోగాకు లద్దె పురుగు ప్రస్తుతం అక్కడక్కడా కనిపిస్తున్నాయి. వీటి నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గులాబి రంగు పురుగులు పంట చివరి దశలో గూడ, పూత, కాయలకు నష్టం కలుగజేస్తాయి.



★ గులాబి రంగు పురుగు నాలుగు దశల్లో పెరుగుతుంది. పైర్లు వేయక ముందు భూమిలో, పత్తి వ్యర్థాల్లో కోశస్థ దశలో దాగి ఉండి వర్షాలు కురిసిన వెంటనే గోధుమరంగుతో సన్నటి రెక్కల పురుగులుగా వెలువడతాయి. ఒక్కో పురుగు పత్తి మొక్కపై 400 పైగా గుడ్లు పెడుతుంది.

★ ఇవి ఎదిగి గులాబీ రంగు పురుగుల్లా మారి మొగ్గలు, లేత కాయలకు రంధ్రాలు చేసి నష్టం కలుగజేస్తాయి. పురుగులు లోపలి భాగంలో చేరిన తరువాత రంధ్రాలు మూసుకు పోవటంతో కీటకాలను గుర్తించటం కష్టం. మొక్కల్లో పదార్థాలు తినేయడం ద్వారా పూత దశలో ఎక్కువ నష్టం కలుగుతుంది. గుడ్డిపూలు, కాయలు ఏర్పడతాయి. ఈ కీటకాలు పైరు పైభాగంలో కనిపించే అవకాశం తక్కువ. గుడ్డి కాయల్ని చీల్చి పురుగులను గుర్తించాలి.

సమష్టి యాజమాన్యం

పత్తి రైతులందరు సమష్టిగా సస్యరక్షణ చర్యలు చేపడితే పైరును ఆశించే కీటకాలు, తెగుళ్లను సులువుగా నివారించుకోవచ్చు.

★ లింగాకర్షణ బుట్టలను ఎకరానికి 4, 6 వరకు ఏర్పాటు చేయటం ద్వారా కోశస్థ దశలో ఉండే రెక్కల పురుగులు గుడ్లు పెట్టకముందే మగ పురుగుల్ని బంధించి నాశనం చేసి కీటకాల తీవ్రతను తగ్గించుకోవచ్చు. గులాబీరంగు పురుగు, పొగాకు లద్దె పురుగులకు వేర్వేరు లింగాకర్షణ బుట్టలు అమర్చుకోవాలి.

అగ్ని అస్త్ర ప్రయోగం : రైతులు తమ ఇళ్లలో దొరికే జీవ సంబంధ పదార్థాలతో తయారుచేసే ద్రావణంతో పురుగులను సమర్థంగా నివారించుకోవచ్చు. మట్టి కుండలో 10 లీటర్ల గోమూత్రంతో పాటు కిలో పొగాకు, అయిదు కిలోల వేపాకులు, అర కిలో పచ్చిమిరప కాయలు, అరకిలో వెల్లుల్లి ముద్దల్ని వేసి నాలుగుసార్లు పొంగు వచ్చేలా ఉడికించాలి. ఈ ద్రావణాన్ని 48 గంటలు చల్లార్చి వడకట్టి పిచికారీ చేయాలి. ఒక దఫాలో 3 లీటర్ల అగ్ని అస్త్రాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పైరుపై పిచికారీ చేయాలి.

తక్షణ సస్యరక్షణ: పత్తి చేలల్లో కాయతొలుచు పురుగు ఉద్ధృతి అధికంగా ఉన్నపుడు 1.5 గ్రా. థయోడికార్బ్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. పైరు చివరి దశలో ఉన్నప్పుడు సైపర్‌మిత్రిన్ 1 మి.లీ లేదా లామ్డా సైహలోత్రిన్ 1 మి.లీ., లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. సింథటిక్ పైరిత్రాయిడ్లు మొదటి దశలో వాడితే పైరుపై రసం పీల్చే పురుగులు ఆశించి నష్టం కలుగుతుంది. బీటీ పత్తికి చుట్టూ కంచెలా సాధారణ పత్తిని నాటుకోవాలని ఆమె సూచించారు.

– న్యూస్‌టుడే, చేజర్ల (నెల్లూరు జిల్లా)

కొబ్బరిలో కొమ్ము పురుగు

అన్ని ప్రాంతాల్లో కొబ్బరిని కొమ్ము పురుగు ఆశించి నష్టం చేస్తోంది. దీని నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారి కోటేశ్వరరావు తెలిపారు.

లక్షణాలు: విప్పారిన ముదురు ఆకులపై 'వి' ఆకారంలో కత్తిరించినట్లు ఉంటుంది.

★ కొబ్బరి చెట్టు మొవ్వులో పురుగు తొలిచిన రంధ్రం, పురుగు వదిలిన పిప్పి ఉంటుంది. కొమ్ము పురుగు కొబ్బరి లేత మొవ్వ భాగాన్ని తొలవటం వల్ల విప్పారని లేత ఆకులు నష్టపోయి కొబ్బరి దిగుబడులు తగ్గుతాయి. చిన్న మొక్కలను ఈ పురుగు ఆశిస్తే మొవ్వు కుళ్లిపోయే ప్రమాదం ఉంది.

★ ఈ పురుగు ప్రత్యక్షంగా చేసే నష్టమే కాకుండా ఒక చెట్టు నుంచి మరొక చెట్టుకు తిరుగుతున్నప్పుడు మొవ్వుకుళ్లు తెగులును కూడా వ్యాప్తి చేస్తుంది. కొమ్ము పురుగు నష్టపరిచిన మొవ్వు భాగం నుంచి వచ్చే పులిసిన వాసనకు కొబ్బరిలో కాండం తొలిచే ఎర్ర ముక్కు పురుగు ఆశించే ప్రమాదం ఉంది.

నివారణ చర్యలు: కొబ్బరి తోటల్లో పడిపోయిన చెట్లను తొలగించి మొదలు (భూమిలో ఉన్న భాగం) తవ్వించి తగుల బెట్టాలి. తోటలో పశువుల ఎరువు కుప్పలు ఉంచరాదు. దగ్గరలోని పశువుల ఎరువుల కుప్పలను మూడు నెలలకొకసారి తిరగేస్తూ కార్బరిల్ (50 శాతం) 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. మూడు నెలలకొకసారి కొబ్బరి చెట్ల మొవ్వు ఆకుల వలయాలలో వేప పిండి లేదా వేప గింజల పొడి 100 గ్రాములను 150 గ్రాముల ఇసుకలో కలిపి వేయాలి.

– న్యూస్‌టుడే, చిత్తూరు (వ్యవసాయం)

ఉక్కు పరిశ్రమపై ప్రభుత్వ వైఖరి తెలపాలి

179వ రోజుకు చేరిన ఉక్కు దీక్షలు

బిల్టప్, (కడప) న్యూస్‌టుడే: విభజన సమయంలో కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని కేంద్రం చెప్పింది. ఇప్పుడు కాలయాపన చేస్తుంది. ఉక్కు పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరేంటని రాయలసీమ రైతుసంఘం నాయకులు లింగమూర్తి ప్రశ్నించారు. కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని డిమాండ్ చేస్తూ కోటిరెడ్డికూడలిలో రాకపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు దీక్షలు సోమవారంతో 179వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్ర విభజనకు ఒక్క సీపీఎం పార్టీ తప్పా.. అన్ని పార్టీలు మద్దతు తెలిపాయని... భాజపా, తెదేపా విభజన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించి ఉక్కు పరిశ్రమ సాధించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ఉక్కు సాధించే వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని చెప్పారు. దీక్షలలో నాయకులు రవిశంకర్‌రెడ్డి, శంకర్, చెన్నయ్య, లక్ష్మిదేవి తదితరులు కూర్చున్నారు.



దీక్షలను ప్రారంభిస్తున్న రాయలసీమ రైతుసంఘం నాయకులు లింగమూర్తి

గండికోట జలాశయంలో తగ్గిన నీటిమట్టం

కొండాపురం, న్యూస్‌టుడే: గండికోట జలాశయంలో నీటిమట్టం కొంతమేర తగ్గింది. సోమవారం జలాశయంలో 7.860 టీఎంసీల నీరు ఉండగా, ప్రాజెక్టులో నీటిమట్టం 206.6 మీటర్లు ఉంది. అవుకు జలాశయం నుంచి గండికోట ప్రాజెక్టుకు సుమారు 1000 టీఎంసీలకు పైగా నీరు వచ్చి చేరుతోంది. గండికోట జలాశయం నుంచి జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాల్వ ద్వారా సర్వరాయసాగర్‌కు 200 క్యూసెక్కుల నీరు వెళుతోంది. అలాగే గండికోట ఎత్తిపోతల పథకం(ఎల్-1) ద్వారా మూడు పంపుల నుంచి 1500 క్యూసెక్కులు నీటిని సీబీఆర్‌కు పంపుతున్నారు. నాలుగు రోజుల క్రితం జలాశయంలో 8.27 టీఎంసీల నీరు ఉండగా ప్రాజెక్టులో నీటిమట్టం 206.22 మీటర్లు ఉండేది. అవుకు నుంచి వచ్చే నీటి ప్రవాహం తగ్గడంతో ప్రాజెక్టు నందు నీటిమట్టం తగ్గినట్టు జలవనరులశాఖ ఎస్‌సీ మధుసూధన్ రెడ్డి పేర్కొన్నారు.



గండికోట ప్రాజెక్టులో తగ్గిపోయిన నీరు

'హెచ్-64 యూనియన్' కాలమానిని ఆవిష్కరణ

ఆర్టీపీపీ (ఎర్రగుంట్ల), న్యూస్‌టుడే: ఆర్టీపీపీ విద్యుదుత్పత్తి కేంద్రంలోని ఎ.పి. ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (హెచ్-64) నూతన కాలమానిని ముఖ్య ఇంజినీరు శ్రీరాములు సోమవారం ఆవిష్కరించారు. ఆర్టీపీపీ అతిథిగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన హక్కులకోసం పోరాటాలు చేయడానికి తమ సంఘం నిరంతరం కృషిచేస్తోందని చెప్పారు. శ్రమను దోపిడీ చేసి కార్మికుల కడుపు కొట్టే యాజమాన్యాల మెడలు వంచి హక్కులు సాధించుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పి.శివమయ్య, ఎం.గంగాధర్, సుబ్రహ్మణ్యం, నరసింహులు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న సీఈ శ్రీరాములు

డీసీసీబీ ఉద్యోగాల్లో చేరిక

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో ఉన్న ఖాళీల భర్తీకి నిర్వహించిన పోటీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరుతున్నారు. 39 ఖాళీలకు నిర్వహించిన పోటీ పరీక్షలనంతరం ముఖాముఖి నిర్వహించారు. అన్ని తంతులు పూర్తి చేసుకున్న తర్వాత అందులో అన్నింటిలో ప్రతిభ చూపి ముందున్న అభ్యర్థులను రిజర్వేషన్ ప్రకారం ఎంపిక చేశారు. వారికి గతేడాది డిసెంబర్ 28వ తేదీన ఉద్యోగాల్లో చేరాలని నియామకపత్రాలను పోస్టల్లో నేరుగా వారి చిరునామాలకు పంపారు. అందులో 15 మంది కొత్త సంవత్సరం రోజునే డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేశారు. వీరిలో 13 మంది నేరుగా వచ్చినవారు కాగా ఇద్దరు కార్యదర్శుల కోటాలో పరీక్షలు రాసి వచ్చినవారు ఉన్నారు. మిగిలిన వారు కూడా ఈనెల 10వ తేదీలోపు ఉద్యోగాల్లో చేరాల్సి ఉంటుంది.

పంది దాడిలో బాలుడికి గాయాలు

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు పురపాలిక 9వ వార్డు మహబూబ్‌నగర్‌లో సోమవారం పంది దాడిలో అస్లాం అనే రెండేళ్ల బాలుడు గాయపడ్డారు. హసీనా అబ్దుల్ దంపతుల కుమారుడైన బాలుడు చాక్లెటు తింటూ వీధిలో ఇంటిముందు ఆడుకుంటుండగా పంది దాడి చేసి చెట్లలోకి తీసుకెళ్లసాగింది. కుమారుడ్ని కాపాడేందుకు అక్కడే ఉన్న బాలుడి తల్లి హసీనా కొద్దిసేపు పందితో పోరాటం చేసింది. పంది వెంబడించి దాడి చేయడంతో ఆమె కిందపడి కాళ్లకు గాయాలయ్యాయి. అక్కడే భవన నిర్మాణ పనిలో ఉన్న కూలీలు స్పందించి గడ్డపారతో పందిని కొట్టడంతో అది బాలుడ్ని వదిలేసి చెట్లలోకి వెళ్లిపోయింది. బాలుడి నోరు, కంటి వద్ద గాయాలయ్యాయి. ఆ వెంటనే బాలుడ్ని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. బాలుడు చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. కొద్దిసేపు ఆలస్యమైనా బాలుడ్ని పంది చంపేసి ఉండేదని తల్లి హసీనా తెలిపారు. తమ వీధులో పందులు అధికంగా ఉన్నాయని పిల్లలను బయటకు పంపాలంటేనే భయంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



గాయపడిన అస్లాం

పొరపాట్లకు తావివ్వొద్దు

కలెక్టరు బాబూరావు, శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి



హెలిప్యాడ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టరు, ఎస్పీ



సీఎం పర్యటనపై సతీష్‌రెడ్డితో చర్చిస్తున్న కలెక్టరు

లింగాల, న్యూస్‌టుడే: ఈనెల 3న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుచే గండికోట - పీబీఆర్ ఎత్తిపోతల పథకాన్ని జాతికి అంకితం చేసే క్రమంలో పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని కలెక్టరు బాబూరావునాయుడు, శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎస్పీ అట్టాడ బాబూజీతో కలిసి పెంచికల బసిరెడ్డి జలాశయం (పీబీఆర్) వద్ద హెలిప్యాడ్, పైలాన్ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గండికోట-పీబీఆర్ డెలివరీ పాయింటు వద్దకు కడప విమానాశ్రయం నుంచి హెలికాప్టరులో 11.50 గంటలకు చేరుకుంటారన్నారు. తొలుత జలాశయంలో జలహారతి ఇచ్చి పైలాన్‌ను ఆవిష్కరించి రూ.1350 కోట్ల వ్యయంతో చేపట్టిన గండికోట-పీబీఆర్ ఎత్తిపోతల పథకాన్ని జాతికి అంకితం చేస్తారన్నారు. జలహారతి కార్యక్రమంలో భాగంగా తిరుమల నుంచి పసుపు, కుంకుమ, చీరతో పాటు లడ్డూలు తెప్పించి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించాలని నిర్ణయించారు. పైలాన్ ఎదురుగా ఏర్పాటుచేసిన వేదిక మీద నుంచి ముఖ్యమంత్రి మాట్లాడేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎదురుగా ప్రజాప్రతినిధులు, నీటి సంఘాల సభ్యులతో సమావేశమవడానికి అనువుగా కుర్చీలు వేయిస్తున్నారు. దీనికి వెనుకభాగంలో వీఐపీలకు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. సభా ప్రాంగణంలో నీడ ఉండేలా చర్యలు చేపట్టారు. జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీరు వరదరాజులు, తెలుగుగంగ ఈఈ ప్రతాప్, పులివెందుల ప్రాంతీయ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నంద్యాల హేమాద్రిరెడ్డి పాల్గొన్నారు.

పరిశీలన : హెలిప్యాడ్, పైలాన్, సీఎం వచ్చే మార్గాన్ని అణువణువూ పరిశీలించి తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై కీలక నిర్ణయం తీసుకున్నారు. పులివెందుల, అనంతపురం నుంచి రోడ్డుమార్గాన వచ్చే వాహనాలను ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా కోన అడ్డదారిలో ఆపాలని ఓ అవగాహనకు వచ్చారు. వీఐపీల వాహనాలను మాత్రమే సభా ప్రాంగణం సమీపంలో నిలపడానికిగాను చదును చేయిస్తున్నారు. హెలిప్యాడ్ వద్ద అడ్డుగా ఉన్న స్తంభాలను తొలగించాలని, కొండ చుట్టూ ఎర్రటి జెండాలు ఏర్పాటు చేయాలని, గాలికి దుమ్ము రాకుండా నీటితో తడపాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు. కడప నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్‌తో, మెటల్ డిటెక్టరుతో తనిఖీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన పనులను సింహాద్రిపురం జడ్పీటీసీ సభ్యుడు పోరెడ్డి ప్రభాకరరెడ్డి పర్యవేక్షణలో మండల తెదేపా అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, పార్నపల్లె పుల్లానాయుడులు దగ్గరుండి చేయిస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: సిలంబమ్ 63వ జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలకు కడప జిల్లా క్రీడాకారులు అర్హత సాధించారని రాష్ట్ర సిలంబమ్ సంఘం ఛైర్మన్ వై.శివరామక్రిష్ణమూర్తి తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు దిల్లీలో జరగనున్న సిలంబమ్ జాతీయ స్థాయి పోటీల్లో ఐదుగురు విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. వారిలో అండర్-14 విభాగంలో కె.పల్లవి, పి.ఉషారాణి, అండర్-17 విభాగంలో షేక్ జానెద్, ఎన్.అవినాష్, అండర్-19 విభాగంలో పి.మల్లికార్జునలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్, వ్యాయామ ఉపాధ్యాయుడు నరసరాజు పాల్గొన్నారు.



సిలంబమ్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు

హత్యకేసులో నిందితుడి అరెస్టు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: రామేశ్వరం గ్రామం సమీపంలోని పొలాల వద్ద గత నెల 24వతేదీ జరిగిన హత్యకేసులో నిందితుడు దమ్మలపాటి పెద్ద వెంకటేష్‌ను సోమవారం అరెస్టు చేసి బద్వేలు కోర్టులో హాజరుపరిచామని సీఐ పద్మనాభన్, ఎస్సై నాగరాజు తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఐ మాట్లాడుతూ.... రామేశ్వరం గ్రామానికి చెందిన పెద్దవెంకటేష్ తన పొలం వద్ద ఏర్పాటు చేసుకున్న కలంలో వడ్లు ఆరబోశారు. వీటికి కాపలాగా వెంకటేష్ వెళ్లారు. అదేరోజు రాత్రి తన భార్య గంగమ్మకు ఎండ్రకాయల కూర చేసుకుని తీసుకు రావాలని కోరారు. ఎండ్రకాయలు దొరక్కపోవడంతో కోడిగుడ్ల కూరతో భోజనాన్ని గంగమ్మ రాత్రి పొలం వద్దకు తీసుకెళ్లారు. కోడిగుడ్ల కూరను చూసిన వెంకటేష్ తన భార్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ పక్కనే ఉన్న గడ్డపారతో గంగమ్మ ముఖంపై వెంకటేష్ దాడి చేశారు. ఈ దాడిలో గంగమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఆపై హత్య విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలిపారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న వెంకటేష్‌ను సోమవారం మార్కాపురం మలుపు వద్ద పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించారు. విచారణ చేయగా పూర్తి విషయాలు చెప్పారని సీఐ తెలిపారు.



నిందితుడిని చూపుతున్న ఎస్సై నాగరాజు

కలెక్టర్‌కు ఎస్పీ శుభాకాంక్షలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ బాబూరావుకు ఎస్పీ బాబూజీ పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆనక జిల్లా ప్రగతిపైనా, జన్మభూమి- మా ఊరు కార్యక్రమం, ముఖ్యమంత్రి పులివెందుల పర్యటనపై చర్చించారు.



కలెక్టర్ బాబూరావుకు పుష్పగుచ్ఛం ఇస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ బాబూజీ

ఉత్తమ ఫలితాలతో ముందుకెళ్దాం

కడప విద్య, న్యూస్‌టుడే : కొత్త సంవత్సరంలో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సమష్టిగా కృషి చేద్దామని పాఠశాల విద్య ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి, డీఈవో శైలజ కోరారు. 2018 నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా సోమవారం పలువురు జిల్లా అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా విద్యాధికారి శైలజ ఆర్జేడీకి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకులు రఘునాథరెడ్డి, జయరామయ్య, ఇలియాస్‌బాషా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్రహ్మణ్యంరాజు, బాలగంగిరెడ్డి తదితరులు కలిసి కొత్త సంవత్సర ఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌లను సమర్పించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, సుబ్బరాజు తదితరులు డైరీలను అందజేశారు. రాయచోటి మాసాపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురయ్య, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రమణయ్య, మలికార్జున్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు ప్రసాదరావు, నాగన్న, రమణ, ఏపీయూఎస్ రాష్ట్ర సహాధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, బాలానాయుడు, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి తదితరులు ఆర్జేడీకి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సీఆర్పీల సంఘం నాయకులు శంకర్, రామ్మోహన్ తదితరులు కలిశారు. జిల్లా విద్యాధికారి శైలజకు పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆర్జేడీ, డీఈవోలు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా, పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉద్బోధించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి కడప నగరంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో విద్యార్థులతో కేక్ కట్ చేయించి వేడుకలను నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకులు రఘునాథరెడ్డి, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

TENTH
Social Studies

Globalisation

2 Marks Questions

Q: Why do Government try to attract more foreign investment?

A: More foreign investment helps in increasing the economic activities. This helps in employment generation. So the Government try to attract more foreign investment.

Q: Where do MNC's setup offices and factories for production? Give reason.

A: MNC's establish offices and factories for production near the markets or places where skilled and unskilled labours are available or where factors of production is available.

Q: What are the various ways in which countries can be linked?

A: The various ways in which countries can be linked are

★ The movement of goods, services, investment and technology.

★ The movement of people between countries in search of better income, better jobs, better education.

Q: The impact of globalisation has not been Uniform. Explain the statement.

A: ★ It is benifitted to rich persons in the urban areas.

★ Some large Indian companies emerged as MNCs.

★ Thousands of small producers closed their units and met losses.

★ Many employees lost their employment and workers saw their rights erode.

Q: Why do developed countries want developing countries to liberalise their trade and investment? What do you think should the developing countries in return?

A: ★ Developed countries want developing countries to liberalise their foreign trade and foreign investment.

★ So that MNC's owned by these developed countries can expand into developing countries.

★ Developed countries with huge wealth, which is greater than the budgets of many developing countries can influence the world trade balance.

Q: Appreciate the role of WTO in promoting Globalisation.

A: W.T.O. is playing a crucial role in promoting globalisation. It promotes global business and international trade. It is the process of rapid integration of the countries. It provides a global platform to the countries for smoother solution for their problems and to establish greater free trade agreements on goods, services and technology.

Q: MNCs provide better quality products. Do you agree?

A: MNCs setup offices and factories for production in regions where they can get cheap labour and other resources.

★ The production process is divided into small parts and spread out across the globe.

★ This is done so that the cost of production is low and the MNC's can earn greater Profits giving quality products.

Q: What is the difference between foreign trade and foreign investment?

A: Foreign trade: It is any kind of trade (exports & imports) with other countries of the world.

Foreign investment: Private capital investment by firms of one country into those of another country is called foreign investment.

Q: Nearly all major multi nationals are American, Japanese or European such as Nike, Coca-Cola, Pepsi, Honda, Nokia. Can you guess why?

A: To start a MNC, enormous wealth is required. Only developed countries like the above can start MNC's as their wealth sometimes exceeds the entire budget of the developing countries. They are financially strong. So most of the MNC's are from America, Europe and Japan.

Q: What are the problems being faced by the small producers and workers by the impact of Globalisation? (2 Marks)

A: The MNC place orders for production with small producers. The products produced are sold by the MNCs under their own brand names. The MNC's have tremendous power to determine manufacturing conditions for the local producers. The History has shown the most of the local producers have failed to compete with the MNC's. So, either they have sold their units to the MNC's or have been wiped off.

ప్రతిభ

What was the previous name of WTO?

4 Marks Questions

Q: How has liberalisation of trade and investment policies helped the globalisation process?

A: ★ Liberalisation of trade and investment helped the Globalisation process.

★ Its policies removed many barriers and restrictions in Industrialisation.

★ Establishment of MNCs accelerated the globalisation.

★ Quality of goods increased

★ Goods and services availability is greatly increased throughout the world.

★ Due to liberalisation of trade and investment policies transport system developed well.

★ Mobile Phones, internet and computer facilities developed well.

★ We can access any information with low cost internet facilities within seconds.

Q: What were the reasons for putting barriers to foreign trade and investment by the Indian Government? Why did it wish to remove these barriers?

A: ★ To protect the producers within the country from foreign competition.

★ Industries were just coming up, with foreign competition they may not survive.

★ Foreign investment may be influence our economy.

★ Our goods quality is less than compare to foreign goods.



Writer:
K. Srinivasa Rao
Subject Expert

★ Around 1991, Indian government decided that the time had come for foreign competition.

★ It believed that competition would improve our goods quality.

★ Foreign technology help for us.

★ So it wished to removed these barriers.

Q: Globalisation will continue in the future. Can you imagine what the world would be like twenty years from now? Give reasons for your answer.

A: After 20 years the world would undergo a positive change with the features of the following.

★ Improved quality of products

★ More access to information technology

★ Healthy competition

★ Better living standards

★ Increased volume of output, income and employment.

The above changes are going to happen because-

★ Human resources are plenty.

★ Enterpreneurship will grow.

★ Domestic markets of all major countries will experience growth.

★ All major countries will have a broad resource and Industrial base.

Q: Elsewhere we read what may be development for one may be destructive for others. The setting of SEZs has been opposed by some people in India. Find out who are these people why are they opposing it.

A: ★ What may be development for one may be destructive for others.

★ The setting of Special Economic zones has been opposed by some people.

★ SEZs need not pay taxes for first five years

★ SEZs have flexible labour laws.

★ They have world class facilities

★ People are against SEZs as many companies which setup SEZs are not functioning well.

★ They were provided exemptions at the expense of other companies.

Q: How is information technology connected with globalisation? Would globalisation have been possible without the expansion of IT?

A: Information and communication technology has played a major role in spreading out production of service across countries.

★ The development in IT in the areas of computers Tele communications, internet have been changing rapidly.

★ Internet also allows us to send instant e -mail and talk across the world at negligible costs.

★ With the help of IT, Globalisation able to integrate of one's country's economy with world economy.

★ Globalisation would not have been possible without expansion of IT.

Q: Supposing you find two people arguing: One is saying that globalisation has hurt our country's development. The other is telling globalisation is helping India develop. How would you respond to these arguments?

A: Positive Impact

1) Increases in the volume of trade in goods and services.

2) Inflow of private foreign capital and export orientation of the economy.

3) Increases the volume of out put, income and employment

Negative impact

1) It may not help in achieving sustainable growth

2) It may lead to aggravation of income inequalities within countries.

3) Whatever may be the negative impacts of the globalisation I feel that it has now become a process which is catching the fancy of more and more nations. Hence we must become ready to accept globalisation with grace and also maximise economic gains from the world market.

1 Mark Questions

Q: What is Globalisation?

A: Globalisation is a major change that occurred across the globe in the late 20th century. This has political, cultural as well as economic dimensions.

Q: What is Arab spring?

A: Tunisia, Egypt were influenced by each other's revolutions and uprooting of dictators. This was called Arab spring in the media.

Q: Would you say Ford motors is an MNC? Why?

A: Yes, we can say Ford motors is an MNC, because its production units have spread over 26 countries of the world. This is the most important feature of an MNC.

Q: What was the previous name of WTO?

A: The previous name of WTO was GATT (General Agreement on Trade and Tariff)

Q: When was the W.T.O established?

A: The W.T.O was established on 01.01.1995

Q: How many countries are currently the members of the W.T.O.?

A: The W.T.O has 159 member countries as on 2.3.2013

Q: What is tariff?

A: A tax on a duty on imports which can be levied on physical units is called tariff.

Q: What is Privatisation?

A: Privatisation means encouraging private sector and discouraging public sector.

Q: Where is the Headquarters of W.T.O?

A: It is in Geneva - Switzerland.

Q: What is meant by MNC?

A: An MNC is a Multi National Corporation, owns and controls production in more than one nation.

Q: What is liberalisation?

A: Removing barriers or restrictions set by the Government is known as liberalisation.

Q: Why was World Trade Organisation setup?

A: The World Trade Organisation was setup to liberalise international trade.

Q: Define Economic reforms of New Economic Policy 1991.

A: The Economic Reforms of NEP 1991 was called liberalisation of trade and business.

Q: Expand I.B.R.D. and S.E.Z and IMF.

A: I.B.R.D: International Bank for Reconstruction and Development.

S.E.Z: Special Economic Zone

IMF: International Monetary Fund

Q: What is outsourcing?

A: Outsourcing means going out to a source outside the company to buy regular service.

Q: State the new strategies of New Economic Policy.

A: 1) Liberalisation

2) Privatisation

3) Globalisation

Q: Write any two impacts of liberalisation and globalisation in India?

A: 1) There are better services in communication sector.

2) Many food processing companies have taken over the market.

ఏపీ టెట్

శిశువికాసం, పెడగాజి

1. బి.ఎఫ్. స్కిన్నర్ అభ్యసనా సిద్ధాంతానికి సంబంధించి సత్యవాక్యాన్ని గుర్తించండి.
1) స్కిన్నర్ అభ్యసనా సిద్ధాంతం క్రియాశీలక నిబంధనం
2) ఒక జీవన వ్యవస్థతో వెలిపరిచే ఎలాంటి ప్రతిస్పందన అయినా అది పరికరాత్మక నిబంధనమే
3) పునర్బలనంతో బలపడిందే పరికరాత్మక నిబంధనం
4) పైవన్నీ

2. 'The Work of Digestive Glands' గ్రంథ రచయిత ఎవరు?
1) బి.ఎఫ్. స్కిన్నర్ 2) కోహిలర్
3) పావ్‌లోవ్ 4) థార్న్ డైక్

3. స్కిన్నర్ 'కార్యక్రమయుత అభ్యసనం'లో ఏ అంశానికి ప్రాధాన్యం లేదు?
1) బోధనాంశాలను క్లిష్టతర అంశాల ఆధారంగా అమర్చాలి
2) అభ్యాసకుడు క్రియాశీలకంగా ఉండటం జరుగుతుంది.
3) స్వీయ అభ్యసనం జరుగుతుంది
4) అభ్యసనాంశంలో బోధకుడికి అధిక ప్రాధాన్యం ఉంటుంది

4. 'అభిలషణీయమైన ప్రవర్తనను విద్యార్థుల నుంచి గుర్తించిన తర్వాత ఉపాధ్యాయుడు బహుమతి ఇవ్వడంతో ఆ ప్రవర్తన పునర్బలనం చెందేలా చేయొచ్చు' అని వివరించే అభ్యసనా సిద్ధాంతం ఏది?
1) S - R Type 2) R - Type
3) S - Type 4) R - S Type

5. నిబంధిత ప్రతిస్పందన బలపడేలా చేయడమనే ప్రక్రియ శాస్త్రీయ నిబంధనానికి ప్రధానమైంది. అయితే ఏ నియమం ఈ ప్రక్రియకు దోహదపడుతుంది?
1) పునర్బలన నియమం 2) విలుప్తీకరణం
3) అయత్నసిద్ధ స్వాస్థ్యం 4) సాధారణీకరణం

6. రాజు అనే బాలుడు ఒక మూర్తిమత్వ శోధికలోని ప్రశ్నల్లో ప్రతి 8 ప్రశ్నలు పూరించిన తర్వాత ప్రయోక్త రాజుకు మంచి బహుమతి ఇస్తున్నాడు. అయితే స్కిన్నర్ ప్రకారం ఇది ఏ రకమైన పునర్బలనం అవుతుంది?
1) స్థిరకాల పునర్బలనం 2) స్థిర నిష్పత్తి పునర్బలనం
3) చరశీల పునర్బలనం 4) నిరంతర పునర్బలనం

7. బాలుడు ఒక ప్రశ్నావళిలోని ప్రశ్నలను పూరించే సందర్భంలో ఉపాధ్యాయుడు ప్రతి 45 నిమిషాలకు ఒకసారి బాలుడిచ్చే సమాధానాలకు పొగడ్తను అందిస్తున్నాడు. అయితే ఈ ఉపాధ్యాయుడు అనుసరిస్తున్న స్కిన్నర్ సిద్ధాంతంలోని పునర్బలనం ఏది?
1) స్థిరకాల పునర్బలనం
2) స్థిరనిష్పత్తి పునర్బలనం
3) చరశీల పునర్బలనం 4) నిరంతర పునర్బలనం

8. పరికరాత్మక అభ్యసనంలో ఎలుక 'మీటను నొక్కడం' అనే చర్య దేనికి సంబంధించింది?
1) అసహజ ఉద్దీపన 2) నిర్నిబంధ ప్రతిస్పందన
3) అసహజ ప్రతిస్పందన 4) నిర్నిబంధిత ఉద్దీపన

9. పావ్‌లోవ్ నియమానికి సంబంధించి సత్యవాక్యాన్ని గుర్తించండి.
1) ఇందులో సాధారణంగా వదలబడిన ప్రతిస్పందనలు ఉంటాయి
2) ప్రతిస్పందన ఉంటేనే పునర్బలనం ఇవ్వబడుతుంది
3) జీవి ఎల్లప్పుడూ క్రియాత్మకంగా ఉంటుంది
4) జీవి ఎల్లప్పుడూ నిష్క్రియాత్మకంగా ఉంటుంది

10. కింద పేర్కొన్న వాక్యాల్లో ఏది సత్యం?
1) S-Type నిబంధనంలో కంటే R-Type నిబంధనంలో జీవి క్రియాత్మకం
2) R-Type నిబంధనంలో కంటే S-Type నిబంధనంలో జీవి క్రియాత్మకం
3) S-Type నిబంధనంలో కంటే R-Type నిబంధనంలో జీవి నిష్క్రియాత్మకం
4) S-Type, R-Type రెండు నిబంధనల్లో జీవి నిష్క్రియాత్మకం

11. Learning by doing అనే ప్రక్రియను ఇనుమడింపజేసుకున్న అభ్యసనా సిద్ధాంతమేది?
1) శాస్త్రీయ నిబంధనం 2) పరికరాత్మక అభ్యసనం
3) పరిశీలనాత్మక అభ్యసనం 4) బోధనా సిద్ధాంతం

★ అభ్యాసకుడు ఆలోచిస్తాడు, వివేచన చేస్తాడు. మొత్తాలను గ్రహించిన తర్వాత పరస్పర సంబంధాన్ని గుర్తించగలడు. సమస్యా పరిష్కార శక్తిని అంతర్గతంగా కలిగి ఉంటాడు అని తెలిపిన సిద్ధాంతం ఏది?
1) శిక్షణా సిద్ధాంతం 2) అనుకరణ సిద్ధాంతం
3) అంతర్ దృష్టి సిద్ధాంతం 4) సాంఘిక సిద్ధాంతం

జవాబు: 3

ప్రతిభ

కార్యక్రమయుత అభ్యసనంలోని పరిమితి ఏది?



రచయిత
- కోటపాటి హరిబాబు
విషయ నిపుణులు

12. ఒక ఉపాధ్యాయుడు తన పర్యవేక్షణలో ఒక విద్యార్థికి ఒక ప్రకల్పనను కల్పించి, ఆ విద్యార్థి చూపించే ప్రతిస్పందనలకు సరైన కాలంలో పునర్బలనం ఇవ్వలేదు. స్కిన్నర్ ప్రకారం దీన్ని ఏ పునర్బలనంగా పేర్కొనవచ్చు?
1) స్థిరకాల పునర్బలనం 2) స్థిరనిష్పత్తి పునర్బలనం
3) చరశీల పునర్బలనం 4) నిరంతర పునర్బలనం

13. ఒక ఉపాధ్యాయుడు సౌర కుటుంబం అనే పాఠ్యాంశాన్ని కృత్యాధార పద్ధతిలో బోధిస్తున్నాడు. ఈ బోధనకు ప్రేరేపితమైన విద్యార్థులు ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తున్నారు. విద్యార్థులకు వెంటనే పొగడ్త కల్పిస్తున్నట్లయితే ఇది స్కిన్నర్ ఏ పునర్బలనానికి చెందింది?
1) స్థిరకాల పునర్బలనం 2) స్థిరనిష్పత్తి పునర్బలనం
3) చరశీల పునర్బలనం 4) నిరంతర పునర్బలనం

14. పావ్‌లోవ్ నియమానికి చెందనిది ఏది?
1) పునర్బలన నియమం 2) ఆకృతీకరించడం
3) విరమణ 4) ఉద్దీపనా-సామాన్యీకరణం

15. కార్యక్రమయుత అభ్యసనంలో ఉన్న పరిమితి ఏది?
1) విద్యార్థి తన సందేహ భావనలను వ్యక్తపరచడం తక్కువ
2) సందేహ నివృత్తి జరగకపోవచ్చు
3) 1, 2
4) జీవి క్రియాత్మకంగా ఉంటుంది

16. ఏవాద అభ్యసనం అనేది పరిశీలించదగిన ప్రవర్తనలపై ఆధారపడి ఉంటుంది?
1) ప్రవర్తనా వాదం 2) నిర్మాణాత్మక వాదం
3) కార్యాత్మక వాదం 4) సంజ్ఞానాత్మకవాదం

17. విద్యార్థులందరూ పాఠశాల ఆటస్థలంలో ఆడుకుంటున్న సమయంలో ఒక విద్యార్థి 'పాము' అని అరవగా విద్యార్థులందరూ ఆ అరుపు విని పామును చూడకపోయినా పరిగెత్తారు. ఇందులో పాము అనేది?
1) నిబంధిత ఉద్దీపన 2) నిర్నిబంధిత ఉద్దీపన
3) నిబంధిత ప్రతిస్పందన 4) ఏదీకాదు

18. సంప్రదాయక నిబంధనంలో పసుపు వ్యానుకు బాలుడిని అలవాటు చేయగా, తర్వాతి రోజుల్లో ఆ బాలుడు ఏ పసుపు రంగు వ్యానును చూసినా అదేవిధంగా ప్రతిస్పందించడం అనేది?
1) ఉద్దీపన - విభేదీకరణం 2) ఉద్దీపన - విచక్షణ
3) ఉద్దీపన - సాధారణీకరణం 4) ఉద్దీపన - గుర్తింపు

19. శాస్త్రీయ నిబంధన ప్రక్రియలో అసహజ ప్రతిస్పందన క్రమంగా క్షీణించడానికి కారణం కిందివాటిలో...
1) సహజ ఉద్దీపన లేకపోవడం
2) ఉన్నత క్రమ నిబంధిత ఉద్దీపన లేకపోవడం
3) సహజ ఉద్దీపన పునర్బలనం కావడం
4) ఉద్దీపనాక్రమం ఉన్నత క్రమంగా ఉండటం

20. హరి అనే అధ్యాపకుడు కాబోయే ఉపాధ్యాయులకు 'మనోవిజ్ఞాన శాస్త్రాన్ని చక్కగా నేర్చుకుంటే ఏ విద్యార్థి ప్రవర్తనైనా అర్థం చేసుకోవచ్చు. తద్వారా కీర్తిప్రతిష్ఠలు వస్తాయి' అని బోధించి ఆ శాస్త్రంపై భయాన్ని పోగొట్టడం పావ్‌లోవ్ ఏ నియమాన్ని తెలుపుతుంది?
1) అయత్నసిద్ధ స్వాస్థ్యం 2) విరమణ
3) సామాన్యీకరణం 4) పునర్బలన నియమం

21. సహకార చింతనంతో ప్రభావితమైన ఒక వ్యక్తి పునర్బలనాన్ని ఆచరించకుండా సంతృప్తి కోసం ఇతరుల ప్రవర్తనాంశాలను పునరుత్పాదన చేయడం అనేది పరిశీలన ప్రకారం ఏ పునర్బలనం అవుతుంది?
1) స్వీయ పునర్బలనం 2) ప్రత్యక్ష పునర్బలనం
3) పరోక్ష పునర్బలనం 4) ప్రతికూల పునర్బలనం

22. సంసర్గవాద సిద్ధాంత ముఖ్య లక్షణం ఏది?
1) ప్రవర్తనా ప్రక్రియను అలవాటు చేయడం
2) ప్రవర్తనా ప్రక్రియ నిబంధనం
3) జ్ఞాన నిర్మాణాత్మకం 4) ఆలోచనా ప్రక్రియ

23. కోహిలర్ అంతర్‌దృష్టి అభ్యసన సిద్ధాంతానికి సంబంధించి అసత్య వాక్యాన్ని గుర్తించండి.
1) జీవికి జ్ఞానం స్వభావసిద్ధంగా కలుగుతుంది
2) అభ్యసనం యాంత్రికంగా జరుగుతుంది
3) ఆలోచనలు జ్ఞానాత్మక స్థాయిలో ఏర్పడే నిర్మాణాలు
4) అభ్యసనం అకస్మాత్తుగా జరుగుతుంది

24. కింది భావనల్లో ఏది నిర్మాణాత్మకవాదానికి చెందింది?
1) విషయాంశాలను బట్టీ విధానంతో నేర్పి అవసరమైనప్పుడు పునఃస్మరణ చేయడం
2) పిల్లలు క్రియాశీలకంగా ఉంటూ ప్రపంచంపై తమ స్వీయ అవగాహన పెంచుకోవడం
3) ఉపాధ్యాయుడు నిరంతరం క్రియాత్మకంగా ఉండటం
4) అభ్యసనానికి అనుకరణను ఆపాదించడం

25. 'హింసాత్మక సన్నివేశాలు చూసిన పిల్లలు అదే రకమైన ప్రవర్తనలను అలవరచుకుంటారు' అనే అంశానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన శాస్త్రవేత్త ఎవరు?
1) థార్న్ డైక్ 2) ఆల్బర్ట్ బండూరా
3) పావ్‌లోవ్ 4) స్కిన్నర్

26. 'The Gestalt Psychology' గ్రంథ రచయిత ఎవరు?
1) కోహిలర్ 2) థార్న్ డైక్
3) బండూరా 4) స్కిన్నర్

27. సాంఘిక సాంస్కృతిక అభ్యసన సిద్ధాంతం ఏ అంశాన్ని వివరించింది?
1) విద్యావిధానంలో వైయక్తిక నియోజనాలకు అవకాశం ఇవ్వడం.
2) విద్యార్థికి మొదట సహకారం అందించి, ఆ తర్వాత సహకారాన్ని ఆపివేయడం.
3) విద్యార్థులు తన కంటే అల్ప ప్రజ్ఞ ఉన్నవారి నుంచి నేర్చుకోవడం.
4) అభ్యసనాన్ని భాగస్వామ్యయుతంగా పొందడం

28. దొంగతనం చేసిన ఒక బాలుడిని గమనించిన మరొక బాలుడు కూడా దొంగతనం చేసి ఆ సందర్భంలో పట్టుబడి, శిక్షకు గురయ్యాడు. తర్వాత ఆ పనిచేయడానికి ఆసక్తి చూపలేదు. అయితే ఇక్కడ పునరావృతం కాకుండా నిరుత్సాహపరిచే పర్యవసానాలను ఏమంటారు?
1) అనుకూల పునర్బలనం 2) ప్రతికూల పునర్బలనం
3) విరమణ 4) 1, 2

29. నిర్మాణాత్మక విద్యావిధానంలో అభ్యసన పరిస్థితి కల్పించడంలో ఉపాధ్యాయుడి పాత్ర ఏది?
1) నియమ నిబంధనలను అమలుపరచడం
2) జ్ఞానాన్ని ఒకరి నుంచి మరొకరికి ప్రసారం చేయడం
3) విలువలను సృష్టించడం
4) అభ్యసనానికి వీలు కల్పించడం

30. 'Social Learning and Personality Development, Aggression : A Social Learning Analysis' గ్రంథ రచయిత?
1) బండూరా 2) వైగాట్ స్కీ
3) కోహిలర్ 4) బ్రూనర్

31. వైగాట్ స్కీ ఏ అంశాన్ని పేర్కొన్నారు?
1) భాష సముపార్జనలో పాఠశాల పాత్ర ముఖ్యం
2) భాష సముపార్జన అంశం సంజ్ఞానాత్మక సామర్థ్యాల సముపార్జనకు దారితీస్తుంది
3) సంజ్ఞానాత్మక జ్ఞానం భాషా జ్ఞానాన్ని పెంపొందిస్తుంది
4) వైగాట్ స్కీకి, భాషకు సంబంధం లేదు

32. రాజు అనే బాలుడు తన స్నేహితుడు మొదటి ర్యాంక్ సాధించినందుకు ఉపాధ్యాయుడు మెచ్చుకోవడాన్నే గమనించి తద్వారా విద్యను అభ్యసించడంలో ఎన్నో విషయాలు నేర్చుకుంటే దీన్ని ఏ అభ్యసనంగా చెప్పవచ్చు?
1) గెస్టాల్ట్ అధ్యయనం
2) పరికరాత్మక అధ్యయనం
3) సాంప్రదాయ నిబంధన
4) నమూనా అభ్యసనం

33. వైగాట్ స్కీ ప్రకారం పూర్వపాఠశాల దశలో పిల్లలు వారి చింతన, ప్రవర్తనలకు మార్గదర్శకంగా ఏ భాషను ఉపయోగిస్తారు?
1) అంతరంగిక భాష 2) అహంకేంద్ర భాష
3) సామాజిక భాష 4) వ్యక్తిగత భాష

34. ఏ విషయాన్నైనా విశ్లేషణా దృష్టితో కాకుండా సంశ్లేషణా దృష్టితో చూసి అర్థవంతంగా అభ్యసించవచ్చనే అంశాన్ని ఏ సిద్ధాంతం ప్రబోధిస్తుంది?
1) పరిశీలనాభ్యసనం 2) శాస్త్రీయ నిబంధనం
3) అంతర్‌దృష్టి అభ్యసనం 4) కార్యసాధక నిబంధనం

35. వైగాట్ స్కీ ప్రకారం ZPD గా వ్యవహరించేది?
1) సమవయస్కులు 2) సాంకేతిక పరిజ్ఞానం
3) ఉపాధ్యాయులు 4) పైవన్నీ

36. తరగతి గదిలో పిల్లలు పాఠ్యాంశాన్ని అభ్యసించడంలో కింది అంశాల్లో ఏది అంతర్‌దృష్టి అభ్యసనానికి సంబంధించింది?
1) నిదానంగా అభ్యసించడం
2) అర్థవంతంగా అభ్యసించడం
3) బట్టీ పద్ధతిలో చదవడం 4) ఏదీకాదు

37. సమస్యా పరిష్కార పద్ధతి, అన్వేషణ పద్ధతి అనేవి ఏ అభ్యసనా సిద్ధాంతాన్ని ప్రోత్సహిస్తాయి?
1) శాస్త్రీయ నిబంధనం 2) యత్నదోష అభ్యసనం
3) అంతరదృష్టి అభ్యసనం 4) పరిశీలనాభ్యసనం

38. కిందివాటిలో సరికాని జత ఏది?
1) మానవతావాదం - కార్ల్‌రోజర్స్
2) నిర్మాణాత్మకవాదం - పావ్‌లోవ్
3) సంజ్ఞానాత్మకవాదం - జీన్ పియాజె
4) సంసర్గవాదం - జె.బి. వాట్సన్

39. అంతర్ దృష్టికి సంబంధించి సరిపోని వాక్యమేది?
1) మెరుపులాంటి అభ్యసనం
2) సంశ్లేషణాత్మక అభ్యసనం
3) విశ్లేషణాత్మక అభ్యసనం
4) అభ్యసనం అవగాహనపై ఆధారపడుతుంది

40. వైగాట్‌స్కీ ప్రకారం...
1) వికాసం కల్పించుకున్న తర్వాత అభ్యాసం దాన్ని అనుసరిస్తుంది.
2) ముందుగా అభ్యసనం చోటు చేసుకున్న అనంతరం వికాస ప్రక్రియ దాన్ని అనుసరిస్తుంది
3) వికాసానికి, అభ్యసనానికి సంబంధం లేదు.
4) అభ్యసనం, వికాసం ఒకేసారి జరుగుతాయి.

జవాబులు

1-4	12-3	23-2	34-3
2-3	13-4	24-2	35-4
3-4	14-2	25-2	36-2
4-2	15-3	26-1	37-3
5-1	16-1	27-4	38-2
6-2	17-1	28-2	39-3
7-1	18-3	29-4	40-2
8-3	19-1	30-1	
9-4	20-2	31-2	
10-1	21-1	32-4	
11-2	22-2	33-4	

ప్రమాదంపై స్వారీ.. గతితప్పితే ప్రాణాలు హారీ!

నిత్యం రద్దీ.. రయ్‌మని దూసుకొచ్చే భారీ వాహనాలు.. రహదారి నిబంధనలు పట్టని ప్రయాణాలు రహదారులను రక్తసిక్తం చేస్తున్నాయి. మన కళ్లముందే రోజూ ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి.. ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు.. మరెందరో వికలాంగులుగా మారుతున్నారు. అన్నీ తెలిసినా అలవిమాలిన నిర్లక్ష్యంతో చాలామంది అజాగ్రత్తగా వాహనాలు నడుతపుతున్నారు. ఏమాత్రం అదుపుతప్పినా.. తాము ప్రమాదానికి గురవ్వడంతో పాటు ఏ తప్పూచేయని ఎదుటివారికి సైతం ముప్పు తెస్తారు. ఈ చిత్రాల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వీరే అందుకు నిదర్శనం. ఇలాంటి వారిలో చైతన్యమొస్తేనే ప్రయాణం సురక్షితం.

- చిత్రాలు : శ్రీనివాస పట్నాయక్


బిల్లప్ వద్ద


పులివెందుల రోడ్డులో


దండు వంతెనపై..

ముఖ్యమంత్రి పర్యటనపై డీఐజీ సమీక్ష

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కర్నూలు రేంజ్ డీఐజీ ఘట్టమనేని శ్రీనివాస్ సోమవారం కడపలో పోలీసు అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పులివెందుల నియోజకవర్గం పర్యటనకు రానున్న దృష్ట్యా డీఐజీ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సోమవారం సాయంత్రం డీఐజీ పులివెందులకు వెళ్లారు. అక్కడున్న పోలీసులతో బందోబస్తుపై చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసు నిఘా ఉండాలన్నారు.



పండుగలా సీఎం పర్యటన సాగాలి

శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి



ఏర్పాట్లపై పార్టీ శ్రేణులతో చర్చిస్తున్న శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి.. అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ బాబూరావు

పులివెందుల, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో పులివెందుల గడ్డపై తొలిసారిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన కొనసాగనుందనీ, దీన్ని ఓ పెద్ద పండుగలా జరపాలని శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి అన్నారు. స్థానిక ధ్యాన్‌చంద్ క్రీడామైదానంలో బుధవారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను సోమవారం తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి, కలెక్టర్ బాబూరావునాయుడు, డీఐజీ శ్రీనివాసులు, ఎస్పీ బాబూజీ, ఏఎస్పీ కృష్ణారావులు విడివిడిగా పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందుల అంతా పార్టీ జెండాలతో, ముఖ్యమంత్రి భారీ కటౌట్లతో నింపాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పురవీధుల్లో ప్రజలు, తెలుగు తమ్ముళ్లు ఊరేగింపుగా డప్పులు మోగిస్తూ ముఖ్యమంత్రి సభావేదిక వద్దకు చేరుకోవాలని కోరారు. ఈ సభను విజయవంతం చేయాలని రాయలసీమ తెదేపా నాయకత్వ శిక్షణ శిబిరం డైరెక్టర్ రాంగోపాల్‌రెడ్డికి ఆయన సూచించారు. ఏర్పాట్లను ఆయన క్షుణ్నంగా పరిశీలించారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి కీలక నేతలు ఈ సభలో పాల్గొంటున్నందున జారీచేసే పాసుల విషయమై అధికారులతో చర్చించారు. కలెక్టర్ బాబూరావు మాట్లాడుతూ ఏర్పాట్లు శరవేగంగా చేయాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. పంటలను ప్రదర్శించేందుకు ప్రత్యేక స్టాల్ ఏర్పాటుచేయాలని, వైద్యసిబ్బందికీ ఒక ప్రదేశం కేటాయించాలని సూచించారు. డీఐజీ శ్రీనివాసులు మాట్లాడుతూ బందోబస్తు పక్కాగా ఉండాలని సూచించారు. ఎస్పీ బాబూజీ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. సభావేదిక వద్దకు వచ్చే ప్రజలు, కార్యకర్తలు, నేతలను తనిఖీచేసేందుకు ప్రత్యేకంగా 7 చెక్‌పోస్టులను ఏర్పాటుచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ తెదేపా నాయకత్వ శిక్షణ శిబిరం డైరెక్టర్ రాంగోపాల్‌రెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ తూగుట్ల రాఘవరెడ్డి, ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధి మండలి కమిటీ ఛైర్మన్ నంద్యాల హేమాద్రిరెడ్డి, తెదేపా పట్టణ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండి తలనీలాల వేలం పాటల్లో మతలబు..!

వేంపల్లె, చక్రాయపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గండి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల తలనీలాల సేకరణ వేలం పాటల కేటాయింపులో మతలబు చోటుచేసుకుంది. దేవాదాయశాఖ అధికారులు పాలకవర్గం గుట్టుచప్పుడు కాకుండా సోమవారం ప్రకాశం జిల్లాకు చెందిన ఓ గుత్తేదారుకు రూ.60.05 లక్షలకు తలనీలాల సేకరణ హక్కును కట్టబెట్టారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.5.50 లక్షల ఆదాయం తగ్గినట్లైంది. ఈ వ్యవహారంలో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి గండిక్షేత్రానికి వచ్చే భక్తుల తలనీలాల సేకరణకు సంబంధించి జనవరి 2018 జనవరి 1 నుంచి డిసెంబరు 31 వరకు తలనీలాల సేకరణకు నిర్వహించాలని అధికారులు, పాలకవర్గం నిర్ణయించారు. ఈ మేరకు అధికారులు మొదటి దఫా నవంబరు 26న గండిక్షేత్రంలో తలనీలాలకు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటల్లో పాల్గొనే వారు రూ.20 లక్షలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు. అప్పట్లో నలుగురు గుత్తేదారులు డిపాజిట్ చెల్లించి వేలంపాటలకు హాజరయ్యారు. అయితే ఆలయం వేలం పాట రూ.50 లక్షలుగా ప్రకటించడంతో సదరు గుత్తేదారులు వేలం పాడకుండానే వెళ్లిపోయారు. మళ్లీ గత ఏడాది డిసెంబరు 13న వేలం పాటలు నిర్వహించడంతో ఒకే ఒక గుత్తేదారు హాజరయ్యారు. దీంతో అధికారులు సదరు వేలంపాటలను రద్దుచేశారు. మళ్లీ డిసెంబరు 23న తలనీలాల సేకరణ కోసం వేలపాటలు నిర్వహించారు. నలుగురు గుత్తేదారులు హాజరయ్యారు. ఇందులో ప్రకాశం జిల్లా అద్దంకికి చెందిన గుత్తేదారు రాజు రూ.56.50 లక్షలకు వేలం పాడారు. అయితే తాము అనుకున్న మేరకు దేవస్థానానికి డబ్బులు రాలేదని చెబుతూ అధికారులు మళ్లీ టెండర్లను రద్దు చేశారు. దీంతో చివరగా డిసెంబరు 28న భక్తుల తలనీలాల సేకరణకు వేలంపాట నిర్వహించారు. మళ్లీ ఒకే ఒక గుత్తేదారు హాజరు కావడంతో ఆ వేలం పాటలను అధికారులు రద్దు చేశారు. ఈ నేపథ్యంలో కొత్త ఏడాది ప్రారంభం రోజు అయిన సోమవారం అద్దంకికి చెందిన రాజు వచ్చి మూడో సారి తాను వేలంపాటలకు వచ్చిన సందర్భంలో రూ.56.50 లక్షలకు పాట పాడానని, ప్రస్తుతం ఇది తనకే ఇవ్వాలని కోరారు. ఈ మేరకు దేవస్థాన ఛైర్మన్, పాలక మండలి సభ్యులు, అధికారులు చర్చించి సదరు గుత్తేదారుకు రూ.60.05 లక్షలకు వేలం కట్టబెట్టారు. గత ఏడాది తలనీలాల వేలం ద్వారా రూ.65.55 లక్షలు రాగా, ఈ ఏడాది రూ.5.50 లక్షల మేర తగ్గినట్లు అయ్యింది. ఈ వ్యవహారంలో అక్రమాలు చోటు చేసుకున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఆలయ సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్‌ను వివరణ అడగ్గా భక్తుల తలనీలాల సేకరణ కోసం నాలుగు పర్యాయాలు టెండర్లు నిర్వహించగా సరైన రీతిలో ఆదాయం లేకపోవడం, ఒకే ఒక గుత్తేదారు వేలంలో పాల్గొనడం వల్ల ఆ వేలాన్ని రద్దు చేశామని తెలిపారు. కొత్త ఏడాది ప్రారంభం కావడం వల్ల పాలక మండలి, అందరం కలిసి చర్చించి ప్రకాశం జిల్లా వాసికి వేలంపాట హక్కును కట్టబెట్టామని తెలిపారు. ఈ విషయాలన్నింటిపై రాష్ట్ర దేవాదాయ కమిషనర్‌కు నివేదిక పంపుతామన్నారు. ఎలాంటి అక్రమాలకు తావులేదని ఆయన పేర్కొన్నారు.

బద్వేలు

బియ్యం పత్రాల కోసం దరఖాస్తు చేసుకోండి

గోపవరం, న్యూస్‌టుడే: జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో బియ్యంపత్రాలు లేనివారు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దారు నరసింహులు పేర్కొన్నారు. ప్రభుత్వం అర్హులకు పంపిణీ చేయటానికి వీలుగా నోడల్ అధికారికి 100 పత్రాల మంజూరుకు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు.

తెదేపా కార్యకర్త కుటుంబాన్ని ఆదుకుంటాం

బి.కోడూరు (బద్వేలు గ్రామీణ), న్యూస్‌టుడే: బి.కోడూరు మండలం అమ్మవారుపేటలో సోమవారం మృతి చెందిన తెదేపా కార్యకర్త కేశవయ్య మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే కె విజయమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబసభ్యులకు ఆమె ధైర్యం చెప్పారు. చంద్రన్న బీమా కింద మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరపున అందే రూ. 2 లక్షలు గాకుండా తాను సొంతంగా మరో రూ. 2 లక్షలు ఆర్థిక సహాయం చేస్తానని ప్రకటించారు.

అటల్ టింకరింగ్ పథకానికి ఎంపిక



పథకానికి ఎంపికైన బద్వేలు బాలుర ఉన్నత పాఠశాల

బద్వేలు, న్యూస్‌టుడే: కడప జిల్లాలోని రెండు సాంఘిక సంక్షేమశాఖ, ఒక బాలుర ఉన్నత పాఠశాల కేంద్ర ప్రభుత్వం అమలు చేయ సంకల్పించిన అటల్ టింకరింగ్ ల్యాబ్స్ పథకానికి ఎంపికైంది. ఇందులో ఒకటి బద్వేలు బాలురోన్నత పాఠశాల. మరో రెండు రైల్వేకోడూరులోని ఎస్టీ మినీ గురుకుల, దేవపట్ల సాంఘిక సంక్షేమ పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు కేంద్రప్రభుత్వం ఏటా పది లక్షలు మంజూరు చేస్తుంది. ఐదేళ్లపాటు ఈ పథకం అమలులో ఉంటుందని, యాభై లక్షలు ప్రభుత్వం వ్యయం చేస్తుందని ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

లక్ష్యం నిర్దేశించుకుని చదవండి



విద్యార్థినులతో ఎస్సై మహమ్మద్‌రఫీ

అట్లూరు, న్యూస్‌టుడే : కస్తూరిబా బాలికలు లక్ష్యంతో చదివితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ఎస్సై మహమ్మద్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కస్తూరిబా పాఠశాలలో కేక్‌ను విద్యార్థులకు పంచిపెట్టారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు పదికిపది పాయింట్లు సాధించాలని కోరారు.

కాలమానిని ఆవిష్కరణ

బద్వేలు, న్యూస్‌టడే: బద్వేలు బాలుర ఉన్నతపాఠశాలలో సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో కాలమానిని ప్రధానోపాధ్యాయులు పుల్లయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శశిధర్, చక్రపాణి, దస్తగిరి, ఆచారి, సత్యనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్న నిర్మాణంలోని ఇల్లు మండల కేంద్రమైన అట్లూరులోని జంగా సీతరామయ్యది. మూడ నెలల క్రితం నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఇప్పటి వరకు పైకప్పు వరకు పని జరిగింది. రూ. లక్షన్నర బిల్లుకుగాను గృహనిర్మాణ సంస్థ అధికారుల నుంచి రూ. 39 వేలే అందింది. మిగిలిన బిల్లు రాలేదు. వడ్డీకి అప్పు తెచ్చి ఇంటి నిర్మాణ పనులను మొదలు పెట్టారు. బిల్లు సకాలంలో అందని కారణంగా నిర్మాణ పనులు కుంటుపడుతున్నాయని ఆయన ఆవేదన చెందుతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న నిర్మాణంలోని గృహం కలసపాడులోని వెంకటసుబ్బయ్యది. మూడు నెలల క్రితం పునాదులు తవ్వి గోడల వరకు ఇంటి పని పూర్తి చేశాడు. వడ్డీకి రూ. 60 వేలు అప్పుతెచ్చి పనులు చేయగలిగారు. రెండు విడతలుగా అందాల్సిన బిల్లు గృహనిర్మాణ సంస్థ అధికారులు అందించ లేదు. దీంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. బిల్లులను చెల్లించాలని లబ్ధిదారుడు కార్యాలయానికి వెళ్లి విజ్ఞప్తి చేసినా అధికారులు మీనమేషాలను లెక్కిస్తున్నారు.



ముందుకు సాగని గృహ నిర్మాణాలు

- అందని బిల్లులు
- ఆపై ఇసుక కొరత
- బద్వేలు నియోజకవర్గం పరిస్థితి

మనిషికి తిండి, గుడ్డ తరువాత అతిముఖ్యమైంది ఇల్లు. ప్రతి కుటుంబం ఇల్లు కలిగి ఉండేలా చూడటంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నాయి. దీంతో వేల కుటుంబాలు సొంతింటికి దూరమయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు పేదలకు నివాసాలు కల్పించేందుకు ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కూడా వివిధ కారణాల వల్ల ఆశించిన రీతిలో ఆచరణకు నోచుకోలేదు.

బద్వేలు, కాశినాయన న్యూస్‌టుడే: బద్వేలు నియోజకవర్గంలో ఎన్‌టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం అమలు ప్రహసనంగా మారింది. 2017-18 సంవత్సరానికి ఈ పథకం కింద 1600 ఇళ్లు నియోజకవర్గానికి మంజూరయ్యాయి. ఇందులో 474 ఇళ్లు వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయి. 91 ఇళ్ల నిర్మాణం పూర్తి అయింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు ప్రభుత్వం లక్షన్నర చెల్లిస్తోంది. పెరిగిన ధరల కారణంగా ఈ ఆర్థిక సాయం చాలక ఇంటి నిర్మాణాలు అర్థాంతరంగా ఆగాయి. వాటిని పూర్తి చేసుకోవటానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక, ఇటుకలు, సిమెంటు, ఇనుము, భవన కార్మికుల కూలీ ధరలు పెరగడంతో పేద కుటుంబాలు ఇళ్లను పూర్తి చేసుకోవటానికి అష్టకష్టాలు పడుతున్నారు. గృహ నిర్మాణ సంస్థ అధికారుల అంచనా ప్రకారం ఒక ఇంటిని నిర్మించుకోవాలంటే రూ. 2,44,000 వరకు అవుతుంది.

కొన్ని మండలాల్లో బిల్లులు సకాలంలో చెల్లించక లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎక్కువగా కలసపాడు మండలం లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందక ఎదురుచూస్తున్నారు.

వివరాలు

బద్వేలు నియోజకవర్గంలో ఎన్‌టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణాలు

మండలం	మంజూరైనవి	నిర్మాణంలోనివి	పూర్తి అయినవి
అట్లూరు	200	79	13
బి.కోడూరు	170	59	10
బద్వేలు	145	52	10
గోపవరం	171	48	02
కలసపాడు	234	70	29
పోరుమామిళ్ల	469	119	22
కాశినాయన	211	47	05
మొత్తం	1600	474	91

200 అడుగుల ఇంటి నిర్మాణానికి అయ్యే వ్యయం

ఇటుకలు 6000	రూ.48,000
ఇనుము 150 కిలోలు	రూ 6,000
80 బస్తాలు సిమెంటు	రూ.20,000
ఇసుక 4 ట్రాక్టర్లు	రూ. 20,000
లేబర్, ఇతర ఖర్చులు	రూ. 1,50,000
మొత్తం	రూ 2,44,000

బిల్లు సకాలంలో చెల్లించలేదు

మూడు నెలల క్రితం పునాది వేసి గోడల వరకు ఇల్లు నిర్మించుకున్నా. రెండు విడతలగా ఇవ్వాల్సిన బిల్లు ఇంతవరకు చెల్లించలేదు. అధికారులను వెళ్లి అడిగితే ఇస్తామంటూ తిప్పుతున్నారు. ఇప్పటి వరకు ఇంటికి అరవైవేలు వ్యయం అయింది. వడ్డీకి అప్పుతెచ్చి పెట్టా. అధికారులు సకాలంలో బిల్లులను చెల్లిస్తే ఇంటి నిర్మాణ పనులను త్వరితగతిన చేసుకుంటాం.

- వెంకటసుబ్బయ్య, కలసపాడు

ఇబ్బందులుంటే తెలపండి




ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఏవైనా ఇబ్బందులుంటే నా దృష్టికి తీసుకురండి. ఇబ్బందులు తీరుస్తా. బిల్లులు ఇవ్వక పోతే నాకు తెలియచేస్తే చాలు వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసకుంటాం. ఇసుక కొరత ఉంది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. దీనికి త్వరలో పరిష్కారం దొరుకుతుంది.

- ప్రసాద్, గృహనిర్మాణ సంస్థ డీఈఈ బద్వేలు

చర్చిలో సామూహిక ప్రార్థనలు



ప్రాచీన చర్చిలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



చెన్నారెడ్డిపల్లె ఆర్సీఎం చర్చి వద్ద నూతన సంవత్సర వేడుకల్లో భక్తుల సందడి

కలసపాడు, న్యూస్‌టుడే : మండలంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా సోమవారం వివిధ గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు సామూహిక ప్రార్థనలు చేశారు. చర్చిలను రంగురంగుల విద్యుత్తుదీపాలతో అందంగా అలంకరించారు. కలసపాడు, చెన్నారెడ్డిపల్లె ఆర్సీఎం, ప్రాచీన సీఎస్ఐ చర్చిలకు వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో క్రైస్తవులు తరలివచ్చారు. సామూహిక ప్రార్థనలు, గుడిప్రదక్షణలు చేశారు. ఫాదర్లు మరియదాస్, సతీష్, ఎన్. ప్రకాష్, డీనరీ ఛైర్మన్ జి. జాకోబ్ భక్తులకు సందేశమిచ్చారు. క్రైస్తవులు పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు



మాజీ ఎమ్మెల్యే కె విజయమ్మను పూలమాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా సోమవారం వివిధ మండలాలకు చెందిన తెదేపా నాయకులు, కార్యకర్తలు, అధికారులు కార్యాలయానికి తరలివచ్చి మాజీ ఎమ్మెల్యే కె. విజయమ్మకు శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా చింతపుత్తాయపల్లెకు చెందిన బైసాని సుబ్బారెడ్డికి మంజూరైన రైతురథం ట్రాక్టరును ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్ ఎస్. పార్థసారథి, తెదేపా నాయకులు బి. రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, బి. వీరారెడ్డి, పల్లెం యల్లారెడ్డి, మునిరెడ్డి, జహంగీర్, బిగ్‌బాస్, మండలాధ్యక్షులు, కౌన్సిలర్లు, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమానత్వ సాధనే సేవా సమితి లక్ష్యం


దువ్వూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చూసి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే జై భీమ్ సామాజిక సేవా సమితి లక్ష్యమని ఆ సమితి అధ్యక్షుడు బి.ఎస్.జయరాం అన్నారు. ఎంపీడీవో సభా భవనంలో సోమవారం జైభీమ్ సేవా సమితి సంస్థ ఆవిష్కరణ, సమావేశం నిర్వహించారు. డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి బడిలో చేర్చుట, వృద్ధులకు చేయూత, దివ్యాంగుల హక్కుల సాధనకు కృషి, ఇళ్లులేని పేదలకు స్థలాలు మంజూరు చేయించడం తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

బద్వేలులో మార్కెట్ ధరలు (నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
టమోటాలు	10
పచ్చిమిరప	30
బెండకాయలు	24
కాకరకాయలు	32
మటిక్కాయలు	30
క్యాబేజీ	30
క్యారెట్	50
దొండకాయలు	30
చిక్కుడు	40
ఉర్లగడ్డ	30
బీరకాయలు	30
ఉల్లిపాయలు	50
వంకాయలు	24
బీట్‌రూట్	80
బంగాళదుంప	20
క్యాలీఫ్లవర్	50
అల్లం	50
కాకరకాయలు	32

మాంసం ధరలు



	కిలో (రూ)
మటన్	400
చికెన్	120
100 గుడ్లు	400
డజను గుడ్లు	52
చేపలు	100

తెరపై ఈనాడు

శేఖర్ : 10
కేజీఎన్ : హలో
నౌషాద్ : ఎంసీఏ(మిడిల్ క్లాస్‌అబ్బాయి)
పోరుమామిళ్ళ : శ్రీదేశాయి : ఎంసీఏ,
వెంకటేశ్వరా : హలో

పూర్తి వివరాలతో దరఖాస్తులు

పోరుమామిళ్ల: అర్హులైన పేదలు బియ్యం పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు శేషారామ్‌సింగ్ తెలిపారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పత్రాలు లేని పేదలు, చెంచులు, హిజ్రాలు, సంచార జీవనం చేసేవారు, ఎస్సీ, ఎస్టీలు పూర్తి వివరాలతో మండల నోడల్ అధికారికి దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. అర్హతను అనుసరించి పత్రాలు మంజూరు చేస్తారని వివరించారు.

బద్వేలు

అత్యవసర సేవలకు 108


చుక్కనీరు లేని బద్వేలు పెద్దచెరువు

గుండె చెదిరిన పెద్దచెరువు

❖ వేయి ఎకరాల్లో వరిపంటకు నీటి కొరత ❖ బొక్కినేరు వద్ద నీటి నిలుపుదల
❖ వీరారెడ్డి ఎడమకాల్వకు నీటి ప్రవాహం తగ్గుదల

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలోనే అతి పెద్దచెరువైన బద్వేలు పెద్ద చెరువుకు కష్టమొచ్చింది. ప్రస్తుతం చెరువులో చుక్క నీరు లేదు. ఈచెరువు కింద సుమారు 1000 ఎకరాలకు పైగా వరి సాగుచేశారు. రైతులకు వరి పంట దక్కాలంటే మరో రెండు నెలలు నీరు అవసరం అవుతుంది. ఇప్పటి వరకు పెద్దచెరువులోకి చేరిన వర్షపు నీరే వరిపంటకు ఆధారంగా ఉంది. ప్రస్తుతం చెరువులో నీరు అయిపోవడంతో పది రోజుల నుంచి వరి పంట ఎండుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గొట్టపు బావులున్న వారు మాత్రం పంటను కాపాడుకుంటున్నారు. గొట్టపుబావులు లేనివారు పంటను ఎండబెట్టుకుంటున్నారు. బ్రహ్మంసాగర్ నుంచి వీరారెడ్డి ఎడమకాల్వకు ప్రస్తుతం 150 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోంది. బి.కోడూరు మండలంలోని బొక్కినేరు వద్ద అక్కడి రైతులు నీటిని చెరువులకు మళ్లించుకుంటున్నారు. 150 క్యూసెక్కుల నీటిని పోరుమామిళ్ల చెరువుకు పంపిస్తున్నారు. తెలుగుగంగ నీరు వస్తుందన్న ఆశతో బి.కోడూరు, బద్వేలు మండలాల్లోని రైతులు వందల ఎకరాల్లో వరి సాగుచేశారు. ప్రస్తుతం వీరారెడ్డి ఎడమ కాల్వ ద్వారా తెలుగుగంగ ఉన్నతాధికారులు 150 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. పోరుమామిళ్ల చెరువుకు మాత్రమే ఈ నీటిని పంపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బద్వేలు పెద్దచెరువుకు నీరు వచ్చే అవకాశం కనిపించడం లేదు. గతంలో ఎడమ కాల్వకు విడుదల చేసిన నీటితో బి.కోడూరు మండలంలోని చెరువులు కొన్ని నిండాయి. రామసముద్రం చెరువుకు నీరు వచ్చింది. మేకవారిపల్లె, పెదుళ్లపల్లె చెరువులకు ఎడమ కాల్వ ద్వారా నీరు వదిలితే అవి నిండి బద్వేలు పెద్దచెరువుకు నీరు సరఫరా అవుతుంది. అయినా తెలుగుగంగ ఉన్నతాధికారులు ఎడమకాల్వకు బ్రహ్మంసాగర్ నుంచి 150 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. ఎడమ కాల్వ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని బొక్కినేరు ద్వారా బద్వేలు పెద్దచెరువు, పోరుమామిళ్ల చెరువులకు నీరు అందిస్తే సాగులోని వరిపంటను కాపాడుకోవచ్చు. ఈ రెండు మండలాల రైతుల ఇబ్బందులపై ఎమ్మెల్యే టి జయరాములును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తెలుగుగంగ ఉన్నతాధికారులు, కలెక్టర్‌ను కలిసి ఎడమకాల్వ ద్వారా 800 క్యూసెక్కుల నీరు విడుదల చేయిస్తామని చెప్పారు. బద్వేలు పెద్దచెరువుకు నీరు అందించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.


లక్ష్మీపాళెం పరిధిలో పొట్టతో ఉన్న వరిపంట


సీఎం దృష్టికి తీసుకెళ్లి విడుదల చేయిస్తాం



బ్రహ్మంసాగర్ నుంచి వీరారెడ్డి ఎడమకాల్వకు 800 క్యూసెక్కులకు తక్కువ కాకుండా నీటిని విడుదల చేయించేందుకు ఈనెల 3వతేదీ పులివెందులకు వచ్చే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి సమస్యను వివరిస్తాం. బొక్కినేరు నుంచి బద్వేలు పెద్దచెరువుకు తప్పకుండా నీటిని విడుదల చేయిస్తాం. కుడికాల్వకు కూడా 200 క్యూసెక్కులకు తక్కువ కాకుండా నీటిని విడుదల చేయిస్తాం.


- కె విజయమ్మ, మాజీ ఎమ్మెల్యే, బద్వేలు.

నీరు విడుదల చేయాలి



బ్రహ్మంసాగర్ నుంచి వీరారెడ్డి ఎడమకాల్వ ద్వారా 800 క్యూసెక్కుల నీరు విడుదల చేసి బద్వేలు పెద్దచెరువుకు అందించాలి. పెద్దచెరువు కింద సుమారు 1000 ఎకరాలకు పైగా వరి సాగుచేశారు. పదిరోజులుగా నీరు లేక పంట ఎండిపోతోంది. విడుదల చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చుపెట్టారు. నీటి విడుదల కోసం మాజీ ఎమ్మెల్యే కె విజయమ్మతో కలసి కలెక్టర్‌ను, అధికారులను కలుస్తాం. పెద్దచెరువుకు నీటిని విడుదల చేస్తే బద్వేలు మండలంలో సాగు, తాగునీటిసమస్య తీరుతుంది. **- బి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ, బద్వేలు మండలం**

సాగు నీటికోసం ఇబ్బంది పడుతున్నాం



బద్వేలు పెద్దచెరువులో చుక్కనీరు లేదు. లక్ష్మీపాళెం పరిధిలో సాగు చేసిన వరి పంట ఎండిపోతోంది. గొట్టపుబావులు ఉన్నవారు పంటను కాపాడుకుంటున్నారు. గొట్టపుబావులు లేని మేము పంటను ఎండబెట్టుకుంటున్నాము. పెద్దచెరువులో రెండు మాసాలు నీరు ఉన్నందున బద్వేలు పెద్దచెరువు పరిధిలో మాలాంటి చాలా మంది రైతులు వరి సాగుచేశారు. ప్రస్తుతం చెరువులో నీరు లేనందున రైతులు చాల ఇబ్బంది పడుతున్నారు. తక్షణం పెద్దచెరువుకు నీటిని విడుదల చేయాలి **- గోపాలయ్య, లక్ష్మీపాళెం**

నేటి నుంచి జన్మభూమి మాఊరు

కాశినాయన న్యూస్‌టుడే: కాశినాయన మండలంలో మంగళవారం నుంచి జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు బాధ్య ఎంపీడీవో సుజన్ కుమార్ తెలిపారు. 2న అమగంపల్లె, ఇటుకులపాడు, 3న రంపాడు, సావిశెట్టిపల్లె, 4న కోడిగుడ్లపాడు, ఆకులనారాయణపల్లె, 5న కొండ్రాజుపల్లె, వరికుంట్ల, 6న వడ్డమాను, గొంటువారిపల్లె, 7న కత్తెరగండ్ల, 8న బాలాయపల్లె, 9న గంగనపల్లి, 10న ఉప్పలూరు, 11న నరసాపురం గ్రామాల్లో నిర్వహిస్తామని తెలిపారు.

నేడు కొంగళవీడులో జన్మభూమి:

బి.కోడూరు(బద్వేలు గ్రామీణ): మండలంలోని కొంగళవీడు గ్రామంలో మంగళవారం జన్మభూమి- మాఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేష్ తెలిపారు. ఈకార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. పంచాయతీ పరిధిలోని ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. వినతిపత్రాల్లో ఆధార్, చరవాణి సంఖ్య తప్పనిసరిగా వేయాలని ఆయన పేర్కొన్నారు.

జన్మభూమి- మాఊరు కార్యక్రమం:

బి.కోడూరు (బద్వేలు గ్రామీణ), న్యూస్‌టుడే: బి.కోడూరు మండలంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని ఎంపీడీవో మల్లయ్య తెలిపారు. 2న మండలంలోని తుమ్మలపల్లె, 3న తంగెడుపల్లె, 4న ప్రభలవీడు, 5న పెద్దుళ్లపల్లె, 6న పాయలకుంట, 7న బి.కోడూరు, 8న ఐత్రంపేట, 9న మేకవారిపల్లె, 10న మున్నెలి, 11న పాపనపల్లె పంచాయతీల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.


గోపవరం ఎంఈవోకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు


గోపవరం: ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీడీవో, సర్పంచులు, సిబ్బంది


పోరుమామిళ్ల: ఏపీటీఎఫ్ కాలమానిని ఆవిష్కరిస్తున్న ఎంఈవో రఘురాములరెడ్డి

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: పోరుమామిళ్ల పట్టణంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి స్వగృహంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకును కట్ చేశారు. అనంతరం కార్యకర్తలు ఆయనకు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గం సమన్వకర్త వెంకటసుబ్బయ్య, వైకాపా నాయకులు పాల్గొన్నారు. ఎస్టీయూ, ఏపీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

❐ స్థానిక తెదేపా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు కార్యకర్తలు బాణసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు. తెదేపా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని కేకును కట్ చేశారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. ఈమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏపీటీఎఫ్, ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని గ్రామాల నుంచి కార్యకర్తలు హాజరయ్యారు. అమెను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

❐ ఎంఈవో రఘురాములరెడ్డిని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీయూ, ఏపీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు కాలమనినిలను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వివిధ ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీలక్ష్మీవేంకటేశ్వర, కన్యకాపరమేశ్వరి, షిర్డిసాయిబాబా, టేకూరుపేట, సిద్ధవరం, మద్దిమాను గుర్రప్పస్వామి అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు. ఈ ఆలయం కమిటీలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కలసపాడు: మండలంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను స్థానికులు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుని ఆనందంలో మునిగిపోయారు. యోవేవి పాలకమండలి సభ్యురాలు ఎన్.డి. విజయజ్యోతి, హోమియో వైద్యాధికారి విజయకుమార్ దంపతులను తెదేపా శ్రేణులు పెద్దపాటి పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పలు పాఠశాలల విద్యార్థులు, యూత్ స్థానిక పోలీసుస్టేషన్‌ను సందర్శించి ఎస్సై వెంకటరమణ, పోలీసులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా పర్యవేక్షించిన ఎస్సై వెంకటరమణను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ముద్దంవారిపల్లె యూత్ అధ్యక్షుడు చిరంజీవి, కన్వీనరు శౌరీ, కోకన్వీనరు హృదయరాజ్ పాల్గొన్నారు.

బద్వేలు గ్రామీణ: బద్వేలు మండలంలోని వివిధ ఆలయాల్లో సోమవారం నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీపాళెంలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి, చెన్నంపల్లె శ్రీఆదిచెన్నకేశవస్వామి

గోపవరం: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి, తెదేపా నాయకులు, ఎంపీపీ శిరీష భర్త ప్రభాకర్‌రెడ్డికి ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. సర్పంచులు శ్రీనివాసులరెడ్డి, జయరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీలు సాంబశివారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సూపరిండెంట్ నాగార్జునుడు, పంచాయతీ కార్యదర్శులు విజయ్‌కుమార్, వెంకటలక్షుమ్మ, వెంకటసుబ్బయ్య, మోషెలతో పాటు తెదేపా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారి చెన్నయ్యను ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

గాంధీనగర్‌లోని రామాలయం వద్ద నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా సిద్దయ్య కోలాట బృందం ఆధ్వర్యంలో చిన్నారులు కోలాటం అలరించింది.


పోరుమామిళ్ల: ప్రత్యేక అలంకరణలో సాయిబాబా


పోరుమామిళ్ల: శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి


కలసపాడు: విజయజ్యోతిని శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా శ్రేణులు


లక్ష్మీపాళెం శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలందుకున్న శ్రీవారు

జమ్మలమడుగు

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు

ముద్దనూరు(ఎర్రగుంట్ల), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈనెల 2 నుంచి జరిగే 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమంలో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు ఎస్.రమ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉంటూ రేషన్‌కార్డుల్లేని అర్హులకు సుమారు 100 కార్డులు మంజూరు చేసేందుకు ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చారని ఆమె తెలిపారు. కార్డుల్లేని అర్హులైన పేదవారు, బడుగువర్గాల వారు, సంచార జీవనం చేసే షెడ్యూల్డు తెగలవారు తదితరులు తమ పూర్తి వివరాలతో మండల నోడల్ అధికారికి అర్జీలు ఇవ్వాలని ఆమె చెప్పారు. దరఖాస్తుతోపాటు కుటుంబసభ్యుల బృంద చిత్రం, కుటుంబసభ్యుల ఆధార్ నకళ్లు, విద్యుత్తు బిల్లు లేదా ఎన్నికల గుర్తింపు పత్రాలు అందజేయాలన్నారు. అర్హత కలిగిన వారిని గుర్తించి కొత్త రేషన్‌కార్డులు మంజూరుచేస్తారని ఆమె స్పష్టంచేశారు.

మదరసాలో అన్నదానం

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కనున్న మదరసా ఏరియాజుల్ ఉలూం వద్ద సోమవారం రిటైర్డ్ ఎస్సై షేక్ మియా ఉద్యోగ విరమణ సందర్భంగా 120 మంది విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు.

రాత్రైతే చాలు వాలిపోతున్నాయ్..!

- మైలవరం మండలంలో ఆగని ఇసుక అక్రమ రవాణా
- రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా తరలిపోతున్న ఇసుక
- కర్నూలు జిల్లాలో ఒక్కో ట్రాక్టరు రూ.10 వేల చొప్పున విక్రయాలు




నదిలో ట్రాక్టర్లు వెళ్లకుండా అడ్డుగా ఏర్పాటుచేసిన గుంత .. నిషేధిత ప్రాంతంలో అక్రమ తవ్వకాల ఆనవాళ్లు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: మైలవరం మండలంలో ఇసుక అక్రమ రవాణా రాత్రి వేళల్లో యథేచ్ఛగా సాగుతోంది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్‌లలో ఇసుకను తీసుకెళ్లాలనే నిబంధనలున్నాయి. వీటికి విరుద్ధంగా రాత్రివేళల్లో పెన్నానది నిషేధిత ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ప్రతి రాత్రి 40 నుంచి 50 ట్రాక్టర్ల ఇసుక కర్నూలు జిల్లాకు తరలిపోతున్నట్లు సమాచారం. మైలవరం మండలం దొమ్మరనంద్యాల సమీపంలో పెన్నానదిని అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్ నుంచి కాకుండా రహదారికి సమీప ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్ల ట్రాలీకి చెక్కలు అమర్చి తీసుకెళ్తున్నారు. పెన్నానదిలో ఏర్పడిన పెద్ద పెద్ద గోతులే అందుకు నిదర్శనం. ప్రతి రోజు రాత్రి 8 గంటలు దాటిన తర్వాత పెద్ద ఎత్తున ట్రాక్టర్లు పెన్నానదిలో వాలిపోతున్నాయి. అర్ధరాత్రి 12 గంటల వరకు ఇసుకను నింపేసుకొని రోడ్డు ఎక్కుతున్నారు. రోజూ ఒకే దారిలో కాకుండా వేర్వేరు దారుల్లో ఇసుకను కర్నూలు జిల్లాకు తీసుకెళ్తున్నారు. ఆ జిల్లాలో పెన్నానది ఇసుకకు మంచి గిరాకీ ఉండడంతో ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.10 వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. స్థానిక ప్రజలు ట్రాక్టర్లు నదిలో వెళ్లకుండా గుంతలు ఏర్పాటుచేసినా.. తరలింపుదారులు వేరే దారులు తయారుచేసుకుని ఇసుకను తీసుకెళ్తున్నట్లు స్థానిక ప్రజలు చెబుతున్నారు. పోలీసులు, మైనింగ్ అధికారులు దృష్టి సారించకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక తరలకుండా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

నిఘా ఏర్పాటుచేస్తాం



పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలకుండా నిఘా పెంచుతున్నాం. ఇటీవల పెద్దముడియం మండలం గుండ్లకుంట వద్ద 11 ఇసుక ట్రాక్టర్లను సైతం పట్టుకున్నాం. గూడెంచెరువు సమీపంలోనూ మరికొన్ని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నాం. రాత్రి వేళల్లో నిఘా పెంచి ఇసుక తరలకుండా అడ్డుకట్ట వేస్తాం.

- కె.కృష్ణన్, జమ్మలమడుగు డీఎస్పీ.

వైకాపా కొండాపురం పట్టణ అధ్యక్షునిగా వాసుదేవరెడ్డి



కొండాపురం, న్యూస్‌టుడే: వైకాపా కొండాపురం పట్టణ అధ్యక్షునిగా కొండు వాసుదేవరెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయని వాసుదేవరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ పార్టీ అధిష్టానవర్గం తమ సేవలను గుర్తించి పట్టణ అధ్యక్షునిగా నియమించినట్లు పేర్కొన్నారు. అలాగే మండల మైనార్టీ సెల్ అధ్యక్షునిగా షేక్ అబ్దుల్‌ఖాదర్‌ను, మండల యువజన విభాగ అధ్యక్షునిగా లక్ష్మీకాంత్‌రెడ్డిని నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి, అబ్దుల్‌ఖాదర్‌లు మాట్లాడుతూ తమ సేవలను గుర్తించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు.

సంక్రాంతి చంద్రన్న కానుకల పంపిణీ



చంద్రన్న కానుకలను అందిస్తున్న జయరామిరెడ్డి తదితరులు

పోట్లదుర్తి(ఎర్రగుంట్ల), న్యూస్‌టుడే: మండలపరిధిలోని పోట్లదుర్తిలో సోమవారం సంక్రాంతి చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. తెదేపా నాయకుడు సి.జయరామిరెడ్డి కార్డుదారులకు ఉచిత కానుకలను అందజేశారు. కొత్త సంవత్సరంలో పేదలు సంక్రాంతి పండుగను సంతోషంగా, ఆనందంగా జరపడానికి ప్రభుత్వం ఉచితంగా చంద్రన్న కానుకలను అందజేస్తోందని ఆయన తెలిపారు. చౌకదుకాణం - 31లోని కార్డుదారులు 800 మందికి చంద్రన్న కానుకలు వచ్చినట్టు డీలరు శివారెడ్డి పేర్కొన్నారు.

నేటి నుంచి 'జన్మభూమి - మాఊరు'

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు మండలంలో మంగళవారం నుంచి 'జన్మభూమి - మాఊరు' కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీవో కె.శివకుమారి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 2న కలమల్ల, 3న ఇల్లూరు, చిన్నదండ్లూరు, 4న నిడిజువ్వి, వలసపల్లె, 5న మాలేపాడు, చిర్రాజుపల్లె, 6న చిలంకూరు, 7న పోట్లదుర్తి, 8న సున్నపురాళ్లపల్లె, కదిరివారిపల్లె, 9న పి.వెంకటాపురం, హనుమనగుత్తి, 10న పెద్దనపాడు, తిప్పలూరు, 11న తుమ్మలపల్లె, కోడూరు గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు.

విజయవంతం చేయండి

కొండాపురం: జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో అమర్‌నాథరెడ్డి కోరారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ 2వ తేది నుంచి 11వ తేది వరకు జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి రోజు మంగళవారం మండల పరిధిలోని బెడుదూరు, యనమలచింతల, బి.కొట్టాలపల్లె గ్రామ పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు దేవగుడిలో..

జమ్మలమడుగు గ్రామీణ: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని దేవగుడి, గొరిగెనూరు పంచాయతీల్లో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో నాగరాజు తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులందరూ పాల్గొంటారని, గ్రామాల్లోని సమస్యలకు అప్పటికప్పుడే పరిష్కార మార్గం చూపుతామన్నారు. మంగళవారం ఉదయం దేవగుడి, గొరిగెనూరు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఈ గ్రామ సభలు జరుగుతాయన్నారు.

నేడు ఒకటి, రెండు వార్డుల్లో

జమ్మలమడుగు : జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఒకటి, రెండు వార్డులకు సంబంధించి గ్రామ సభలు ఉంటాయని జమ్మలమడుగు నగర పంచాయతీ కమిషనర్ లక్ష్మీరాజ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఒకటో వార్డు, మధ్యాహ్నం 2 గంటలకు రెండో వార్డుకు సంబంధించిన గ్రామసభలు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్థానిక దిగువపట్నం కాలనీలో ఉచిత ట్యూషన్ కేంద్రంలోని విద్యార్థులకు సమత దళిత్ యునైటెడ్ కమిటీ ప్రతినిధులు కె.దేవదానం, పి.బాబు హాజరై బహుమతులను అందజేశారు. సమత దళిత్ యునైటెడ్ కమిటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆరేళ్లుగా ఉచితంగా ట్యూషన్ చెప్పిస్తున్నారు. ఏటా జనవరి 1న విద్యార్థులందరికీ బహుమతులను అందజేయడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. సోమవారం సాయంత్రం విద్యార్థులకు విద్యాసామగ్రితోపాటు ఇతర వస్తువులను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో బిర్రు సంతోష్, మర్రి ప్రకాశం, కౌన్సిలర్ మార్తమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో మార్కెట్ ధరలు (నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
టమోటాలు	10
పచ్చిమిరప	25
బెండకాయలు	30
మటిక్కాయలు	40
వంకాయలు	20
బీట్‌రూట్	40
బంగాళదుంప	20
కాకర	30
దొండకాయలు	40
అల్లం	50
చిక్కుడు	40
క్యారెట్	60
ఎర్రగడ్డలు	50
క్యాబేజీ	30
బీరకాయలు	50
బీన్స్	60
ముల్లంగి	30

మాంసం ధరలు



	కిలో (రూ)
మటన్	400
చికెన్	200
100 గుడ్లు	380
డజను గుడ్లు	50
చేపలు	100

తెరపై ఈనాడు

సాయిరాం : హలో
టి.పి.ఆర్ : 2 కంట్రీస్
టి.ఎన్.ఆర్ : ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయ్)
ఎర్రగుంట్ల : హేమ: ఎం.సి.ఎ.
వెంకటేశ్వర: 2 కంట్రీస్

సుస్థిర జీవనోపాధితోనే అభివృద్ధి

మైలవరం, న్యూస్‌టుడే: సుస్థిర జీవనోపాధితోనే అభివృద్ధి సాధ్యమని దాల్మియా పరిశ్రమ అధిపతి అనిల్‌బజాజ్ పేర్కొన్నారు. సోమవారం దాల్మియా పరిశ్రమలో నవాబుపేట పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ పరిసర గ్రామాల్లో జీవనోపాధి కోసం సహకరిస్తామన్నారు. గత సంవత్సరకాలంలో పాల ఉత్పత్తిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. ఉత్తమ మహిళగా దండు మేరమ్మ, ద్వితీయ ఉత్తమ మహిళగా పట్నం రంగీలమ్మలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దాల్మియా టెక్నికల్ హెడ్ కరుణాకరన్, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఛైర్మన్ ప్రమీలమ్మ, దాల్మియా సిబ్బంది శ్రీనివాసులు, రాజేష్‌కుమార్, గురప్ప, నాగార్జున, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాల్మియా పరిశ్రమ అధిపతి అనిల్‌బజాజ్

15వ రోజుకు చేరిన నిరసనలు

ఆర్టీపీపీ (ఎర్రగుంట్ల), న్యూస్‌టుడే: ఆర్టీపీపీ విద్యుదుత్పత్తి కేంద్రంలో ఒప్పంద కార్మికులు చేస్తున్న నిరసనలు సోమవారానికి 15వ రోజుకు చేరాయి. ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు ఒప్పంద కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆర్టీపీపీ రెండో గేటు ఎదురుగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. విద్యుత్తు సంస్థల్లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఐదు డిమాండ్లను పరిష్కరించేవరకు సమ్మెబాటలో నడుస్తామని వారు తెలిపారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు తీసుకున్న కార్యాచరణను కార్మికులు విధిగా పాటిస్తూ నిరసనలు చేపట్టినట్టు వారు తెలిపారు. నాయకులు సాంబశివారెడ్డి, దేవగిరిరెడ్డి, విజయకుమార్, నాగార్జున్‌రెడ్డి, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేస్తున్న కార్మికులు

జమ్మలమడుగు

ఆరుతడి పంటల కోసం నీటిని విడుదలచేయాలి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ఆరుతడి పంటల కోసం మైలవరం జలాలను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని హెచ్ఎల్సీ ఛైర్మన్ శ్రీనివాసులరెడ్డి, న్యాయవాది మురళీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. మైలవరం ఉత్తర, దక్షిణ కాలువలకు నీళ్లు వదిలితే ఆరుతడి పంటలకు జీవం పోసినట్లు అవుతుందన్నారు. ప్రస్తుతం మైలవరం జలాశయంలో ఆరున్నర టీఎంసీలకు పైగా నీరున్నట్టు పేర్కొన్నారు.





రోడ్లు, భవనాలశాఖ అతిథిగృహం ఆవరణలో పచ్చదనం ఇలా.... రెవెన్యూ కార్యాలయం ఎదుట వృక్షాలు... ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో...

సేదదీర్చుతున్న పచ్చదనం

- ◆ నాటి అధికారుల స్ఫూర్తిని నేటి తరం అందిపుచ్చుకోవాలి
- ◆ అవసరమైన అన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటాలి



కొండాపురం జిల్లాపరిషత్తు పాఠశాలలో..

కొండాపురం, న్యూస్‌టుడే: స్థానిక కొండాపురంలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు పచ్చదనానికి నిలయాలుగా మారాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి అనేక సమస్యలతో సర్కారు కార్యాలయాలకు వచ్చే ప్రజలకు నీడనిస్తూ, వారు సేదదీరేలా ఇక్కడున్న చెట్లు ఉపకరిస్తున్నాయి. వివిధ పనులపై మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు ఈ చెట్లు 'చల్లటి' ఉపశమనాన్ని ఇస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద పెద్ద పెద్ద పచ్చని వృక్షాలున్నాయి. మండల పరిషత్తు, తహసీల్దారు కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాల, జిల్లా పరిషత్ పాఠశాల, పోలీసు సర్కిల్ కార్యాలయం, రోడ్లు, భవనాలశాఖ అతిథిగృహం తదితరాల వద్ద సుమారు 100కు పైగా పెద్ద చెట్లున్నాయి. ఇవి నీడతో పాటు చల్లని గాలులను ఇస్తున్నాయి. నాటి అధికారుల పర్యవేక్షణలో ఎదిగిన ఈ మొక్కలు ఇప్పుడు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. నాటి అధికారుల స్ఫూర్తిని అందిపుచ్చుకొని నేటి అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, వైద్యశాలల ఉద్యోగులు తదితరులు కూడా చెట్లు లేని అనేక కార్యాలయాలు, బడులు, వైద్యకేంద్రాలు తదితరాల వద్ద, అవసరమైన ఇతర ప్రాంతాల్లో, రోడ్ల పక్కన విరివిగా మొక్కలను నాటి పెంచాల్సి ఉంది.



ఎంపీడీవో కార్యాలయం వద్ద నీడనిస్తున్న చెట్లు

శనగ పంటకు ఎండు తెగులు

65 రోజులకే కోతకు సిద్ధం

పెద్దముడియం, న్యూస్‌టుడే: శనగ పంటకు తెగులు సోకడంతో 20 రోజుల ముందే పంట నూర్పిళ్ల దశకు వచ్చింది. పంటకాలం 90 నుంచి 100 రోజులు పడుతుండగా.. 65 రోజలకే పైరు నూర్పిళ్ల దశకు చేరింది. మండల పరిధిలోని రైతులు ఎక్కువగా శనగ పంటపై ఆధారపడి జీవిస్తుండగా ప్రభుత్వం ఆ సంవత్సరం మండలానికి 9 వేల క్వింటాళ్ల రాయితీ శనిగలను అందజేసింది. దాదాపు 15 వేల హెక్టార్లలో పంట సాగైంది. ఆక్టోబరులో భారీ వర్షాలు 20 రోజుల పాటు కురవగా.. పొలాల్లో గడ్డి మొలిచి రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆక్టోబరు 25 నుంచి మండలంలో రైతులు శనగను సాగు ఆరంభించి నవంబరు 15 వరకు విత్తారు. సాగుచేసిన తర్వాత వర్షాలు పడకపోవడంతో పైరు బెట్టకు గురైంది. దీనికితోడు ఎండు తెగులు సోకడంతో పంట స్థితిలో రోజురోజుకు మార్పు వచ్చింది. దాదాపు 90 నుంచి 100 రోజులకు నూర్పిడికి రావాలసిన పంట 65 రోజులకే నూర్పిడి దశకు వచ్చేసింది. వర్షం పడకపోవడం, ఎండు తెగులు సోకడంతో పంట పూత, కాయల మీద పూర్తి ప్రభావం చూపగా దిగుబడులు సైతం తగ్గనున్నాయి. ఎకరాకు 2 నుంచి 4 (క్వింటాళ్లు) మూటలు దిగుబడులు మాత్రమే రానున్నాయని పలువురు రైతులు పేర్కొన్నారు. ధర క్వింటా విపణిలో ప్రస్తుతం రూ. 4 వేలు పలుకుతోంది.



తెగులు సోకడంతో కోతకు వచ్చిన శనగపంట




జమ్మలమడుగు : గండికోట ఆకృతిలో ఉన్న కేకును కోస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి...
పెద్దముడియం : విద్యార్థినులతో కేకును కోయిస్తున్న ఎస్సై హరిప్రసాద్

మిన్నంటిన నూతన వత్సర సంబరాలు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలో చిన్నారుల నుంచి పెద్దవారి వరకు నూతన వత్సర సంబరాలను పెద్దఎత్తున జరిపారు. కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరికి కుటుంబంలో కష్టాలూ, కన్నీళ్ల స్థానంలో ఆనందం నింపాలని, గతం కంటే భవిష్యత్తు బాగుండాలంటూ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అర్ధరాత్రి నుంచి యువత ద్విచక్రవాహనాలపై దూసుకెళుతూ, రోడ్ల మీద కలియతిరుగుతూ, సెల్ఫీలు తీసుకుంటూ, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందంగా గడిపారు. పాత బస్టాండ్ సర్కిల్‌లో డీఎస్పీ కె.కృష్ణన్ ఆధ్వర్యంలో కేకును కోసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతూ సందడి చేశారు. సోమవారం ఉదయం చిన్నారులు సైతం తమ అభిమాన హీరోల గ్రీటింగ్‌కార్డులతో పాటు చాక్లెట్లు పంచారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను రంగుల కాగితాలతో, పూలదండలతో ముస్తాబుచేసి, కేకులను కోసి పంచిపెట్టారు.

తాళ్లప్రొద్దుటూరు (కొండాపురం): మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా సాగాయి. పిన్నల నుంచి పెద్దల దాకా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచే యువత కేరింతలు, ఆనోందోత్సాహాలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. సోమవారం ఉదయం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక శివసాయి, స్వామి వివేకానంద, సలామత్ పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాళ్లప్రొద్దుటూరులో సిద్ధార్థ విద్యాసంస్థల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే విద్యార్థులకు నూతన సంవత్సర కాలమానినిలను పంపిణీ చేసినట్లు సిద్ధార్థ కరస్పాండెంట్ నరసింహారెడ్డి పేర్కొన్నారు.

చిలంకూరు (ఎర్రగుంట్ల): మండలంలోని ఎర్రగుంట్ల, చిలంకూరు, ఆర్టీపీపీ ప్రాంతాలతోపాటు పల్లెసీమల్లో ఆదివారం అర్ధరాత్రి, సోమవారం ఉదయం కొత్త సంవత్సర సంబరాలను పెద్దఎత్తున జరిపారు. అర్ధరాత్రి 12 గంటల తరువాత టపాకాయలు పేల్చి, కేకులు కోసి వేడుకలు నిర్వహించారు. పిల్లలు, యువకులు, పెద్దలు, మహిళలు సంతోషంగా వీటిలో పాల్గొన్నారు. సోమవారం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు.

పెద్దపసుపుల (పెద్దముడియం) : స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం సిబ్బంది, విద్యార్థినులు ఘనంగా జరిపారు. ఈ వేడుకల్లో మండల ఎస్సై హరిప్రసాద్, సిబ్బంది పాల్గొని విద్యార్థులచే నూతన సంవత్సర కేకును కోయించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బాలికలు బాగా చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, పై చదువుల్లో ర్యాంకులు సాధించి ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత బాలికల కోసం కస్తూర్బా విద్యాలయాలను ఏర్పాటుచేసి విద్యాభివృద్ధి కోసం కృషిచేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆశయాన్ని నిలబెట్టాలన్నారు. పలు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలకు ఎస్సై చేతుల మీదుగా బహుమతులు ఇప్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని హరిణి, పాఠశాల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగు : జమ్మలమడుగు పోలీసులు నూతన ఏడాది సందర్భంగా పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం జమ్మలమడుగు పట్టణం కన్నెలూరు సమీపంలోని వృద్ధుల శరణాలయాన్ని సందర్శించి, వృద్ధులను పరామర్శించారు. జమ్మలమడుగు డీఎస్పీ కె.కృష్ణన్ విచ్చేసి వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం మూడు రోడ్ల కూడలి సమీపంలో ఉన్న కరుణ వృద్ధాశ్రమానికి వెళ్లి అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకుని, వారికి దుప్పట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ, గ్రామీణ సీఐలు ప్రవీణ్‌కుమార్, ఉమామహేశ్వరరెడ్డి, ఎస్ఐలు హనుమంతు, మౌలాపీరా, పోలీసులు పాల్గొన్నారు.

తెదేపా ఆధ్వర్యంలో నూతన ఏడాది ఉత్సవాలు

జమ్మలమడుగు : నూతన ఏడాదిలో మంచి జరిగి అందరూ సుఖంగా ఉండాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆకాంక్షించారు. నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో ఆయన కార్యకర్తలతో గడిపారు. సోమవారం ఉదయం నుంచే జమ్మలమడుగు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్దఎత్తున తెలుగు తమ్ముళ్లు విచ్చేసి రామసుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. రామసుబ్బారెడ్డి, గిరిధర్‌రెడ్డి, హెచ్ఎల్సీ ఛైర్మన్ శ్రీనివాసులరెడ్డికి కార్యకర్తలు గజమాల వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. గండికోట ఆకృతిలో ఉన్న పెద్ద కేకును కోసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయేది ఎన్నికల సీజన్ అయినందున ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముల్లా జానీ, జిలనీ బాషా, సీతారాముడు తదితర కార్యకర్తలు హాజరయ్యారు.



జమ్మలమడుగు : వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న డీఎస్పీ కృష్ణన్



ఎర్రగుంట్ల: మహేశ్వర్ నగర్‌లో కేకును కోసి, సంబరాలు చేసుకుంటున్న మహిళలు, చిన్నారులు



కొండాపురం: నృత్యం చేస్తున్న సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు

అన్నదానం పుణ్యకార్యం

ఎర్రముక్కపల్లె(కడప), న్యూస్‌టుడే: నగరంలోని పాత బస్టాండ్ సమీపంలోని పీవీఆర్ డిజిటల్స్ యజమాని వెంకట్రామిరెడ్డి పేదలకు నూతన సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో అందరూ సంతోషంగా ఉండాలని... కడుపునిండా అన్నంపెట్టాలన్న సంకల్పంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.



అన్నదానం చేస్తున్న పీవీఆర్ డిజిటల్స్ యజమాని

నేడు సీతారాముల కల్యాణం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఏకశిలానగరిలో కొలువైన కోదండ రామాలయంలో మంగళవారం ఉదయం సీతారాముల కల్యాణాన్ని వేడుకగా నిర్వహిస్తామని ఆలయ పర్యవేక్షకుడు కేవీ లక్ష్మీనాగరాజు తెలిపారు. రాములోరి పరియణయ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు తరలిరావాలని కోరారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

మట్లిరాజుల కోటలో పర్యటకుల సందడి



కోటలోని మండపం నుంచి వస్తున్న సందర్శకులు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటంలోని చారిత్రక మట్లిరాజుల కోటలో సోమవారం పర్యటకుల సందడి నెలకొంది. కొత్త సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని కడప, కర్నూలు, చిత్తూరు, నేపాల్, తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యటకులు కోటను సందర్శించారు. కోటలోని మొదటి మండపం, ఉద్యానవనం, ఢంకానగర్, రెండో మండపం, శిలా శాసనం, నంది విగ్రహం, బయల్పడిన శివలింగం, బిస్మిల్లాషా ఖాద్రి దర్గా, సొరంగ మార్గం, భారీ బురుజులు, ఇతర కట్టడాలను తిలకించారు. స్నేహితులు, కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో తరలివచ్చి ఉత్సాహంగా గడిపారు.

మార్కెట్ ధరలు



కడప రైతు బజారులో కూరగాయల ధరలు (నిన్నటివి).. చికెన్, గుడ్లు, మటన్, చేప ధరలు బయట మార్కెట్‌లో పలికిన ధరలు కూడా అదే రోజువి.
- న్యూస్‌టుడే, కడప వ్యవసాయం

కూర గాయలు	కిలోకు ధర రూపాయల్లో...
టమోటా	08
పచ్చిమిరప	20
వంకాయ	14
బెండ	20
బీర	20
కాకర	20
మటిక	20
చిక్కుడు	20
అలసంద	24
అనపకాయలు	24
ఉల్లిపాయలు	35-40
బంగాళదుంపలు	18
క్యాబేజి	18
క్యారెట్	68
బీన్సు	28
బీట్రూట్	30
కీర	18
దోస	20
దొండ	26
ముల్లంగి	16
అల్లం	48
కాలీఫ్లవర్	32

మాంసం ధరలు..

చికెన్ మామూలు	160
చికెన్ స్కిన్‌లెస్	180
గుడ్లు డజను	42
మటన్	480
చేప	80 నుంచి 140

కడప

తెరపై ఈనాడు

రవి - హలో, **ప్రతాప్ -** 2 కంట్రీస్
రాజా (రహత్) - ప్రాజెక్ట్ **మురళి -** ఒక్క క్షణం,
సుధ -10, **తాహర్ -** సప్తగిరి ఎల్ఎల్‌బి, **అమీర్ -**
టైగర్ జిందాహై, **రమేష్ :** ఎంసీఏ , **అప్సర -** రాజుగారి
గది-2 **ఎస్ఆర్ సాయిబాబా -** ఎంసీఏ

ప్రగతి పనులు చేపడతామంటున్న అధికారులు

2018 ప్రాధమ్యాలు.. లక్ష్యాలపై ప్రకటన

2018 ఆశల పల్లకి.. నాంది అభివృద్ధికి

'నూతన వత్సరంలో కొత్త ఆశలు.. ఆకాంక్షలే కాదు ప్రాధామ్యాలు.. ప్రణాళికతో ముందడుగు వేస్తామని జిల్లాలోని పలు శాఖల అధికారులు చెబుతున్నారు. నూతన సంవత్సరంలోకి ప్రవేశించిన సందర్భంగా మీ లక్ష్యాలు, గత ఏడాది పనితీరు, భవిష్యత్తు ప్రణాళికను ప్రకటించారు. 'న్యూస్‌టుడే'తో ఆయా అధికారులు చెప్పిన విషయాలు వారి మాటల్లోనే..'

అవినీతిపరులకు ముకుతాడు



జిల్లాలో 2017లో అవినీతి నిరోధక శాఖ (అనిశా) బాగా పని చేసింది. పది మంది అవినీతి అధికారులను పట్టుకున్నాం. లెక్కకు మించిన ఆస్తుల కేసులో ఒకరిపై కేసు నమోదు చేశాం. ప్రజలు కూడా బాగా సహకరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2017లో బాగా పని చేశాం. కొత్త ఏడాదిలో రెట్టింపు ఉత్సాహంతో 2018లో అవినీతి అధికారులను పట్టుకుంటాం. తమ సిబ్బంది కూడా బాగా పని చేశారు. జిల్లా ప్రజల సహకరం ఉండాలి.

- నాగరాజు, అనిశా డీఎస్పీ, కడప

ఎర్రచందనానికి రక్ష రేఖ



అటవీశాఖ సిబ్బంది ప్రత్యేక ప్రణాళికలతో 2017లో మంచి ఫలితాలు సాధించింది. 2018లో మరింత పూర్తిస్థాయిలో మనకు మాత్రమే ప్రత్యేకమైన ఎర్రచందనాన్ని రక్షిస్తాం. వంద హెక్టార్లలో ఎర్రచందనం మొక్కలు నాటాం. ప్రత్యేక పర్యవేక్షణలో భాగంగా 17 బేస్ క్యాంపులు, ఆరు స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. సెప్టెంబరు ఇప్పటి వరకు దాదాపు 60 మంది తమిళ స్మగ్లర్లను పట్టుకుని జైలుకు పంపాం. రూ.3 కోట్లు విలువ చేసే 4 వందల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా పోలీసు, ఇతర అధికారుల సహకారంతో రాబోవు సంవత్సరంలో తమిళ కూలీలు, స్మగ్లర్లు అడవుల్లోకి రాకుండా, స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

- షేక్ సలాం, డీఎఫ్‌వో


రిమ్స్‌లో మరింత మెరుగైన వైద్యం



రిమ్స్ వైద్య విజ్ఞాన సంస్థలో మరింత మెరుగైన వైద్యం 2018లో ప్రజలకు అందిస్తాం. ఆసుపత్రిలో అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పేద ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు కృషి చేస్తాం. 2017 మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి 17 డిస్టెంక్షన్లు సాధించారు. పీజీ సీట్లు 16 నుంచి 32కు పెరిగాయి. రిమ్స్‌లో ఎంఆర్ఐ స్కానింగ్ లేనందున రోగులు కొంత ఇబ్బంది పడుతున్న మాట వాస్తవం. ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. 2018లో సర్జరీ, మెడికల్ సీట్లు ఇతర సీట్లు 150 నుంచి 200లకు పెరిగే అవకాశం ఉంది. బయోమెట్రిక్ నూతన విధానం అమలు చేయబోతున్నాం. గత సంవత్సరంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేకపోయాం, ఈ సంవత్సరంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇకపై కూడా రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా రిమ్స్‌కు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు వచ్చేలా కష్టపడతాం అని అన్నారు.

- డాక్టర్ శశిధర్, రిమ్స్ డైరెక్టర్

దేవాదాయ ఆస్తులకు రక్ష



దేవదాయ ఆస్తులు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్న విధానంలో రాష్ట్రస్థాయిలో కడప మొదటి స్థానంలో ఉంది. ఉన్నతాధికారుల సహాయంతో ఇంటికి మీ భూమి ద్వారా 5,200 ఎకరాల దేవదాయ ఆస్తులను గుర్తించి రికార్డులు తయారు చేశాం. రాష్ట్రంలోనే తొలిసారిగా 958 ఎకరాలు స్వాధీనం చేసుకుని లీజుకు ఇచ్చాం. దీర్ఘకాలికంగా కోర్టులో ఉన్న కేసులు పరిష్కరించి సుమారు రూ.40 కోట్లు విలువ చేసే ఆస్తులను దేవదాయశాఖ పరిధిలోకి తెచ్చాం. ప్రొద్దుటూరులో పూర్తిగా అన్యాక్రాంతంలో ఉన్న శ్రీకృష్ణ గీతాశ్రమం ఆస్తులు రూ.150 కోట్లు విలువ చేసే 44 ఎకరాలు స్వాధీనం చేసుకున్నాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన దివ్యదర్శనం యాత్రను దిగ్విజయంగా చేసి 8,500 మంది నిరుపేద భక్తులకు దైవ దర్శనాలు చేయించాం.


- శంకర బాలాజీ, ఏసీ, దేవదాయశాఖ

కొత్త ఏడాదిలో స్వచ్ఛ కడప



కడప జిల్లాలో స్వచ్ఛ భారత్ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు 2017లో శ్రీకారం చుట్టాం. దాన్ని 2018లో పూర్తి చేసేలా నిర్ణయం తీసుకున్నాం. కొత్త ఏడాదిలో జిల్లా స్వర్ణయుగంగా మారుతుందనడంలో సందేహం లేదు. జనవరి 31వ తేదీలోగా పూర్తిస్థాయిలో ఓడీఎఫ్‌గా జిల్లాను మారుస్తున్నాం. చెత్త నుంచి సంపదను సేకరిస్తున్నందున అందరికీ ఉపాధి, ఆర్థిక పెరుగుదలకు ఎంతో మేలు చేసేలా చూస్తున్నాం. **- ఖాదర్‌బాషా, జిల్లా పంచాయతీ అధికారి**

పాఠశాల విద్యకు నూతన కళ



నూతన సంవత్సరం 2018 పాఠశాల విద్య విద్యార్థులందరికీ వెలుగులు నింపేదిగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. కడప జిల్లాలో ఇన్‌ఛార్జిల పాలనలో కొనసాగుతూ వచ్చిన ఎంఈవోలు ఇతర పోస్టులు కొన్ని రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు జరిగాయి. ప్రస్తుతం పరిపాలనా పరంగా విద్యాశాఖ మెరుగ్గా కనిపిస్తోంది. మంత్రి గంటాశ్రీనివాసరావు నిరంతరం విద్యాశాఖ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో డిజిటల్ తరగతులను అందరికీ అమలు చేసే దిశగా కార్యాచరణ జరుగుతోంది. కొత్త ఏడాది మొత్తం డిజిటల్ విద్య దిశగా అడుగులు వేయనుంది. పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం ఇప్పటికే జిల్లాలవారీగా కోట్లాది రూపాయల కేటాయింపు జరిగింది. ఆయా జిల్లాల్లో నిధులు విడుదలై ఖర్చు చేస్తే పాఠశాలలల్లో అనేక వసతులు విద్యార్థులకు చేరువవనున్నాయి.


-ప్రతాప్‌రెడ్డి, కడప పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, పాఠశాల విద్య

మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యం



జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులతో మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా ముందుకు వెళ్లనున్నాం. ఇప్పటికే చాలా వరకూ పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేశారు. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు. మాదిరి ప్రశ్నలు, ప్రశ్నాపత్రాలు విడుదల చేశాం. విద్యార్థులకు వాటిని అందజేసి స్టడీ అవర్స్‌ను పకడ్బందీగా నిర్వహిస్తాం. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు నిర్వహణ పరంగా ఎలాంటి సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరి కృషితో కొద్ది సంవత్సరాలుగా పదో తరగతి ఫలితాలలో కడప జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో కొనసాగుతోంది. నూతన సంవత్సరంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, జిల్లావిద్యాశాఖ ఉద్యోగులు ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని కోరుకుంటున్నా. **- శైలజ, జిల్లా విద్యాశాఖాధికారి**

ఫలితాల సాధనకు ప్రణాళిక



2017వ సంవత్సరం ఆశించిన మేర సంతృప్తి నిచ్చింది. అంతకు ముందు ఏడాది కంటే రాయితీలు బాగా ప్రభుత్వం ఇచ్చింది. అంతే కాక వేరుసెనగ పంట దిగుబడి సాధారణం కంటే ఎక్కువగా వచ్చింది. సాధారణంగా హెక్టారుకు 900 కిలోలు రావాల్సి ఉంటే జిల్లాలో చేసిన 600ల పంట కోత ప్రయోగాల ప్రకారం చూస్తే హెక్టారుకు 1390 కిలోలు వచ్చింది. జిల్లాలో ప్రాజెక్టుల్లో నీరు బాగా ఉండటంతో భూగర్భ జలం పెరగడంతో ఈ రబీలో వరి పంట ఆశించిన దానికంటే ఎక్కువగా సాగైంది. 2017లో వ్యవసాయ యాంత్రీకరణకు రూ.33 కోట్లు ఇస్తే వచ్చే ఏడాది రూ.44 కోట్లు ఇస్తోంది. విత్తనకాయలు రాయితీతో ఇచ్చాం. ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపుతున్నారు. మరిందరిని దాని వైపు మళ్లించాలని చూస్తున్నాం. కొత్త సంవత్సరంలోను ఆశించిన ఫలితాలను సాధిస్తాం.

-ఠాగూర్‌నాయక్, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు


నూతన లక్ష్యాలతో ముందడుగు



నిన్నటి సంవత్సరం అంటే 2017లో ప్రభుత్వం సూచించిన లక్ష్యాలన్నింటినీ పూర్తి చేశాం. కృత్రిమ గర్భధారణ, సునందిని, పశుగ్రాస పంపిణీ, పశుగ్రాస పెంపకం లాంటివి చేశాం. పశువులకు నీటి తొట్లు నిర్మించాం. ఇప్పుడు కొత్తగా పశువులకు వసతి గృహాలు వచ్చాయి. అదే విధంగా సాధారణ పశుగ్రాస క్షేత్రాలు కాకుండా మెగా పశుగ్రాస క్షేత్రాలు జిల్లాకు వచ్చాయి వాటిని పూర్తి చేస్తాం. యంత్రాంగం సహకారంతో ప్రభుత్వం అమలు చేసే ప్రతి కార్యక్రమాన్ని పూర్తి చేస్తూ పశువులకు మెరుగైన వైద్య సేవలందిస్తాం.

-జయకుమార్, పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు


మరిన్ని దిగుబడుల సాధన



2017 ఆరంభంలో వర్షం లేక కరవు నెలకొంది. ఆ సమయంలో ఉన్న కాస్త నీటిని పొదుపుగా వాడుకున్నారంటే అందుకు కారణం బిందు, తుంపర సేద్యాలే. అలా చేయడంతో నీటిని పొదుపు చేయడమే కాక మంచి దిగుబడులు కూడా సాధించారు. మంచి ధరలుతో పంటల దిగుబడులు విక్రయించుకున్నారు. కొత్త ఏడాదిలోను ఆశించిన ఫలితాలు సాధిస్తాం.

- మధుసూదన్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ

కమనీయం.. లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



కల్యాణ వేదికపై లక్ష్మీనరసింహస్వామి

ఊటుకూరు (రాజంపేట), న్యూస్‌టుడే : భువనగిరిపల్లె లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కంబయ్యగారి నరసింహ, మల్లెం తిరుపాల్ ఆధ్వర్యంలో భువనగిరిపల్లె కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారిని కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి జరిగిన కల్యాణ వేడుకను తిలకించడానికి భక్త జనసందోహం తరలివచ్చింది. బ్రహ్మోత్సవాల సమయంలో వచ్చినట్లు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. స్వామివారిపై పోసిన ముత్యాల తలంబ్రాలను నిర్వాహకులకు భక్తులకు పంపిణీ చేశారు. స్వామివారి కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.



కల్యాణాన్ని తిలకించడానికి తరలివచ్చిన భక్తులు

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఖాజీపేట, న్యూస్‌టుడే : కోటంగరువాయపల్లెలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, సహస్త్రనామార్చన, తదితర పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాన్ని, మూలవిరాట్టును పూలతో అలంకరించారు.

కడప

పోలీసు సేవల కొరకు **100**



ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు


జువైనల్ హోంలో కేక్‌కట్ చేస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు వాసు, ఉమా రాష్ట్ర అధ్యక్షుడు షంషుద్ధీన్


కేకు కోస్తున్న ది కడప జ్యువెలరీ అసోసియేషన్ సభ్యులు


కందుల సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా నేత అమీర్‌బాబు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలు కడప నగరంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ఆకాంక్షించారు.

● కడప నగరంలోని వైవీ స్ట్రీట్‌లో నూతన సంవత్సర వేడుకలు ది కడప జ్యువెలరి అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రాజశేఖర్, సయ్యద్ సలావుద్దీన్, అధ్యక్షుడు ఆకుల రాజమోహన్, కార్యదర్శి సయ్యద్ చాన్‌బాషా, ఉపాధ్యక్షులు మాధవాచారి, సికిందర్‌ఖాన్, సంయుక్త కార్యదర్శి గోవిందు నాగరాజు, కోశాధికారి సురేష్, గౌరవ సలహాదారు హాజీ పాల్గొన్నారు.

● నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా 11వ బెటాలియన్ ఎస్పీ రాజకిశోర్‌బాబు, కడప ఎమ్మెల్యే అంజాద్ బాషా, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, మేయర్ సురేష్‌బాబు, జెసీ-2 శివారెడ్డి, డీఎస్పీ మాసుంబాషా తదితర ప్రముఖులను జనవికాస్ సేవా సమితి అధ్యక్షుడు తాహీర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా 11వ బెటాలియన్ ఎస్పీ రాజకిశోర్‌బాబును సన్మానించారు. గౌస్‌ఖాన్, సద్దాం హుస్సేన్, వల్లిబాషా, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

● మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డిని, ప్రముఖ పారిశ్రామికవేత్త కందుల రాజమోహన్‌రెడ్డిని సోమవారం తెదేపా రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు అమీర్ బాబు కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కడప గ్రామీణ : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సందడి చేశారు. పార్టీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, సీనియర్ నాయకుడు తులసిరెడ్డికి కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు మాజీ మంత్రి సి.రామచంద్రయ్య నివాసానికి చేరుకుని పార్టీ జిల్లా అధ్యక్షుడు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, చార్లెస్, విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.

అరవిందనగర్(కడప) : నగరంలోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం డీఎస్పీ మాసూం బాషాను కడప నగర బంగారు వర్తకుల సంఘం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. డీఎస్పీకి పూలగుచ్ఛంతోపాటుగా పండ్లు అందించారు. డీఎస్పీ కలిసిన వారిలో సంఘం గౌరవాధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, నాయకులు సలావుద్దీన్, రాజమోహన్, చాన్ బాషా, నాగరాజు తదితరులున్నారు.

● కొత్త ఏడాదిలో కడప నగరాన్ని మరింతగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షిస్తూ జనవికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ తాహిర్ ఎమ్మెల్యే అంజాద్‌బాషాకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కవిమిత్ర గౌస్‌ఖాన్, వాజిద్, వల్లీబాషా, సద్దాం హుసేన్ తదితరులు పాల్గొన్నారు. ● కొత్త ఏడాదిలో కడప జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తెలుగుదేశం పార్టీ కంకణం కట్టుకుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అన్నారు. కడపలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆయన కేకు కోశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్దన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు. ● మానసిక వికలాంగులు దేవుళ్లతో సమానమని వారిని అక్కున చేర్చుకుని ఆలనాపాలన చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అంతర్జాతీయ మానవహక్కుల సంఘం రాష్ట్ర ఛైర్మన్ బొమ్మన సుబ్బరాయుడు అన్నారు. నగరంలోని ఆల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో సోమవారం ఆయన చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. బొమ్మన ఫౌండేషన్ తరపున కేంద్రానికి నిత్యవసర వస్తువులు, బియ్యం ఉచితంగా అందించారు. ప్రతినిధులు విజయ్, కృష్ణ, శీను, రాజేష్, ఓబుల్‌రెడ్డి, మణికంఠ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బిల్టప్, (కడప) : కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే ఉద్యమాలను నూతన ఉత్తేజంతో ముందుకు తీసుకెళతామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య అన్నారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా కడపలోని పార్టీ కార్యాలయంలో కేకు కోసి నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటశివ, నాగసుబ్బారెడ్డి, చంద్ర, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా సచివాలయం : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని నగరంలోని కలెక్టర్ బంగళాలో సోమవారం కలెక్టరేట్ ఉద్యోగులు కలెక్టర్ బాబూరావు, ఎస్పీ బాబూజీకి శుభాకాంక్షలు తెలిపారు. సంయుక్త కలెక్టర్ నాగేశ్వర్రావు, జేసీ-2 శివారెడ్డి, డీఆర్వో బాబయ్య, కడప ఆర్డీవో దేవేందర్‌రెడ్డి, ఏవో శ్రీనివాసులు తదితర ఉద్యోగుల బృందం పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో అన్ని శాఖల ఉద్యోగులు మమేకం కావాలన్నారు.

ఎర్రముక్కపల్లె(కడప) : జువైనల్ హోంలో ఉన్నట్లు బాధపడాల్సిన అవసరమే లేదని... ఇక నుంచి మీ భవిష్యత్తును మీరు మార్చుకునేలా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతుందన్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ జిలా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అన్నారు. నగరంలోని జువైనల్ హోంలో సోమవారం యునైటెడ్ మైనార్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల మధ్య శ్రీనివాసులరెడ్డి కేక్‌కట్ చేశారు. ఉమా రాష్ట్ర అధ్యక్షుడు షంషుద్ధీన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హకీం, మహబూబ్‌ఖాన్, మున్సిపల్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు షాహిద్, కృష్ణయ్య, నాగరాజు పాల్గొన్నారు.

రైతులు ఆనందంగా ఉండాలి


ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కేక్ కోస్తున్న ప్రధాన శాస్త్రవేత్త కరుణసాగర్

ఊటుకూరు(చింతకొమ్మదిన్నె), న్యూస్‌టుడే: ఈ ఏడాది మంచి వర్షాలు పడి పంటలకు చీడపీడలు ఆశించకుండ మంచి దిగుబడులతో బంగారు పంటలు పండి రైతులు వ్యవసాయంలో ఆర్థికంగా మెరుగుపడాలని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కరుణసాగర్ పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు కేక్ కోశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాదీ ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏదో విధంగా రైతులు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీనివాసచారి, అరుణ, సునీల్‌కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


సీపీఐ ఆధ్వర్యంలో...


ఎమ్మెల్యే అంజాద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జనవికాస్ సేవా సమితి అధ్యక్షుడు తాహిర్


మానసిక వికలాంగుల మధ్య కేక్ కట్ చేస్తున్న అంతర్జాతీయ మానవహక్కుల సంఘం రాష్ట్ర ఛైర్మన్

కాలమానిని ఆవిష్కరణ


జీఎన్‌ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ నాగేశ్వరరావుచేత కాలమానినిని ఆవిష్కరింప చేస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: ఏపీ సహకార బ్యాంకు ఉద్యోగులు సంఘం కాలమానినిని బ్యాంకు అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, సీఈఓ వెంకటరత్నంలు సోమవారం బ్యాంకులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగులు బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, వీరబ్రహ్మం, నారాయణరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కడప వ్యవసాయం : బీసీ ఉద్యోగ సంఘ ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి జేసీ నాగేశ్వరరావు చేతుల మీదుగా సోమవారం సంఘ నాయకులు రాజశేఖర్ తదితరుల ఆధ్వర్యంలో కాలమానినిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, కృష్ణయ్య, రామమూర్తి, పుల్లయ్య, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రముక్కపల్లె(కడప) : తెలుగుదేశం పార్టీకి మూలస్తంభం తెలుగునాడు విద్యార్థి సంఘమేనని తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అన్నారు. నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలుగునాడు విద్యార్థి సమాఖ్య రూపొందించిన క్యాలెండర్(కాలమానిని)ను వాసు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఓబులరెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి, ప్రతాప్, పోలిశివకుమార్, బ్రహ్మానందరెడ్డి, రామకృష్ణ, వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : కడప-రాయచోటి రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మండలంలోని బుగ్గలేటిపల్లె వద్ద రోడ్డును వెడల్పు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అధికారులు పనులు మొదలు పెట్టారు. రోడ్డు పక్కన ఇళ్లున్న వారు తమ ఇళ్లు కోల్పోతున్నామని తమకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఇందుకు డీఈ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలం ఉన్నంత వరకు తమకు రోడ్డుకు అవసరమైన స్థలంను తీసుకుంటామని పట్టాలాంటి స్థలం ఉంటే వారికి నష్టరిహారం చెల్లిస్తామని తెలిపారు. గ్రామస్థులు పనులను అడ్డుకున్న ఫలితం ఉండదని వీలైనంత వరకు న్యాయం చేస్తామని డీఈ గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

నగదు, కోళ్లు స్వాధీనం

కాటగుంటవారిపల్లె(చక్రాయపేట), న్యూస్‌టుడే: కోడిపందాలు ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.26,130లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై గోవింద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నూతన సంవత్సరం, సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామాలలో కోడిపందాలు, జూదాలపైన విస్తృత దాడులు చేశామన్నారు. సోమవారం మండల పరిధిలోని కాటగుంట వారిపల్లె దగ్గర కోడిపందాలు నిర్వహిస్తున్న కొందరిని పోలీసులు పట్టుకున్నారు. ఏడు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఘర్షణ..కేసు నమోదు

కమలాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఈడిగపల్లెలో సోమవారం ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఎస్సై మహమ్మద్‌రఫి సమాచారం మేరకు.. ఈడిగపల్లెకు చెందిన రవి అతని భార్య మాణిక్యమ్మ తమ పొలానికి నీరు కడుతుండగా అదే దారిలో పంగా కృష్ణయ్య ద్విచక్రవాహనంపై వెళ్లాడు. ద్విచక్రవాహనంపై వెళ్లడంతో పైపు పగిలింది. దీంతో రవి కృష్ణయ్యను కొట్టాడు. కృష్ణయ్య రవి భార్యను కొట్టాడు. రవి ఫిర్యాదు మేరకు కృష్ణయ్యపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. కృష్ణయ్య ఫిర్యాదు మేరకు రవిపై 307, 324 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కమలాపురం

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

కృష్ణాపురం(చింతకొమ్మదిన్నె), న్యూస్‌టుడే: ప్రభుత్వం మంగళవారం నుంచి నిర్వహించే జన్మభూమి-మాఊరు కార్యక్రమ గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రజల సమస్యలను ఈ గ్రామ సభల్లో పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. మండలంలోని ఇప్పపెంట పంచాయతీలో మంగళవారం గ్రామసభ ఉంటుందని చెప్పారు. అలాగే 3వ తేదీన బుగ్గలపల్లె, 4న కొలుములపల్లె, 5న బుసిరెడ్డిపల్లె, 6న కమ్మవారిపల్లె, 7న పబ్బాపురం, 8న పాపాసాహెబ్‌పేట, 9న కొప్పర్తి, 10న తాడిగొట్ల, 11న సీకేదిన్నె పంచాయతీలో జన్మభూమి-మాఊరు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘర్షణ..కేసు నమోదు

కమలాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఈడిగపల్లెలో సోమవారం ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఎస్సై మహమ్మద్‌రఫి సమాచారం మేరకు.. ఈడిగపల్లెకు చెందిన రవి అతని భార్య మాణిక్యమ్మ తమ పొలానికి నీరు కడుతుండగా అదే దారిలో పంగా కృష్ణయ్య ద్విచక్రవాహనంపై వెళ్లాడు. ద్విచక్రవాహనంపై వెళ్లడంతో పైపు పగిలింది. దీంతో రవి కృష్ణయ్యను కొట్టాడు. కృష్ణయ్య రవి భార్యను కొట్టాడు. రవి ఫిర్యాదు మేరకు కృష్ణయ్యపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. కృష్ణయ్య ఫిర్యాదు మేరకు రవిపై 307, 324 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధితులకు న్యాయం చేయండి

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : కడప-రాయచోటి రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మండలంలోని బుగ్గలేటిపల్లె వద్ద రోడ్డును వెడల్పు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అధికారులు పనులు మొదలు పెట్టారు. రోడ్డు పక్కన ఇళ్లున్న వారు తమ ఇళ్లు కోల్పోతున్నామని తమకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఇందుకు డీఈ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలం ఉన్నంత వరకు తమకు రోడ్డుకు అవసరమైన స్థలంను తీసుకుంటామని పట్టాలాంటి స్థలం ఉంటే వారికి నష్టరిహారం చెల్లిస్తామని తెలిపారు. గ్రామస్థులు పనులను అడ్డుకున్న ఫలితం ఉండదని వీలైనంత వరకు న్యాయం చేస్తామని డీఈ గ్రామస్థులకు హామీ ఇచ్చారు.



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు తప్పెట శివరామిరెడ్డి. వయసు 67 ఏళ్లు. చెన్నూరు గ్రామం రెడ్డివారివీధిలో నివాసం ఉంటున్నారు. అర్హత ఉన్నా ఎన్టీఆర్ 'భరోసా' లభించలేదు రెండేళ్ల కిందట పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా 8007142007 నంబరు ఇచ్చారు. ఇంతవరకు మంజూరు చేయలేదు. అధికారులను అడిగితే జన్మభూమి కమిటీ ఆమోదం తెలిపిన వారికి మాత్రమే మంజూరు చేస్తారని చెబుతున్నారు. రెండేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదని, ఈ జన్మభూమిలో అయినా పింఛను అందుతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.



పింఛను అందుకుంటున్న లబ్ధిదారులు

అర్హులకు అందని ఎన్టీఆర్ భరోసా


చెన్నూరు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రభుత్వం అందించే పింఛన్లు మండలంలో అర్హులకు అందడం లేదు. వృద్ధులు, వితంతువులు ఏళ్లుగా ఎదురుచూపులు చూస్తున్నారు. పలుమార్లు జన్మభూమి- మాఊరు గ్రామసభల్లో వినతులు ఇచ్చినా ఫలితంలేదు. మండల కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు కావాల్సిన ప్రతి పని గ్రామస్థాయిలో జరగాలని, ప్రతి సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో మీకోసం నిర్వహిస్తున్నారు. ప్రజల నుంచి అందిన వినతులు పరిష్కరించాలని అధికారులు ఆదేశిస్తున్నా ఆచరణలో అమలుకావడంలేదు. ఎలాంటి ఆసరాలేని వృద్ధులు పింఛను కోసం మండల కేంద్రం చుట్టూ తిరగడానికి అవస్థలుపడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ సిబ్బంది పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. మండల పరిధిలో 3854 మందికి రూ.41.63 లక్షలు నెల నెలా పింఛన్లు అందిస్తున్నారు. ఇప్పటికీ అర్హులైనవారు చాలా మంది ఉన్నారు. దరఖాస్తు చేసుకుని పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాకపోవడం, ఆధార్‌లో సమాచారం తప్పుగా ఉందని, ఇతరత్రా కారణాలు చూపి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచారు. ఇచ్చిన సమాచారం కచ్చితమైనదేనని అర్హులు మరో మారు దరఖాస్తు చేశారు. ఏడాది దాటినా ఇప్పటికీ పింఛను మంజూరుకాలేదని, అడిగితే సరైన సమాధానం చెప్పేవారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 2,046 మంది ఇప్పటి వరకు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో వృద్ధులు 1,036, వితంతువులు 622, చేనేతలు 60, దివ్యాంగులు 328 మంది ఉన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రస్తుతం నిర్వహించే జన్మభూమి- మాఊరులో అయినా పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఏడాదిగా ఎదురుచూపులు

పింఛను కోసం ఏడాది కిందట దరఖాస్తు చేసుకున్నా. అవసమైన అన్ని పత్రాలు సమర్పించా. ఆన్‌లైన్‌లో నమోదు చేసి గుర్తింపు నంబరు ఇచ్చారు. ఇంతవరకు మంజూరు చేయలేదు. పలుమార్లు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లా. అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పలేదు. ప్రస్తుతం నిర్వహించే జన్మభూమిలో అయినా పింఛను రాకపోతుందా అని ఎదురుచూస్తున్నా.



\- పద్మావతి, కొక్కరాయపల్లె



ఎన్టీఆర్ భరోసా పింఛను పుస్తకం

మండలాల వారీగా పింఛన్లు కోసం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు ఇలా..

మండలం	వృద్ధులు	వితంతువులు	చేనేత	దివ్యాంగులు	మొత్తం
చింతకొమ్మదిన్నె	26	116	04	52	298
వల్లూరు	119	83	01	55	258
వీరపునాయునిపల్లె	124	66	52	03	245
చెన్నూరు	184	131	0	48	363
కమలాపురం	318	95	03	84	500
పెండ్లిమర్రి	165	131	0	86	382

రైతులు ఆనందంగా ఉండాలి



ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కేక్ కోస్తున్న ప్రధాన శాస్త్రవేత్త కరుణసాగర్

ఊటుకూరు(చింతకొమ్మదిన్నె), న్యూస్‌టుడే: ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కరుణసాగర్ నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కేక్ కోశారు. ఆయన మాట్లాడుతూ.. . సేంద్రియ వ్యవసాయానికి ప్రధాన్యత ఇవ్వాలని తద్వారా భూమి సారవంతంగా ఉండటంతో పాటు ప్రకృతి బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీనివాసచారి, అరుణ, సునీల్‌కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో తెదేపా నాయకులు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కమలాపురం తెదేపా బాధ్యుడు పుత్తా నరసింహారెడ్డిని మండల కన్వీనర్ టి.కృష్ణారెడ్డి, కడప మార్కెట్‌యార్డు కమిటీ ఉపాధ్యక్షుడు గంధం మోహన్‌బాబు, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, తెదేపా నాయకులు పలువురు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డిని కలిసిన మండల తెదేపా నాయకులు

నవ సంవత్సరాది.. ఆశల పునాది

కమలాపురం, న్యూస్‌టుడే : మాజీ ఎమ్మెల్యే, తెదేపా నాయకుడు వీరశివారెడ్డి కమలాపురంలోని తన కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం తన సతీమణి రాజరాజేశ్వరి, కుమారుడు డీసీసీ ఛైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి కేకును కోసి అభిమానులకు పంచిపెట్టారు. సర్వమత ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విందుకు భారీగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, భాజపా నాయకుడు రాజోలి వీరారెడ్డి, మాజీ మంత్రి అహ్మదుల్లా, బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కుసుమకుమారి తదితరులు విందుకు హాజరయ్యారు.



కేకును కోస్తున్న మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి

కమలాపురం : నూతన సంవత్సర వేడుకలు మండల వ్యాప్తంగా అంబరాన్నంటాయి. సోమవారం పలు పాఠశాలలు, కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. కేకుకోసి పిల్లలకు, కార్యాలయ సిబ్బందికి పంచిపెట్టారు. స్థానిక సూర్య ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ టీవీ సుబ్బారెడ్డి కేకుకోసి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పంచిపెట్టి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో తెదేపా ముస్లీం మైనార్టీ నాయకుడు ఖాదర్‌బాషా, పంచాయతీ ఇన్‌ఛార్జి పల్లె రామసుబ్బారెడ్డి, కార్యదర్శి కుమార రంగయ్య నూతన సంవత్సర కేకుకోసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.



వల్లూరు తహసీల్దారు కార్యాలయంలో ..

వల్లూరు, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం అధికారులు నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా నిర్వహించారు. తహసీల్దారు స్థానిక కార్యాలయంలో తహసీల్దారు మహాలక్ష్మి సిబ్బందితో కేకును కోసం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్తఏడాది సిబ్బంది బాగాపనిచేసి ప్రజలకు సేవలను అందించాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ భాస్కర్‌రెడ్డి సిబ్బందితో కలిసి కేకును కోసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. 2018లో ఈ మేరకు బాధ్యతతో పనిచేసి సహకారాన్ని అందిస్తామని సిబ్బంది చెప్పారు.. కార్యక్రమంలో తెదేపా మండల సమన్వయకర్త నాగేశ్వర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పలువురు నాయకులు పాల్గొన్నారు.



సూర్య ఉన్నత పాఠశాలలో కేకు కోస్తున్న కరస్పాండెంట్ టీవీ సుబ్బారెడ్డి



పంచాయతీ కార్యాలయంలో కేకు కోస్తున్న ఖాదర్‌బాషా, కుమార రంగయ్య



సిబ్బందితో నూతన సంవత్సర వేడుకలను జరుపుకొంటున్న ఎస్ఐ

మైదుకూరు

బియ్యం కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖాజీపేట, న్యూస్‌టుడే : మండలంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు బియ్యంకార్డుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు పార్వతి తెలిపారు. మంగళవారం నుంచి జరగనున్న జన్మభూమి కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. మండలానికి వంద కార్డులు వచ్చాయని, నోడల్ అధికారి ద్వారా మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. చెంచులు, యానాదులు, సంచార జీవనం చేసే ఎస్సీలు, హిజ్రాలు పూర్తి వివరాలతో నోడల్ అధికారిని సంప్రదించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు అన్నదానం

జీవీసత్రం(మైదుకూరు), న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం జీవీసత్రంలోని మైదుకూరు నిర్మలా వికలాంగుల సేవా నిలయంలోని దివ్యాంగులకు అన్నదానం చేశారు. మాతృశ్రీ వైద్యశాల వైద్యుడు వై.వి. రమణయాదవ్, జీవీసత్రంలోని ప్రభాకర్‌రెడ్డి, పోతులూరిరెడ్డి, మాలేపాటి సుధాకర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి మూలవిరాట్టు

ఖాజీపేట, న్యూస్‌టుడే : కోటంగరువాయపల్లెలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, సహస్రనామార్చన, తదితర పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాన్ని, మూలవిరాట్టును పూలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రంగాచార్యుల ఆధ్వర్యంలో పూజలు, ఆలయ ఛైర్మన్ సురేష్ బాబు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

ఖాజీపేట: పుల్లూరు సమీపంలోని నాగనాథేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దంపతులు సందర్శించారు. శివుడికి అభిషేకాలు, అర్చనలు, పూజలు చేయించారు. నూతన సంవత్సరంలో ప్రజలకు శుభం చేకూరాలని దేవుడిని ప్రార్థించినట్లు చెప్పారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యేని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. వైకాపా రాష్ట్రకార్యదర్శి ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి దస్తగిరిబాబు, మండల కన్వీనరు జనార్దన్‌రెడ్డి, పలువురు నాయకులు వెంట ఉన్నారు.

అంగన్వాడీలకు సామగ్రి పంపిణీ


అంగన్వాడీ కార్యకర్తకు సామగ్రి అందజేస్తున్న సర్పంచి, పంచాయతీ కార్యదర్శి

దువ్వూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని తొమ్మిది అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన సామగ్రిని సోమవారం అందజేశారు. పంచాయతీ తరపున ఒక్కో కేంద్రానికి రూ.5 వేలు విలువ చేసే 11 వస్తువులను సర్పంచి దండు విజయమ్మ, ఎంపీడీవో ఎ.వి. రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వీరారెడ్డి అందజేశారు. సీడీపీవో నిర్మలాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ పాల్గొన్నారు.

తలకు నూనె కరవు.. స్నానానికి సబ్బు లేదు!

❑ ఆరు నెలలుగా అందని కాస్మోటిక్ ఛార్జీలు ❑ కస్తూర్బా విద్యార్థినులకు తప్పని ఇక్కట్లు

ఖాజీపేట, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు లేని పిల్లలు, అయినవారి నిరాదరణకు గురైన నిర్భాగ్యులు, కుటుంబ పరిస్థితులు అనుకూలించక చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థినులను అక్కున చేర్చుకుని వారికి విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దడానికి ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు నేడు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. నెల నెలా విద్యార్థినులకు అందించాల్సిన సౌందర్య సాధనాల(కాస్మోటిక్ ఛార్జీలు) బిల్లులు అందడం లేదు. ఆరునెలలుగా ఇదే పరిస్థితి. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభమైన ఆరు మాసాలు అవుతున్నా ఇంత వరకు విద్యార్థినులకు కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వలేదు. ప్రతి నెలా ఒక్కో విద్యార్థినికి ప్రభుత్వం రూ.100 ఖాతలో జమచేస్తుంటుంది. ఈ మొత్తంతో కొబ్బరి నూనె, సబ్బు, షాంపు, టూత్‌పేస్టు, బ్రస్, పౌడర్, స్టిక్కర్లు, తదితర వస్తువులను విద్యార్థినులు కొనగోలు చేసి అవసరాలు తీర్చుకుంటూ ఉండేవారు. ఆరు నెలలుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, నిరాదరణకు గురైన విద్యార్థినులు పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక బాధతో కుమిలిపోతున్నారు. మండల పరిధి సుంకేసుల వద్ద ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయంలో 190 మంది విద్యార్థినులు విద్య అభ్యసిస్తున్నారు. వీరందరికి కాస్మోటిక్ ఛార్జీలు అందలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాస్మోటిక్ ఛార్జీలు సకాలంలో అందించి ఆదుకోవాలని విద్యార్థినులు కోరుతున్నారు.


కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం


కస్తూర్బా విద్యార్థినులు

ఎదురు చూడాల్సి వస్తోంది



ప్రతి నెలా ప్రభుత్వం వంద రూపాయల మొత్తాన్ని ఖాతాలో జమ చేస్తుండేవారు. ఈమొత్తంతో అవసరమైన వస్తువులు కొనగోలు చేసి అవసరాలు తీర్చుకునేవాళ్లం. ఆరు నెలలుగా డబ్బు ఇవ్వలేదు. ప్రతి నెలా బ్యాంకు వద్దకు వెళ్లి నిరాశతో వెనుదిరిగి రావాల్సి వస్తుంది. ప్రభుత్వం ఇచ్చే వంద రూపాయలు ప్రస్తుత అవసరాలకు సరిపోవట్లేదు. కాస్మోటిక్ ఛార్జీల మొత్తాన్ని కొంత పెంచితే విద్యార్థినులకు ఉపయోగకరంగా ఉంటుంది.

- ప్రశాంతి, 9వ తరగతి

ప్రభుత్వమే అందించాలి



ప్రభుత్వమే విద్యార్థినులకు అవసరమైన సౌందర్య సాధనాలు ఇవ్వాలి. ప్రతి నెలా బజారుకు వెళ్లి తెచ్చుకోవాలన్నా ఇబ్బందికరంగా ఉంటుంది. ఒక్కోసారి తల్లిదండ్రులు తీసుకొచ్చే పరిస్థితులు ఉండవు. ప్రభుత్వమే పేస్టు, పౌడర్, షాంపూ, సబ్బులు, కొబ్బరినూనె తదితర వస్తువులు పంపిణీ చేయాలి. ప్రభుత్వం చర్యలు తీసుకుని ఇబ్బందులు లేకుండా చూడాలి.

- నందిని, విద్యార్థిని

దుస్తులు ఎలా శుభ్రం చేసుకోవాలి



ఆరు నెలలుగా కాస్మోటిక్ ఛార్జీలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దుస్తులు శుభ్రం చేసుకోవాలన్నా సమస్యగా ఉంది. ఒకసారి ధరించిన దుస్తులను మళ్లీ వేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో ఎప్పుడూ ఇంత జాప్యం జరిగేదికాదు. సంక్రాంతి సెలవులు సమీపిస్తున్నా ఇవ్వకపోవడం బాధకరం. ఒక్కో విద్యార్థినికి ప్రభుత్వం రూ.600 చెల్లించాల్సి ఉంది.

- శిల్పాదేవి, ఎనిమిదో తరగతి విద్యార్థిని

సౌందర్య సాధనాల బిల్లు పెంచాలి



ప్రభుత్వం ఇస్తున్న వంద రూపాయల మొత్తం ప్రస్తుత అవసరాలకు ఏమాత్రం సరిపోదు. నిత్యావసర వస్తువుల ధరలు అధికంగా పెరిగాయి. పేస్టు కొనాలన్నా రూ.20 ఖర్చు అవుతుంది. ప్రభుత్వం ఇస్తున్న మొత్తం ఏమాత్రం సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తల్లిదండ్రులపై ఆర్థికంగా భారం పడుతోంది. ప్రస్తుత ధరలకు అనుగుణంగా కనీసం రూ.200 అయినా చెల్లించాలి.

- లిఖిత, కస్తూర్బా విద్యార్థిని

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



కస్తూర్బా విద్యార్థినులకు కాస్మోటిక్ ఛార్జీలు అందక ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య లేకుండా చూస్తాం. ప్రభుత్వం వద్ద నిధుల కొరతతో సమస్య ఎదురవుతోంది. సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని విద్యార్థినులకు బకాయి అందేలా చర్యలు తీసుకుంటాం. కాస్మోటిక్ ఛార్జీల బదులు కిట్స్ ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం ఉంది.

- ప్రసాద్, ఎంఈవో, ఖాజీపేట

మైదుకూరులో మార్కెట్ ధరలు (నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
టమోటాలు	10
పచ్చిమిరప	20
బెండకాయలు	50
మటిక్కాయలు	50
వంకాయలు	40
బీట్‌రూట్	25
బంగాళదుంప	30
కాకర	50
క్యాలీఫ్లవర్	40
అల్లం	70
చిక్కుడు	60
క్యారెట్	100
ఎర్రగడ్డలు	60
క్యాబేజీ	50
మునక్కాయలు	120
బీన్స్	30
దొండ	30
ముల్లంగి	40

మాంసం ధరలు




	కిలో (రూ)
మటన్	440
చికెన్	140
100 గుడ్లు	410
డజను	55
చేపలు	100

తెరపై ఈనాడు

విజయ్ : ఎంసీఏ,
భారత్ : హలో
ఖాజీపేట :
రాజ్: ఆక్సిజన్

ఆలయాల్లో పూజలు.. చర్చిల్లో ప్రార్థనలు / ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


చాపాడు : కేకు కత్తిరిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు, అధికారులు


మైదుకూరు: ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు


మైదుకూరు: ప్రార్థనలు చేస్తున్న ఫాదర్


చాపాడు : ప్రసంగిస్తున్న మైదుకూరు డివిజినల్ ఛైర్మన్ ఆనందరావు


మైదుకూరు: అలంకరణతో పెద్దమ్మదేవత

మైదుకూరు, న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకలకు మైదుకూరులో కళ తప్పింది. పాశ్చాత్య సంస్కృతి వద్దని నూతన సంవత్సర వేడుకలపై ఒకసారి ఆలోచించాలని కోరుతూ పలు సంస్థలు ప్రచారం నిర్వహించడం, ప్రత్యేక పూజలు లేవంటూ దేవాదాయ ధర్మాదాయశాఖ ప్రకటించిన నేపథ్యంలో కొందరు నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నారు. పోలీసుల పర్యవేక్షణ ఉండడంతో ఆదివారం అర్ధరాత్రి యువత సందడి కనిపించలేదు. వ్యాను ఢీకొని ముగ్గురు మృతి చెందిన నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను కట్టడి చేశారు. సోమవారం ఆలయాలకు చేరుకుని పూజలు చేయించారు. వేదపండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. నంద్యాలరోడ్డులోని ఆదివారం అర్ధరాత్రి ప్రార్థనా మందిరాల్లో క్రిస్టియన్ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసును కీర్తిస్తూ పాటలు పాడారు.

◆ నియోజకవర్గంలోని తెదేపా, వైకాపా నాయకులు, కార్యకర్తలు ప్రొద్దుటూరు ఉంటున్న శాసనసభ్యుడు రఘురామిరెడ్డిని, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పురపాలిక ఛైర్మన్ రంగసింహను కొందరు నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

చాపాడు : ప్రతి ఒక్కరూ గత స్వభావాలను విడిచి నూతన సంవత్సరంలో నవీన స్వభావం ధరించుకుని మంచిగా జీవించాలని సీఎస్‌ఐ మైదుకూరు డివిజినల్ ఛైర్మన్ పాస్టర్ ఆనందరావు తెలిపారు. సోమవారం కేతవరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భద్రిపల్లె, చిన్నగురువలూరు, చాపాడు, పల్లవోలు చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

చాపాడు : నూతన సంవత్సరంలో మండల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మండల అధ్యక్షురాలు వెంకటలక్షుమ్మ ఆకాంక్షించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైకాపా నాయకులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామదాసు మాట్లాడుతూ మంగళవారం నుంచి జరగనున్న జన్మభూమి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జడ్పీటీసీ సభ్యుడు బాలనరసింహారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సానా నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

ఖాజీపేట : ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరమణ అధికారులతో కలిసి కేకు కోసి పంచిపెట్టారు. ఆర్‌ఈఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ మద్దిలేటిరెడ్డి అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కేక్‌కోసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. తెదేపా నియోజకవర్గ బాధ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి, ఎంపీపీ గుజ్జల సుమలత, జడ్పీటీసీ సభ్యురాలు డి.లక్ష్మిదేవి, తెదేపా రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డిని పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దువ్వూరు : తెదేపా నియోజకవర్గ బాధ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డిని తెదేపా నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండల కన్వీనర్ గోపిరెడ్డి బాబు, ఉపాధ్యక్షుడు శేగినేని వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి పంగా సుబ్బరాయుడు, కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ పెంచికలపాటి రమణయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సేవలకు 108

మైదుకూరు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ఖాజీపేట, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకుని పేదలకు తమ వంతు సాయం అందించాలని రైతు సంఘం నాయకులు డి.ఎన్.ఎరికల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పిచ్చపాటిపల్లెకు చెందిన పి.రాజశేఖర్‌రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం సోమవారం సీతానగరం, పత్తూరు దళితవాడ, బుడ్డాయపల్లె, పిచ్చపాటిపల్లెలోని వికలాంగులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి మఖ్య అతిథిగా ఎరికల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను ప్రేమంచి వారి యోగక్షేమాలను చూసుకోవాల్సిన బాధ్యల బిడ్డలపై ఉందన్నారు.

చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ

చాపాడు, న్యూస్‌టుడే : మండలంలోని సిద్దారెడ్డిపల్లె ప్రభుత్వ చౌకదుకాణంలో చంద్రన్న సంక్రాంతి కానుకలు అందజేశారు. సోమవారం సర్పంచి రమణమ్మ చేతులుమీదుగా ఆరు రకాల సరకులు అందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.


సరకులను అందిస్తున్న సర్పంచి రమణమ్మ

కాలమానిని ఆవిష్కరణ


మైదుకూరు : దైనందిని ఆవిష్కరిస్తున్న డీఈవో శైలజ, ఎంఈవో పద్మలత, యూనియన్ నాయకులు

మైదుకూరు, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య దైనందిని, కాలమానిని సోమవారం మైదుకూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద విద్యాశాఖజిల్లా అధికారి పి.శైలజ ఆవిష్కరించారు. ఎంఈవో పద్మలత, యూనియన్ నాయకులు రవికుమార్, ఎంజే రాయప్ప, రాంభూపాల్‌రెడ్డి, పీర్‌బాషా, గురుప్రతాప్, నారాయణ, కొండారెడ్డి, రవిప్రకాష్, రత్నం పాల్గొన్నారు. కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానం రద్దు చేయాలని, పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలని, 11వ పీఆర్సీ కమిటీ వేయాలని నాయకులు డిమాండు చేశారు.

● రాష్ట్రోపాధ్యాయ సంఘ నాయకులు మండల ప్రత్యేక అధికారి, డీఈవో శైలజ, ఎంఈవో పద్మలత, తహసీల్దారు నాగేశ్వరరావు, బాధ్య ఎంపీడీవో రామానుజంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. సంఘ నాయకులు బీకేసురేష్, సయ్యద్‌మీర్‌సాబ్, చంద్రశేఖర్, మనోహర్, రామయ్య, చెన్నకేశవరెడ్డి, మల్లేశ్వరరెడ్డి, పాలకొండయ్య పాల్గొన్నారు.

దువ్వూరు : రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) నూతన సంవత్సర కాలమానిని మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో సుబ్బరాయుడు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఎస్టీయూ నాయకులు వీరారెడ్డి, నాగేంద్ర, పట్నాయక్ రామయ్య, బాబు, రమేష్, నాగరాజు తదితరులు ఎంఈవోకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చాపాడు, న్యూస్‌టుడే : తెలుగుయువత మండల అధ్యక్షుడు నారపురెడ్డి, పుట్టా యువసేన నాయకుడు నాగరాజు ప్రత్యేకంగా కాలమానిని తయారుచేయించారు. సోమవారం తెదేపా నియోజకవర్గ బాధ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ చేతుల మీదుగా కాలమానిని ఆవిష్కరించి కార్యకర్తలకు అందించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మేకల వెంకటరమణ, హరి, బాలరాజు, యాపరాల సుబ్బారావు పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల తిష్ట

జన్మభూమిలో అయినా పరిష్కారం అయ్యేనా?

విశ్వనాథపురం(చాపాడు), న్యూస్‌టుడే : మండలంలోని అల్లాడుపల్లె, విశ్వనాథపురం గ్రామపంచాయతీల్లో సమస్యలు తిష్టవేశాయి. పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. రెండు గ్రామాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలు ఏళ్లతరబడి అర్ధంతరంగా ఆగిపోయాయి. మంగళవారం ఈ గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు జరగనున్నాయి. అధికారులు పర్యటించి సమస్యలు పరిష్కారిస్తారని స్థానిక ప్రజలు ఎదురుచూస్తున్నారు. అల్లాడుపల్లె పంచాయతీని స్వచ్ఛభారత్ కింద ఎంపికచేసి ఇంటింటి చెత్తసేకరణకు బుట్టలు ఇవ్వగా వాటిని పంచాయతీ కార్యాలయంలో మూలనపడేశారు. చెత్తను సేకరించే మూడుచక్రాల సైకిళ్లు సర్పంచి ఇంటివద్ద నిరుపయోగంగా తుప్పుపడుతున్నాయి. డిజిటల్ పంచాయతీగా ఎంపికచేసి కంప్యూటర్‌ను అందించారు. ప్రారంభంలో ఆపరేటర్‌ను నియమించినా తర్వాత వారి సేవలు నిలిచిపోయాయి. కంప్యూటరును మండల కేంద్రంలో వినియోగిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రం సమీపంలో మురుగు కాల్వలు సరిగాలేక ఆయకట్టుకు అందించే సాగునీరు ఇళ్ల ముందు ప్రవహిస్తోంది. ఆలయాల వద్ద తాగునీటి పథకం గొట్టాలు దెబ్బతిని నీరు వృథా అవుతోంది. ఆరు నెలలుగా ఇదే పరిస్థితి. ఇలాగే వదిలేస్తే రానున్న రోజుల్లో తాగునీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దెబ్బతిన్న గొట్టాలకు మరమ్మతుచేసి నీటి వృథాను అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.


పూడికతోనిండిన మురుగుకాల్వ


నీటిపథకానికి అల్లుకున్న పిచ్చిమొక్కలు

● విశ్వనాథపురం గ్రామంలో మురుగుకాల్వలు పూడికతో నిండిపోయాయి. స్నానపుగదులు, ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య వారోత్సవాల్లో రోడ్డుకు ఒకవైపు మురుగు కాల్వలో జేసీబీతో పూడికతీశారు. మరోవైపు తీయకుండా వదిలేశారని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితంలేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యపై ఈవోపీఆర్డీ సుబ్బారెడ్డిని వివరణ కోరగా పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'జన్మభూమి- మాఊరు' విజయవంతం చేయండి

దువ్వూరు, న్యూస్‌టుడే : జన్మభూమి- మాఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో సభాభవనంలో సోమవారం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ప్రజాసమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గత జన్మభూమిలో పింఛన్లు, బియ్యంకార్డులు, పక్కాగృహాలు, ఇతర సమస్యలపై వచ్చిన వినతులకు సంబంధించిన నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు. తహసీల్దారు ఎస్.రవిశంకర్‌రెడ్డి, ఎంపీడీవో ఎ.వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు : మండలంలో మంగళవారం నాలుగుచోట్ల జన్మభూమి గ్రామసభలు నిర్వహించనున్నారు. పురపాలిక పరిధిలోని కేశలింగాయపల్లె, శెట్టివారిపల్లె, ఎల్లంపల్లె, మండలంలోని వనిపెంటలో గ్రామసభలు నిర్వహిస్తారు.

మార్పుతోనే మనుగడ


టమోటాల ట్రేలపై కూర్చున్న యువకులు



ధాన్యం బస్తాలపై కూలీలు

పెరుగుతున్న రహదారి ప్రమాదాలపై ప్రతిఒక్కరూ ఆలోచించాలి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి క్షేమంగా ఇంటికి తిరిగొస్తారనే నమ్మకం లేని పరిస్థితులు నెలకొన్నాయి. మనమే కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. మైదుకూరు ప్రాంతంలో అరటి, టమోటా ఉత్పత్తులను వాహనాల్లో తరలించే సమయంలో కూలీలు ఎత్తుగా పేర్చిన పెట్టెలపైనే కూర్చుంటున్నారు. ట్రాక్టర్లలో ధాన్యం తరలించే సమయంలోనూ కూలీలు అలానే చేస్తున్నారు. రహదారిలో వాహనాలు వెళ్తూ అదుపుతప్పిన సందర్భాలు అనేకం. వాహనాలపై కూర్చుని ప్రయాణించడం ప్రమాదకరమని భావించాలి. సురక్షిత ప్రయాణం దిశగా అడుగులు వేయాలి. మార్పుతోనే మనుగడ ఉంటుందనే విషయాన్ని గుర్తెరగాలి.

- మైదుకూరు, న్యూస్‌టుడే

పల్లె కబుర్లు


అగ్రహారంలో విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న పచ్చిమొక్కలు

● **అగ్రహారం :** అగ్రహారంలోని కేసీ కాల్వ సమీపంలో వీధిచివరన ఉన్న కరెంటు స్తంభానికి పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని కాలనీవాసులు అంటున్నారు. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించి సమస్య లేకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● **చెముళ్లపల్లె :** చెముళ్లపల్లె బీసీ కాలనీలో విద్యుత్తు తీగలు కిందికి వేలాడున్నాయి. కొన్నిచోట్ల చేతికి అందే ఎత్తులో ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీగలను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్థులు విన్నవిస్తున్నారు.

● **బెస్తకాలనీ :** పత్తూరు బెస్తకాలనీలో వీధులు సిమెంటు రోడ్లకు నోచుకోలేదు. గతంలో వేసిన మట్టిదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. గుంతలమయంగా మారిన దారుల్లో రాకపోకలు సాగించాలంటే మహిళలు, పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

● **కూనవారిపల్లె :** కూనవారిపల్లె ప్రభుత్వ పాఠశాల ప్రహరీ దెబ్బతిని శిథిలమైంది. విద్యార్థులకు రక్షణ లేకుంది. పశువులు పాఠశాల ఆవరణలోకి వచ్చి అపరిశుభ్రం చేస్తున్నాయి. ప్రహరీ ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకండా చూడాలి.

- ఖాజీపేట, న్యూస్‌టుడే

సమానత్వ సాధనే సేవా సమితి లక్ష్యం

దువ్వూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చూసి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే జై భీమ్ సామాజిక సేవా సమితి లక్ష్యమని ఆ సమితి అధ్యక్షుడు బి.ఎస్.జయరాం అన్నారు. ఎంపీడీవో సభా భవనంలో సోమవారం జైభీమ్ సేవా సమితి సంస్థ ఆవిష్కరణ, సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు మాట్లాడుతూ అన్ని వర్గాల్లో డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి బడిలో చేర్చుట, వృద్ధులకు చేయూత, దివ్యాంగుల హక్కుల సాధనకు కృషి, ఇళ్లులేని పేదలకు స్థలాలు మంజూరు చేయించడం తదితర సమస్యలను పరిష్కరించడమే సమితి ముఖ్య ఉద్దేశమన్నారు. సమితిలోని ప్రతి ఒక్కరూ లక్ష్యసాధనకు కృషిచేయాలని సూచించారు.

పైపులైను దెబ్బతిని ఆగిన నీటిసరఫరా

వల్లూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రం వల్లూరులో రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. నూతన సంవత్సరం తొలిరోజు సోమవారం వల్లూరు వాసులు బిందెలు తీసుకొని చేతిపంపుల వద్దకు పరుగులు తీశారు. శనివారం వల్లూరులోని తాగునీటి ట్యాంకు వద్ద జేసీబీతో నిర్వహిస్తున్న పనుల కారణంగా తాగునీటి పైపులైను పగిలిపోయింది. దీంతో ఆదివారం నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సోమవారం నూతన సంవత్సరం రోజున తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై కార్యదర్శి శారదారెడ్డిని అడుగగా పైపు పగిలిపోయిందని పైపులు విడిభాగాలు సిద్ధం చేశామని కూలీలు దొరకక పనులు చేయించలేకపోయమన్నారు.

ప్రొద్దుటూరు

దివ్యాంగులకు చేయూత

ప్రొద్దుటూరు పురపాలిక, న్యూస్‌టుడే: మానవ జన్మ చాలా పవిత్రమైనది. తోటి మానవులకు తోడ్పడి చేయూతనిచ్చే సేవాగుణాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ వెంకటశివారెడ్డి సూచించారు. గాజులపల్లె పెద్ద సుబ్బయ్య, పెద్ద సుబ్బమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం సమితి అధ్యక్షుడు రామచంద్రుడు అధ్యక్షతన సీఐ 26 మంది దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.200 చొప్పున అందించారు. ఎస్ఐలు చిన్నపెద్దయ్య, ఖాన్, సమితి సభ్యులు సుబ్బరాయుడు, సంజీవరాయుడు, గుర్రప్ప సొంత నిధులతో బిస్కెట్లు, మిరపబజ్జీలు, కేకులు పంచారు. పుష్పరాజు, గోవిందరాజులు, శ్రీధర్, నరసింహులు, సుబ్బయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యుత్తు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి




ఆర్.కృష్ణయ్యతో బీసీ విద్యుత్తు ఉద్యోగులు

మైదుకూరు రోడ్డు(ప్రొద్దుటూరు), న్యూస్‌టుడే: బీసీ కులానికి చెందిన విద్యుత్తు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు నిచ్చారని బీసీ విద్యుత్తు ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బైరగాని జైరామ్ తెలిపారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో 13 జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొని, రాష్ట్ర వ్యాప్తంగా బీసీ విద్యుత్తు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించామని చెప్పారు. అనంతరం సమావేశంలో బీసీ విద్యుత్తు ఉద్యోగుల రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా వీరభద్రయ్యను, రాష్ట్ర కార్యదర్శిగా గణేశ్వరరావును ఎన్నుకున్నారని జైరామ్ తెలిపారు. జనవరి 8న విజయవాడలో బహిరంగ సభను నిర్వహిస్తున్నామని రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు పదివేల మంది బీసీ విద్యుత్తు ఉద్యోగులు పాల్గొననున్నారని ఆయన పేర్కొన్నారు. అందరం కలసికట్టుగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని కోరారు.

సుస్థిర జీవనోపాధితోనే అభివృద్ధి

మైలవరం, న్యూస్‌టుడే: సుస్థిర జీవనోపాధితోనే అభివృద్ధి సాధ్యమని దాల్మియా పరిశ్రమ అధిపతి అనిల్‌బజాజ్ పేర్కొన్నారు. సోమవారం దాల్మియా పరిశ్రమలో నవాబుపేట పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ పరిసర గ్రామాల్లో జీవనోపాధి కోసం సహకరిస్తామన్నారు. గత సంవత్సరకాలంలో పాల ఉత్పత్తిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. ఉత్తమ మహిళగా దండు మేరమ్మ, ద్వితీయ ఉత్తమ మహిళగా పట్నం రంగీలమ్మలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దాల్మియా టెక్నికల్ హెడ్ కరుణాకరన్, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఛైర్మన్ ప్రమీలమ్మ, దాల్మియా సిబ్బంది శ్రీనివాసులు, రాజేష్‌కుమార్, గురప్ప, నాగార్జున, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో మార్కెట్ ధరలు (నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
టమోటాలు	10
పచ్చిమిరప	30
బెండకాయలు	50
మటిక్కాయలు	42
వంకాయలు	30
బీట్‌రూట్	50
బంగాళదుంప	30
కాకర	50
క్యాలీఫ్లవర్ (ఒక పువ్వు)	50
అల్లం	70
చిక్కుడు	40
క్యారెట్	70
ఎర్రగడ్డలు (పాతవి)	50
ఎర్రగడ్డలు (కొత్తవి)	66
క్యాబేజీ	42
మునక్కాయలు	50
బీన్స్	120
దొండ	30



మాంసం ధరలు

	కిలో (రూ)
మటన్	420
చికెన్	150
చికెన్ స్కిన్‌లెస్	160
నాటుకోడి మాంసం	320
100 గుడ్లు	500
చేపలు	130

తెరపై ఈనాడు

బీవీఎస్ : గరుడ వేగ

వెంకటేశ్వర : ఎంసీఏ **సుధ :** హలో **అర్చన :** జై లవకుశ, **ఆరవేటి :** ప్రాజెక్ట్

శ్రీసాయిరాజేశ్వరి సినీహబ్ : ఒక్క క్షణం, జుమన్‌జి, 2 కంట్రీస్

కాలమానిని ఆవిష్కరణ

మైదుకూరు, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య డైనందిని, కాలమానిని సోమవారం మైదుకూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద విద్యాశాఖజిల్లా అధికారి పి.శైలజ ఆవిష్కరించారు. ఎంఈవో పద్మలత, యూనియన్ నాయకులు రవికుమార్, ఎంజే రాయప్ప, రాంభూపాల్‌రెడ్డి, పీర్‌బాషా, గురుప్రతాప్, నారాయణ, కొండారెడ్డి, రవిప్రకాష్, రత్నం పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది.. ఉప్పరపల్లె ఎస్సీ కాలనీ రోడ్డు పక్కన పోగైన కసువు వ్యర్థాలు. 181 కుటుంబాలకుగాను 629 మంది జనాభా ఉన్నారు. చెత్త వ్యర్థాలను కుళ్లబెట్టి సేంద్రియ ఎరువుగా తయారు చేసేందుకు స్థలాభావం వేధిస్తోంది.



గోపవరం బైపాస్ రోడ్డు పక్కన పోగైన కసువు వ్యర్థాలకు పెట్టిన నిప్పుతో పొగ, కాలుష్యం వాతావరణంలోకి కలుస్తున్నాయి ఇలా..

తరగని వ్యర్థాలు

సేంద్రియ ఎరువుల తయారీ కాగితాలకే పరిమితం

చెత్త నుంచి సంపదకు స్థలాల కొరత

కొత్తఖాదరబాదు(ప్రొద్దుటూరు గ్రామీణ), న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాలకు సంబంధించి గ్రామ పంచాయతీలలో చెత్త నుంచి సంపద తయారీ ప్రక్రియ.. కాగితాలకు మాత్రమే పరిమితమవుతోంది. ముందస్తుగా రెవెన్యూ పరంగా స్థలాలకు కొరత తీవ్రంగా ఉంది. దీంతో కుళ్లిపోయే వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులుగా తయారు చేసేందుకు యంత్రాంగానికి అవకాశాలు లేవు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఊరి బయట, లోపల అడుగడుగునా చెత్త కుప్పలు తరగిపోకుండా గుట్టలుగా పోగవుతున్నాయి. దీంతో పర్యావరణ ప్రయోజనాలకు విఘాతం ఏర్పడుతోంది. అపరిశుభ్రత, అనారోగ్య సమస్యలకు దారితీస్తోంది.

కలెక్టరుకు పంపని నివేదిక

జిల్లా వ్యాప్తంగా పంచాయతీల వారీగా కసువు వ్యర్థాల నిల్వ కోసం 20 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు రెవెన్యూ స్థలాలను గుర్తించాలని తహసీల్దార్లకు 2017 అక్టోబరు 2న కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛత అమలు కోసం ప్రైవేటు భూములను కొనుగోలు చేసే ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. ప్రొద్దుటూరు మండలంలోని చౌడూరులో 50 సెంట్లు, నంగనూరుపల్లెలో 30 సెంట్లు, 20 సెంట్లు చొప్పున కొత్తపల్లె, కల్లూరులో, కాకిరేనిపల్లెలో 10 సెంట్లు చెత్త నిల్వల కోసం సర్కారు స్థలాలను గుర్తించారు. ఇప్పటికి నాలుగు నెలలు గడిచినా స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు నివేదిక పంపలేదు. కేవలం దానిని కాగితాలకే పరిమితం చేస్తున్నారు. దీంతో చెత్త నుంచి సంపద తయారీ చేయాలన్న లక్ష్యం నీరుగారుతోంది. రాజుపాళెం మండలంలో కూడా ఇదే పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రొద్దుటూరు మండల పరిధిలో..

ప్రొద్దుటూరు మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలలో 24,573 కుటుంబాలకుగానూ 96,162 మంది జనాభా ఉన్నారు. 2-7 రోజులకొకసారి ఇళ్ల నుంచి కసువు వ్యర్థాలను సేకరిస్తున్నారు. వాటిని తడి, పొడి చెత్తగా విభజనతోపాటు కుళ్లిపోయే వ్యర్థాల నుంచి సేంద్రీయ ఎరువుల తయారీ పనులకు జాడ లేదు. పక్కాగా స్థలాలు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ కసువు వ్యర్థాలను పడేస్తున్నారు. రహదారులు, వీధులు, నడకదారుల్లో కంపుకొడుతున్న చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో అపరిశుభ్రత, పర్యావరణ పరంగా సమస్యలకు దారితీస్తోంది. చెత్తను సంపాదనకు వనరుగా మలుచుకోవాలంటే స్థలాలను సాకుగా చూపుతున్నారు. దీనిపై అధికారులతోపాటు పాలకులు చోద్యం చూస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు చివరకు కాల్వల్లోని మురుగు ప్రవాహాన్ని అడ్డుకోవడంతో మురుగు నిల్వ, అనారోగ్య పరిస్థితులు ఎదురవుతున్నాయి. పరిసరాలను కలుషితం చేయకుండా పంచాయతీ కార్యదర్శుల్లో బాధ్యత, జవాబుదారీతనం కొరవడుతోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో చెత్త నుంచి సంపద సృష్టించాలన్న లక్ష్యం కలగా మారుతోంది.

రాజుపాళెం మండల కేంద్రంగా..

రాజుపాళెం మండలంలో 8,601 కుటుంబాలుండగా 32,819 మంది జనాభా ఉన్నారు. రాజుపాళెం గ్రామంలో 40 సెంట్లు స్థలంలో చెత్త నుంచి సంపద తయారీ పనులు జరగుతున్నాయి. సర్పంచి సానా వెంకటసుబ్బారెడ్డి, కార్యదర్శి పుల్లారెడ్డి జోక్యం వలన వానపాముల తయారీ తొట్లు వినియోగంలో ఉన్నాయి. సేంద్రియ ఎరువుల తయారీ వలన కేంద్రం నుంచి ప్రశంస, పురస్కారానికి ఎంపికకావడం గమనార్హం. మిగితా 14 పంచాయతీలలో స్థలాల కొరత వలన చెత్త నుంచి సంపద తయారీ అవకాశాలు లేవు.

నివేదిక పంపాలి

పనిభారం, ఇతర విధులు వలన కసువు వ్యర్థాల నిల్వల కోసం ఎంపిక చేసిన స్థలాలపై నివేదిక కలెక్టరేట్ కార్యాలయానికి పంపడంలో జాప్యం ఉంది. సత్వరంగా జాబితా తయారీ చేసి కలెక్టర్‌కు పంపాలని సర్వేయరును ఆదేశించాం.

- వెంకటరెడ్డి, తహసీల్దారు, ప్రొద్దుటూరు.

5వ రోజుకు చేరిన చేనేత పింఛనుదారుల దీక్షలు



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న కవి జింకా సుబ్రహ్మణ్యం

ప్రొద్దుటూరు పురపాలిక, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులో పురపాలక సంఘం కార్యాలయం ఎదుట కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 5వ రోజుకు చేరాయి. గత మూడు నెలలుగా చేనేత పింఛను డబ్బులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నందుకు నిరసనగా చేనేత పింఛనుదారులు చేపట్టిన దీక్షలకు మద్దతుగా వైకాపా ఎమ్మెల్యే, పార్టీ నేతలు, కౌన్సిలర్లు, కార్యకర్తలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన 77 మంది చేనేత పింఛనుదారులకు డబ్బులు ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి మాటను శిలాశాసనంలా పాటించడం దారుణమని కలెక్టరును చేనేత కార్మికులు విమర్శించారు. ఉన్నతాధికారి రాజకీయ నేతల మాటలు విని, అధికారాన్ని అపహాస్యం చేయడమేనని వారు పేర్కొన్నారు. పామిలేటి, లక్ష్మణస్వామి, కె.రామాంజనేయులు, ఈశ్వరయ్య తదితరులు దీక్షలలో కూర్చున్నారు. వీరికి కవి జింక సుబ్రహ్మణ్యం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. విపక్షనేత వి.మురళీధర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసనలు

ఆర్టీపీపీ (ఎర్రగుంట్ల), న్యూస్‌టుడే: ఆర్టీపీపీ విద్యుదుత్పత్తి కేంద్రంలో ఒప్పంద కార్మికులు చేస్తున్న నిరసనలు సోమవారానికి 15వ రోజుకు చేరాయి. ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు ఒప్పంద కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆర్టీపీపీ రెండో గేటు ఎదురుగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. విద్యుత్తు సంస్థల్లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఐదు డిమాండ్లను పరిష్కరించేవరకు సమ్మెబాటలో నడుస్తామని వారు తెలిపారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు తీసుకున్న కార్యాచరణను కార్మికులు విధిగా పాటిస్తూ నిరసనలు చేపట్టినట్టు వారు తెలిపారు. నాయకులు సాంబశివారెడ్డి, దేవగిరిరెడ్డి, విజయకుమార్, నాగార్జున్‌రెడ్డి, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేస్తున్న విద్యుత్తు ఒప్పంద కార్మికులు

ప్రొద్దుటూరు

మదరసాలో అన్నదానం

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కనున్న మదరసా ఏరియాజుల్ ఉలూం వద్ద సోమవారం రిటైర్డ్ ఎస్సై షేక్ మియా ఉద్యోగ విరమణ సందర్భంగా 120 మంది విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు.


సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


ఎమ్మెల్యేకు గజమాల వేసిన కార్యకర్తలు, అభిమానులు


వరదకు ఆసం శుభాకాంక్షలు

ఘనంగా నూతన సంవత్సర సంబరాలు

ప్రొద్దుటూరు పురపాలిక, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సర సంబరాలు సోమవారం సిరిపురంలో అంబరమంటాయి. ఆదివారం అర్ధరాత్రి కొత్త సంవత్సరం 2018లోకి ప్రవేశించిన వెంటనే పట్టణవాసులు భారీగా బాణసంచా పేల్చారు. యువత వీధుల్లోకి వచ్చి కేరింతలు కొట్టారు. చరవాణుల్లో పలకరింపులు, శుభాకాంక్షలు, సందేశాలు, చాటింగులతో ప్రేమ, స్నేహ పూర్వకమైన హాలో అంటూ ఆనందాలు పంచుకున్నారు. కుల, మత, రాజకీయ, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల వారు నూతన సంవత్సర వేడుకలను కన్నుల పండువగా జరుపుకున్నారు. పూలమాలు, పండ్లు పరస్పరం ఇచ్చుకొని, ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

★ పురపాలక ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి నియోజకవర్గ తెదేపా బాధ్యుడు వరదరాజులురెడ్డిని ఆ పార్టీ కార్యాలయంలో కలిసి పూలమాల వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత పుర ఛైర్మన్ ఇంటికి కమిషనరు బండి శేషన్న, అధికార బృందం కలిసి వెళ్లి పూలగుచ్ఛాలు అందించి ఛైర్మన్‌కు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఛైర్మన్ కేకు కత్తిరించి, నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. పట్టణ తెదేపా మాజీ అధ్యక్షుడు ఘంటసాల వేంకటేశ్వర్లు, కౌన్సిలర్లు శివకుమార్, తలారి పుల్లయ్య, పిట్ట శ్రీనివాసులు, మార్తల రామమునిరెడ్డి, భ్రమరాంబ, జె.రామాంజనేయులరెడ్డి, కె.ఆనంద్, జయశంకర్, కందుకూరి అనసూయ, తెదేపా నేతలు ఫరీద్, నూరి, సోమా బాలయ్య, కుండ నాగరాజు, వెంకటకొండయ్య, వ్యాపార సంఘాల వారు తరలి వచ్చి పుర ఛైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

★ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తన స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. తొలుత కేకు కత్తిరించి, పలువురి నాయకులకు తినిపించారు. అనంతరం నూతన సంవత్సరంలో ప్రొద్దుటూరు అభివృద్ధి ప్రథంలో నడవాలని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తలు, అభిమానులు గజమాల వేసి ఎమ్మెల్యేను అభినందించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

★ ఏపీ పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్ మల్లేల లింగారెడ్డి ఇంట్లో నూతన సంవత్సర వేడుక ఘనంగా జరిగింది. పార్టీ నేతలు, కార్యకర్తలు వచ్చి లింగారెడ్డికి పూలమాలలేసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేకు కత్తిరించి, ఒకరినొకరు తినిపించుకున్నారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.ముక్తియార్, ఆయన తనయుడు షేర్‌అలీ లింగారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి లింగారెడ్డిని కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

★ బీసీ సీమాంధ్ర సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ ఇంట కొత్త సంవత్సర సందడి కనిపించింది. చల్లా రాజగోపాల్‌కు బీసీలందరూ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కేకు కట్ చేశారు. అభిమానులు, కుల పెద్దలందరికీ ఫలహారాన్ని సమకూర్చారు.

★ ఉక్కు పరిశ్రమ సాధన సమితి అధ్యక్షుడు జి.వి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి కుల, మత సంఘాలు, విద్యాసంస్థలు, విద్యార్థి సంఘాల సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సమితి కార్యాలయంలో కేకు కోసి కొత్త సంవత్సర సంబరాలు జరిపారు. 2018లో ఉక్కు పరిశ్రమ స్థాపన చేసేందుకు ప్రభుత్వంపై మరింత ఒత్తిడి చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

★ నూతన సంవత్సరంలో నవ్వుతూ సుఖంగా, ఆరోగ్యంగా జీవించాలని పశువైద్య కళాశాల ప్రిన్సిపల్ ఆనంద్‌రావు పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కొత్త సంవత్సర వేడుకను మదర్ థెరిస్సా అనాథ, వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. కేకు కత్తిరించి అందరికి పంచిపెట్టారు. అనంతరం ఆశ్రమానికి గ్రీజరు, సైకిల్, నీళ్ల పైపు, వాటర్ ప్యూరిఫైర్ యంత్రం, వృద్ధులకు ఊతకర్రలు, బియ్యం తదితర వాటిని ఉచితంగా పంపిణీ చేశారు. అధ్యాపకులు కల్యాణ చక్రవర్తి, ఇందిర, ప్రసాద్‌రావు, సాయి దిలీప్, గుప్త, మహేష్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

మైదుకూరు రోడ్డు(ప్రొద్దుటూరు): నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం పట్టణంలోని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం రాత్రి 11 గంటల నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు కుటుంబ సభ్యులతో ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం కేకులను కత్తిరించి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తర్వాత పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని సీఎస్ఐ, ఆర్సీఎం, ఎస్వీజీ 1, 2, 3లలో, కాలనీలోని గోల్డెన్ జూబ్లీ చర్చిలలో నూతన సంవత్సవ వేడుకలు నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

★ **చిన్నశెట్టిపల్లె(రాజుపాళెం):** నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని మాజీ ఎంపీపీ, తెదేపా నాయకుడు ఎం.ప్రభాకరరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు చిన్నశెట్టిపల్లెలోని ప్రభాకరరెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథరెడ్డి, రఘునాథరెడ్డి, దస్తగిరి, క్రిష్ణారెడ్డి, పగిడాల రామచంద్రారెడ్డి, వెల్లాల సుదర్శనరెడ్డి, గంగిరెడ్డి, ప్రభాకరరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


పౌర సరఫరాల ఛైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు


రాజుపాళెం: మాజీ ఎంపీపీ ప్రభాకరరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


చల్లా రాజగోపాల్‌తో బీసీ నాయకులు

కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు పత్రాల పంపిణీ

రామేశ్వరం(ప్రొద్దుటూరు గ్రామీణ), న్యూస్‌టుడే: స్థానిక ఆర్ట్సు కళాశాల రోడ్డులోని డాక్టర్ అబ్దుల్‌కలాం భవన నిర్మాణ, కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 45 మంది కూలీలకు ప్రభుత్వ గుర్తింపు పత్రాలను పంపిణీ చేశారు. సోమవారం సంఘం అధ్యక్షుడు పద్మ వీరన్న అధ్యక్షతన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాపీ, సెంట్రింగ్, కార్పెంటర్, పెయింటింగ్ పనుల్లో నిపుణులైన 45 మందికి ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందే లబ్ధిదారులుగా ఉంటారన్నారు. దీంతో కార్మికుల కుటుంబంలో ఇద్దరు కుమార్తెలకు, మహిళా కార్మికురాలు కాన్పునకు రూ.20 వేలు సాయం అందజేస్తారని తెలిపారు. పెళ్లి కూతురుకు రూ.20 వేలు నగదు ఇస్తారన్నారు. 18 ఏళ్లు దాటిన కార్మికులెందరో ప్రభుత్వ గుర్తింపు పత్రాలకు దూరంగా ఉంటున్నారన్నారు. తమ సంఘం తరఫున చైతన్యం, అవగాహన కల్పించడంతో వారిని సభ్యులుగా నమోదు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గుర్తింపు పత్రం ఉంటే ఉచితంగా వైద్య సదుపాయాలకు అవకాశం ఉంటుందన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు గురుమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మ వినోద్, కార్యదర్శి క్రిష్ణారెడ్డి, మేస్త్రీ రాజు పాల్గొన్నారు.


కూలీలకు గుర్తింపు పత్రాలను అందజేస్తున్న భవన నిర్మాణ యూనియన్ నాయకులు

నేటి నుంచి జన్మభూమి గ్రామసభలు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలలో ఈనెల 2 నుంచి 11వ తేదీ వరకు 5వ విడత జన్మభూమి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు రెండు దఫాలుగా గ్రామసభల్లో సమావేశాలు ఉంటాయన్నారు. మంగళవారం కాకిరేనిపల్లె, చౌడూరు, 3న పెద్దశెట్టిపల్లె, చౌటపల్లె, 4న కామనూరు, చెన్నమరాజుపల్లె, 5న సోములవారిపల్లె, 6న కల్లూరు, తాళ్లమాపురం, 7న దొరసానిపల్లె, 8న ఉప్పరపల్లె, 9న గోపవరం, 10న నంగనూరుపల్లె, సీతంపల్లె, 11న కొత్తపల్లె పంచాయతీలలో జన్మభూమి కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

★ **రాజుపాళెం:** రాజుపాళెం మండలంలో మంగళవారం నుంచి జన్మభూమి-మాఊరు గ్రామసభలు గోపల్లె నుంచి ప్రారంభం అవుతాయని ఎంపీపీ దివ్యఅనుజ్ఞ తెలిపారు. ప్రజలు పాల్గొని తమ సమస్యలను గ్రామసభలో తెలిపి పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి మూలవిరాట్టు

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఖాజీపేట, న్యూస్‌టుడే : కోటంగరువాయపల్లెలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, సహస్రనామార్చన, తదితర పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాన్ని, మూలవిరాట్టును పూలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రంగాచార్యుల ఆధ్వర్యంలో పూజలు, ఆలయ ఛైర్మన్ సురేష్‌బాబు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

ఖాజీపేట: పుల్లూరు సమీపంలోని నాగనాథేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దంపతులు సందర్శించారు. శివుడికి అభిషేకాలు, అర్చనలు, పూజలు చేయించారు. నూతన సంవత్సరంలో ప్రజలకు శుభం చేకూరాలని దేవుడిని ప్రార్థించినట్లు చెప్పారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యేని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. వైకాపా రాష్ట్రకార్యదర్శి ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి దస్తగిరిబాబు, మండల కన్వీనరు జనార్దన్‌రెడ్డి, పలువురు నాయకులు వెంట ఉన్నారు.

పులివెందుల

నేటి నుంచి ధ్యాన శిక్షణ తరగతులు

వేంపల్లె, న్యూస్‌టుడే: వేంపల్లెలో మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక్కడి రవి పెట్రోల్‌బంకు సమీపంలోని రామచంద్రమిషన్ ధ్యానకేంద్రంలో రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు.

అర్హులు బియ్యపుపత్రాల కోసం దరఖాస్తుచేయాలి

వేముల, న్యూస్‌టుడే: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లో అర్హులైనవారు బియ్యపు పత్రాల కోసం దరఖాస్తుచేసుకోవాలని తహసీల్దార్ చిన్నయ్య సూచించారు. ఈనెల 2 నుంచి జరిగే జన్మభూమి కార్యక్రమంలో అర్హులైనవారిలో వందమందికి బియ్యంపత్రాలను మంజూరుచేయడానికి మండల నోడల్‌అధికారికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు.

చెత్తకుప్పల్లో మొక్కలు.. చేతులు తడిపితేనే పనులు



ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనం-మనం కార్యక్రమంలో ప్రతి ఊరు, రహదారుల్లో మొక్కలు నాటించమని అధికారులుకు అప్పగిస్తే వారు వీటిపై నిర్లక్ష్యం వహించి నాటమని ఇచ్చిన మొక్కలను చెత్త కుప్పల్లో వేశారు. ఈ దృశ్యాలను చుసిన స్థానికులు కొన్ని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజల పనులు జరగాలంటే అధికారులు చేతులు తడిపితేనే పనులు జరిగేది లేకపోతే 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు' చందంగా వ్యవహారిస్తారని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు..

- న్యూస్‌టుడే, తొండూరు

స్థానిక తహసీల్దారు కార్యాలయం వెలుపల చెత్తకుప్పల్లో వేసిన మొక్కలు ఇలా ఎండిపోతున్నాయి..

బ్యాంకులు రైతుల శ్రేయస్సు కోసం పనిచేయాలి

స్టేట్‌బ్యాంకు మేనేజర్ ఈశ్వరరెడ్డి

బలపనూరు (సింహాద్రిపురం), న్యూస్‌టుడే: బ్యాంకులు రైతు శ్రేయస్సుకోసం పనిచేసినప్పుడే రైతులు ఆర్థికంగా బలోపేతం కాగలరని బలపనూరు స్టేట్‌బ్యాంకు మేనేజర్ ఈశ్వరరెడ్డి అన్నారు. బదిలీ అయిన బ్యాంకు మేనేజర్ ఈశ్వరరెడ్డిని సోమవారం బ్యాంకు వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులకు సమస్యకాకుండా రైతులకు ఇబ్బందులు లేకుండా పనిచేయాలని తెలిపారు. అనంతరం ప్రస్తుత మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ రైతులు తీసుకొన్న రుణాలను బకాయిలు లేకుండా చెల్లించాలని, ఇబ్బందులు ఉన్న సమయంలో బ్యాంకు వద్దకు వచ్చి సమస్యను తెలియజేస్తే రైతులకు ఉపయోగపడేలా సహకారం అందిస్తామని ఆయన అన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన మేనేజర్‌ను ఈకార్యక్రమంలో గ్రామ వైకాపా నాయకులు వెలుగోటి చంద్రశేఖర్‌రెడ్డి, రాచమల్లు క్రిష్ణారెడ్డిలు, బ్యాంకు అధికారులు మోహన్‌కుమార్, కిరణ్, చైతన్యకుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, బాలాజీతో పాటుగా సిబ్బంది పాల్గొన్నారు.

నగదు, కోళ్లు స్వాధీనం

కాటగుంటవారిపల్లె(చక్రాయపేట), న్యూస్‌టుడే: కోడిపందాలు ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 26,130లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై గోవింద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నూతన సంవత్సరం, సంక్రాంతి పురస్కరించుకుని గ్రామాలలో కోడిపందాలు, జూదాలపైన విస్తృత దాడులు చేశామన్నారు. సోమవారం మండల పరిధిలోని కాటగుంటవారిపల్లె దగ్గర కోడిపందాలు నిర్వహిస్తున్న కొందరిని పోలీసులు పట్టుకున్నారు. ఏడు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు.



కోళ్లతో పట్టుబడ్డ పందేలు వేసే వ్యక్తులు

జన్మభూమి గ్రామసభలు ఎక్కడ..?

సింహాద్రిపురం, న్యూస్‌టుడే: జన్మభూమి గ్రామసభల వివరాలు తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 3న ముఖ్యమంత్రి చంద్రబాబు పులివెందులలోని జన్మభూమి గ్రామసభలో పాల్గొననుండడంతో ఇక్కడి మండల అధికారులు ఆ పనుల్లో పాల్గొంటూ మండలంలో నిర్వహించాల్సిన సభల వివరాలను తెలియజేయడం లేదు. దీంతో రేషన్, పింఛను, గృహం ఇలా రకరకాల సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న గ్రామీణులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో కృష్ణమూర్తిని వివరణ కోరగా గ్రామసభ వివరాలను వెంటనే తెలియజేస్తామని అన్నారు.

పెద్దకుడాలలో జన్మభూమి సభ వాయిదా

లింగాల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జనవరి 3న పార్నపల్లె పర్యటనతో పాటు, పులివెందుల పురపాలికలో జన్మభూమి-మాఊరు గ్రామ సభకు హాజరవుతుండడంతో పెద్దకుడాల, బోనాల గామాల్లో నిర్వహించే జన్మభూమి-మాఊరు గ్రామ సభను 7వ తేదీ వాయిదా వేశామని ఎంపీడీవో సురేంద్రనాద్ తెలిపారు. ఏడో తేదీ ఆదివారం లింగాలలో నిర్వహించే గ్రామ సభను 11న నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

ఉత్తమ డ్రైవర్లుగా ఎంపిక



ప్రమాదరహిత డ్రైవర్లుగా ఎంపికైంది వీరే

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందుల ఆర్టీసీ డిపోలో డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్ ఆర్‌సీ రెడ్డి, ఎస్వీఎంబాషాలు ప్రమాదరహిత ఉత్తమ డ్రైవర్లుగా ఎంపికైనట్లు ఆర్టీసీ డీఎం అజ్జతుల్లా చెప్పారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సోమవారం ఆయన ఆ డ్రైవర్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఇరువురు డ్రైవర్లు గత 29ఏళ్లుగా ఎలాంటి రోడ్డు ప్రమాదాలు చేయకుండా సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానం చేర్చారని ఆయన చెప్పారు. గతంలో కూడా నాలుగుసార్లు ఉత్తమ డ్రైవర్లుగా అవార్డులు కూడా అందుకున్నారని ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనకు శరవేగంగా ఏర్పాట్లు





ప్రజలు కూర్చునేందుకు పందిరి ఏర్పాటు ఇలా..ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లే దారి ఇదే..

పులివెందుల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి పర్యటన దగ్గర పడడంతో తెదేపా శ్రేణులు, అధికారుల్లో హడావుడి మొదలైంది. ఈ నేపథ్యంలో స్థానిక ధ్యాన్‌చంద్ క్రీడామైదానంలో బుధవారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను సోమవారం శరవేగంగా సాగిస్తున్నారు. గండికోట-పీబీసీఆర్ ఎత్తిపోతల పథకాలకు సంబంధించి పార్నపల్లె సమీపంలో పైలాన్‌ను ఆవిష్కరించి హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి నేరుగా స్థానిక ధ్యాన్‌చంద్ క్రీడామైదానం సమీపంలో 'ల్యాండ్' అవుతారు. ఇక్కడ హెలిప్యాడ్‌ను అందంగా రూపుద్దారు. ఇక్కడ నుంచి సభావేదిక వద్దకు చేరుకునే దారి అద్భానంగా ఉంది. ఈ మట్టిరోడ్డును చదును చేసి చిన్నపరిమాణంలో కంకర పరిచారు. సుమారు 35 వేల మంది ప్రజలు కూర్చొనేందుకు వీలుగా ఉండేలా పందిళ్లు ఏర్పాటుచేశారు. రాయలసీమ తెదేపా నాయకత్వ శిక్షణ శిబిరం డైరెక్టర్ రాంగోపాల్‌రెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ తూగుట్ల రాఘవరెడ్డి, ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధి మండలి కమిటీ ఛైర్మన్ సంద్యాల హేమాద్రిరెడ్డి, తెదేపా పట్టణ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్ నాగరాజు, తెదేపా సీనియర్ నాయకుడు పుచ్చా ప్రసాద్‌రెడ్డిల పర్యవేక్షణలో ఏర్పాట్లు ముమ్మురంగా సాగుతున్నాయి. సభా ప్రాంగణంలో పెద్దఎత్తున ముఖ్యమంత్రి కటౌట్లు ఏర్పాటుచేశారు.



బారికేడ్ల ఏర్పాటుకు గుంతలు తవ్వుతున్న కూలీలు

వైకాపాకు మంచి రోజులు రానున్నాయ్..

వేంపల్లె, న్యూస్‌టుడే: వైకాపాకు త్వరలో మంచి రోజులు రానున్నాయని కడప పార్లమెంటు సభ్యుడు వై.ఎస్. అవినాష్‌రెడ్డి అన్నారు. వేంపల్లెకు చెందిన మండల వైకాపా ప్రచారకమిటీ ఛైర్మన్ బాబాషరీఫ్ నేతృత్వంలో ముద్రించిన దైనందినిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలపై నేతల దృష్టి సారించాలన్నారు. వైకాపా బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతమైన పాదయాత్రకు శ్రీకారం చుట్టారన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేస్తేనే పార్టీకి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పూల కాలేష, వైకాపా నేతలు అనీల్, సుబహాన్, రసూల్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



వైకాపా దైనందినిని ఆవిష్కరిస్తున్న ఎంపీ అవినాష్ రెడ్డి

స్ఫూర్తిదాయకం.. పూర్వ విద్యార్థుల దాతృత్వం

వేంపల్లె, న్యూస్‌టుడే: పూర్వ విద్యార్థుల దాతృత్వంతో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వేముల జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తెలిపారు. మండలంలోని తాటిమాకులపల్లె యోగానంద గురివిరెడ్డి స్వామి ఆశ్రమంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. 1985 - 86లో వేముల జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తిచేసిన వారంతా ఇక్కడ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సదరు పూర్వ విద్యార్థులంతా రూ. 60 వేల విరాళాలు సేకరించి ఆశ్రమానికి అవసరమైన వంట సామగ్రి, కుర్చీలను వితరణగా ఇచ్చారు. రూ. 3 లక్షల మేర విరాళాలు సేకరించి ఆ మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసి, దాని ద్వారా వచ్చే వడ్డీ మొత్తంతో వేముల జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో మంచి గ్రేడింగ్ పాయింట్లు సాధించే ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మేక నరసింహారెడ్డి ఆధ్వర్యంలో భగవద్గీత ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు పూర్వ విద్యార్థులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు పీవీ మోహన్‌రెడ్డి, భగవద్గీత సత్సంగ నిర్వాహకులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





తాటిమాకులపల్లెలో సమావేశమైన పూర్వ విద్యార్థులు... భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు

పులివెందులలో మార్కెట్ ధరలు (నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
టమోట	5
ఉల్లిగడ్డలు	40
బంగాళదుంపలు	20
బెండకాయలు	30
వంకాయలు	20
క్యారెట్	60
ముల్లంగి	30
మిరపకాయలు	30
కాకర	40
చిక్కుడు	40
బీన్స్	30
మటిక్యాయలు	40
బీట్రూట్	40

మాంసం ధరలు



	కిలో (రూ)
మటన్	420
స్కిన్‌లెస్ (చికెన్)	180
100 గుడ్లు	380
డజను	54
చేపలు	100

తెరపై ఈనాడు

సుజాత : హలో
శ్రీనివాస: 2 కంట్రీస్ ,
లక్ష్మి : ఒక్కక్షణం
మారుతి :ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయ్)
వేంపల్లె :
వేంకటేశ్వర- ఎంసిఎ,
తిరుమల - 2 కంట్రీస్,
నూర్జహాన్ - హలో

పులివెందుల

తొండూరులో నూతన ఏడాది వేడుకలు

తొండూరు: పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి నూతన సంవత్సరాన్ని మండల ప్రజలు, ప్రజా నాయకులు, యువజనులు తదితరులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారంఅర్ధరాత్రి సమయం నుంచి వేడుకలు ప్రారంభం మయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా తెదేపా మండలాధ్యక్షుడు మాట్లాడుతూ ఈ కొత్త ఏడాదిలో ప్రతి పేదప్రజలు,చిన్నారులు సంతోషంగా ఉండాలని ఆయన కోరారు.

ఘనంగా నూతన వత్సరానికి స్వాగతం



పులివెందుల గ్రామీణ : భక్తి గీతానికి నృత్యం చేస్తున్న చిన్నారి





పులివెందుల గ్రామీణ : బృంద గీతానికి నృత్యం చేస్తున్న విద్యార్థినులు... నూతన సంవత్సర వేడుకల్లో చిన్నారులు

పులివెందుల గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని ఆరు గ్రామ పంచాయతీల్లో ఉన్న ప్రజలు ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా జరిపారు. కొందరు పిల్లలు, పెద్దలు ఆదివారం రాత్రి 12.00 గంటల వరకు మేల్కొన్నారు. కేకులు కోసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పలు పాఠశాలలు, కార్యాలయాల్లో కూడా ఈ వేడుకలు జరిగాయి. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ఈ ఏడాది అంతా మంచి జరగాలని పూజలు చేశారు.

శిల్పారామంలో.. : పులివెందులలోని శిల్పారామం సోమవారం సాయంత్రం సందర్శకులతో కిక్కిరిసింది. 2018 నూతన సంవత్సరం సందర్భంగా సందర్శకులు వేల సంఖ్యలో తరలివచ్చారు. నాగార్జున ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలకు చెందిన చిన్నారులు సుమారు 40 పాటలకు పైగా నృత్యాలు చేసి అలరించారు. చిన్నారులు లయబద్ధంగా అడుగులు వేస్తోంటే ఆ ప్రాంగణం సందర్శకుల చప్పట్లతో మార్మోగింది. కార్యక్రమంలో పరిపాలనాధికారి సుధాకర్, పాఠశాల కరస్పాండెంట్ శివరామ్‌ప్రసాద్, నృత్య శిక్షకుడు శరవణ తదితరులు పాల్గొన్నారు.

వేముల : నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఈ ఏడాది సాదాసీదాగా జరిపారు. గ్రామాల్లో బాణసంచా పేలుడుకు స్వస్తి పలికారు. చాలామంది కొత్త దుస్తులకు దూరమయ్యారు. పులివెందుల వైకాపా బాధ్యులు వైఎస్ భాస్కరరెడ్డికి వేములకు చెందిన వైకాపా నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ లింగాల ఉషారాణికి ఎంపీటీసీలు, సర్పంచులు వైకాపా నాయకులు అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు, వైకాపా కన్వీనర్ సత్యప్రభావతమ్మ, జడ్పీటీసీ సభ్యుడు శివక్రిష్ణారెడ్డియాదవ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు అందించారు. ఈ సందర్భంగా కేకును కోసి మిఠాయిలను పంచిపెట్టారు. కొంతమంది భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.

ముఖ్యమంత్రి ఫ్లెక్సీల సందడి



పట్టణంలో ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి ఫ్లెక్సీలు

పులివెందుల, న్యూస్‌టుడే: ఈనెల 3న పులివెందులకు రానున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు తెలుగుతమ్ముళ్లు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలి, పార్నపల్లె బస్టాండ్ రింగ్‌రోడ్డు, ముద్దనూరు రింగ్‌రోడ్డు మొదలుకుని స్థానిక ధ్యాన్‌చంద్ క్రీడా మైదానంలో నిర్వహించే ముఖ్యమంత్రి సభా వేదిక వరకు ముఖ్యమంత్రి నమూనా కలిగిన ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. మొత్తం సుమారు 5 కిలోమీటర్ల పొడవునా ఫ్లెక్సీలు, బటర్‌ఫ్లై దీప స్తంభాలకు పార్టీ జెండాలను ఏర్పాటుచేశారు. ఎటుచూసినా పట్టణంలో తెదేపా గుర్తులు, తోరణాలతో కళకళలాడుతోంది. సుమారు 3 వేల ఫ్లెక్సీలు ఏర్పాటుచేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



'బటర్‌ఫ్లై' దీప స్తంభాలకు పార్టీ జెండాలు ఇలా..

వేంపల్లె, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని శాసన మండలి మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం వేంపల్లెలో పార్టీ నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేకును కోసి ఆయన కార్యకర్తలకు పంచి పెట్టారు. తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్(టీఎన్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ముద్రించిన కాలమానినిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు, రాష్ట్ర తెదేపా మైనార్టీ సెల్ మాజీ కార్యదర్శి షబ్బీర్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు నామా వెంకటేష్, మండలశాఖ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాజకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల: పట్టణంలో సోమవారం నూతన సంవత్సర సంబరాలు కమనీయంగా నిర్వహించారు. రాష్ట్ర శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డికి తెదేపా శ్రేణులు, అభిమానులు పూలగుచ్ఛాలు అందజేస్తూ

పులివెందులలో ప్రతి ఎకరాకు సాగునీరే లక్ష్యం

శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కేకును కోసి పలువురికి ఆయన తినిపించారు. అలాగే ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వేంపల్లెలో కేకును కోస్తున్న సతీష్‌రెడ్డి

తల్లిదండ్రులను ఆదరించాలి

లింగాల : కని పెంచిన తల్లిదండ్రులను ఆదరించాలని వారిని జీవిత చరమాంకంలో వృద్ధాశ్రమాల్లో వదలడం దారుణమని పులివెందుల వెంకటప్ప పాఠశాల విద్యార్థులు అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం ఇప్పట్ల లీలావతి వృద్ధాశ్రమంలో మూడు గంటలు దాకా గడిపి కేకు కోసి కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. వృద్ధులతో కేకు కోయించి ఆనందం పంచుకున్నారు. తల్లితండ్రులు ఇచ్చిన డబ్బుతో వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. వెంకటప్ప పాఠశాల ప్రధానాచార్యులు రామచంద్రారెడ్డి ఇందులో పాల్గొన్నారు.

సీఎం రాకతో రూపుదిద్దుకున్న రహదారి

పార్నపల్లె(లింగాల), న్యూస్‌టుడే: గండికోట-పీబీఆర్ ఎత్తిపోతల పథకం 'డెలివరీ పాయింటు' వద్దకు వెళ్లాలంటే బండరాళ్లతో నిండిన ఆ దారిలో ద్విచక్రవాహనం సైతం వెళ్లలేని పరిస్థితి.. ముంపువాసులు స్వగ్రామాలకు వెళ్లాలంటే నరకయాతన పడేవారు. మహిళల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అది నిన్నటి మాట. నేడు ఆదారిలో వెలితే దారి తప్పి వచ్చామన్న భ్రమ కలుగుతుంది నేడు. కారణమేమంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గండికోట-పీబీఆర్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించడానికి బుధవారం వస్తుండటంతో ఆఘమేఘాల మీద చిన్న నీటి పారుదల విభాగ అధికారులు కోనమల్లేశ్వర అడ్డరోడ్డు నుంచి డెలివరీ పాయింటు వరకు బండరాళ్లతో నిండిన రోడ్డును చదునుచేసి మట్టి చల్లారు. నీళ్లు చల్లి రోలింగు చేయడంతో మట్టిదారి తారురోడ్డును తలపిస్తోంది. అలాగే కోనమల్లేశ్వర ఆలయం అడ్డరోడ్డు నుంచి బృహత్తర మంచినీటి పథకం వరకు కంపచెట్లు పెరిగి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.



రూపొందుతున్న రాదారి

కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలి

వేంపల్లె, న్యూస్‌టుడే: కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో సోమవారం పార్టీ నేతలతో కలసి నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా కేకును కోసి కార్యకర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు పూర్వ వైభవం రానుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. ఈ ప్రభుత్వాల హయాంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా లేరని ఆయన తెలిపారు. కాంగ్రెస్‌తోనే ప్రజలకు మంచి రోజులు సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధ్రువకుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, ఉత్తన్న, పార్టీ మండలశాఖ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ఆరుశేర్ల సుబ్బరాయుడు, పార్టీ సేవాదళ్ కన్వీనర్ ప్రసాద్, కాంగ్రెస్ నేతలు వై.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం : ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయమని వేంపల్లె మండలాధ్యక్షుడు మాచిరెడ్డి రవికుమార్‌రెడ్డి అన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం ఆయన పార్టీ నేతల ఆధ్వర్యంలో కేకును కోసి కార్యకర్తలకు అందించారు. గ్రామాల్లోని ప్రజలు ఏవైనా సమస్యలు తమ దృష్టికి తెచ్చిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు శక్తిమేర కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ఎంపీపీ రవి, జడ్పీటీసీ సభ్యుడు షబ్బీర్‌వలి, మండల వైకాపా కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి తదితరులను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల మాజీ జడ్పీటీసీ సభ్యుడు మోరం రెడ్డి రాజారెడ్డి, బక్కన్నగారిపల్లె సర్పంచి కృష్ణానాయక్, చింతలమడుగుపల్లె సహకార సంఘ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గంగరాజు, కటిక చంద్ర, పద్మా జయలక్ష్మిదేవి, హబీబుల్లా, మాజీ సర్పంచి మిట్టా శ్రీనివాసులు తదితరులు నేతలకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. కాగా ఆపిల్ పాఠశాలలో పాఠశాల కమిటీ ఛైర్మన్ బద్రి రోశయ్య, కరస్పాండెంట్ బద్రి రత్నకుమారి నేతృత్వంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే రాయలసీమ ఆంగ్లమాధ్యమం పాఠశాలలో కరస్పాండెంట్ వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేకును కోసి విద్యార్థులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

వేంపల్లె అభివృద్ధే లక్ష్యం : వేంపల్లె మేజర్ పంచాయతీ అభివృద్ధే లక్ష్యమని ఉప సర్పంచి మునీర్ అన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం ఆయన పార్టీ నేతలతో కలిసి కేకును కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఈవో నాగభూషణరెడ్డి, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ఉప సర్పంచిని కలిసి పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పంచాయతీలో తాగు నీరు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామని ఆయన తెలియజేశారు.



వేంపల్లెలో కేకును కోస్తున్న తులసిరెడ్డి

రాజంపేట

నేటి నుంచి జన్మభూమి- మాఊరు గ్రామసభలు

మడితాడు (సుండుపల్లి), న్యూస్‌టుడే : జన్మభూమి- మాఊరు గ్రామసభలు ఈనెల 2 నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయని మండల నోడల్ అధికారి రంగయ్య, తహసీల్దారు సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపీడీవో సుధాకరరెడ్డి తెలిపారు. మండల అధికారులు రోజూ ఒక పంచాయతీలో గ్రామసభ నిర్వహిస్తారన్నారు. ముఖ్యమంత్రి రోజూ ఒక పథకం గురించి దృశ్యమాధ్యమం ద్వారా వివరిస్తారని, స్థానిక అధికారులు కూడా ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ప్రజలు, ఆయా పంచాయతీల్లోని ఉద్యోగులు కూడా హాజరు కావాలన్నారు.

గ్రామసభల వివరాలు : మండలంలో ఈనెల 2న చిన్నగొల్లపల్లి, మాదిరెడ్డిగారిపల్లి, 3న ముడుంపాడు, పొలిమేరపల్లి, 4న రాయవరం, 5న జి.రెడ్డివారిపల్లి, సొంరంవారిపల్లి, 6న బాగంపల్లి, గుండ్లపల్లి, 7న పెద్దినేనికాలువ 8న యర్రమనేనిపాలెం, 9న మడితాడు, 10న తిమ్మసముద్రం, 11న సుండుపల్లిలో మండల అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు.

మట్లిరాజుల కోటలో పర్యటకుల సందడి



కోటలోని మండపం నుంచి వస్తున్న సందర్శకులు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటంలోని చారిత్రక మట్లిరాజుల కోటలో సోమవారం పర్యటకుల సందడి నెలకొంది. కొత్త సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యటకులు కోటను సందర్శించారు. కోటలోని మొదటి మండపం, ఉద్యానవనం, ఢంకానగర్, రెండో మండపం, శిలాశాసనం, నంది విగ్రహం, బయల్పడిన శివలింగం, బిస్మిల్లాషా ఖాద్రి దర్గా, సొరంగ మార్గం, భారీ బురుజులు, ఇతర కట్టడాలను తిలకించారు. స్నేహితులు, కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో తరలివచ్చి ఉత్సాహంగా గడిపారు.

చురుగ్గా ఆలయ గోపుర నిర్మాణం

వీరబల్లి, న్యూస్‌టుడే : వీరబల్లిలోని హరిహరాదుల ఆలయం గోపుర పనులు చురుగ్గా జరుగుతున్నాయి. తితిదే జేఈవో పోలా భాస్కర్ చొరవతో ఈ పనుల కోసం ప్రభుత్వం రూ.36.90 లక్షలు మంజూరు చేసింది. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు పనులు ప్రారంభించారు. గోపురం నిర్మాణం పూర్తయితే ఆలయానికి ప్రత్యేక ఆకర్షణ వస్తుందని భక్తులు పేర్కొంటున్నారు.



కొనసాగుతున్న హరిహరాదుల ఆలయ గోపురం పనులు

రాజంపేటలో మార్కెట్ ధరలు (నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
టమోటాలు	10
పచ్చిమిర్చి	20
వంకాయలు	20
బీట్రూట్	30
ఉర్లగడ్డ	20
క్యారెట్	60
బీన్స్	40
చిక్కుడు	40
క్యాబేజీ	30
ఎర్రగడ్డలు	40-50
అల్లం	60
బెండకాయలు	32
మటిక్కాయలు	30
కాకర	30
బీరకాయలు	32

మాంసం ధరలు



	కిలో (రూ)
పొట్టేలు మాంసం	400-440
చికెన్	
బాయిలర్(లైవ్)	100
బాయిలర్ స్కిన్	160
బాయిలర్ స్కిన్‌లెస్	180
నాటుకోడి లైవ్	300
నాటుకోడి స్కిన్	350-380

తెరపై ఈనాడు

సుదర్శన్ : హలో, **ఎన్ఎస్ఆర్ :** ఎంసీఏ **పీవై :** కెంట్రోస్, **బీఎస్ :** ఒక్క క్షణం, **సమద్ :** పైసా వసూల్ **నందలూరులో :** **విజయభాస్కర్ :** అదిరింది

మీరూ స్పందించండి

మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి. యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' అవకాశం కల్పిస్తోంది. మీ చుట్టుపక్కలవారు, మీరు ఎదుర్కొంటున్న సమస్యను ఫొటో తీసి అక్కడి పరిస్థితి, ఎంతమంది ఆ సమస్యతో బాధపడుతున్నారు, దానికి పరిష్కారం ఏమిటి? క్లుప్తంగా రాసి మీ పేరుతో సహా వాట్సప్‌లో పంపండి. మీ సమస్యను అధికారుల దృష్టికి వెళ్లేలా చూస్తాం.

\- న్యూస్‌టుడే, నందలూరు.

ఫోన్ నంబర్లు : నందలూరు: 9440034246.. రాజంపేట : 9948047582.. వీరబల్లి : 8008573486.. సిద్దవటం : 9441402508.. ఒంటిమిట్ట : 9441577405

నేడు సీతారాముల కల్యాణం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఏకశిలానగరిలో కొలువైన కోదండ రామాలయంలో మంగళవారం ఉదయం సీతారాముల కల్యాణాన్ని వేడుకగా నిర్వహిస్తామని ఆలయ పర్యవేక్షకుడు కేవీ లక్ష్మీనాగరాజు తెలిపారు. రాములోరి పరిణయ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు తరలిరావాలని కోరారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

స్పందనకు వందనం

మందుబాబుల ప్రవేశానికి 'అడ్డు'కట్ట



ఒంటిమిట్ట ఎత్తిపోతల పథకం చెంత ఏర్పాటు చేస్తున్న ద్వారం తలుపులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట మండలం కొటపాడు సమీపంలో సోమశిల వెనక జలాల్లోకి మందుబాబులు ప్రవేశించకుండా శాశ్వత గేటు ఏర్పాటు చేసేందుకు అటవీ శాఖ ముందుకొచ్చింది. అనుమతి లేనిదే లోపలికి వెళ్లకుండా చర్యలు చేపట్టారు. 20 ఏళ్ల తర్వాత ప్రధాన రహదారిలో ద్వారం ఏర్పాటు చేసి ఇనుప తలుపులు అమర్చే పనులు చేస్తున్నారు. కడప- నెల్లూరు జిల్లాలను అనుసంధానం చేస్తూ పెనుశిల నరసింహ అభయారణ్యం ఏర్పాటు చేయాలని రెండు దశాబ్దాల కిందట అటవీ శాఖ అధికారులు ప్రతిపాదించారు. నెల్లూరులో 40,443.265 హెక్టార్లు, మన జిల్లాలో ప్రొద్దుటూరు డివిజన్‌లో 7,844.28 హెక్టార్లు, రాజంపేట డివిజన్‌లో 11,306.62 హెక్టార్లు, కడప డివిజన్‌లో 43,491.608 హెక్టార్లను ఇందులోకి చేర్చారు. సోమశిల వెనక జలాలు నిల్వ ఉన్న 22 వేల హెక్టార్లను అభయారణ్యం పరిధిలోకి వస్తుంది. ఒంటిమిట్ట మండలం కొటపాడు, పాత మాధవరం సమీపంలో నీరు నిల్వ ఉంది. ఇక్కడే శ్రీరామ ఎత్తిపోతల పథకం పంపుహౌస్ ఉంది. కనుచూపుమేర ఆహ్లాదకరంగా కనిపించే జలాలను, ఎత్తయిన కొండలను, కలియతిరిగే అడవి జంతువులను తిలకించేందుకు సందర్శకులు ఇక్కడికి అధిక సంఖ్యలో వస్తుంటారు. అందులో కొంతమంది యువకులు నిషేధిత ప్రాంతంలోకి మద్యం సీసాలను అనధికారికంగా తెచ్చుకొని ఇక్కడే తాగుతున్నారు. ఈ ప్రాంతంలో తాగి పడేసిన ఖాళీ సీసాలు ఎటుచూసినా కనిపించేవి. ఇక్కడ వసతులు కల్పనకు నిధుల కొరత ఉంది. దీనిపై 2017 డిసెంబరు 11న 'ఈనాడు'లో 'ఆహ్లాద తీరం.. అభివృద్ధికి దూరం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై అటవీ శాఖ అధికారులు స్పందించారు. శ్రీరామ ఎత్తిపోతల పథకం పంపుహౌస్ పక్కనే పాత మాధవరం వెళ్లే రహదారిలో పెద్ద గేటును ఏర్పాటు చేస్తున్నారు. అనుమతి లేకుండా ఎవర్నీ లోపలికి పంపించడం లేదు. ప్రస్తుతానికి గేటుకు అవతలి వైపున వాహనాలు వెళ్లకుండా రెండుచోట్ల కంపను అడ్డుగా వేశారు. మందుబాబులు లోపలికి ప్రవేశించకుండా రూ.75 వేలు ఖర్చుచేసి గేటును అమర్చుతున్నామని మాధవరం అటవీ బీటు అధికారి గురుశేఖర్‌రెడ్డి తెలిపారు.

రహదారిని బాగు చేయరూ..




సమస్య : నందలూరు పంచాయతీ పరిధిలోని దుర్గాపురం ఎస్సీకాలనీకి వెళ్లే రహదారి దారుణంగా తయారైంది. కంకర తేలి పాదచారులకు గాయాలవుతున్నాయి. అధికారులు స్పందించి ఈ రహదారిని బాగుచేయాలి.

\- వెంకటరమణ, దుర్గాపురం ఎస్సీకాలనీ, నందలూరు

సమాధానం : దుర్గాపురం ఎస్సీకాలనీకి గతంలో వేసిన రహదారి పాడైంది. దీంతో ఆ రోడ్డును పునర్నిర్మించడానికి, ఆ మార్గంలో వర్షం నీరు వెళ్లేందుకు వీలుగా మోరీ నిర్మించడానికి రూ.1.30 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

\- రామాంజనేయులు, ర.భ.శాఖ ఇంజినీరు, నందలూరు మండలం

మోరీ లేక ప్రమాదాలు



సమస్య : నాగిరెడ్డిపల్లె గ్రామ శివారున పాటూరు రహదారిలో ఎర్రచెరువుకు సాగునీరు అందించే కాలువ మీద మోరీ నిర్మించి ఆ మార్గంలో ప్రమాదాలను నివారించాలి. మోరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనచోదకులు కాల్వలో పడి గాయపడుతున్నారు.

\- చంగల్‌రెడ్డి,పాటూరు,నందలూరు మండలం

సమాధానం : పాటూరు రహదారిని పరిశీలిస్తాం. అవసరమైతే ఆ ప్రాంతంలో మోరీ నిర్మాణానికి అంచనా రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తాం.

\- రామాంజనేయులు, ర.భ.శాఖ ఇంజినీరు,నందలూరు మండలం

కంకర తొలగించి కష్టం తీర్చాలి



సమస్య : నాగిరెడ్డిపల్లె గ్రామంలోని అమ్మవారిశాలవీధిలో రోడ్డుపై కంకర, ఇసుకను తోలారు. కంకర రహదారి మొత్తం విస్తరించింది. ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్నారు. పాదచారులు, విద్యార్థులు గాయాలపాలవుతున్నారు. పక్కనే ఉన్న తాగునీటి వాల్వ్ ఉన్న గుంత కంకరచేరి పూడిపోతోంది.

\- బుజ్జి, హోంగార్డు, నాగిరెడ్డిపల్లె, నందలూరు

సమాధానం : రహదారిపై ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న కంకర, ఇసుకను వెంటనే తొలగింపచేసి స్థానికుల ఇబ్బందులను నివారిస్తాం.

\- సమ్మెట శివప్రసాద్, సర్పంచి, నాగిరెడ్డిపల్లె పంచాయతీ

దుర్వాసనతో ప్రయాణం నరకం



సమస్య : నందలూరు కన్యక చెరువు గట్టుపై మండల కేంద్రంలోని కోడిమాంసం దుకాణాల వారు పడేస్తున్న మాంసం వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో ఈ గట్టుమీద గల కడప- చెన్నై ప్రధాన రహదారిపై ప్రయాణించలేకున్నాం. చెరువుగట్టుపై మాంసం వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- కనకరాజు, ఈదరపల్లె, నందలూరు

సమాధానం : పరిశీలించి చెరువుకట్టపై వ్యర్థాలను తొలగింప చేస్తాం. వ్యర్థాలను చెరువుగట్టుమీద వేయకుండా కోడిమాంసం వ్యాపారులను హెచ్చరిస్తాం. వేసినవారిపై చర్యలు తీసుకొంటాం.

\- అయ్యవారయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి, నందలూరు

కమనీయం.. లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

ఊటుకూరు (రాజంపేట), న్యూస్‌టుడే : భువనగిరిపల్లె లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కంబయ్యగారి నరసింహ, మల్లెం తిరుపాల్ ఆధ్వర్యంలో భువనగిరిపల్లె కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి జరిగిన కల్యాణ వేడుకను తిలకించడానికి భక్త జనసందోహం తరలివచ్చింది. బ్రహ్మోత్సవాల సమయంలో వచ్చినట్లు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. స్వామివారిపై పోసిన ముత్యాల తలంబ్రాలను నిర్వాహకులకు భక్తులకు పంపిణీ చేశారు. స్వామివారి కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. లక్ష్మీ సమేత నరసింహస్వామికి భక్తులు పెళ్లి కానుకలను సమర్పించారు.



కల్యాణ వేదికపై లక్ష్మీనరసింహస్వామి



కల్యాణాన్ని తిలకించడానికి తరలివచ్చిన భక్తులు

భవన నిర్మాణ కార్మికులంటే నిర్లక్ష్యం తగదు

రాజంపేట, న్యూస్‌టుడే : భవన నిర్మాణ కార్మికుల పట్ల కార్మిక శాఖ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటయ్య ఆరోపించారు. స్థానిక బైపాస్‌రోడ్డులోని సంఘం కార్యాలయ ఆవరణలో సోమవారం కార్మికుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు అందుబాటులో లేకుండా కార్మికశాఖ కార్యాలయాన్ని రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేశారని తెలిపారు. అక్కడికి ఎప్పుడు వెళ్లినా ఒక్క అధికారి కూడా అందుబాటులో ఉండడం లేదన్నారు. రోజు కూలిని పోగొట్టుకుని అక్కడికి వెళ్లిన పేదలు ఉసూరుమంటూ వెనుదిరిగి రావాల్సి వస్తోందన్నారు. రాజంపేటలో చాలామంది కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉందని, అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. వాస్తవానికి ఆశాఖ అధికారులే కార్మికుల వద్దకు వచ్చి కొత్తవారిపేర్లను నమోదు చేయాల్సి ఉందన్నారు. కొత్త కార్మికులకు గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేదన్నారు. ఈ కారణంగా ఏదైనా దుర్ఘటన జరిగినప్పుడు భవననిర్మాణ కార్మికులు చాలా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గాలి చంద్ర, ఖాజావలి, శివయ్య, ఎం.ఎస్.రాయుడు తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతో ప్రశాంతత

సిద్దవటం : ప్రతి మానవుడు దైవ చింతనతో మెలిగితే ప్రశాంత జీవనం సాధ్యమవుతుందని ఆరాధన ఛానల్ ప్రసంగీకుడు భవనాశి సుధీర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సిద్దవటం, భాకరాపేట, టక్కోలు, మాధవరం తదితర ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిద్దవటం దిగువపేటలోని గ్రేస్ ప్రార్థనా మందిరంలో సుధీర్ ప్రసంగించారు.

రాజంపేట

కొత్త ఏడాది.. కావాలి విజయాలకు నాంది

❑ ఊరూరా ఆలయాల్లో ప్రత్యేక పూజలు ❑ కోదండ రామయ్య దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న తెదేపా నాయకులు




ఆర్డీవోను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న పురపాలిక కమిషనర్, డీఈ, ఇతర అధికారులు, సిబ్బంది




మాజీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న జడ్పీ వైస్‌ఛైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు



ఒంటిమిట్ట, భక్తులకు దర్శనమిచ్చిన సంజీవరాయస్వామి



రాజంపేట: భక్తులకు దర్శనమిస్తున్న పరమశివుడు



రాజంపేట: పూజలందుకుంటున్న వాయుపుత్ర హనుమాన్



రాజంపేట: అలంకరణలో వీరచౌడేశ్వరీదేవి అమ్మవారు



గంగాభవానిమాతకు సుందరంగా పుష్పాలంకరణ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రతి హృదిలో నవోత్సాహం తొణికిసలాడింది. నవతరం కొంగొత్త ఆశలు, ఆకాంక్షలతో 2018 సంవత్సరంలోకి అడుగుపెట్టారు. అర్ధరాత్రి నుంచి ఊరూరా ఆనందహేల సందడి నింపింది. నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం నూతన సంవత్సర ప్రారంభ వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించుకొన్నారు. ఒంటిమిట్ట కోదండ రామాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉప కార్యనిర్వహణాధికారి ఎం.లక్ష్మణ్‌నాయక్, పర్యవేక్షకుడు కేవీ లక్ష్మీనాగరాజు ఆధ్వర్యంలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణుల మూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలు, పుష్పమాలికలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ ఏడాది శుభం కలగాలని, అంతా మంచి జరగాలని, రామయ్య అనుగ్రహం కోసం భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈసారి పసిడి నగలతో రాములోరిని అలంకరించినట్లు ఆలయ పర్యవేక్షకుడు లక్ష్మీనాగరాజు తెలిపారు. చెన్నూరు ఇస్కాన్ భజన కుటీర బృందం వారి భజనలు ఆకట్టుకున్నాయి. రామయ్య క్షేత్రానికి తూర్పు దిశలో ఉన్న భక్త సంజీవరాయస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఒంటిమిట్ట, కొత్తమాధవరం, కొండమాచుపల్లి, సాలాబాదు, గంగపేరూరు, పెన్నపేరూరు, గొల్లపల్లి, మంటపంపల్లె, చింతరాజుపల్లె, కోనరాజుపల్లె, నర్వకాటిపల్లె, నడింపల్లి, రాచగుడిపల్లి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లోనూ కొత్త ఏడాది వేడుకను అట్టహాసంగా జరుపుకొన్నారు.

శాంతియుత జీవనం సాగిద్దాం

రాజంపేట: కొత్త సంవత్సరంలో ఎలాంటి ఒడుదొడుకుల్లేకుండా శాంతియుత జీవనం సాగిద్దాం.. ఆత్మీయ అభిమానాలతో, సంతోషాలతో అందరితో కలిసిపోయి కొత్త జీవనానికి నాంది పలకాలని ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ర.భ.శాఖ అతిథిగృహంలో సోమవారం నూతన సంవత్సర వేడుకల్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధశాఖల అధికారులు ఆయన్ను మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఆసుపత్రి కమిటీ నాయకులు గజమాలతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన పీఆర్టీయూ క్యాలెండరును ఆవిష్కరించారు. ఆర్డీవో వి.వీరబ్రహ్మం, డీఎస్పీ లక్ష్మీనారాయణ, అన్నమయ్య ప్రాజెక్టు ఈఈ రమేష్, తహసీల్దారు నరసింహులు, ఎంపీడీవో వాసుదేవగుప్త, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సుబ్బారావు మేడాను కలిసి శుభాకాంక్షలను తెలిపారు.

◆ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని డివిజన్‌లోని రెవెన్యూ యంత్రాంగం ఆర్డీవో వి.వీరబ్రహ్మంను కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. పురపాలిక కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, డీఈ శ్రీనివాసులుతో పాటు ఏఈ, పట్టణ ప్రణాళిక అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది, డివిజన్‌లోని 17 మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, ఎంపీడీవోలు ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేశారు.

◆ స్థానిక ఆకేపాటి భవనంలో నూతన సంవత్సర వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, వైకాపా రాజంపేట పార్లమెంటు కన్వీనర్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని ఆ పార్టీ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున వచ్చి పండ్లు, పుష్పగుచ్ఛాలను అందజేశారు. కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. జడ్పీ వైస్ ఛైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డితో పాటు పలువురు నాయకులు ఆయన్ను కలిశారు.

◆ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని వైకాపా రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి శ్రీనివాసులరెడ్డిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలను తెలియజేశారు.



జగదభిరాముడి దర్శన కోసం బారులుతీరిన భక్తులు

నందలూరు: మండలంలోని ప్రజలు నూతన సంవత్సరంలో సుఖశాంతులతో జీవించాలని ఎంపీపీ మేడా పద్మజ ఆకాంక్షించారు. నూతన సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకొని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం ఆమె కేకును కోసి పంచిపెట్టారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు మేడా విజయభాస్కరరెడ్డి, మండల తెదేపా అధ్యక్షుడు బి.లక్ష్మీనరసయ్య, రాజంపేట మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తాటి సుబ్బరాయుడు, తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో మల్లీశ్వరి, ఈవోపీఆర్డీ ప్రసాద్, మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపల్లె పంచాయతీ కార్యాలయంలో సర్పంచి సమ్మెట శివప్రసాద్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర సంబరాలు నిర్వహించారు.

సరస్వతిపురం (రాజంపేట) : కొత్త సంవత్సరంలో అంతా మంచే జరగాలని, ఎలాంటి సమస్యల్లేకుండా జీవనం ప్రశాంతంగా సాగాలని కోరుకుంటూ భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. పట్టణంలోని పర్వతవర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరుడు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చాడు. ఆంజనేయస్వామి ఆలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భక్తులు వాయుపుత్ర హనుమాన్‌ను దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక రెడ్డివారివీధిలోని వీరచౌడేశ్వరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలను నిర్వహించి, పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు. రాంనగర్, సాయినగర్ ప్రాంతాల్లోని సాయిబాబా ఆలయాల్లో, మన్నూరు శివారులోని ఉదయగిరి యల్లమ్మ ఆలయం, మన్నూరు శివాలయం, పోలిచెరువుకట్టపై ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

సుండుపల్లి : నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు మండలంలో ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో కేజీబీవీ పాఠశాలలో కేక్ కత్తిరించి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఎస్‌వో సిద్ధేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. సుండుపల్లి వెల్ఫేర్ సొసైటీ కువైట్ ఇండియా ఆధ్వర్యంలో సుండుపల్లిలో అర్ధరాత్రి కేక్ కత్తిరించారు. ఎస్సై నరసింహారెడ్డి, వైకాపా కువైట్ కమిటీ గవర్నింగ్ సభ్యుడు రహిమాన్ ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కత్తిరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సలీం, ధర్మానాయక్, విశ్రాంత అధ్యాపకుడు సి.సుబ్బరాజు, వైకాపా నాయకులు అబ్దుల్లా, అలి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు మస్తాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ఎంఈవో కార్యాలయం, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేక్‌లు కోశారు. పలువురు ఆలయాలను సందర్శించి నూతన సంవత్సరంలో శుభాలు కలగాలని పూజలు చేశారు.

వీరబల్లి : మండలంలో సోమవారం కొత్త ఆంగ్ల సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని యువత, వివిధ వర్గాల ప్రజలు ఘనంగా వేడుకలు చేసుకున్నారు. ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో టపాసులు కాల్చి, కేకులు కోసి సంబరాలు చేసుకున్నారు. పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ స్వప్న కేకు కోశారు. ఎంపీడీవో జనార్ధనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటంలోని కామాక్షి సిద్దవటేశ్వరస్వామి, బాలబ్రహ్మేంద్రస్వామి, కపర్థీశ్వరస్వామి, జ్యోతి గ్రామంలోని జ్యోతి సిద్దవటేశ్వరస్వామి, మాధవరం-1 బంగారుపేటలోని గంగాభవానిమాత, మరికొన్ని ఆలయాల్లో సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. 2018 నూతన సంవత్సర వేడుకలను పురష్కరించుకుని భక్తులు ఆలయాలను సందర్శించారు. అర్చకులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, సహస్రనామార్చన, ఖడ్గమాల, కుంకుమార్చన మరికొన్ని రకాల ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు ఎక్కువమంది హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

నూతన రేషన్‌కార్డులు మంజూరు

నందలూరు, న్యూస్‌టుడే : మండలంలో అర్హులైన వంద మందికి రేషన్‌పత్రాలు మంజూరు చేయాలని మండల నోడల్ అధికారికి ప్రభుత్వం అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసిందని మండల తహసీల్దారు డి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ రేషన్‌కార్డులను ఈనెల 2 నుంచి నిర్వహించే జన్మభూమి-మాఊరు గ్రామసభల్లో మంజూరు చేస్తారని ఆయన పేర్కొన్నారు. రేషన్‌కార్డులు లేని అర్హులైన పేదవారు, యానాదులు, చెంచులు, సంచార తెగలు, హిజ్రాలు తమ పూర్తి వివరాలతో దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దారు కోరారు. దరఖాస్తుతో పాటు కుటుంబ సభ్యుల బృంద చిత్రం, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు నకలు, కరెంటు బిల్లులు లేదా ఎన్నికల గుర్తింపు కార్డు నకళ్లను జత చేయాలని చెప్పారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కమాండెంటు సేవలు మరవలేనివి

ఏపీఎస్పీ కాలనీ (సిద్దవటం), న్యూస్‌టుడే : ఏపీఎస్పీ పదకొండో పటాలం కమాండెంటు రాజాకిషోర్‌బాబు సేవలు మరవలేనివని జనవికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహిర్ అభినందించారు. సిద్దవటం శివారులోని ఏపీఎస్పీ పదకొండో పటాలంలో ఆదివారం రాత్రి కమాండెంటు రాజకిషోర్‌బాబు జనవికాస్ సేవా సమితికి చెందిన కాలమానిని ఆవిష్కరించారు. ఈసందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహిర్ మాట్లాడుతూ కమాండెంటు విధి నిర్వహణలో మెరుగైన సేవలు అందించి రాష్ట్ర, జాతీయస్థాయి పతకాలు సాధించడం ప్రశంసనీయమన్నారు. ఈసందర్భంగా వారు కమాండెంటును సత్కరించారు. అదనపు కమాండెంటు శామ్యూల్‌జాన్, జనవికాస్ సేవాసమితి ప్రతినిధి గౌస్‌పీర్, పటాలం సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

మాధవరం-I (సిద్దవటం), న్యూస్‌టుడే : మండలంలోని మాధవరం-1 గ్రామానికి చెందిన చలపాటి చంద్ర, పుత్తా రాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అరుణ్‌రెడ్డి సోమవారం తెలిపారు. సిద్దవటం మండలం మాధవరంలో ప్రారంభించిన క్రికెట్ పోటీలకు సంబంధించి స్థానికులైన చలపాటి చంద్ర, పుత్తా రాజు మాధవరంలోని ప్రధాన రహదారి పక్కన బ్యానర్లు ఏర్పాటు చేశారన్నారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వాటిని చించివేసినట్లు వెల్లడించారు. మాధవరంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన మునెయ్య, వినోద్ చించేశారన్న అనుమానంతో పై ఇద్దరు వారిని కులం పేరుతో దూషించినట్లు వివరించారు. ఈవిషయమై బాధితులు ఫిర్యాదు చేయడంతో చంద్ర, రాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

ఘనంగా బాబా గ్రామోత్సవం



పుల్లంపేట పురవీధుల్లో ఊరేగుతున్న బాబా

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన పుల్లంపేట వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన కళాకారుల ప్రదర్శనతో పులకరించిపోయింది. సోమవారం స్థానిక బజారువీధిలో వెలసిన షిర్డీ సాయినాథుని ఆలయ 37వ వార్షికోత్సవం భాగంగా స్వామి వారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవం వెంట ఇతర జిల్లాల నుంచి తరలివచ్చిన కళాకారులు డబ్బు దరువు, కర్ర, కత్తి విన్యాసాలతో ఆకట్టుకున్నారు. చెక్కభజన ప్రదర్శనలో చిన్నారులు ఆలపించిన భక్తిగీతాలతో పుల్లంపేట పులకిరించిపోయింది. గుర్రం రెండు కాళ్లపై నృత్యం చేయడం అందరిని అబ్బురపరిచింది. కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపకుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, సుబ్బరాయుడు, డాక్టర్ శంకరయ్య, చలమయ్య, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి

అత్యవసర సేవలకు 108

అన్నదానం గొప్పది



గాలివీడులో అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై మంజునాథ

గాలివీడు, న్యూస్‌టుడే: దానంలోకెల్ల అన్నదానం గొప్పదని ఎస్సై పార్నపల్లి మంజునాథ పేర్కొన్నారు. స్థానిక పావని కూడలిలోని మోక్షశ్రీ ఫొటో స్టూడియోలో సోమవారం సమయం మీ కోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల్లో అన్నదానం చేయడం అభినందనీయమని ఎస్సై చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నచ్చు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి బాలాజీ, కానిస్టేబుళ్లు గంగాధర్, వాసుతేజ పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు



జూదరులతో ఎస్సై, సిబ్బంది

సంబేపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దుద్యాల గ్రామం వడ్డిపల్లెకు సమీపంలో సోమవారం కోడిపందెం ఆడుతున్న 8మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై హుషం తెలిపారు. వీరితో పాటు మూడు కోళ్లు, రూ.2,300 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నూతన సంవత్సరం కావడంతో ఎవరూ తెలియదు అన్న ఆశతో వారు ఆటను మొదలు పెట్టారు. తమకు సమాచారం రావడంతో ఆయన సిబ్బందితో అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులోహాజరుపరచనున్నట్లు చెప్పారు.

గ్రామసభల విజయవంతానికి పిలుపు

గాలివీడు, న్యూస్‌టుడే: మండల పరిధిలో జనవరి 2 నుంచి జన్మభూమి- మా ఊరు గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో విలేకర్లతో మాట్లాడారు. జన్మభూమి- మా ఊరు గ్రామ సభలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభలు జరుగుతాయన్నారు. ఎంపీడీవో, తహసీల్దారు పర్యవేక్షణలో ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సామాజిక పింఛన్లు, రేషనుకార్డులు మంజూరైన లబ్ధిదారులకు అందిస్తామన్నారు. స్థానికులు ఇచ్చే అర్జీలు తీసుకుంటామన్నారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది హాజరు కావాలన్నారు.

"సౌర" తెచ్చిన తంటా.. రోడ్డు బాగుపడేదెట్లా?

తూముకుంట(గాలివీడు), న్యూస్‌టుడే: సౌర విద్యుత్తు ప్లాంటు సంబంరం చంకల్లో పోతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంటు నిర్మాణ పనులు జరుగుతుండగానే తారు రోడ్డు మట్టిరోడ్డుగా మారిందని చెబుతున్నారు. విద్యుత్తు ప్లాంటుకు అవసరమైన పరికరాలు ఎక్కువ మొత్తంలో సరఫరా చేసుకోవాల్సి ఉండటంతో భారీ వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. దీంతో తారురోడ్డు పాడైంది. సౌర పనుల వద్దకు అవసరమైన రోడ్డు మార్గం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోలేదు. ఉన్న గ్రామీణ రోడ్లను ఉపయోగించడంతో రహదారి వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని జనం వాపోతున్నారు. గాలివీడు- కదిరి ప్రధాన మార్గం ఇందుకూరువాండ్లపల్లి నుంచి తూముకుంట గ్రామం కస్పా మీదుగా ప్రకాశ్‌నగర్‌కాలనీ వరకు తారురోడ్డు ఉంది. అదేమార్గంలో సౌర ప్లాంటుకు చెందిన వాహనాలు వెళ్తున్నాయి. ప్రకాశ్‌నగర్‌కాలనీ మార్గంలో వెళ్తే గండి, వేంపల్లెకు దగ్గరి దూరం. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు. గుంతలమయమైన రోడ్లతో రవాణా చాలా ఇబ్బందిగా ఉందని ఎంపీటీసీ సభ్యురాలు కవిత పేర్కొన్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు.



ప్రకాశ్‌నగర్‌కాలనీ తారురోడ్డు దుస్థితి



తూముకుంట కస్పా వద్ద పాడైన రోడ్డు

గుంతలమైన రోడ్డు



ప్రకాశ్‌నగర్ కాలనీ రోడ్డు గుంతలమయంగా తయారైంది. చాలా ప్రాంతాల్లో తారు రోడ్డు దెబ్బతింది. ఆటోలు అద్దెకు రావడం లేదు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు రవాణా కష్టంగా మారింది. రోడ్డును అభివృద్ధి చేయాలి. సౌర పనులు పూర్తయిన తర్వాత రోడ్డు అభివృద్ధి చేస్తామంటే ఎలా? ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని రోడ్డు పనులు చేయించాలి.

-సోనీనాయక్, స్థానికుడు, ప్రకాశ్‌నగర్‌కాలనీ, తూముకుంట

రోడ్డు అభివృద్ధి చేయిస్తా

అధిక బరువుతో భారీ వాహనాలు ఎక్కువగా పోవడంతో తారురోడ్డు పూర్తిగా దెబ్బతింది. సౌర విద్యుత్తు అధికారులతో చర్చించాం. పాడైన రోడ్లను అభివృద్ధి చేసేందుకు అంగీకరించారు. అందుకు ప్రణాళికను పంపాం. పల్లెల్లో సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ.30 లక్షలతో నివేదిక దస్త్రం ఉన్నతాధికారుల పరిశీలన ఉంది.

-అనితమ్మ, సర్పంచి, తూముకుంట గ్రామం, గాలివీడు మండలం

సంక్రాంతి కానుకలు పంపిణీ

రామాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా పండుగ సరకులను అందిస్తుందని లక్కిరెడ్డిపల్లె మార్కెటింగు కమిటీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. రామాపురంలో సోమవారం చంద్రన్న కానుకలను ఆయన గ్రామస్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జన్మభూమి గ్రామసభల్లో పింఛన్లు, రేషను కార్డులు అర్హులకు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, భనవం వెంకటమరణారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

వెలిగల్లు(గాలివీడు): పర్వదినాల్లో పేదలు కుటుంబం సభ్యులతో కలిసి సంతోషంగా గడపడానికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చంద్రన్న కానుకలు అందిస్తున్నారని రాయచోటి నియోజకవర్గ బాధ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెలిగల్లు, తూముకుంట గ్రామాల్లో సోమవారం ఇంటింటా తెదేపా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న రమేష్‌రెడ్డి మాట్లాడారు. వెలిగల్లు పునరావాస కాలనీలో ఇంటింటికీ వెళ్లి గ్రామస్థులతో ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. మాజీ సర్పంచి వీరభద్రనాయుడు, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు మహబూబ్‌బాషా, కాల్వపల్లి రామ్మోహన్‌నాయుడు, కదిరిరెడ్డినాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.



రామాపురంలో సంక్రాంతి కానుకలు అందిస్తున్న రమేష్‌రెడ్డి

గ్రామసభల్లో ఫిర్యాదులకు ఆధార్ తప్పనిసరి

చిన్నమండెం, న్యూస్‌టుడే: నేటి నుంచి జరిగే ఐదో విడత జన్మభూమి గ్రామసభల్లో ప్రజలు ఇచ్చే సమస్యలు, ఫిర్యాదులకు ఆధార్, సెల్ నెంబరు తీసుకోవాలని జిల్లా కలెక్టరు బాబూరావునాయుడు ఆదేశించారు. సోమవారం సాయంత్రం జరిగిన దృశ్యమాధ్యమ గోష్ఠిలో ఈ విషయం చెప్పినట్లు మండల ప్రత్యేకాధికారి గుణశేఖరపిళ్లై తెలిపారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకోండి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధిలో మంగళవారం నుంచి చేపట్టే జన్మభూమి కార్యక్రమంలో అర్హులైనవారు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వంద కార్డులకు అనుమతి వచ్చిందన్నారు. పేదవారు, యానాదులు, సంచార జీవంచేసే ఎస్టీలు, హిజ్రాలు తమ వివరాలను అందించాలన్నారు. దరఖాస్తు కుటుంబ సభ్యుల బృంద చిత్రం, సభ్యుల ఆధార్‌కార్డులు, ఎన్నికల గుర్తింపుకార్డు, విద్యుత్తు బిల్లును జతచేయాలని కోరారు. మండల నోడల్ అధికారికి అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తం

లక్కిరెడ్డిపల్లె,న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లక్కిరెడ్డిపల్లె ఎస్సై సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానికి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రమాద నివారణ ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి వాహనచోదకుడు రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణా చర్యలను వివరించారు. అనంతరం ఫ్లెక్సీలను ఆవిష్కరించారు, కార్యక్రమంలో ఏఎస్సై భాస్కర్, హెడ్‌కానిస్టేబుల్ మునిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మట్కాతో కుటుంబాలు రోడ్డుపాలు:

మట్కా, జూదంలాంటివి అనేక కుటుంబాలను రోడ్డున పడుతున్నాయని వాటికి ప్రజలు దూరంగా లక్కిరెడ్డిపల్లె ఎస్సై సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఎస్పీ ఆదేశాల మేరకు మట్కా, జూదంపై గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్కా, జూదాలకు అలవాటు పడిన వారికి కఠినచర్యలు తప్పవన్నారు. అనంతరం గోడ పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్సై భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ మునిరెడ్డి పాల్గొన్నారు.



ప్రమాదాల నివారణకు ఫ్లెక్సీలను ఆవిష్కరిస్తున్న ఎస్సై సురేష్‌రెడ్డి

చంద్రన్న కానుకను సద్వినియోగం చేసుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ప్రజలు చంద్రన్న కానుకను సద్వినియోగం చేసుకోవాలని తెదేపా మండల అధ్యక్షుడు జయరామ పేర్కొన్నారు. మండల పరిధిలోని దిన్నెపాడు పంచాయతీ పర్వతరెడ్డిగారిపల్లెలో సోమవారం చంద్రన్న సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ పెద్దఎత్తున చేసిన ఘనత ఒక్క చంద్రబాబుకే సాధ్యమన్నారు. అనంతరం చంద్రన్న కానుకను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.



చంద్రన్న సరకులను పంపిణీ చేస్తున్న తెదేపా మండల అధ్యక్షుడు జయరామ

నేటి నుంచి జన్మభూమి-మాఊరు గ్రామ సభలు

పింఛన్లు, రేషన్‌కార్డుల జారీకి అధికారుల కసరత్తు

రాయచోటి, న్యూస్‌టుడే: అయిదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి మంగళవారం నుంచి అధికారులు శ్రీకారం చుట్టారు. పురపాలికలోని వార్డులు, గ్రామీణ ప్రాంతాలలోని పంచాయతీల పరిధిలో గ్రామ సభలు నిర్వహించే షెడ్యూలును విడుదల చేశారు. రాయచోటి పురపాలికలో 2న 1, 2, 3, 31 వార్డుల వారికి మాసాపేట మార్కెట్‌యార్డులో ఉదయం 9.30 గంటలకే జన్మభూమి-మా ఊరు గ్రామ సభ నిర్వహిస్తామని పురపాలిక కమిషనర్ బి.ప్రసాద్‌రాజు తెలిపారు. 3న 4, 5, 6, 7, 8 వార్డుల వారికి ఉర్దూ ఉన్నత పాఠశాల కొత్తపల్లిలోను, 4న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 9, 10, 11 వార్డులకు, 5న ఎస్.ఎన్.కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో 12, 13, 14 వార్డులకు, 6న కె.రామాపురం ఉన్నత పాఠశాలలో 15, 16, 17, 18 వార్డులకు, 7న బోస్‌నగర్ ఉర్దూ పాఠశాలలో 19, 20, 21 వార్డులకు 8న ప్రభుత్వ డైట్ పాఠశాలలో 22, 25, 9న కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాలలో 23, 24 వార్డులకు, 10న మార్కెట్ ఉర్దూ పాఠశాల 26, 27, 28 వార్డులు, 11న శివాలయం, పాతరాయచోటిలో 29, 30 వార్డుల వారికి జన్మభూమి-మా ఊరు గ్రామ సభలు జరుగుతాయని కమిషనర్ పేర్కొన్నారు. పట్టణంలో రేషన్‌కార్డులు కావాల్సిన వారు ఆధార్ కార్డులు, కుటుంబ బృంద చిత్రంతో అర్జీలను సమర్పిస్తే నోడల్ అధికారి ద్వారా నేరుగా మంజూరు చేస్తారని తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం నోడల్ అధికారికి 100 రేషన్‌కార్డుల జారీకి అధికారం అప్పగించిందన్నారు. గ్రామ సభలకు పురపాలిక, గ్రామీణ పరిధిలోని ఆయా శాఖల అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని వారు కోరారు.

రాయచోటి గ్రామీణ: మండల పరిధిలోని 9 గ్రామ పంచాయతీల్లో జరిగే జన్మభూమి-మాఊరు గ్రామసభలు మంగళవారం నుంచి జరగనున్నట్లు ఎంపీడీవో సోమశేఖర్ తెలిపారు. మంగళవారం శిబ్యాల గ్రామసచివాలయంలో, బుధవారం డి.అబ్బవరంలో మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల, 4న పెమ్మాడలపల్లె గ్రామ సచివాలయంలో, 5న చెన్నముక్కపల్లె జడ్పీ ఉన్నతపాఠశాలలో, 6న గొర్లముదివీడు జడ్పీఉన్నత పాఠశాల, 7న కాటిమాయకుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామసభలుంటాయన్నారు. 8న వరిగెపాపిరెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయం, 9న యండపల్లె గ్రామసభ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల బోయపలలో, 10న మాధవరం జిల్లాపరిషత్‌ఉన్నత పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గ్రామసభలుంటాయని ఆయన వివరించారు.

దైనందిని ఆవిష్కరణ

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఏపీ ఉపాధ్యాయ సంఘం మండల శాఖకు సంబంధించిన దైనందిని, కాలమానిని సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో మండల విద్యాశాధికారి ఎం. చక్రేనాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిని, కాలమానిని ఉపాధ్యాయులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయనాన్నరు. దేశ చారిత్రకతను తెలియజేసేందుకుగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామచంద్రయ్య, జిల్లా కోశాధికారి ఎం.నరసింహులు, మండల అధ్యక్షుడు బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి కె.నరసింహులు, మండల కోశాధికారి మల్లయ్య, గౌరవ అధ్యక్షుడు రెడ్డెయ్య, మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపకార్యదర్శి నాగార్జున, శంకరయ్య, శేఖర్, రెడ్డిబాబు, నాగులయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి

శుభాకాంక్షల వెల్లువ

లక్కిరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని తెదేపా కార్యాలయంలో సోమవారం మండల పరిధిలోని అధికారులు, నాయకులు, తెదేపా కార్యకర్తలు తెదేపా నియోజకవర్గ బాధ్యుడు ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డికి 2018 సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2018 సంవత్సరంలో నియోజకవర్గంలోని ప్రజలకు, రైతులకు భగవంతుడు మంచి చేయాలన్నారు.



వాడవాడలా నూతన సంవత్సర వేడుకలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు నేతలు, ఉన్నతాధికారులకు దిగువ శ్రేణి శుభాకాంక్షలు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి నియోజకవర్గంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. అర్ధరాత్రి 12 గంటలకు యువత వేడుకల్లో పాల్గొని కేకులు కత్తిరించి నూతన సంవత్సరం సంబరాలు చేసుకున్నారు. ఉదయం నుంచి నేతల ఇళ్లు, కార్యాలయాలకు అన్ని మండలాల నుంచి వచ్చిన అధికారులు, దిగువ శ్రేణి నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపేందుకు వరుసకట్టారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి ఉపాధ్యాయ బృందం అందచేసిన భారీ కేకును కత్తిరించి నేతలు, కార్యకర్తలు, అధికారులకు పంచి పెట్టారు. తెదేపా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. తెదేపా జిల్లా మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి సుజాత ఆధ్వర్యంలో 25 కిలోల కేకును మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి కత్తిరించి కార్యకర్తలు, నేతలకు పంచి పెట్టారు. తెదేపా నేత సుగవాసి ప్రసాద్‌బాబు, వైకాపా నేత మండిపల్లి రాంప్రసాద్‌బాబులకు అధికారులు, పార్టీల నేతలు, కార్యకర్తలు కలిసి పూలమాలలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



రాయచోటి: సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



రాయచోటి:పార్టీ కార్యాలయంలో 25 కిలోల కేకును కత్తిరిస్తున్న మాజీ ఎమ్మెల్యే



రామాపురం: మహావిష్ణువుకు అలంకారం

కస్తూర్బాలో కొత్త సంవత్సరం వేడుకలు

చిన్నమండెం: మండల కేంద్రంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్‌వో శశికళ ఆధ్వర్యంలో కేకును కత్తిరించారు. ఈ కేకును విద్యార్థినులకు తినిపించారు. ఈ సందర్భంగా ఎస్‌వో మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పదో తరగతి బాలికలు అత్యుత్తమ గ్రేడ్లు సాధించి ఎక్కువ మంది ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించాలని కోరారు. అనంతరం బాలికలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆలయాలు కిటకిట

చిన్నమండెం: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం మండల పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆలయాల్లో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా ఆలయాల్లో దర్శనాల కోసం భక్తులు తరలి వచ్చారు. మండలంలోని శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయం, తొగటపల్లె, కొండమూల, గుట్టమోటు, మల్లూరు క్రాస్‌లో ఆంజనేయస్వామి ఆలయాలు, బోడిరెడ్డిగారిపల్లె దగ్గర విరూపాక్షమ్మ, గవిమల్లేశ్వరుడు, కేశాపురంలో ఆత్మలింగేశ్వరుడు, చిన్నమండెంలో ముక్తి రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రామాపురం: మండల పరిధిలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయాలలో భక్తులు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండపల్లి సమీపంలోని ఆలయంలో మహావిష్ణువు ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. రామాపురం, నీలకంఠ్రావుపేట, చిట్లూరు, గువ్వలచెరువు, హసనాపురం ప్రాంతాల్లోని ఆలయాల్లో గ్రామస్థులు పూజలు చేశారు. ప్రధాన చర్చిలో క్రైస్తవ సోదరులు ప్రార్థనలు జరిపారు.

వైభవంగా నూతన సంవత్సర వేడుకలు


రాయచోటి గ్రామీణ: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. చాలా మంది ఆదివారం అర్ధరాత్రి నుంచే సంబరాలు అంబరాన్ని అంటాయి. పలు ఆలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఎస్‌ఎన్‌కాలనీలోని సాయిబాబా ఆలయంలో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎన్జీవో కాలనీలోని వేంకటేశ్వరాలయం, ఎస్‌ఎన్‌కాలనీలోని శివాలయం, గుండాంజనేయస్వామి, మాసాపేటలోని శ్రీలక్ష్మీప్రసన్న వేంకటేశ్వరాలయం, చెన్నముక్కపల్లెలోని రామాలయం, రెడ్డీస్‌కాలనీలో రామాలయం, కొత్తపేటలోని శివరామాలయం, రామాలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పూజలు చేశారు. సాయిబాబా ఆలయంలో ఆలయకమిటీ అధ్యక్షుడు డాక్టరు బయారెడ్డి, ఆలయ ఇంజనీర్ నాగేశ్వరరావు, కోశాధికారి కొప్పల గంగిరెడ్డిల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్‌ఎన్‌కాలనీలోని లూథరన్ చర్చిలో ఫాస్టర్ శుభాకర్ నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలను చేయించారు. బేతల్‌కాలనీలో ఫాస్టర్ సల్మాన్ రెడ్డి సందేశాన్ని ఇచ్చారు.



రాయచోటి:తెదేపా నేత ఎస్.ప్రసాద్‌బాబును సత్కరిస్తున్న పురపాలిక సిబ్బంది



రాయచోటి గ్రామీణ: సందేశానిస్తున్న ఫాస్టర్ శుభాకర్



చిన్నమండెం: పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి



చిన్నమండెం: కస్తూర్బాగాంధీ పాఠశాలలో కేకు కత్తిరించి విద్యార్థినులకు తినిపిస్తున్న ఎస్‌వో శశికళ

ఆర్టీసీలో నూతన సంవత్సర వేడుకలు




నూతన సంవత్సర వేడుకల్లో డీఎం నారాయణస్వామి

రాయచోటి గ్రామీణ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని స్థానిక ఆర్టీసీ బస్టాండులో డిపో మేనేజర్ నారాయణ స్వామి సోమవారం కేకు కోసి కార్మికులకు పంచిపెట్టారు. ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలో టిక్కెట్ తీసుకున్న ప్రయాణికులకు ప్రతి నెల లక్కీడిప్ నిర్వహించే విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. నూతన సంవత్సరంలో ప్రయాణికులు సురక్షితంగా గమ్యాన్ని చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజర్వేషన్ కౌంటర్ నిర్వాహకులు సద్దాం, ఖలీంబాషా, అస్లాం బాషా, రాజశేఖర్, కంట్రోలర్ రియాజుల్లా పాల్గొన్నారు.

కోవెలల్లో ప్రత్యేక పూజలు

గాలివీడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ప్రజలు నూతన సంవత్సరం వేడుకలు ఉత్సాహంగా చేసుకున్నారు. పలు కోవెలలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గాలివీడు- కదిరి ప్రధాన మార్గంలోని వెలిగల్లు జలాశయం స్పిల్‌వే దిగువన పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన గండిమడుగు పుణ్యక్షేత్రంలో పూజలు నిర్వహించారు. ప్రాజెక్టు యాత్రికులు గండిమడుగుకు చేరుకుని దైవసన్నిదిలో గడిపారు. ఉమామహేశ్వరస్వామి ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. ఎగువగొట్టివీడు, అరవీడు, నూలివీడు, గాలివీడు ఆలయాల్లో గ్రామస్థులు సందడి చేరారు.



గాలివీడులో మూలవిరాట్‌కు అలంకారం

చర్చిల్లో..

గాలివీడు: మండల పరిధిలో జనవరి1 వేడుకలు ప్రార్థనా మందిరాల్లో నిర్వహించారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజామున చర్చిల్లో ప్రత్యేక ప్రార్థలను జరిపారు. గాలివీడులోని పట్టణ, కార్మేల్ చర్చిల్లో విశ్వాసులు దేవని వాగ్దానాల కోసం పోటీ పడ్డారు. నాలుగురోడ్ల కూడలి, అరవీడు, నూలివీడు, గుండ్లచెరువు, వెలిగల్లు ప్రాంతాల్లో జరిగిన కూటముల్లో అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నాయకుల సంబరాలు



కేక్‌ను కోస్తున్న ఎస్సై హాషం

సంబేపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలో ఆటో యూనియన్ నాయకులు సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై హాషం చేతుల మీదుగా కేకును కోయించి పలువురికి పంచిపెట్టారు. ఈ సంవత్సరం అందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు ప్రార్థించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్రమణ్యం నాయక్, సుధీర్‌రాజు, విజయ్‌కుమార్, చలపతి, సుబ్బు, ఖాదర్‌వలీ, నారాయణస్వామి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



ప్రత్యేక అలంకారంలో ← నల్లగంగమ్మ తల్లి మూలవిరాట్



ప్రత్యేక అలంకారంలో మోటకట్ల శివాలయంలో శివుని మూలవిరాట్ →

సంబేపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పలు ఆలయాలు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం మండలంలోని మోటకట్ల శివాలయం, దేవరరాయి నల్లగంగమ్మ ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. ఉదయం ఆలయ అర్చకులు ఆలయాలను శుద్ధి చేసి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మోటకట్ల శివాలయం వద్ద భక్తులు జాతీయ రహదారి వరకు వరుస కట్టారు. నల్లగంగమ్మ ఆలయం వద్ద కూడా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద చెక్కభజనలు భక్తుల సౌకర్యార్థం ఈవో మహేశ్వర్‌రెడ్డి ఏర్పాటు చేయించారు.